# మహర్షులు - లోకోపకారవ్రతం

రచన

చివుకుల రమాకాంత శర్మ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
2023

# MAHARSHULU - LOKOPAKARAVRATAM

By
**Chivukula Ramakantha Sarma**

T.T.D. Religious Publications Series No. 1438
@ All Rights Reserved

First Edition : 2023

Copies : 500

Published by :
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

**D.T.P.**
Publications Division,
T.T.D, Tirupati

Printed at
**Tirumala Tirupati Devasthanam's Press**
Tirupati - 517 507

## ముందుమాట

భారతదేశం 'భా' అంటే కాంతి, అగ్ని అని అర్థం. దానితో రమించే దేశం కాబట్టి భారతదేశం అయింది. భారతీయులు అగ్ని ఆరాధకులు. సూర్యోపాసకులు. మన మహర్షులు యజ్ఞ–యాగాదులతో దేవతలకు హవిస్సులనందించి వారిని ప్రసన్నచిత్తుల్ని చేసుకుని లోకకళ్యాణానికి కారకులైనారు.

మహర్షులు తమ తపోశక్తితో శ్రుతులను స్మృతులను మానవాళికి అందించి వారిని మహోన్నతులుగా తీర్చిదిద్దారు. తమకు వినిపించిన దివ్యసందేశాలను శ్రుతులు అన్నారు. తమకు అనిపించిన దివ్యజ్ఞానాన్ని స్మృతులు అన్నారు. అందుకే మన వేదాలకు శ్రుతులు, స్మృతులు అని పేరు. వేదము అంటేనే అపూర్వ విజ్ఞానాన్ని తెలియజేయునది అని అర్థం. ఇదే మహర్షులు – లోకోపకారానికి చేసిన వ్రతం! తపస్వులలో – ఋషులు, రాజర్షులు – బ్రహ్మర్షులు అని మూడు వర్గాలున్నాయి. శ్రీ చివుకుల రమాకాంత శర్మగారు "మహర్షులు లోకోపకారవ్రతం" అనే తన గ్రంథంలో వసిష్ఠమహర్షి నుండి కణ్వమహర్షి వరకు ఉన్న 24మంది మహర్షుల జీవితవిశేషాలను, వారి రచనలను, తపోమహిమలను విశదంగా వివరించారు.

వసిష్ఠ, భరద్వాజ, గౌతమ, కశ్యప, జమదగ్ని, అత్రి, విశ్వామిత్ర, వ్యాస, అగస్త్య, చ్యవన, నారద, శంఖ–లిఖిత, శుక, మైత్రేయ, కాశ్యప, యాజ్ఞ్యవల్క్య, మార్కండేయ, భృగు, కపిల, పరాశర, అంగిరస, పిప్పల, మతంగ, కణ్వమహర్షులు లోకోపకారానికి ఎంత కృషి చేశారో, ప్రాణత్యాగానికి కూడా వెనుకంజ వేయకుండ ఎంత త్యాగనిరతిని ప్రకటించారో ఈ రచన ద్వారా హృద్యంగా అభివర్ణించారు.

ఈ మహర్షుల రచనలు చాతుర్వర్ణ్య వ్యవస్థను, గాయత్రి మంత్రమహిమను, అన్నదాన మహిమను, చ్యవనమహర్షి రూపొందించిన

చ్యవనప్రాశలేహ్య సామర్థ్యాన్ని, భక్తి జ్ఞాన వైరాగ్య ప్రభావాన్ని విశదపరుస్తాయి. యజ్ఞవిజ్ఞానాన్ని పలకడంలో సమర్థుడు కావున యాజ్ఞవల్క్యుడు అనే పేరుపొందిన మహర్షి విరచిత "యజ్ఞ్యవల్క్య స్మృతి" ఆస్తిలో స్త్రీకి హక్కు ఉందని ప్రతిపాదించిన మొదటి గ్రంథం.

కర్దమమహర్షికి దేవహూతికి శ్రీమన్నారాయణుని అంశతో జన్మించిన కపిలమహర్షి – పుండరీక మహారాజుకు బోధించిన అహింసా సిద్ధాంతం – జీవకారుణ్య ధర్మం. మానవాళికి ఒక ఆదర్శం – ఈ కపిలమహర్షి పేరు మీదనే తిరుమల కొండలక్రింద ఉన్న కపిలతీర్థం వెలసింది.

ఈ గ్రంథం గృహస్థాశ్రమధర్మంతోపాటు, వృత్తిధర్మం, రాజధర్మం, పాతివ్రత్యధర్మం, కులధర్మం, పతిధర్మం మొదలైన ధర్మాలను ప్రబోధిస్తుంది.

మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి భారతీయమహర్షులు మార్గదర్శకులై భారతదేశఖ్యాతిని విశ్వవ్యాప్తంచేశారు. మానవత్వాన్ని ప్రేమతత్వాన్ని, అలవరచుకోవడానికి మన మహర్షుల హితోక్తులు – సూక్తులు మనం చదవాలి. గ్రహించాలి. ఆచరించాలి. ఈ సందేశాల్ని "మహర్షులు – లోకోపకారవ్రతం" అన్న గ్రంథం ద్వారా మనకు అందించిన శ్రీ చివుకుల రమాకాంతశర్మగారు అభినందనీయులు.

"సర్వేజనాస్సుఖినో భవంతు"

*సదా శ్రీవారి సేవలో...*

**శ్రీకార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| | ముందుమాట | iii |
| 1. | వసిష్ఠ మహర్షి | 1 |
| 2. | భరద్వాజ మహర్షి | 5 |
| 3. | గౌతమ మహర్షి | 17 |
| 4. | కశ్యప మహర్షి | 21 |
| 5. | జమదగ్ని మహర్షి | 29 |
| 6. | అత్రి మహర్షి | 40 |
| 7. | విశ్వామిత్ర మహర్షి | 51 |
| 8. | వ్యాస మహర్షి | 65 |
| 9. | అగస్త్య మహర్షి | 79 |
| 10. | చ్యవన మహర్షి | 99 |
| 11. | నారద మహర్షి | 111 |
| 12. | శంఖలిఖిత మహర్షులు | 139 |
| 13. | శుక మహర్షి | 147 |
| 14. | మైత్రేయ మహర్షి | 158 |
| 15. | కాశ్యప మహర్షి | 167 |
| 16. | యాజ్ఞవల్క్య మహర్షి | 172 |

17. మార్కండేయ మహర్షి 181
18. భృగు మహర్షి 188
19. కపిల మహర్షి 198
20. పరాశర మహర్షి 210
21. అంగిరస మహర్షి 224
22. పిప్పలాది మహర్షి 232
23. మతంగ మహర్షి 249
24. కణ్వ మహర్షి 259

* * *

## సప్తఋషులు

# 1. వసిష్ఠ మహర్షి

సప్తఋషులలో వసిష్ఠ మహర్షి, ఒకరు. ఇక్ష్వాకు వంశానికి కులగురువు. వసిష్ఠుడిలో ఆగ్రహం, రజోగుణం లేవు. త్రిలోక పూజ్యురాలైన మహాపతివ్రత అరుంధతికి వసిష్ఠుడు భర్త. వసిష్ఠ మహర్షి త్రికాలవేది. భవిష్యత్తులో ఇక్ష్వాకువంశంలో ధర్మపరిపాలన జరుగుతుందనీ, విష్ణువు భూలోకంలోకి రాదలచుకుంటే యోగ్యమైన వంశం అవుతుందని గ్రహించి వారికి ఉపదేశం చేశాడు. ఆ వంశస్థులందరికీ కులగురువు అయినాడు.

ఈ సందర్భంలో వసిష్ఠ మహర్షి భార్య అరుంధతి తపఃశ్శక్తిని, సుమంగళత్వాన్ని తెలుసుకోవలసిన అవసరం ఉంది. తనకు కాబోయే భార్యయొక్క గొప్పదనం లోకానికి తెలియజేయాలని సంకల్పించాడు. అందుకోసం ఆమెను పరీక్షింపదలచి – ఒక గుప్పెడు ఇసుక తీసుకొనివచ్చి, దానిని పచనంచేసి, అన్నంగా మార్చి వండి పెట్టమని ఆదేశించాడు. అటువంటి వాళ్ళకే తనకు ధర్మపత్ని కాదగిన శక్తి, అర్హత, ఉంటుందని అన్నాడు వసిష్ఠుడు. అందుకు సమాధానంగా అరుంధతి "మహర్షీ! నేను తప్పక చేయగలను. మీ అనుగ్రహం, ఆశీర్వచనం ఉంటే ఏదైనా సరే సాధించగలను" అని చెప్పింది. ఆవిధంగా పలికిన తెలివి, వివేకం ఆమెలో ఉన్నాయి. ఆ ఇసుకను అరుంధతికి ఇచ్చే సమయంలో "నేను వసిష్ఠుడికి తగినటువంటి ధర్మపత్నినైతే......" అనుకున్నది.

ఆ ఇసుక రేణువులు బియ్యపు గింజల మాదిరి మెత్తగా ఉడికి అన్నం అయింది. కర్దమ ప్రజాపతి అనుమతితో వసిష్ఠుడు అరుంధతిని వివాహం చేసుకున్నాడు. ఆ మహత్తును లోకానికి తెలియజేయటానికి ఆ పరీక్ష నిర్వహించాడు. ఇదంతా వివాహానికి ముందు జరిగిన పరీక్ష.

వివాహం అయిన తరువాత వసిష్ఠుడు అరుంధతికి మరో పరీక్షకు గురిచేసాడు. "ఒకనాడు మంత్రజలం ఉన్న కమండలం ఆమె చేతిలో ఉంచాడు. నేను తిరిగి వచ్చేవరకు కమండలం నేలపై ఉంచగూడదు" అని ఆదేశించాడు. ఆమె సరేనని అలాగే కమండలాన్ని చేతిలో ఉంచుకొని నిలబడింది. ఏకాగ్రమైన యోగస్థితిని పొందింది. సంవత్సరాలు గడిచాయి. ఆమె చలించలేదు. వసిష్ఠుడు తిరిగి రాలేదు. అరుంధతి కమండల ధారణకోసం యోగమందు ప్రవేశించి, తపస్సులో ఉండిపోయింది.

క్రమంగా ఆమె తపఃశ్శక్తి అంతా లోకాలకు వ్యాపించింది. ఈ ఇంద్రలోకం వరకు ఆమె తపస్సు వ్యాపించింది. ఆమెకు ఆ తపస్సులో ఉగ్రత్వం కలిగింది. బ్రహ్మాదులందరికీ ఏమి చేయాలో తోచలేదు. అప్పుడు వాళ్ళంతా వసిష్ఠ మహర్షి ఎక్కడ ఉన్నారో కనుగొని ఆయనను ఇంటికి తీసుకొని వచ్చారు. వెంటనే ఆయన ఆమె వద్ద ఉన్న కమండలం తను తీసుకున్నాడు. అరుంధతి ఆయన పాదాలను స్పృశించి నమస్కరించింది. దేవతలు పుష్పవర్షం కురిపించారు. బ్రహ్మాదులు ఆమె ఐదవతనానికి ఆశ్చర్యంచెంది ఆమెకు దీర్ఘాయువు, సుమంగళత్వం ప్రసాదించారు. అరుంధతి మహిమ, పాతివ్రత్యం అటువంటిది అని లోకానికి తెలియపర్చారు.

వసిష్ఠ మహర్షి స్మృతి కర్తలలో ఒకరు. మనుస్మృతి మాదిరి వసిష్ఠస్మృతి' కూడా ఉంది. ఆ గ్రంథంలో ముప్పది అధ్యాయాలు ఉన్నాయి. దీనికి 'వసిష్ఠ ధర్మసూత్రములు' అని పేరు. ఈ గ్రంథంలో బ్రహ్మచారి ధర్మాలు, గృహస్థ ధర్మాలు, వానప్రస్థ, సంన్యాస ధర్మాలు, వైశ్వ దేవాదికములు, స్నాతక వ్రతము, ఉపాకర్మ విధి, దత్తత స్వీకారం మొదలైన సద్విషయాలు తెలియపరచాడు. ఇంకా ఈ గ్రంథంలో యజ్ఞయాగాదులలో ప్రాయశ్చిత్తాలు, దానములు వాటి విధానాలు, ప్రాణాగ్నిహోత్ర విధి విధానాలు వాటి వివరాలు ఉన్నాయి. 'వృద్ధ వాసిష్ఠము' అని కూడా విపులమైన గ్రంథం వున్నది. మితాక్షర, 'స్మృతీ



చంద్రిక' మొదలైన ధర్మశాస్త్రములు, వసిష్ఠస్మృతి నుంచే ధర్మ నిర్ణయాలు ఏర్పాటు చేసుకున్నాయి.

'మితాక్షర'ను ఆధారం చేసుకొనే 'హిందూ లా' (Hindu Law) పుట్టింది. ఇదికాక జ్ఞానవిషయములు వచ్చినపుడు "యోగవాసిష్ఠము"ని, "జ్ఞాన వాసిష్ఠము"ని, "జ్యోతిర్వాసిష్ఠము"ని పేరుతో గూడా గ్రంథములు వచ్చాయి. వసిష్ఠ మహర్షి "వసిష్ఠ రామాయణము" అనే గ్రంథం గూడ రచించారని చరిత్రలవలన తెలిసింది. అయితే ఆ గ్రంథం అందుబాటులో లేదని చరిత్ర పరిశోధకులు చెప్పటం జరిగింది. వసిష్ఠుడు కొన్ని రకాల అస్త్రాలను కనుగొన్న శాస్త్రవేత్త కూడా.

## గృహస్థాశ్రమ ధర్మం శ్రేష్ఠం

గృహస్థాశ్రమ ధర్మంలోని ప్రయోజనాలను, విశిష్టతను వసిష్ఠమహర్షి వివరించాడు. వీటికి మూలం వేదాలు ఆధారం. ఒక్క గృహస్థాశ్రమంలోనే యోగము, భోగము, తపస్సు, దానము, సేవ, త్యాగము, ధర్మము, సమాజానికి ఋణం తీర్చుకోవటము, దేశానికి ఋణం తీర్చుకోవడము మొదలైన సత్కార్యాలు సాధ్యమవుతాయి. గృహస్థధర్మం ఎలా ఉండాలో తెలుసుకోవటానికి ఋషులను, వారి స్మృతులను జ్ఞాపకం చేసుకోవాలి. "సంసారం సాగరం దుఃఖం" బాధ, బంధనం, అంటూంటాం కానీ, ధార్మికదృష్టి ఉన్నవాడికి ఆ సంసారంలోనే ఋణాలు తీర్చుకోవడానికి ధర్మం ఆచరించటానికి, తపస్సు చేసుకోవటానికి పదిమందికి అన్నము వితరణ చేయటానికి అవకాశం ఉంటుంది. సంసారంలో ఇబ్బందులు, కష్టాలు, బాధలు, పుణ్యం చేయకపోవటం, ధర్మం ఆచరించకపోవటం వలన వస్తాయి. పూర్వజన్మ పుణ్యం లోపించటం వలన సంసారం చాలా కష్టముల పాలవుతుంది. అటువంటి సంసారంలో కూడా ఉత్తములు తపోభంగం లేకుండా జీవించారు. తపస్సు, నిష్ఠ, ధర్మానికి ఏ భంగమూ కలగకుండా వాళ్ళు కష్టాలను అనుభవించారు. సుఖంతో గూడిన

సంసారంలో ఇవన్నీ చేయగలమని అనుకోకూడదు. ఎన్నో కష్టాలు పడుతూ మన పూర్వులు వారి ధర్మాచరణలో లోపం రాకుండా జీవించారు. ఇదే భారతీయ ఆదర్శవంతమైన గృహస్థ ధర్మాన్ని భారతీయ మహర్షులు ఆచరించారు.

ఈ రోజుకీ భారతదేశంలో వసిష్ఠమహర్షికి ప్రముఖ స్థానం ఉంది. ప్రతి గృహంలో నిర్వహించే శుభకార్యాలలో ఒక యాజ్ఞికుడిని ఆహ్వానించి శుభకార్యం నిర్వహిస్తాం. అతడిని "వసిష్ఠులవారు" అని సంబోధించటం ఒక సంప్రదాయంగా వస్తోంది.

ప్రస్తుత కాలంలో వివాహ మహోత్సవ సమయంలో నూతన వధూవరులకు 'అరుంధతీ' నక్షత్రంను విధిగా చూపిస్తారు. దాని అర్థం : అరుంధతీ వసిష్ఠులు ఎంతో అన్యోన్యంగా, గృహస్థధర్మాలను తు.చ తప్పక ఆచరిస్తుంటారు. ఈనాటికీ వారిద్దరు ఆదర్శ దంపతులు. అందువల్ల నూతన వధూవరులు గూడ గృహస్థ ధర్మాలను నిత్యం ఆచరిస్తూ, అన్యోన్య దంపతులుగా నిండు నూరేళ్లు జీవించాలని, ఆకాంక్షిస్తూ ఈ నియమాన్ని శాస్త్రబద్ధం చేసారు భారతీయ మహర్షులు, ఈ నియమం లోకానికి అందించిన ఉత్తమ సందేశం.

* * *

# 2. భరద్వాజ మహర్షి

భరద్వాజ మహర్షి సప్తఋషులలో ఒకరు. బృహస్పతి మమతల పుత్రుడే భరద్వాజుడు. భరద్వాజుడు పరమ ప్రశాంతమైన మనస్సు కలిగిన పరమ పవిత్రుడు. ఆయన తపస్సు చేసిన ఆశ్రమానికి 'భరద్వాజ తీర్థ'మని పేరు వచ్చింది. భరద్వాజ మహర్షి ఒకసారి కైలాస శిఖరం దాకా వెళ్లి భృగుమహర్షిని దర్శనం చేసుకొని, అతడివల్ల జ్యోతిషశాస్త్రం పూర్తిగా తెలుసుకున్నాడు. అంతేగాక ఈ సృష్టియొక్క క్రమం తెలుసుకున్నాడు. వర్ణాశ్రమ ఆచారక్రమం, పరలోకస్థితి వంటి విషయాలు అన్నీ ఆయన వల్లనే తెలుసుకున్నాడు.

అందువల్ల ఎంతటివారైనా జ్ఞానం సంపాదించాలనే అభిలాష పెంచుకోవాలి. నిత్య విద్యార్థి శ్రద్ధను పెంచుకుంటే ఎంత జ్ఞానాన్నయినా సంపాదించుకోవచ్చు. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్" అన్నాడు గీతాచార్యుడు. శ్రద్ధ ఉంటే జ్ఞానం లభిస్తుందని అర్థం. నేటి విద్యార్థులకు ఇది అత్యంత అవసరం.

### రాజధర్మం

శత్రుంజయుడను మహారాజు ఒక రోజు భరద్వాజ మహర్షిని దర్శించి తనకు రాజధర్మాలు తెలియజేయమని ప్రార్థించాడు. వెంటనే భరద్వాజుడు ఆయనకు సకల రాజధర్మాలు బోధించారు. అవి :

రాజా! రాజు దండ విధానంలో చాలా జాగరూకుడై ఉండాలి. దండ విధానం ద్వారా శత్రుపక్షమనే వృక్షాన్ని కూకటి వేళ్ళతో నిర్మూలించాలి. శత్రువు విషయంలో దయాదాక్షిణ్యాలు లేకుండా ఉండాలి.

మధురమైన మాటలతో, పూర్తి గౌరవ మర్యాదలతో సభలో మాట్లాడుతూనే ఉండాలి. శత్రువు అని తెలిసినప్పటికీ బయటకు మాత్రం కుటుంబ క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంటూ ఉండాలి. శత్రువుల విషయం వస్తే కోయిలవలె మధురంగా మాట్లాడాలి. హృదయంలో వజ్రకాఠిన్యం ఉండాలి.

ఎప్పుడూ జాగరూకుడై జాగ్రత్తగా ఉండాలి. తన వాళ్లతో, తన బలంలో శత్రుపక్షం వారు ఎక్కడ ఉన్నారో, ఏం తింటున్నారో, ఏం మాట్లాడుకుంటున్నారో తెలుసుకుంటూ ఉండాలి. అదీ రాజధర్మం. వాళ్లను శిక్షించవలసి వచ్చినపుడు సగం శిక్షించి, శత్రువు శరణు అంటే దయతో వదిలిపెట్టడం నాస్తిక లక్షణం అనిపించుకుంటుంది. ఇది ఆర్యధర్మం కాదు.

ఇంకా రాజధర్మాలను గురించి భరద్వాజమహర్షి ఇలా వివరించారు. 'నీ శత్రువుల ప్రశస్తి వచ్చినపుడు నీవు కోయిలవలె మధురంగా మాట్లాడాలి. నీ వాక్పారుష్యం చేత శత్రుత్వం పెంచవద్దు. యుద్ధానికి నీవు మొదట కారణం కాకూడదు. రాజు ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. చతురంగ బలాలు ఉన్నాయి కదా! అని నిద్రపోకూడదు. తన చుట్టూ అనేకమంది పరివారం ఉన్నా రాజు కూడా జాగ్రత్త వహించాలి. అందులో ఎవరిలో ఏ విధమైన మనస్తత్వం ఉంటుందో తెలియదు. అందరి ముఖకవళికలను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి. మాటలు కూడా వింటూ ఉండాలి. రామాయణంలో రామలక్ష్మణులు రాజధర్మాలు అడిగితే, రావణుడు తన అవసాన దశలో ప్రాణాలు పోయే పరిస్థితులలో గూడ వారిద్దరికి రాజధర్మాలను బోధించాడు. శత్రువుల్లోనూ మంచి చెడూ ధర్మాలు ఉంటాయనీ, వాటిని వినాలనీ, ఆచరించాలనీ లోకానికి అందించాడు భరద్వాజుడు.

నమ్మితేనే మోసం చేయటం కుదురుతుంది. అందుకని ద్రోహమంటే నమ్మక ద్రోహమనే అర్థం. ఈ ప్రకారంగానే మనుష్యులూ ఉంటారు. అందుకనే శత్రుపక్షంతో ఆచితూచీ సంభాషించాలి. శత్రువులతో సంభాషణా చాతుర్యాలు, నైపుణ్యాలు (Communication Skills) ఎలా ఉండాలో భరద్వాజ మహర్షి పూస గ్రుచ్చినట్లు వివరించాడు. ఆనాటి రాజధర్మాలు నేటి ప్రభుత్వాలకు అవసరమే. పొరుగు దేశాల వారితో ఎలా ఉండాలో భరద్వాజ మహర్షి రాజధర్మాలు ఎంతో ఉపయుక్తముగా ఉంటాయి అనటంలో సందేహంలేదు.



శత్రువులు దండెత్తి వస్తున్నారంటే రాజులు మేరు పర్వతంవలె నిశ్చలంగా, గంభీరంగా ఉండాలట. రాజులలో కలవరం కనపడగూడదు. “అలాగా! శత్రువులు వస్తున్నారా! రానీయ్యండి!! ఏమీ ఫరవాలేదు ధైర్యంగా ఎదుర్కొంటాము” అని ధైర్యంగా నిలబడాలి.

భరద్వాజుడు ఇంకా పాలనలో జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో చెబుతున్నాడు. “రాజా! ఆరామాల్లో, వేశ్యాగృహాల్లో, సత్రాల్లో, మందిరాల్లో స్నాన, పాన ప్రదేశాల్లో దొంగలు చేరుతూ ఉంటారు. జార, చోరుల వల్ల ప్రజలకు దొంగ భయం ఉంటుంది. అందువల్ల పట్టుకొని బంధించాలి. అది పాలనలో మొదటి ధర్మం. లోకక్షేమంకోసం ఎక్కడ ఎక్కడ ఏమి జరుగుతుందో రాజు గమనించాలి. ఎవరి గురించైనా, ఎవరైనా మంచి మాటలు, నడవడి ఉత్తమ వ్యక్తిత్వం చెబితే, రాజు ఆ మాటలు త్వరగా నమ్మగూడదు. అలాగని వాడిని అక్కడే అనుమానించనూ వద్దు, వారిని లోతుగా పరీక్షించి, సమగ్ర విచారణ జరిపించాలి, నిర్ణయం తీసుకోవాలి.

రాజు ఋణశేషం పెట్టకోగూడదు. రాజు ఋణగ్రస్థుడు కాకూడదు. శత్రువు ఓడిపోయినా, రాజు మీద ద్వేషం ఉంటుంది. దానిని 'రణశేషాగ్ని' అంటారు. ఋణశేషాగ్ని, రణశేషాగ్ని ఆ రెండింటినీ ఉపేక్షించగూడదు. అలా చేస్తే రాజు తప్పు చేసిన వాడవుతాడు. రాజు 'దూరదృష్టి'లో 'గ్రద్ద' వలె ఉండాలి అని బోధించాడు భరద్వాజుడు. గరుడపక్షి ఆకాశంలో విహరిస్తూ భూమిమీద ఉన్న చిన్న పురుగును చూచి ఆహారంగా స్వీకరిస్తుంది. అదే గ్రద్ద భూమి మీద ఉన్న చిన్న పాము పిల్లమీద పడుతుంది. అలాంటి దూరదృష్టి పాలకులకు ఉండాలి. ఎంత దూరంలో ఉన్నా చూడగల నైపుణ్యం ఉండాలి. శారీరకంగానూ, మానసికంగానూ, వ్యూహాత్మకంగా గూడా దూరదృష్టి – గ్రద్దదృష్టి ఉండాలి. అంటే కంటితో నిశిత పరిశీలన చేయాలి అని అర్థం.

రాజుకు సమయ సందర్భాలలో "కొంగ వినయం" వుండాలి. అలాగని రాజు ప్రజల వద్ద, మంత్రులవద్ద వినయశీలిగా ఉండకూడదు. గురువుల వద్ద, తల్లిదండ్రుల వద్ద వినయంగా, గౌరవంగా ఉండాలి. వీరికి నమస్కరించి పాదధూళి తీసుకోవాలి. శిరస్సున ధరించాలి.

"విశ్వాసం విషయంలో కుక్కలా ఉండాలి" తన ఇష్టదైవం పట్ల, కుల దైవం పట్ల తీవ్రమైన విశ్వాసంతో ఉండాలి. ఒక మంత్రం, ఒక గురువు, ఒక దైవం మీదనే విశ్వాసం ఉండాలి.

రాజుకు "సింహ పరాక్రమం" ఉండాలి అన్నాడు భరద్వాజుడు. సింహం శత్రువును చూడగనే విచక్షణ లేకుండా వెంటనే దాని మీదకు దూకేస్తుంది. మొదట దాడికి సింహమే చొరవచూపిస్తుంది.

ఆధ్యాత్మ సాధకుడు ఎలా ఉండాలని ప్రశ్న. అతడు సాధకుడు గాబట్టి పరిపాలనలో అతడు ఉండగూడదు. అంటే సాధకునిలా పరిపాలనలో ఉండకూడదని అర్థం. పరిపాలనలో పరిపాలకునిలాగే ఉండాలి. అలాగే ఉద్యోగంలో ఉద్యోగిగానే ప్రవర్తించాలి. అది ఉద్యోగ ధర్మం. సంసార ధర్మం సంఘంలో నేరుగా ఉంటుంది. సాధకుడు భర్తగా ఉన్నపుడు సాధకుడు కాదు. తండ్రిగా ఉన్నపుడు సాధకుడు కాదు. సేవకుడుగా ఉన్నపుడు సేవకుడు కాదు. ఎక్కడ ఏవిధంగా ఉండాలో అలా ఉండాలని అర్థం. తనలో తాను ఒక్కడు ఆధ్యాత్మిక సాధకుడు అవుతాడు. స్పష్టంగా తేడా చెప్పబడింది. ఆర్య ధర్మం అలా చెబుతుంది. ఆధ్యాత్మిక ధర్మాన్ని లౌకిక ధర్మంలో ప్రవేశపెట్టి, అలౌకిక ధర్మాన్ని భ్రష్టం చేయుటకూడా తీవ్రమయిన అధర్మమే.

రాజుకు విచక్షణ జ్ఞానం ఉండాలి. రాజుకు ఒకసారి చేతికి వచ్చిన వస్తువులు ఉంటాయి. అక్కడ ఆ విషయం గమనించే వారు ఎవరు ఉండరు. తాను కావాలనుకుంటే తీసికోవచ్చు. కానీ అది రాజు లక్షణం కాదు గదా! ఉపేక్షించాలి. ఒక చోట బంగారు నాణేలు ఉన్నాయి. ధనం ఉన్నా అది రాజుది కాదు. కనుక తాను తీసుకోకూడదు. చాపల్యము, దుర్బుద్ధి ఉండకూడదు. ఉపేక్షించి వెళ్లిపోవాలి. దొరికింది తీసుకోవటం సంపాదన కాదు. సంపాదన అనే మాటకు అర్థం వేరు. ఊరికే ఒకరు ఇస్తే అది సంపాదన అవుతుందా! సంపాదన అంటే ఏమిటి, ఏదో ఒక పనిచేసి ధనం తీసుకోవటం సంపాదన అవుతుంది.



స్త్రీ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ఒక సౌందర్యవతి అయిన స్త్రీ తన ఇంట్లో శరణు కోరివస్తుంది. ఆమెను చూడనైనా చూడగూడదు. అపహరించేటటువంటి చెడు, వక్రబుద్ధి ఉంటే రాజు నశిస్తాడు. ఆ విధంగా ప్రవర్తించటం రాజ లక్షణంకాదు. 'నావిష్ణుః పృథివీపతిః" అంటే "రాజుకు విష్ణువు లక్షణాలు ఉండాలి" ఆ విభూతి కలిగినవాడు ఆవిష్ణు స్వరూప లక్షణం కలవాడైతే ఒక వస్తువుని అపహరిద్దామనే వక్రబుద్ధి మనసుకు రాకూడదు అతడికి. ఆ వక్రబుద్ధిని మనసుకు రానివ్వనేగూడదు.

"శిక్ష జాగ్రత్తగా వేయాలి" అని భరద్వాజ మహర్షి రాజుకు హితవు పలికాడు. చిన్న తప్పుకు మూలచ్ఛేదనంలాంటిది చేయకూడదు. "అనువుకాని చోట అధికులమనరాదు". ఏదయినా పరీక్షా సమయం వచ్చినపుడు కాకి మాదిరి సంశయము కలిగివుండాలి.

"రాజు నడక పాము నడకలా ఉండాలి" అన్నాడు భరద్వాజుడు. పాము నడక చాలా వేగంగా ఉంటుంది. సర్ప అంటే వేగము అని అర్థం. వేగంగా వెళ్ళేది కాబట్టి దానికి 'సర్పము' అని పేరు వచ్చింది. మెలికలు తిరుగుతూ అతి వేగంగా వెళుతుంది సర్పము. ఒక ప్రదేశము నుంచి మరొక ప్రదేశమునకు వెళ్ళవలసి వచ్చినపుడు ప్రభువులు, ముఖ్యమైన వాళ్ళు, తమకు రక్షకభటులు ఉన్నపుడు నెమ్మదిగా నడవకూడదు. అలా వెళ్లటం వారికి క్షేమంకాదు. తన

రక్షణ భారం భద్రతా యంత్రాంగంపై ఉన్నది. కనుక, వాళ్లతో సహకరించాలి. తనకు తాను ఆపద కొని తెచ్చుకోగూడదు. పాములాగా వేగంగా నడవాలి. అందరికీ అందుబాటులో ఉండకూడదు.

“పాము నడక, కాకి సంశయము, కుక్క విశ్వాసము, సింహ పరాక్రమము, కొంగ జపము, వినయము, గ్రద్ద దృష్టి ఇవన్నీ ఎందుకు! అని ప్రశ్న రావచ్చు. ఆర్యులు పశుపక్ష్యాదుల నుంచి నీతులు నేర్చుకున్నారని అర్థం. ప్రతి పక్షి, ప్రతి పశువు, ప్రతి వస్తువు కూడా మనకు నీతులు చెబుతాయి. వాటిని నీచ దృష్టితో చూడగూడదు. ఈ విషయంలో మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చాయి. వీటిని అర్థం చేసుకొని మెలగాలి.

భరద్వాజ మహర్షి ఆనాడు రాజుకు ఇచ్చిన సందేశాలు, ఆదేశాలు, సలహాలు, సూచనలు నేటి పాలకులకు అత్యంత అవసరం, అనుసరణీయం. రాజుకు సందేశం ఇవ్వటంలో అర్థం పాలన సక్రమంగా పాలించి, రక్షించటమే ధ్యేయం అని స్పష్టంగా తెలుస్తోంది.

## ద్విజుడికి ధర్మములు

భరద్వాజ మహర్షి మేరు శిఖరం మీద తపస్సు చేసుకుంటున్నాడు. ఆయనను చూడటానికి భృగు మహర్షి, అంగీరసుడు, అత్రి. శాండిల్యుడు, మార్కండేయుడు, వసిష్ఠుడు, మాండవ్యుడు మొదలైన మహర్షులు వచ్చారు. ఇంతమంది మహర్షులు ఆయనను చూడటానికి వచ్చారంటే, భరద్వాజుడు ఎంతో గొప్ప మహర్షి అనుకోవాలి. వీళ్ళంతా భరద్వాజుడిని చూచి స్తోత్రంచేసి ఇలా పూజించారు.

**“భగవాన్ సర్వధర్మః సర్వ వేదార్థపారగః ।**
**సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞః సర్వసత్కర్మకోవిదః ॥**



**సంధ్యాది ప్రముఖాః సర్వా నిత్యనైమిత్తిక క్రియాః ।**
**యా స్త్రోర్విజుదిభః కార్యా కన్నో వక్తుమర్హసి ॥”**

ఆవిధంగా ఆయనను స్తోత్రంచేసి, నిత్య నైమిత్తిక క్రియలన్నీ బ్రాహ్మణులకు ఏ ప్రకారంగా ఆచరణీయములో ఆ ధర్మములు వివరింపుము అని అడిగారు.

వెంటనే భరద్వాజ మహర్షి ధర్మశాస్త్రాన్ని వాళ్లకు బోధించాడు. దానిని “భరద్వాజ స్మృతి” అని అంటారు. ఈ గ్రంథము నేటికీ అందుబాటులో ఉంది. అందులో శాస్త్రావతారిక, దిగ్భేదము, మలమూత్ర విసర్జనకు అవసరమైన ధర్మములు, శౌచము, ఆచరణము, దంత ధావనము, క్షురకర్మ, సంధ్యా ప్రమాణము, జపము, తపము, బ్రహ్మయజ్ఞము, పితృతర్పణము, ఔపాసనము, వైశ్వదేవము, మహా యజ్ఞచతుష్టము, భోజనము, శయనము, ధ్యానము, మహాధ్యానము, పూజనము, పూజా ద్రవ్యములు, జపకలశము, జప క్రియలు, యజ్ఞోపవీత ధారణ దాని ప్రాముఖ్యము, కుశలు, ప్రణవము, వ్యాహృతి, సాధనము ప్రాయశ్చిత్తములు మొదలైన ఎన్నో విషయములు భరద్వాజ మహర్షి అందులో నిర్వచించారు (వివరించారు).

స్మృతులు చదవాలి. చదివితే వేదసమ్మతమైన మతము మనము ఆచరించవచ్చు. స్మృతి వేదము యొక్క పరమార్థాన్ని, దాని యొక్క హృదయాన్ని వివరించి మన నిత్యజీవితంలో ఎలా ఆచరించాలో చెప్పింది. ఈ స్మృతులు బ్రాహ్మణులకే కాదు, అన్ని వర్ణముల వారికి, అన్ని ఆశ్రమములలో ఉండేవారికి కూడా అనేక ధర్మాలు చెప్పటం జరిగింది. మనుష్యుడిగా ఏమి ఆచరించాలో స్మృతులలో వివరించారు, అది వేద సమ్మతం.

## సర్వ సత్కర్మలు

సర్వ సత్కర్మలు అంటే – దానము, నమస్కారము చేయుట ఇవన్నీ మనం తూర్పు ముఖంగా కూర్చొని చేయాలి. తాను ఇతరులకు తూర్పు

ముఖంగా ఉండి నమస్కరించవచ్చు. అభిముఖమే ప్రధానం కాదు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క ధర్మాన్ని చాలా జాగ్రత్తగా ఆచరిస్తారు. తూర్పు దిక్కు తెలియకపోతే అసలు కర్మ ప్రారంభించవద్దు అని అన్నాడు భరద్వాజ మహర్షి. తూర్పు దిక్కు తెలియకుండా ఏదో ఒక వైపు కర్మచేస్తే ఫలితం ఉండదు. పరాశరస్మృతిలో, తూర్పు దిక్కు తెలుసుకున్న తరువాతనే సంధ్యావందనం ఆచరించమని పేర్కొనబడింది. అయితే ఉదయం, సాయంత్రం సంధ్యలు ఉదయం పదింటికి, రాత్రి పదింటికి సంధ్యావందనం చేసేవారికి తూర్పు దిక్కు ఎలా తెలుస్తుంది. అందువల్ల ప్రాతఃకాలం సాయంకాల సంధ్యావేళలో మాత్రమే సంధ్యావందనము చేయాలి. ఆ సమయములలో చేయలేకపోతే అసలు చేయనేవద్దు అని అర్థం.

దక్షిణముఖంగా కూర్చొని ఆచమనం చేస్తే మళ్ళీ స్నానం చేయాలి. అలా ఆచమనం చేస్తే సచేల స్నానం చేయాలని నియమం అది ప్రాయశ్చిత్తం, మళ్లీ ఆ గుడ్డలతోనే స్నానం చేస్తే ఆ దోషం పోతుంది. అలా చేయకుండా కర్మ ప్రారంభించరాదు అని భరద్వాజుని నిర్ణయం. భరద్వాజ స్మృతి అలా చెబుతుంది. ఏ కర్మ అయినా ఏదో చెప్పారు. చేద్దాం అని చేయగూడదు. కర్మ ఫలాన్ని ఆశించి శ్రద్ధతో చేస్తేనే ఆ ఫలం లభిస్తుంది. దానివలన ప్రయోజనం ఉండదు అని అనుకొని చెయ్యగూడదు. అంతకన్నా "గోవిందా! గోవిందా! గోవిందా!" అని మూడుసార్లు స్మరణచేస్తే సరిపోతుంది అది పుణ్యం.

సంధ్యావందనంలో కూడా గాయత్రీమంత్ర జపంచేసి చివరకు బ్రహ్మార్పణం చేస్తారు. ఈ విషయం గుర్తు పెట్టుకోవాలి. ఎంతో అర్థముంది అందులో. సంధ్యావందనంలో ప్రథమమైన, ముఖ్యమైన భాగం అర్ఘ్యప్రధానం. దిక్కు తెలుసుకొని అర్ఘ్యప్రదానం చేయాలి. సాయంకాలం ఆలస్యంగా సంధ్యావందనం చేసేవాడు ఉత్తరదిక్కుగా కూర్చొని అర్ఘ్యప్రధానం విడువమని శాస్త్రం చెప్పింది. సకాలంలో చేస్తే, తూర్పు తెలియకపోతే చేయవద్దు, అది



నిష్ఫలమవుతుంది. సాయంకాలం ఆలస్యమైనా తరువాత సంధ్యావందనం ఉత్తరముఖంగా చేయవచ్చు. అకాలమైనా చేయవచ్చు దానికి ప్రాయశ్చిత్తం ఉంది.

బ్రహ్మీముహూర్తంలో నిద్రనుంచి లేవాలి. ఆ విధంగా ఉషఃకాలంకంటే ముందే నిద్రలేచి పరమేశ్వరుడిని ధ్యానించి ఇంట్లోంచి బయటకి వచ్చి, మొట్టమొదట దక్షిణం వైపుగానీ, పశ్చిమంవైపు గానీ వెళ్ళాలి. మొత్తం రాత్రిని అయిదు భాగాలుగా చేసి ఆఖరి భాగాన్ని ఉషఃకాలం అని, బ్రాహ్మీముహూర్తం అని కానీ అంటారు. అంతకుముందే నిద్రలేవాలి అన్నమాట. దక్షిణ లేక పడమర దిక్కులలో ఏదో ఒక దిక్కులో కాలకృత్యములు తీర్చుకోవాలి. చెట్టు, పుట్ట వున్నచోట, కాలిబాటలు, దారులు వున్నచోట, బురదగుంటలు వున్నచోట, అలాగే దేవాలయాలు, గోవులు ఉన్న ప్రదేశాలు పవిత్ర స్థలాలు కాబట్టి అక్కడకు కాలకృత్యాలు తీర్చుకోవటానికి వెళ్లగూడదు.

దంత ధావనం (పండ్లు తోముకోవటం) చేసేటప్పుడు తూర్పు దిక్కుగా తిరగమన్నాడు. భరద్వాజ మహర్షి దేవాలయాలలో, నదీ తీరాలల్లో, ఇళ్ళల్లోనూ, సప్తవిధ స్నానములలో ఒక్క శుద్ధస్నానము ఆచరించమన్నాడు. స్నానాలు చాలా రకాలు ఉన్నాయి. అందులో మృత్తికాస్నానం ఉన్నది. విభూతిస్నానం ఉన్నది. నీళ్ళు లేకపోతే విభూతి స్నానం చేయాలి. నీళ్ళు ఉన్నచోట కూడా అప్పుడప్పుడు కొంతమంది శైవులు విభూతిస్నానం చేస్తారు. స్నానం చేసిన తరువాత వెంటనే సంధ్యావందనం చెయ్యాలి. స్నానానికి, సంధ్యావందనానికి మధ్య ఆలస్యం ఉండరాదు.

## వైమానిక శాస్త్రం

విమాన సృష్టికర్త భరద్వాజ మహర్షి. ప్రాచీన యుగంలో రవాణా సౌకర్యంగా విమానం అవసరమైంది. సముద్రాలు, కొండలు, అరణ్యాలు,

నదులు, దాటి ప్రయాణం చేయాల్సి రావటం కష్టంగా ఉండేది. అందరికి అందుబాటులో ఉండాలనే సదుద్దేశ్యంతో భరద్వాజ మహర్షి విమానాల తయారీకి ప్రాధాన్యత ఇచ్చాడు. ఏ విమానాన్ని ఏ లోహంతో నిర్మించాలో తెలియచేసాడు. వ్యోమ విమానం, ఋక్మ విమానం, పుష్పక విమానం ఇలా పేర్లు నిర్ణయించారు విమానాలకు భరద్వాజుడు.

ఆయన నిర్మాణం చేసిన విమానం విరిగిపోదట. దాన్ని ఖడ్గంతో విరగగొట్టటానికి వీలుపడదట. అగ్నిలో దగ్ధం కాదట. పైనుంచి క్రిందపడ్డా కూడా విమానం నాశనం కాదట. కంటికి కనబడకుండా ఆకాశంలో వెళ్ళే విమానాలు ఆయనచేత నిర్మించబడ్డాయి. శత్రువుల విమానాలలో జరుగుతున్న రహస్య సంభాషణలను వినటానికి వీలయ్యే మార్గాలను కూడా ఆయన చెప్పాడు. ఆ విషయాలన్నీ శ్లోక రూపంలో సంస్కృత భాషలో వ్రాయబడ్డాయి. అది రహస్యంగా ఉంటుంది. ఆయన చెప్పిన విషయాలు చాలా చిత్రంగా ఉంటాయి. ప్రత్యర్థి విమానాలలోని మనుషుల సంభాషణలు వినే శక్తి, శత్రువిమానాల ఛాయాగ్రహణ శక్తి రహస్యములు ఇవన్నీ చిత్రంగా ఉన్నాయి. భరద్వాజ మహర్షి తను రచించిన వైమానిక శాస్త్రంలో ఇలాంటి అద్భుతాలు వివరించారు. భరద్వాజ మహర్షి వ్రాసిన యంత్ర సర్వస్వము అనే గ్రంథములో విమాన నిర్మాణం గురించి వ్రాశాడు. అయితే ఈ గ్రంథం కొంత భాగం మాత్రమే బరోడా (గుజరాత్) గ్రంథాలయంలో ఉన్నదని శాస్త్రవేత్తలు వివరించారు.

భరద్వాజుడు సంపూర్ణ భరతఖండాన్ని పర్యటించి మానవుడు ఎలా జీవిస్తున్నాడో చూసి మిక్కిలి విచారించాడు. ధర్మమే సమగ్ర జీవనమునకు ఆధారము. కాబట్టి సమాజము ధర్మముయొక్క పట్టునుండి సడలిపోకుండా మానవ జీవనము పశుతుల్యము గాకుండా ఉండాలని ఆలోచించాడు. చక్కటి ఆలోచనాశక్తి, ధనశక్తి మరియు భౌతిక, శారీరక శక్తులు మిళితమైతే ఒక



నూతన ప్రచండ శక్తి నిర్మాణమౌతుంది. దాని ఆధారంగా మానవ కళ్యాణము సాధించవచ్చునని భావించి తదనుగుణంగా కృషి చేయటం ప్రారంభించాడు. ఆ ప్రయత్నంలో “దివోదాసుడను” రాజు తటస్థపడి అతనికి శిష్యుడైనాడు. ఆ ఇద్దరి వైదిక తృష్ణధారతో గ్రామగ్రామాన తిరుగుతూ ప్రజలతో వైచారిక క్రాంతిని కలిగించారు. ఆ రోజుల్లో కూడా ప్రజల వద్దకు వెళ్ళి వారితో ఆధ్యాత్మిక సంబంధాలను పెంచుకొని ధర్మాచరణకు నాంది పలికారని తెలుస్తోంది. “ప్రజల వద్దకు ధర్మం” అనే ప్రచార విధానాన్ని ప్రవేశ పెట్టిన వారు వీరిద్దరు.

మానవజీవన వికాసానికి పశువుల ఆవశ్యకతను భరద్వాజుడు గుర్తించి “పశువులను ప్రేమించు” అనే నినాదాన్ని అందించాడు. ముప్పది మూడు కోట్ల దేవతలకు నిలయమైన గోమాత యొక్క మహిమను తెలిపి “గోహత్య చేయగూడదు” అనే భావాత్మక నినాదాన్ని మొట్ట మొదట వ్యక్తంచేసి, ఆచరణలోకి తెచ్చిన మహర్షి భరద్వాజుడు. భరద్వాజ మహర్షి స్ఫూర్తితోనే తిరుమల తిరుపతి దేవస్థానం వారు “గుడికో గోమాత” అనే పథకం ప్రవేశపెట్టి గోసేవ, గోపూజపై ప్రజలకు అవగాహన పెంచారని అనుకోవాలి.

## శ్రీరాముడు - భరద్వాజుని ఆశీస్సులు

రామాయణంలో భరద్వాజ మహర్షికి విశిష్టస్థానం, అత్యంత గౌరవం ఉన్నాయి. శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతంగా అరణ్యవాస ప్రయాణంలో భరద్వాజుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించి ఆశీర్వచనం స్వీకరించాడు. పదునాలుగు సంవత్సరాల తరువాత రావణ సంహారానంతరం అయోధ్యకు వెళ్తూ మధ్యలో భరద్వాజ ఆశ్రమానికి వెళ్ళి విజయ వార్తను చెప్పి, పట్టాభిషేక ఉత్సవ విశేషాలను వివరించి చెప్పాడు శ్రీరాముడు. ఆ సమయంలో భరద్వాజ మహర్షి శ్రీరాముని పరివారానికి పసందైన విందు ఏర్పాటు చేసాడు. ఈ విందు రుచిని, శుచిని, సువాసనలను ఎంతో విశేషంగా వర్ణించారు

రామాయణంలో. శ్రీరాముడికి ఆశ్రమంనుండి వీడ్కోలు పలికే సమయంలో భరద్వాజ మహర్షి శ్రీరాముడిని ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. "నాకు వరాలేమిటి నేను రాజుగా పట్టాభిషిక్తుడిని అవుతున్నాను. నేను వరాలు ఇవ్వాల్సినవాడిని" అన్నాడు శ్రీరాముడు. "శ్రీరామా! నీవు ప్రజలకోసమే వరం అడుగు అన్నాడు" భరద్వాజుడు. "నా సాకేతపురం దాకా నా మూడు యోజనాల దూరం సుగంధభరిత పుష్పాలు, రుచికరమైన వివిధ ఫలాలు, సెలయేళ్ళు పచ్చని వృక్షాలతో ఆహ్లాదపరిచే వనాన్ని సృష్టించమన్నాడు" శ్రీరాముడు. వెంటనే భరద్వాజ మహర్షి "తథాస్తు" అని దీవించాడు. దానినే సాకేతవనము అనే పేరుతో లోక కళ్యాణకారణం చేసాడు భరద్వాజుడు. శ్రీరాముడు ఆ వనాన్ని ప్రియమైనదిగా భావించినందున "సాకేత రాముడు"గా లోకానికి ప్రఖ్యాతి చెందాడు.

భరద్వాజ మహర్షి శక్తిమూర్తి, జ్ఞానమూర్తి, తన మేధాశక్తిని మానవ వికాసానికి ధారపోసిన ఆదర్శమూర్తి, మానవతామూర్తిగా మానవ కళ్యాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహర్షి భరద్వాజుడు.

భరద్వాజ మహర్షి సప్తఋషులలో ఒకడు. ఆయన బ్రహ్మర్షి వర్యుడు. ఇప్పటికీ ఉన్నాడని చెబుతున్నారు. దివ్యజ్యోతిగా ప్రకాశిస్తున్నాడు. నిత్యమూ ఆయనకు నమస్కరిస్తున్నవారు, ఆయన కటాక్షంపొందిన వారి జన్మలు తరిస్తాయి.

భరద్వాజ మహర్షి గోత్రం పేరుతో ఉన్న వంశాలు అనేకం ఉన్నాయి. భరద్వాజస గోత్రీకులే ఎక్కువగా ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. కలియుగ ప్రత్యక్ష దైవం, దివ్యమంగళ స్వరూపుడు, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వారిది "భరద్వాజస గోత్రమే".

* * *

# 3. గౌతమ మహర్షి

గౌతమ మహర్షి బ్రహ్మమానస పుత్రులలో ఒకడు. సప్తఋషులలో సుప్రసిద్ధుడు. ఈయన వ్రాసిన "గౌతమ ధర్మసూత్రములు" ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారతీయ ప్రజలకు ఎంతో ఉపకారం చేసాడు. గౌతమ మహర్షి భార్య అహల్య. బ్రహ్మను గురించి చేసిన తపస్సులో, బ్రహ్మలోపల ఉండే విజ్ఞానం ఏదయితే ఉన్నదో అది సంపాదించుటకోసం, తాను తత్తుల్యం కావటం కోసం, ఆ సంకల్పంతో గౌతముడు తపస్సు చేసాడు. ఆ సంపాదించిన తపశ్శక్తి అంతా మానవాళి ప్రయోజనాలకు ఉపయోగించాడు. స్వార్థంలేని మహర్షి గౌతముడు.

బ్రహ్మ దాతగా, గౌతమ మహర్షి ప్రతి గ్రహీతగా ఉండేటటువంటి అవసరం ఆయనకు లేదు. అయినా బ్రహ్మ ప్రత్యక్షమై ఎందుకు తపస్సు చేస్తున్నావు. ఏదైనా వరం కోరుకో అన్నాడు. అప్పుడు గౌతముడు బ్రహ్మతో, "నేను విత్తనం ఏదయినా చల్లితే ఒక ఝాముసేపులో పంట పండి చేతికి రావాలి. వెంటనే దాని ఫలం ఇవ్వాలి" అని కోరుకున్నాడు. వెంటనే అనుగ్రహించాడు బ్రహ్మ. "తథాస్తు" అన్నాడు.

## ఆహార సృష్టికర్త

తరువాత ఒకసారి భూమి మీద తీవ్రమైన కరువు వచ్చింది. పన్నెండు సంవత్సరములు వానలు లేవు. ఆకాలంలో ఆయన తపోబలంతో యజ్ఞంచేసి, గుప్పెడు ధాన్యం సృష్టించి ఆ ధాన్యాన్ని తన చుట్టూ భూమిమీద చల్లాడు. సూర్యోదయకాలంలో ఆయన చల్లిన విత్తనాలు చిన్న మొలకలై, పెరిగి పెద్దవై రెండు గంటల వ్యవధిలో చూస్తూ ఉండగనే వాటిలోంచి పంట అంతా పండి చేతికి వచ్చింది. వెంటనే ఆ ధాన్యాన్ని వండి అక్కడ వారందరికీ అన్నం వడ్డించారు.

ఈ విధంగా ఆహార సృష్టికి మూలకారకుడు గౌతమ మహర్షి. అన్నమో అని అలమటించే వారికి గౌతమ మహర్షి ఆకలి తీర్చాడు. లోకోపకారమే తన లక్ష్యంగా భావించాడు. గౌతముడు అలా బ్రహ్మదేవుడితో సమానమైనాడు. ఆయన కీర్తి, ఆశ్రమకీర్తి, ఇంద్రలోకం వరకు వ్యాపించింది. నారదాదులు, ఇంద్రాదులు ఆయన ఆశ్రమానికి వచ్చి గౌతముని స్తోత్రంచేసి వెళుతున్నారు. చూస్తూండగనే భూలోకం స్వర్గమై ప్రకాశించింది. ఎంతవరకు వచ్చిందంటే, ఎవరికి ఏది కావలసినా అహల్యా గౌతముల వద్దకు వెళ్ళటం, వాళ్లను అడగటం, వాళ్లు ఇచ్చివేయటం అలవాటయింది. లోకంలో సేవాభావం ఉన్నవారి దగ్గరికే గదా అందరూ వెళుతారు. "దయగల హృదయమే భగవన్నిలయము" అన్నారు మహర్షులు.

మానవాళి అహల్యా గౌతములను కలవరిస్తున్నారు, స్మరిస్తున్నారు, పూజిస్తున్నారు. స్వప్నంలో కూడా అహల్యా గౌతములు సమస్త మానవులకు కనబడటం మొదలు పెట్టారు. స్వప్నంలో గూడా వారి కోరికలు అడిగి తీరుస్తున్నారు అహల్యా గౌతములు. ఈవిధంగా స్వప్న ప్రపంచంలో గూడా వాళ్ళు ఆరాధ్యులైనారు. పురాణంలో ఉన్న గాథ ఇది.

### గంగను భూలోకానికి

ఈయన తపఃశ్శక్తి సత్ఫలితాలకు కొందరు బ్రాహ్మణులు అసూయ చెందారు. గౌతముని మీద గోహత్య పాపము అంటగట్టారు. గౌతమునితోపాటు అహల్యను గూడా పాతకురాలిగా నిర్ణయించారు. గౌతముడి ఆశ్రమంలో వినాయకుడు బ్రాహ్మణ రూపంలో ఉంటూ వచ్చాడు. అహల్యా గౌతములకు అవమానం జరుగుతున్నా ఆయన మాత్రం నవ్వుతూ కూర్చున్నాడట. "స్వామీ నువ్వు ఎందుకు నవ్వుతున్నావు"? అని అడిగాడు గౌతముడు. అందుకు విఘ్నేశ్వరుడు "ఏముందీ! ఈ బ్రహ్మహత్యా పాతకం పోగొట్టుకో! వియద్గంగను, ఆకాశగంగను నేలమీదికి తీసుకురా! ఆ గంగ ఈక్షేత్రం మీదుగా ప్రవహిస్తే కరువు ఉండదు. తరువాత నీవు ప్రజలకు ఏ పంట పండించి పెట్టవలసిన పని వుండదు. ఈ పాపం నశించిపోతుంది. గోహత్యా పాతకం కూడా దీంతో పోతుంది" అని సెలవిచ్చాడు విఘ్నేశ్వరుడు.



ఇదంతా దైవసంకల్పము అని భావించి గౌతముడు అనేక సంవత్సరములు తపస్సు చేసాడు. విఘ్నేశ్వరుడే ఈ కార్యము చేసినట్లు తన దివ్యదృష్టితో గ్రహించి గౌతముడు, శివుణ్ణి గురించి తపస్సు చేసి శివానుగ్రహంతో గంగను భూలోకానికి తీసికొచ్చాడు. అదే గౌతమీ నది అయింది. గౌతమి ఆంధ్రదేశంలోని గోదావరి నదిలో ఒక శాఖ (పాయ). ఇది రాజమండ్రి వద్ద కొవ్వూరు దగ్గర ఉన్నది. దీనినే "గోష్పాదక్షేత్ర"మని పిలుస్తారు. ఇది పురాణ ప్రసిద్ధి చెందింది. ఆ గోవును రక్షించింది కాబట్టి, ఆ నదికి 'గోదావరి' అని పేరు వచ్చింది. గౌతముడి ద్వారా తీసుకొని రాబడింది కాబట్టి 'గౌతమి' అని పేరు ప్రసిద్ధి చెందింది.

గౌతముడు చిరకాలము జీవించాడు. అనంతరం తపోలోకానికి వెళ్లాడు. లోకంలో ధర్మాన్ని గురించి చెప్పటమే మహర్షుల ఆశయం. ఏది చేయవలెనో, ఏది చేయకూడదో, ఏది ధర్మమో, ఏది అధర్మమో మానవాళికి సందేశాలివ్వటమే వారి లక్ష్యం. అందుకనే తపస్సులు చేసినా కూడా, జీవన్ముక్తులు అయినా కూడా, ఈ లోకంలో బోధచేసి చిరకాలము మనుష్యులతో మమేకమై జీవించారు మహర్షులు.

స్మృతి రూపంలో గౌతముడి ధర్మసూత్రములు ఉన్నాయి. ఇదే 'గౌతమ స్మృతి' అను పేరుతో ప్రసిద్ధి చెందింది. న్యాయ తర్కశాస్త్రములు గౌతముడి బోధనా సంప్రదాయం చెబుతుంది. ఆయన స్మృతిలో త్రికాలములలోనూ, అంటే ఇతర భవిష్య యుగాలలో కూడా ఆచరించవలసిన ధర్మాలు ఉన్నాయి. ఏ యుగంలో అయినా ఆచరింపదగినవే. అవి అజ్ఞానాన్ని నాశనంచేసి మనిషికి

పుణ్యలోకాలనిచ్చి, ఉత్తమ జీవనాన్ని ఇస్తాయి. ముక్తి సూత్రములు అని ఆయన ఇరువది ఎనిమిది ధర్మములను బోధించాడు.

ఆహారాన్ని సృష్టించటం, గంగను తెప్పించి గోదావరి అనే పేరుతో నదిని ప్రవహింపచేయటం మొదలైన సత్కార్యాలతో మానవ జీవయాత్రకు అంకురార్పణ చేసిన ఘనత గౌతమ మహర్షిదే. ప్రాచీనయుగంలో మహర్షులు నిర్వహించిన లోకోపకారం ఇట్లాంటిదే. మహర్షులు పుట్టిందే మానవ కళ్యాణానికి, మానవ అభివృద్ధికి. వీరంతా చిరస్మరణీయులు. మానవవనరులను ధర్మ, సత్య మార్గాలలో నడిపించటమే మహర్షుల ధ్యేయం.

* * *

# 4. కశ్యప మహర్షి

కశ్యప మహర్షి ప్రజాపతుల్లో ముఖ్యుడు. ఈయనను కశ్యప ప్రజాపతి అని గూడా పిలుస్తారు. బ్రహ్మ మానసపుత్రులు ఆరుగురు. వారు, మరీచి, అంగిరస, అత్రి, పులస్త్య, ప్రజహ, క్రతులు. మరీచి పుత్రుడు కశ్యపుడు. మరీచి మహర్షికి, కళకు ఒక కుమారుడు జన్మించాడు. ఆ పసికందు గర్భవాసంలో పెరుగుతున్నపుడే ఆయన భార్యతో "నీ గర్భంలో పెరిగే పిల్లవాడు భవిష్యత్తులో ప్రజాపతి అవుతాడు. అతనిని జాగ్రత్తగా పెంచి 'నారాయణ' జపం నిరంతరం స్మరణం చేస్తూవుండు" అని అన్నాడాయన. పిల్లవాడు జన్మించాడు. కశ్యపుడు అని నామకరణం చేసారు. ఆ పసివాడికి (కశ్యప మహర్షి కశ్యప ప్రజాపతి, ప్రజాపతులు, మహర్షులు చాలా చోట్ల ఒక్కరే). బాల్యంలోనే ఉపనయనాది సంస్కారములు చేసారు. ఆయన చాలా సంతానాన్ని పొందాడు. జీవకోటికి తండ్రి ఆయన. అంటే ఒక్క మనుష్యులకేకాక, పశుపక్ష్యాదులకు, సర్పాలకు తండ్రి కూడా ఆయన. ఆ విధంగా కశ్యపుడు ప్రజాపతి అయినాడు. జీవకోటిని రక్షించమని బ్రహ్మగారి ఆజ్ఞ. అన్ని జీవరాశులు నాలుగు గోత్రాల నుండి జన్మించాయి. అవి అంగిరస, కశ్యప, భృగు, వశిష్ఠ గోత్రాలుగా ఆవిర్భవించాయి.

## భూమికి కాశ్యపి అనే పేరు

ఒకప్పుడు పరశురాముడు క్షత్రియులను చంపటానికి 21 సార్లు భూప్రదక్షిణము చేసాడు. ఆయన క్షేత్రాలు దర్శించటానికి కాదు. క్షత్రియులను చంపాడు. ఆయనకు క్షత్రియులంటే అంతకోపం. అంతా పూర్తయిన తరువాత ఆయనకు "పాపంచేసాన"ని గుర్తుకు వచ్చింది. 'వాళ్ళు నన్ను ఎదిరించలేదు. పారిపోతున్న క్షత్రియులను నేను చంపేసాను. నేను బ్రాహ్మణుడిని కదా!" అని అనుకొని, పాపక్షయంకోసమని పరశురాముడు అశ్వమేధయాగం చేసాడు. భూమీ మీద వున్న రాజ్యాలన్నీ పరశురాముడి వశమైనాయి. ఏం చేసుకుంటాడు

ఇన్ని భూములు? ఆ భోగాలు, సుఖాలు అవసరం లేదాయనకు. అందుకని అశ్వమేధయాగం చేసిన తరువాత కశ్యప మహర్షిని పిలిచి ఈ భూమిని అంతా ఆయనకు దానం చేసాడు.

లోకోపకారం కోసం కశ్యప మహర్షి పరశురాముడిచ్చిన భూ దానాన్ని స్వీకరించి "పరశురామా! ఇప్పుడు ఇక్కడ మళ్ళీ క్షత్రియ వంశాలు పుట్టాలిగదా! అవి పెరగాలి. కానీ ఇప్పుడు నీ ప్రతిజ్ఞ ప్రకారం మళ్లీ వాళ్లను నువ్వు చంపవలసి వస్తుంది. కాబట్టి నువ్వు ఈ దేశాన్ని వదలి పెట్టి వెళ్ళు. భూమండలమంతా నాకు ఇచ్చేసావు కదా! అందువల్ల ఈ భూమి అంతా నా స్వాధీనంలో ఉంది. ఇదంతా నాదే. దీన్ని వదిలేసి వెళ్ళిపో! దక్షిణదేశ సముద్రం వైపు వెళ్ళిపో! అక్కడికి వెళ్ళి సముద్రుడిని యాచించు "ఆయన నీవు నివసించటానికి ఒకచోట అంత భూమి ఇస్తాడు. అక్కడికి వెళ్ళి ఆయన దగ్గర ఉండు" అని చెప్పాడు.

కశ్యప మహర్షి స్వీకరించిన భూమండలానికి "కాశ్యపి" అనే పేరు వచ్చింది. "కాశ్యపేనాభి మంత్రితా కాశ్యపేర్నాం భూమిర్నాం భూమికా!" భూ సూక్తంలో "కాశ్యపేనాభి మంత్రితా" అని ఉంది. కశ్యప ప్రజాపతి చేత ఇది మళ్ళీ సంతాన వంతమయింది. భూమియందు కశ్యప ప్రజాపతి సంతానంచే, అనుగ్రహంచేత మళ్ళీ రాజవంశాలు జన్మించాయి. ప్రాణికోటి పెరిగింది. ప్రజలందరూ వృద్ధిచెంది, మళ్ళీ నాగరికత పెరిగింది. శ్రీసూక్తంలో "కర్దమేన ప్రజా భూతమయి సంభవకర్దమ! శ్రియం వాసయ మే కులే మాతరం పద్మమాలినీం" అని ఉంది. "కర్దమేన ప్రజాభూత" అంటే భూలక్ష్మి అని అర్థం అక్కడ. ఆ వాక్యం శ్రీమహాలక్ష్మి. మనం చెప్పేవన్నీ కూడా విష్ణుపత్ని అయిన లక్ష్మికి, మాత్రమే అన్వయం కావు. "కర్దమేన ప్రజా భూతామయి సంభవ – కర్దమ" అంటే ఈ కర్దమ ప్రజాపతి చేత ప్రజాభూత అయింది. "ప్రజాభూత" అంటే సంతానవంతురాలయింది అని అర్థం. 'భూలక్ష్మి అంటాం దానిని.



భూమండలంలో ప్రజలు జన్మించి, భోగ భాగ్యాలు, సశ్యస్యామలమైన పంటలు అనుభవించటానికి మళ్ళీ జీవంపోసిన మహర్షి కశ్యప మహర్షి, మానవ వనరులు సృష్టికర్తగా ప్రఖ్యాతి చెందాడు కశ్యప మహర్షి.

## లోకక్షేమంకోసం గంగానది

మహర్షులందరూ తపస్సు చేసుకునేటటువంటి నైమిశారణ్యానికి కశ్యప ప్రజాపతి ఒకసారి వెళ్లాడు. అక్కడి మహర్షులందరూ ఆయనను స్వాగతించి, గౌరవించి, పూజించారు. వాళ్ళని కుశల ప్రశ్నలు అడిగిన తరువాత, వారంతా "మేము ఎక్కడో చిన్నచిన్న వాగులలో స్నానం చేస్తున్నాము. చెరువులలోనూ స్నానం ఆచరిస్తున్నాము. ప్రవహించేటటువంటి నది ఒకటి ఉంటే ఆ జలాలలో చక్కగా శాశ్వతంగా మా జపహోమాది అనుష్ఠానములన్నీ నిర్వహించి నదీ స్నానంతో పునీతులవుతాముకదా స్వామీ! నీవు సర్వలోకాలను సంరక్షణచేసేంత సమర్థుడవు. నీ పేరుతో పవిత్ర గంగానదిని ఈ భూమిపైన ప్రవేశపెట్టి, దాన్ని ఇక్కడ ప్రవహింపచేసి, లోకక్షేమాన్ని కలిగించి, మా కోరిక తీర్చు" అని ఆయనను ప్రార్థించారు.

అప్పుడు "అభూతాద్రి" అనే పర్వతం హిమాలయాల్లో ఉంది. కశ్యప ప్రజాపతి అక్కడికి వెళ్ళి ఘోరనిష్ఠతో శివుణ్ణి గూర్చి తపస్సు చేసాడు. శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమని అన్నాడు. వెంటనే కశ్యపుడు గంగను భూలోకంలోకి ప్రవహింప చెయ్యమని అడిగాడు. ముందుగనే శివుడు తన జటాజూటమునందు వియద్గంగను, ఆకాశగంగను ధరించి ఉన్నాడు. వెంటనే ఒక శాఖను మాత్రమే వదిలిపెట్టాడు. అది పాతాళానికి వెళ్ళింది. సముద్రమైంది. మరి ఇప్పుడు భూలోకంలో ప్రవహింపవలసిన గంగ రావలసి వచ్చింది. ఇక్కడ ఇప్పుడు తన జటాజూటము నుండి ఒక చిన్న పాయను, గంగాపాయను వదలి పెట్టగా అది ఆయన తపోవాటిక మీదుగా నైమిశారణ్యము వరకు శివానుగ్రహంతో భూమి మీదకి వచ్చి ప్రవహించింది.

ఆ గంగా వాహినికి చాలా యుగాలకు పూర్వ 'కాశ్యపి' అని పేరు పెట్టారు మహర్షులు. కశ్యప ప్రజాపతి తపోబలంచేత భూమి మీదకు ప్రవహించింది. కనుక దానికి 'కాశ్యపి' అని నామకరణం చేసారు. ఆ నదికే కృతయుగంలో 'కృతవతి' అనే పేరు ఉంది. ఆ నదే త్రేతాయుగంలో 'గిరికర్ణ' అనే పేరుతోనూ, ద్వాపరయుగంలో 'దందన' అనే పేరుతోను కలియుగంలో "సాభ్రమతి' అనే పేరుతోను ప్రాధాన్యత చెందింది.

పై విషయాలన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తే చాలా విలువైన సమాచారం మనకు తెలుస్తుంది. ఈ నదులన్నీ వివిధ పేర్లతో ఎక్కడ ఉన్నాయి. ఆ నదులు ఏమిటి? వీటన్నింటికీ సమాధానాలు ఆలోచిస్తే, విశ్లేషిస్తే, అపురూపమయిన అత్యంత విలువయిన సమాచారం మనకు లభిస్తుంది. ఇదంతా విజ్ఞానమే. మహర్షులచరిత్ర మహావిజ్ఞాన సంపద. అనేక శాస్త్రాల విజ్ఞానమంతా భారత దేశంలో పుట్టిందే! ఋషుల చరిత్రలు మన చరిత్రతో సమన్వయం చేసుకుంటే ఇంకా ఎన్నో విలువైన విషయాలు మనకు లభిస్తాయి. ఇక్కడ మరోనది విషయం తెలుసుకుందాం. మన భారతీయ చరిత్ర ఎంతో పవిత్రమైనది, విలువైనది, పాపక్షయమైనది.

'సాభ్రమతి' అనే నది కలియుగంలో వచ్చినటువంటి ఒక మహానది. ఇది సకల పాపాలను హరిస్తుంది. ఈ నదీ తీరంలోనే అనేకమంది మహర్షులు, యవక్రీతుడు, రైభ్యుడు, భృగువు, అంగీరసుడు, దత్తాత్రేయుడు, విశ్వామిత్రుడు, భరద్వాజుడు మొదలగు వారు తపస్సులు చేసి ఫలం పొందారు.

## జీవకోటిని రక్షించటం

భూమి మీద రాజవంశాలు పుట్టి పెరిగాయి. అయితే భూమి మీద ధర్మము నశించిందట. అధర్మం బాగా పెరిగింది. బ్రాహ్మణులు యజ్ఞయాగాది క్రతువులు అన్నీ మానేశారు. అకృత్యాలన్నీ చేస్తున్నారు. ఇటువంటి మహా



దోషాలవలన, పాపాల వలన భూమి పాతాళానికి దిగిపోయింది. అంటే భూమి కిందికి దిగిపోయింది.

ఆ విధంగా దిగిపోతున్న భూమిని కశ్యప మహర్షి తన తొడలతో ధరించి పైకెత్తి జీవకోటిని రక్షించాడట. ఆ యుగంలో భూమాత కశ్యప మహర్షికి నమస్కరించి, క్షత్రియ వంశంలోని మంచివారంతా మళ్ళీ పుట్టి వాళ్ళ దండనీతితో ధర్మాన్ని సంరక్షించాలని కోరి ఆయనను వరమడిగింది. అప్పుడు కశ్యపుడు పరశురాముడి చేతుల్లో చావకుండా మిగిలిన క్షత్రియులు ఎవరు అని అడిగాడు భూదేవిని. ఆమె హైహయులు అని చెప్పింది. పౌరవంశస్థుడైన విదూరథుని కుమారుడు, సౌదాసుని వంశము వాడొకడు, శిబి మనమడు గోపతి అనేవాడొకడు వారివారి పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారు. ప్రతర్దనుడనే రాజు కొడుకు వత్సరాజు అలాగే జీవిస్తూ, ఎక్కడో ఉన్నాడు. ఆ అంకురాలు మిగిలాయి అని చెప్పింది భూదేవి. వాళ్ళ రాజ్యాలు వాళ్ళకిచ్చి రాజులను చెయ్యమని అడిగింది ఆమె. వెంటనే ఆ రాజపుత్రులను పిలిచి కశ్యపుడు భూమిని విభాగాలుగా చేసి వాళ్ళకు ఇచ్చి పరిపాలించమని ఆదేశించాడు. ఆ తరువాత ఆ క్షత్రియ వంశాలు వృద్ధి చెందాయి. క్షత్రియ పరిపాలన మళ్ళీ సుస్థిరమయింది. క్షత్రియ వంశాలన్నీ ఆనందం, ఉత్సాహాలతో ధర్మబద్ధంగా రాజ్యపాలనచేసాయి. క్షత్రియ వంశాలను నిలబెట్టిన ఖ్యాతి కశ్యప మహర్షికి దక్కింది. మహర్షులు లోకోపకారమే లక్ష్యంగా తపస్సు చేసారు. వారు తపస్సు చేయటంలో స్వార్థంలేదు. వారి తపన అంతా మానవాళి కోసమే. క్షత్రియ వంశాల వారికి కశ్యప మహర్షి నేటికీ ప్రాతఃస్మరణీయుడే గదా!

## కశ్యపస్మృతి - ధర్మశాస్త్రం

కశ్యప ప్రజాపతి వ్రాసిన ధర్మశాస్త్రం - కశ్యపస్మృతి అని అంటారు. దీనినే కశ్యప ధర్మసూత్రాలు అని అంటారు. అన్ని గ్రంథాలలో ఉండేటటువంటి నిత్యాచారము, శ్రద్ధ, శౌచ ప్రాయశ్చిత్తముల వంటివి అన్నీ ఇందులో కూడా ఉన్నాయి.

అగ్ని సాక్షిగా వివాహం చేసుకోకుండా, ఇంట్లో ఒక స్త్రీతో కలసి ఉన్నప్పటికీ ఆమె భార్య అనబడదు. దైవ పైతృకాది కార్యాలలో పాల్గొనటానికి ఆమెకు అర్హతలేదు, అని బోధాయనుడు, కశ్యపుడు చెప్పిన శ్లోకమును తన శాస్త్రములో ఉదహరించాడు. కాశీ పురాణాలలో కశ్యపుని మాటలు, 'కశ్యప గీతికలు' అనే పేరుతోవున్నాయి.

"క్షమగల వానికిఁ బృథ్వీసమునకు నిత్యంబు విజయ సంసిద్ధియగున్ క్షమియైనవాని భుజవిక్రమము కదున్ వెలయు సర్వకార్యక్షమయై"

"క్షమ" అనేటటువంటి వస్తువు చాలా మహోన్నతమైనది. అది కలవాడు విజయాన్ని పొందుతాడు అని ఆయన చెప్పాడు. వేదములు, యజ్ఞములు, శౌచము, సత్యము, విద్య, ధర్మము అంతా కూడా క్షమయందు నిలుస్తాయి. తపస్స్వాధ్యాయ యజ్ఞ కర్మలు, కర్తలు బ్రహ్మవిదులు, మొదలైన వారు ఏపదం పొందుతారో, క్షమావంతులు ఆ పదాన్ని పొందుతారు అని కశ్యపుడు వివరించాడు. ఆయన క్షమకు అంత ప్రాముఖ్యత ఇచ్చాడు.

**"క్షమా ధర్మః క్షమా యజ్ఞః క్షమావేదా క్షమాశ్రుతమ్!**
**య ఏతదేవం జానాతి న సర్వం క్షంతు మర్హతి ॥**

**క్షమా బ్రహ్మ క్షమా సత్యం క్షమా భూతం చ భావి చ ।**
**క్షమాతపః క్షమా శౌచం క్షమయేదం ధృతంజగత్ ॥**

**అతి యజ్ఞ విదాన్ లోకాన్ క్షమిణః ప్రాప్నువంతి చ ।**
**అతి బ్రహ్మవిదాం లోకా వతి చాపి తపస్వినామ్ ॥**
**అన్యేవై యజుషాంలోకాః కర్మిణామపరే తథా ॥**
**క్షమావతాం బ్రహ్మలోకే లోకాః పరమపూజితాః ॥**

**క్షమా తేజస్వినాం తేజః క్షమా బ్రహ్మతపస్వినాం ।**
**క్షమా సత్యం సత్యవతాం క్షమా యజ్ఞః క్షమాశమః ॥"**



క్షమలోనే అన్నీ ఉన్నాయని ఆయన భావన. ఎందుచేతనంటే, ఈ విశ్వంలో మనకు నిత్యజీవితంలో జరిగే అనుభవాలలో, క్షమ అంటే కేవలం ఇతరులను క్షమించటమే కాదు. తాను తనకు కలిగిన ఆపదను సహనశక్తితో అనుభవించటమని అర్థం. సహనశీలి కూడా క్షమాగుణం ఉన్నవాడని అర్థం. ఒకవేళ ఇతరుల వలన అపకారం జరిగిందంటే, దానికి గూడా ఇతరులను నిందించక, వారే కారణమనే భావన లేకుండా "నా కర్మలోంచి నాకు రావలసిన ధుఃఖం నాకు వచ్చినపుడు, దానికి ఎవడో నిమిత్తమాత్రుడేకాని, అతడు మూలకారణం కాదు" అనే భావన ఉండాలి. అటువంటి దృక్పథాన్ని కలిగి ఉండాలి. తనకొచ్చిన కర్మ దుఃఖానికి ఇంకొకడు హేతువు అని, కర్మసిద్ధాంతం తెలిసినవాడు ఎప్పుడూ అనుకోకూడదు. ఒక వైపు మన కర్మను మనం అనుభవిస్తున్నాం అని అనుకుంటాం. మరొకవైపు మళ్ళీ నాకు అపకారం చేస్తాడని అంటాం. ఎవరి కర్మ వారు అనుభవిస్తున్నాడనే జ్ఞానం కలిగిన మనం, నిత్యమూ దానినే విశ్వసించేటటువంటి మనం మనకు వచ్చే దుఃఖానికి ఎవరూ కర్తకాదు అనే విషయం గుర్తు పెట్టుకుంటే దాన్ని "క్షమ" అంటారు. ఈ విధంగా భావించే వారికి కర్మ క్షయం తొందరగా క్షీణిస్తుంది. యజ్ఞాలు, తపస్సు, అన్నీ చేసేవారికి ఏ మహాఫలం వస్తుందో, క్షమావంతుడికి అటువంటి ఫలం వస్తుంది. క్షమావంతుడికి ఆ విధమైన ఫలితం లభిస్తుందని ఘంటా పథంగా సిద్ధాంతీకరించి చెప్పాడు కశ్యప మహర్షి.

అధర్మంగా ప్రవర్తించిన మానవాళికి కశ్యప ప్రజాపతి అందించిన పై సందేశం ఎంతో మానసిక మార్పు కలిగిస్తుందనుటలో సందేహం లేదు. ఋషుల వాక్కు బ్రహ్మవాక్కు, మానసిక శాస్త్రవేత్తలు ఈ సందేశాన్ని స్వీకరించి, అనుసరించాలి.

ఇందులో, మానవాళి సుఖదుఃఖములకు పూర్వజన్మలో మనం చేసిన కర్మలే కారణమనే జ్ఞానం ఖచ్చితంగా, నిరంతరంగా జ్ఞాపకం పెట్టుకోమని

బోధ ఒకటి వుంది. మనిషి తను అనుభవించేదంతా తన పురాకృత కర్మ, దాన్ని మాత్రమే తాను అనుభవిస్తున్నాననే జ్ఞానంచేత "నేనొక్కడినే వున్నాను, ఇతరులు ఎవ్వరూ లేరు" అనే జ్ఞానం కలుగుతుంది. "నాకు దుఃఖాన్నిచ్చేవాడు కానీ, సుఖాన్నిచ్చేవాడు కానీ ఎవరూ లేరు. కాబట్టి ప్రవృత్తిలో ఈ జగత్తులో నాకు సంబంధించి ఎవడూలేడు. నాకు దాతలేడు. శత్రువు లేడు. మిత్రుడు లేడు". ఈ ప్రకారంగా ఇలా జ్ఞానం కలిగి కొన్ని అంతస్తులు దాటి, చివరకు ఒంటరిగా ఉన్నాననే జ్ఞానం కలుగుతుంది.

ఇంత అర్థం లేకపోతే, కశ్యప మహర్షి ఊరికే క్షమ కోసం అంత పెద్ద మాటలు మాట్లాడుతాడా? ఏముంది క్షమ అంటే, అని అంటాం మనం! జాగ్రత్తగా విశ్లేషణ చేస్తే, అందులో ఎన్నో మెట్లు ఎక్కితే... "నేనొక్కణ్ణి శాశ్వతంగా నిత్యంగా ఉన్నాను. నాకు ఎవ్వరూ ఇంకేమీ ఇవ్వటంలేదు. తీసుకోవడం లేదు. ఎవరూ దీనికి కర్తకారు. నాకు నేనే కర్తను. కశ్యప మహర్షి చెప్పిన ఈ 'క్షమ' అనే ధర్మంలో "అహమేవ కర్తాసి భోక్తాసి" అనేమాట....ఉపనిషద్వాక్యం, రూఢమవుతుంది.

మహర్షులు ఎప్పుడూ చిన్న మాటలు చెప్పినట్లే ఉంటారు. ఆ మాటలు చిన్నవిగా కనబడినా, వాటిని జాగ్రత్తగా విశ్లేషించి విధిగా ఆచరిస్తే...అవి ఈశ్వరుడి దగ్గరికి తీసికొని వెళుతాయి. మహాత్ముల బోధలలో, వాళ్ళ సందేశాలలో, ఆదేశాలలో అమోఘమైన శక్తివుంది. లోకక్షేమం కోసం మహర్షులు వేదాలలో నిక్షిప్తమైన ధర్మసూత్రాలను వెలికితీసి ప్రజలకు అవగాహన కలిగించి, నిత్యజీవితంలో ఆచరించి మోక్షమార్గానికి ప్రయత్నించమని సత్సందేశాన్ని అందించారు.

* * *

## 5. జమదగ్ని మహర్షి

సత్యవతీ ఋచీకుల కుమారుడు జమదగ్ని మహర్షి. జమదగ్ని రేణువు కూతురైన రేణుకాదేవిని వివాహం చేసుకొని గృహస్థాశ్రమ జీవితం గడుపుతున్నాడు. ఆయన తపోబలంచేత ఒక హోమధేనువును సంపాదించు కున్నాడు. అది కామధేనువు, ఎంతమందికి భోజనం కావాలనుకుంటే అంత మందికీ, పాత్రలు, కంచాలు అన్నిటితోపాటు షడ్రసోపేతమైన భోజనం క్షణంలో ఆ కామధేనువు సిద్ధం చేస్తుంది. దాని వలన వారికి ఏలోటు లేకుండా జీవనం గడుస్తోంది.

### పితృభక్తి

రేణుక, జమదగ్ని మహర్షి గృహస్థ జీవనం సాఫీగా సాగుతున్నది. రేణుక భర్తకు శుశ్రూష చేస్తున్నది. అతడి దయతో ఆమెకు అయిదుగురు కుమారులు కలిగారు. వారు రుమణ్వతుడు, సుసేషణుడు, వసువు, విశ్వావసువు, పరశు రాముడు. పరశురాముడు విష్ణుమూర్తి అవతారమై జన్మించాడు. కొడుకులను పెంచుతూ, భర్త సేవలో నిమగ్నమై ఏలోటు రాకుండా రేణుకాదేవి కాలం గడుపుతున్నది.

ఆమె ఒకరోజు నదికి వెళ్ళింది. అక్కడ చిత్రరథుడనే గంధర్వరాజు భార్యలతో జల క్రీడలాడుతూ మహాభోగంలో ఒళ్ళు తెలియకుండా ఉండి ఆమెకు కనిపించాడు. ఆ క్రీడలు చూచిన ఆమెకు ఏ వికారములు కనపడలేదు. అలా చూస్తూ ఉత్సాహంతో తనకు తెలియకుండానే కొంచెం ఆలస్యం చేసింది. ఎవరో రాజు, ఆయన భార్యలు ఆడుతున్న దృశ్యాలు మహా పతివ్రత అయిన రేణుక చూడవలసిన ఆవశ్యకతలేదు. దీనివలన ఆమె పాతివ్రత్య వ్రతానికి కొంచెం దోషం కలిగినట్లయింది. తెల్లని వస్త్రానికే గదా నల్లని మచ్చ స్పష్టంగా కనుపడుతుంది. ఆమె చేతిలోని నీళ్ళ కడవ క్రిందకు జారిపడిపోయింది. అది

పగిలిపోయింది. ఆ రోజుల్లో కుండలే వాడేవారు. కుండ పగిలింది అంటే తనలో ఏదో దోషం ఉందని గ్రహించిన రేణుక, మలినమైన తన శరీరాన్ని నదిలోనే వదిలివేయాలని అనుకొంది. కానీ తన భర్త అనుజ్ఞలేకుండా ఆ స్వాతంత్ర్యం తనకు లేదు. ఆ రోజుల్లో భర్త అనుమతి లేకుండా భార్యలు ఏ పనీ చేసేవారు కాదని తెలుస్తుంది. భర్తమీద గౌరవం అటువంటిది. అది ధర్మం అని స్త్రీల భావన.

రేణుక భర్త దగ్గరకు వెళ్ళి ఇదంతా చెప్పి ఆయన చేతిలోనే శిక్ష తీసుకోవటం ఉత్తమం అనుకుని, ఆ నీళ్ళ కుండా లేకుండానే ఇంటికి వచ్చింది. ఆమె ఇంటికి రాగానే జరిగినదంతా తన దివ్యదృష్టితో తెలుసుకున్నాడు జమదగ్ని మహర్షి. ఆమెకు ఏమైనా దోషం కలిగిందా అని ఆలోచించి, ఆదోషానికి శిక్ష మరణదండనే అని చెప్పి కొడుకులను పిలిచి, తల్లి యొక్క శిరస్సు ఖండించమని వాళ్ళని ఆదేశించాడు. అప్పుడు కొడుకులు "తండ్రీ నీవు పరమేశ్వర స్వరూపుడివి. మా తల్లి మహా పతివ్రత. ఆమె గర్భవాసంలో జన్మించుటవలన మేము పవిత్రులమై గర్విస్తున్నాము. కన్నతల్లిని శిరశ్ఛేదనం చేయమంటే ఎలా చేయటం. మా మనస్సు అంగీకరించటం లేదు. మాకు చేతులు రావటం లేదు, క్షమించండి" అన్నారు. నలుగురు పెద్దవాళ్లు ఆ పని చేయటానికి అంగీకరించలేదు. అయిదవ కొడుకు పరశురాముడిని పిలిచి "నాయనా! ఇది నా ఆజ్ఞ, నీ తల్లికి శిరశ్ఛేదం చెయ్యి" అని అన్నాడాయన. "నా తండ్రి ధర్మాధర్మములు తెలిసినవాడు. అందువల్ల నా తండ్రి ఆజ్ఞ ప్రధానం. ధర్మాధర్మములతో నాకు నిమిత్తం లేదు అని చెప్పి ఆమె శిరశ్ఛేదనం చేసాడు పరశురాముడు. "నా ఆదేశాన్ని దిక్కరించిన నీ సోదరులను కూడా చంపాలి నువ్వు అన్నాడు జమదగ్ని మహర్షి. అలాగేనని ఆ నలుగురు అన్నలను కూడా శిరశ్ఛేదనం చేసాడు పరశురాముడు.

"పితృ భక్తి, పితృ వాక్య పరిపాలన ఇలా ఉండాలి. లోకోత్తరంగా చేసావు" అని మెచ్చుకున్నాడు. తండ్రి కుమారునితో "నీవు ఏం వరం కావాలో



కోరుకొమ్మని అడిగాడు. "తన తల్లిని, తన సోదరులను బ్రతికించమని అడిగాడు పరశురాముడు. తల్లిపై వాత్సల్యానికి, సోదరులపై ప్రేమకు జమదగ్ని మెచ్చుకొని "వారి తలలను మొండాలకు అతికించు, లేచి కూర్చుంటారు" అన్నాడు.

ఋషులు వాళ్ళు చెప్పినవన్నీ చేస్తే అన్నీ ఇస్తారు. అయితే చేసే ధైర్యం వుండాలి. మృత్యువు వారి చేతిలో ఉంది. ఆ విధంగా తండ్రి అనుగ్రహంతో పరశురాముడు తల్లిని, అన్నలను బ్రతికించుకున్నాడు.

జమదగ్ని మహర్షి తపఃశక్తి ఎంతటిదో తెలిసింది. శిక్షను వేసాడు, ఆచరించాడు, మళ్ళీ బ్రతికించాడు. అధర్మం జరిగింది. ధర్మం నెగ్గింది. అందరూ పునీతులైనారు. పవిత్రులైనారు. కుటుంబం ఒకటైంది.

శ్రీరామాయణ కాలంలో గూడ తండ్రి దశరథ మహారాజు ఆదేశంతో కుమారుడు శ్రీరాముడు 14 సంవత్సరములు అరణ్యవాసం నిర్వహించాడు గదా! ఆ యుగాల్లో, ఆరోజుల్లో, తండ్రి ఆజ్ఞ, పితృవాక్య పరిపాలనకు ప్రాధాన్యత ఇచ్చేవారు. అది ధర్మం. తండ్రిమాట ధర్మం.. వారంతా ధర్మవేత్తలే.

## పరుల వస్తువు అధర్మం

దైవ యోగంచేత ఒకరోజు కార్తవీర్యార్జునుడు వేటకై బయలుదేరి జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. అనేకమంది పరివారంతో వచ్చిన ఆరాజును ఆహ్వానించాడు. జమదగ్ని మహర్షి ఆయన దగ్గర ఉన్న హోమధేనువు మహిమతో వారందరికి మృష్టాన్న భోజనం ఏర్పాటు చేసాడు. అందరూ షడ్రసోపేత భోజనం తిన్నారు. ఆ సన్నివేశం చూచి కార్తవీర్యార్జుననికి ఆశ కలిగింది. ఆ హోమధేనువు తన సొంతం చేసుకోవాలనిపించింది. ఆ మహర్షిని అడిగి తీసుకొని వెళదామనే కోరిక పుట్టింది కార్తవీర్యార్జునిడికి. జమదగ్నిని అర్థించాడు. అలా వీలుపడదు అది తన దగ్గరే ఉండాలని ఆయన అన్నాడు. ఆయనను ఏమీ అనకుండా, ఆ గోవును బలవంతంగా తీసుకురమ్మని

సైనికులను ఆజ్ఞాపించాడు కార్తవీర్యార్జునుడు. సైనికులు అందుకు ఉపక్రమించగానే, జమదగ్ని శరీరంలో నుంచి అనేక మంది మహావీరులైన సైనికులు, రథాలు, అశ్వాలు బయటికి వచ్చి కార్తవీర్యార్జునుడి సర్వసైన్యాన్ని నాశనం చేసాయి. స్వయంగా కార్తవీర్యార్జునుడు జమదగ్నితో యుద్ధంచేసాడు. కానీ ఆయనను ఏమీ చేయలేకపోయాడు. జమదగ్ని మహర్షి అతడికి అనేక బుద్ధులు చెప్పి హితబోధ చేసాడు. "ధర్మంగా, సుఖంగా, బ్రతుకు, నాతో నీకు శత్రుత్వం ఎందుకు? "ఈ గోవు నీది కాదు, నాది, వెళ్ళిపో" క్షమించి పంపించాడు. అయినాసరే జమదగ్నితో ఇరవై ఒక్కసార్లు యుద్ధానికి వచ్చాడు. కార్తవీర్యార్జునుడు 21వ సారి వచ్చినపుడు జమదగ్ని తపోనిష్ఠలో ఉన్నాడు. ఆ సయమంలో మహర్షికి ప్రపంచ స్పృహలేదు. అటువంటి సమయంలో తన ఆయుధంతో ఆయన శిరస్సు ఛేదించాడు కార్తవీర్యార్జునుడు. తనను తాను రక్షించుకునేందుకు జమదగ్ని ఎట్టి ప్రయత్నము చేయలేదు. ఆయన శరీరంతో ఇక ఎటువంటి పనిలేదు అని అనుకున్నాడు. ఇతడు శిరశ్ఛేదనం చేసి వెళ్ళాడు. వెంటనే కార్తవీర్యార్జునుడు ఆ గోవును తీసుకొని వెళుతుంటే అది అంతర్ధానమైంది. ఆ గోవు దక్కలేదు అతడికి. రేణుకాదేవి భర్తతో సహగమనం చేద్దామని అనుకొని సిద్ధమైంది. ఆకాశవాణి "అమ్మా! నువ్వు అలా చేయవద్దు" అని వారించింది. ఇది ఇలా ఉండగా భృగుమహర్షి వచ్చాడు. ఆయన వచ్చి జమదగ్ని మహర్షిని బ్రతికించాడట. ఈ విషయం బ్రహ్మపురాణం, మహాభారతంలో కూడా వ్రాసారని అంటారు.

తరువాత కొంత సమయానికి పరశురాముడు ఏం జరిగిందో తల్లి నుండి తెలుసుకున్నాడు. "నీ తండ్రిని చంపేసారు. భృగుమహర్షి వచ్చి బ్రతికించారు నాయనా! అని చెప్పింది రేణుక. వెంటనే పరశురాముడు ఆగ్రహించి మాహిష్మతీపురానికి వెళ్ళాడు. గండ్రగొడ్డలి ఆయన ఆయుధమైనది. కార్తవీర్యార్జునుడు పదిహేడు అక్షౌహిణుల సైన్యాన్ని పంపాడు. పరశురాముడు



వాళ్ళందరినీ క్షణంలో చంపేసాడు. తనకు అడ్డుపడటానికి కార్తవీర్యార్జునుడు రాగానే అతని వెయ్యిచేతులను, శిరస్సును ఖండించి చంపేశాడు పరశు రాముడు. తరువాత పరశురాముడు జరిగిన విషయం తన తండ్రికి తెలియజేసాడు.

ఇతరులు అనుభవించే సొమ్మును ఆశించటం, ఆ సొమ్మును బలవంతంగా తీసికొని వెళ్లటం అధర్మం అనే విషయం లోకానికి తెలియజేయటం. ఆనాటి మహర్షుల బోధ. జమదగ్ని మహర్షి తపశ్శక్తి అమోఘమైనదని ఋజువు చేయటం జరిగింది.

## తనయుడికి హితబోధ

జమదగ్ని మహర్షి తన కొడుకు పరశురాముడికి ఈ సంఘటన ద్వారా ధర్మబోధ చేసాడు. "నాయనా! పరశురామా! వాడిని శిక్షిస్తానని వెళ్ళావు. నువ్వు. ఎంతటి దుష్టుడైనా క్షత్రియుణ్ణి, రాజును బ్రాహ్మణుడు వెళ్లి చంపకూడదు. పరిపాలన చేసే రాజును, అతడి పదిహేడు అక్షౌహిణుల సైన్యంతో సహా సంహరించావు. నీవు చేసినది పాపమే! దీనిని ప్రక్షాళన చేయటానికి నీవు తీర్థయాత్రలు చేయాలి. అది అత్యంత అవసరం" అని చెప్పాడు. కొడుకును తీర్థయాత్రలకు పంపించాడు జమదగ్ని. పరశురాముడు విష్ణువు అంశ సంభూతుడు. పరమదుర్మార్గుడైన రాజు తనకు అపకారం చేసినప్పటికీ, తన కొడుకు అతడిని చంపితే ధర్మం కాదన్నాడు జమదగ్ని. ఋషులది అంతటి ధార్మిక దృష్టి. తండ్రి ఆదేశాలను అంగీకరించి పరశురాముడు తీర్థయాత్రలకు వెళ్ళాడు. ఈ సంఘటన గూడా పితృవాక్యాన్ని శిరసావహించటమే గదా! అధర్మాన్ని సరిదిద్ది ధర్మమార్గంలో నడిపించటమే ఋషుల లక్ష్యం.

ఎప్పుడూ తండ్రి ఆజ్ఞ ప్రకారం ప్రతి కార్యాన్ని నిర్వహించాడు పరశరాముడు. మనకు అపకారం చేసినాడు కదా అని అవతలివాడికి అపకారం

చేయకూడదని జమదగ్ని మహర్షి హితబోధ మానవాళికి వర్తిస్తుంది. సుమతీ శతకకారుడు గూడ "అపకారికి ఉపకారమే" చేయమన్నాడు.

## క్రోధం ఎల్లవేళలా పనికిరాదు

జమదగ్ని మహర్షి చరిత్రలో మరొక ముఖ్యమైన విషయం ఉంది. క్రోధం ఎల్లవేళలా పనికిరాదని ఒక సంఘటనలో నిరూపించారు.

జమదగ్ని ఒకరోజు పితృకార్యం నిర్వహించవలసి వచ్చింది. నూతన కలశంలో తను స్వయంగా ఆవుపాలు పిండి జాగ్రత్తగా ఒకచోట భద్రపరచాడు. ఆయనను పరీక్షిద్దామని క్రోధ అనే దేవత జమదగ్ని ఆశ్రమంలోకి ప్రవేశించింది. ఏదో ప్రమాదంవల్ల అన్నట్లుగా నటిస్తూ ఆ పాలు ఉన్న కలశాన్ని క్రింద పడవేసింది క్రోధ. ఆ సమయంలో అది అపచారమే. అయినా జమదగ్ని ఏమీ కోప్పడలేదు.

పాలు అలా క్రింద పడిపోవటం వలన పితృకార్యం చెడిపోయింది. ఎన్నో ప్రాయశ్చిత్తాలు చేసుకోవాలి ఇప్పుడు. అయినప్పటికీ క్రోధం లేకుండా శాంతముగా ఉన్న జమదగ్నిని చూచి "మహాత్మా! భృగువంశం వాళ్ళు మహాకోపగ్రస్తులని విన్నాను నేను. నీ విషయంలో అలా కనపడుటలేదు. మీరు శాంతంగా ఉన్నారు. ఈ పని నేనే చేసాను. నన్ను క్షమించు" అని అడిగి ఆ క్రోధ అనే దేవత వెళ్లింది. పితృకార్యం సరిగా జరగలేదు.

అదేరోజు రాత్రి పితృదేవతలు "నాయనా! జమదగ్నీ! నువ్వు ఎంతో తప్పుచేసావు. మాకోసం సిద్ధం చేసిన గోక్షీరం క్రిందపడింది. అయినా శాంతంగా ఉన్నావు. అలా ఊరుకో కూడదు కదా! దాన్ని శాంతం అంటారా! సమయాసమయాలు తెలిసి శాంతం కార్యానికి దోషయుక్తంగా ఉంది. మంచిదని నీవు అనుకున్న శాంత గుణంవలన కర్మలో భ్రష్టత వచ్చింది. దానివల్ల నీకు దోషం అంటింది. నీవు చేసిన దోషానికి ప్రతిఫలం అనుభవించి



తీరాలి. కాబట్టి ఒక జన్మలో నువ్వు ముంగిసవై జన్మిస్తావు అని జమదగ్నికి శాపం ఇచ్చారు.

వెంటనే జమదగ్ని "తండ్రులారా! మహాత్ములారా! తపస్వికి క్రోధం పనికిరాదని అందరూ అనటంచేత నాకు క్రోధం రాలేదు. నా తప్పు నాకు తెలిసింది కాబట్టి నాకు శాపవిముక్తి అనుగ్రహించండి" అని వాళ్ళను ప్రార్థించాడు. పితృదేవతలు జమదగ్నితో నీ మీద మాకేమీ కోపంలేదు నాయనా! ఎంతటివారైనా కర్మఫలం అనుభవించక తప్పదు. "ఒక మహాధర్మము కీడు అని 'నీవు అంటావో ఆనాడు నీకు శాప విమోచనం కలుగుతుంది" అని వెంటనే అదృశ్యమైనారు.

"ఎంతటివారైనా అధర్మంగా ప్రవర్తిస్తే శాపం తప్పదని తెలుసుకోవాలి. మహర్షులైనా తెలియక తప్పు చేసినా మరో జన్మలో దాని ఫలితం అనుభవించాల్సిందే" అని జమదగ్ని మహర్షి చరిత్ర ద్వారా తెలిసింది. ప్రజలకు ఇది చక్కని ఉదాహరణ. "ధర్మో రక్షతి రక్షితః" అనే శాస్త్ర వచనం అన్ని యుగాలకు, అన్ని కాలాలకు, ప్రజలకు వర్తిస్తుందనుటలో సందేహం లేదు.

## ముంగిస జన్మ

జమదగ్ని మహర్షి వచ్చే జన్మలో ముంగిసగా జన్మించాడు. ఈ జన్మలోనూ ఆయన గొప్ప ధర్మాన్ని బోధించి మానవాళికి మంచి సందేశాన్ని అందించాడు. అదేమిటో సవివరంగా తెలుసుకుందాం.

ధర్మరాజు అశ్వమేధయాగం చేస్తున్న సమయంలో ఆ యాగస్థలానికి వచ్చి సక్తుప్రస్థుని త్యాగాన్ని ఉదాహరణంగా చెప్పి ఆక్షేపించాడు. వేలాది మంది బ్రాహ్మణులు షడ్రసోపేతంగా భోజనంచేసి చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. ఆ కడుక్కున్న నీరు నదిలా ప్రవహిస్తున్నది. ఆ నీళ్ళల్లో పంచభక్ష్య పరమాన్నాలు తిన్నటువంటి సువాసనలు వున్నాయి.

ధర్మరాజు "గంటకొక లక్ష బ్రాహ్మణులకు బంగారపు పళ్ళెంలో భోజనం పెట్టిస్తున్నాను. నేడు ఇది మహాదానం" అని అనుకున్నాడు. కొద్దిగా అహంకారం వచ్చింది ఆయనకు. సంతోషం కలిగింది. అంతకన్నా ఏమీలేదు. అయితే శ్రీకృష్ణపరమాత్మ తన భక్తులతో ఒక చిన్నదోషం కూడా ఉండనివ్వడు. కాబట్టి ధర్మరాజును పిలిచి "ఓ చిత్రం చూపిస్తాను, ఇలారా!" అన్నాడు.

"ఆ చేతులు కడుక్కున్నటువంటి నీళ్ళలో ఓ ముంగిస దొర్లుతోంది. దాని శరీరం ఒకవైపు బంగారు రంగులో మెరుస్తోంది. మరొకవైపు మామూలుగానే వుంది. ఆ ముంగిస ఆ నీళ్లల్లో దొర్లుతోంది, మళ్ళీ బయటికి వస్తోంది. మళ్ళీ దొర్లుతోంది ఏమిటా చిత్రం?" అని ధర్మరాజు శ్రీకృష్ణుని అడిగితే "దాన్నే అడుగు, నాకేం తెలుస్తుంది" అన్నాడు, "అయ్యో! నువ్వు ఎవరు? నీ కథ ఏమిటి?" అని అడిగితే ఆ ముంగిస ఇలా వివరించింది.

"ధర్మరాజా! గడియకొక లక్ష బ్రాహ్మణులు భోజనం చేస్తున్నారంటూ లోకాలన్నీ నీ అశ్వమేధయాగ వైభవాన్ని చెప్పుకుంటున్నాయి, ప్రచారం చేస్తున్నాయి. లక్షమందికి ఒకసారి మ్రోగే గంట ఉన్నదట. నిరంతరాయంగా అది మ్రోగుతూనే ఉంటుందని చెప్పుకుంటున్నారు. అన్నదానం యొక్క మహత్తు నేను పూర్వం విన్నాను. అనుభవించి తెలుసుకున్నాను. పూర్వం ఇటువంటి పుణ్యకార్యం జరిగినచోట దొర్లితే నాకు శరీరంలో ఒక భాగం బంగారు మయమైంది. ఏమో ఇంత అన్నదానం చేస్తున్నచోట అటువంటి పుణ్యం జరిగేచోట వీళ్ళు చేతులు కడుక్కుంటున్న నీళ్ళలో ఒకసారి దొర్లితే, మిగతా శరీరం కూడా బంగారుమయం అవుతుందేమోనని ఆశపడి వచ్చాను. ఎంత దొర్లినా నా శరీరం బంగారం కావటం లేదు" అన్నది ముంగిస.

ధర్మరాజు ఆ ముంగిసను "మహాత్మా! నువ్వు ఎవరో నాకు తెలియదు. అంత అన్నదానం చేసిన వారెవరు? నేను చేసిన అన్నదానం ఏమీ లేకుండా



ఉన్నదా దానిముందు! ఆ అన్నదానం ప్రత్యేకత ఏమిటి?" వివరించమన్నాడు. అప్పుడు ఆ ముంగిస ఇలా చెప్పింది.

"పూర్వం ఒక నిరుపేద బ్రాహ్మణుడు ఉండేవాడు. యాచన చేస్తూ జీవించేవాడు. అతడు, భార్య, కొడుకు, కోడలు నలుగురూ ఉండేవారు. ఒకసారి ఆదేశంలో కరువు వచ్చింది. ఏదో విధంగా ఒక గుప్పెడు గింజలు సంపాదించుకొని వాటితో జావ కాచుకొని ఆ కుటుంబమంతా నాలుగు పాత్రలలో పోసుకొని మధ్యాహ్న సమయంలో త్రాగేవారు.

## ధర్మదేవత పరీక్ష

ఆ బ్రాహ్మణుడి ధర్మాన్ని పరీక్షింపతలచి ధర్మదేవత, సరిగ్గా వాళ్ళు జావ తాగే సమయానికి వచ్చి "తనకు ఆకలిగా ఉన్నదని" చెప్పి ఆయనను ఏదైనా బిక్ష వేయమని అర్థించింది. ఆ బ్రాహ్మణుడు "అయ్యా! మహాత్మా! రండి" అని అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి, తన గంజితో నింపిన పాత్రను ధర్మదేవతకు ఇచ్చారు. ఆ గంజి తాగితే తనకు ఆకలి తీరలేదని అన్నది ధర్మదేవత, తరువాత తన భార్య వంతు గంజి ఇచ్చింది. కొడుకు, కోడలు కూడా ఇచ్చారు. వాళ్ళు ఆ పూట తయారు చేసుకున్న ఆహారం అంతా ధర్మదేవతకు సమర్పించారు. త్రాగి "తృప్తోస్మి" అని వెళ్ళిపోయాడు. మరుసటి రోజు మళ్లీ వచ్చాడు. ఆరోజు మంచినీళ్ళు తప్ప ఏమీ దొరకలేదు. మరొకరోజు కూడా ఆ నలుగురు పాత్రలలోని గంజి నీళ్ళు త్రాగి వెళ్ళాడు. మూడవ రోజు మళ్ళీ వచ్చాడు. వచ్చిన తరువాత ఆ బ్రాహ్మణుడు, "మహాత్మా! మా భాగ్యం కొద్దీ మీరు వచ్చారు. మేము ఇంత కన్నా ఏమీ ఇవ్వలేక పోతున్నాం, దయచేసి ఇవి తీసుకొని మీరు తృప్తి పడండి" అని ఉన్నదంతా మళ్ళీ ఇచ్చివేసాడు.

"అప్పుడు ఆయన చేయి కడుకున్న నీళ్ళు అక్కడ పోసుకుని, "నేను ధర్మదేవతను! మీ అన్నదానం గొప్పది. మీరు చేసిన దానానికి స్వర్గ సౌఖ్యాలు

అనుభవిస్తారు. మీకు మోక్షాన్ని ఇస్తాను" అని చెప్పాడు. ఈ ప్రకారంగా ఆయన వారిని అనుగ్రహించి వెళ్ళారు. నేను అప్పుడు అక్కడే వుండి ఆ పెరట్లోనే తిరుగుతున్నాను. ఆ ధర్మదేవత చేయి కడుక్కున్న నీళ్ళతో నా శరీరం తడిసింది. ఆ నీళ్ళే కొద్దిగా ఉన్నాయి. తిన్నదేముంది! కడుకున్నదేముంది! కొంచెంనీళ్ళు. ఆ నీళ్ళలో నా శరీరం ఎంత తడిసిందో అంత భాగం మాత్రమే బంగారమయింది. అన్నదానం యొక్క మహత్తు అటువంటిది. మరి నువ్వు చేస్తున్న అన్నదానం గొప్పది అని విని నేను వచ్చాను. ఇచట ఆ మాదిరి ఏమీ అనుభవం కాలేదు!" అంటూ ధర్మ సూక్ష్మం చెప్పింది ఆ ముంగిస.

## అన్నదాన మహిమ, ఫలం

ఉన్నదంతా ఇవ్వటం అన్నదానం, కానీ చక్రవర్తి బంగారు పళ్ళేల్లో భోజనం పెట్టడం అన్నదానం అనిపించుకోదు. తన దగ్గర ఎంతవుంది, ఎంత ఇచ్చాడు అనే దాన్నిబట్టి దానంయొక్క మహత్తు ఉంటుంది. అంతేకాని ఎంత ఇచ్చాడు అనేదాన్ని బట్టి కాదు. ఒక కోటీశ్వరుడు లక్షరూపాయలు దానం చేస్తూ 'యథాశక్తి' అంటే అది దోషం. "నా బుద్ధి చిన్నది, లక్ష కంటే ఎక్కువ ఇవ్వటంలేదు నేను ఇవ్వకలిగిన వాడినే! యాభై లక్షలు ఇవ్వగలవాడినే! కానీ నా బుద్ధి చిన్నది. స్వీకరించి అనుగ్రహించండి" అని అనాలి. "యథాశక్తి ఇస్తున్నాను. ఏకంగా లక్ష రూపాయలు ఇస్తున్నాను. చాలా పెద్ద మొత్తం ఇస్తున్నాను" అనుకోవటం వాడికి దానమేకాదు. తన శక్తికి సరిపడేటట్లు ఇస్తేనే అది దానం. "శక్త్యానుసారం' – 'యథాశక్తి' అనరాదు, అలా అనకూడదు. యథాబుద్ధి అనాలి. యథాశక్తి అంటే 'యావచ్ఛక్తి' అనే అర్థం, దానికి అదే అర్థం జ్ఞాపకం పెట్టుకోవాలి. లక్ష ఇవ్వగలిగితే లక్ష ఇవ్వాలి. ఇవ్వలేకపోతే ఒప్పుకోవాలి! అప్పుడు దోషం ఉండదు. ఎప్పుడూ కూడా 'యథాశక్తి' అనే మాట వాడకుండా ఉండటమే న్యాయం, క్షేమం. నిజానికి మనం దానం యథాశక్తిగా ఎందులోనూ, ఎప్పుడూ చెయ్యటం లేదు. ఏదో యథాబుద్ధి



చేస్తున్నాం. ఒకవేళ చేసినా దానిని దానం అనే అంటారు. అంతేకాని అది త్యాగం అనిపించుకోదు, త్యాగంవేరు.

ఒక దాత కోటి ఇవ్వ కలిగినవాడు, లక్షయిస్తే, దానం చేసిన వాడవుతాడు. దాని కంటే ప్రతిఫలం ఏదో ఉంటుంది. అది పుణ్యమే అవుతుంది. అయితే ఉన్నదంతా ఇవ్వగలగిన నాడు త్యాగం చేసినవాడవుతాడు. దానం వల్ల పుణ్యం వస్తే, త్యాగంవల్ల మోక్షమే వస్తుంది. ("త్యాగేనైకే అమృతతత్వ మానశుః" అని ఆర్యోక్తి).

## తిరస్కరించిన మహాదానం

కాబట్టి ధర్మరాజు అశ్వమేథయాగంలో చేసినటువంటి లోకోత్తరమైన అన్నదానాన్ని ఆ ముంగిస తిరస్కరించింది. బ్రాహ్మణులందరూ "ఎంత గొప్పదాత! ధర్మరాజు మహానుభావుడు" అని మెచ్చుకున్నారు. ఈ ముంగిస తిరస్కరించింది. అంటే "లోకం అంతా ఒప్పుకున్న ఒక ధర్మాన్ని, ఒక మహాదానాన్ని నీవు ఎప్పుడు ఆక్షేపిస్తావో, అప్పుడు నీకు శాపవిమోచనం" అన్నారు కదా! పూర్వం పితృదేవతలు నీకు శాపం, మోక్షం ఇస్తూ! ఆ కారణంచేత ఈ విధంగా ఆక్షేపణ ప్రకటించటం వలన ముంగిసకు శాపవిముక్తి కలిగింది. ఆ ముంగిస జన్మ తరువాత జమదగ్ని మహర్షికి జన్మరాహిత్యం వచ్చింది. అంటే ఆయనకు ఇంక జన్మలేదని అర్థం.

ధర్మము, దానము సక్రమంగా ఆచరించటంవలన మోక్షప్రాప్తి లభిస్తుందని జమదగ్ని మహర్షి చరిత్ర, అనుభవము వలన విశ్వమానవాళికి సత్సందేశం అందించినట్లయింది.

* * *

## 6. అత్రి మహర్షి

అత్రి బ్రహ్మ మానసపుత్రులలో ఒకడు. సప్త ఋషులలో ఒకడు. పది మంది ప్రజాపతులు ఇతని సంతానం వారే. బ్రహ్మ సృష్టి కర్త. సృష్టిస్తున్న కాలంలో అంటే చతుర్దశ భువనాలు – వీటన్నిటికంటే ముందు, జీవకోటికి ముందుగానే ఎప్పుడో, ఈ సృష్టి చేయటంలో తనకు సహకరించగలడనే ఉద్దేశ్యంతో తన తపస్సులో నుంచి అత్రి మహర్షిని సృష్టించాడు. అత్రిమహర్షి బ్రహ్మలో ఒక భాగం అన్నమాట. మహర్షుల సృష్టి ఇలా ఉంటుంది. వాళ్ళలో ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అని ఉండరు. మహర్షులు అందరూ కూడా సాక్షాత్తూ ఈశ్వర స్వరూపులే.

అత్రి మహర్షి పుట్టగానే, "నన్నెందుకు పుట్టించావు? నా పని ఏమిటి? అని బ్రహ్మను అడిగాడు. వెంటనే బ్రహ్మ ఆయనతో "నాయనా! సృష్టి విషయంలో నాకు నీ సహకారం కావాలి. తపస్సుచేసి నీ తపోబలంతో జీవకోటిని సృష్టించు" అని ఆదేశించాడు.

కశ్యప ప్రజాపతి కుమార్తె అనసూయను అత్రిమహర్షికి ఇచ్చి వివాహం జరిపించారు. ఆయన సన్నిధిలో ఆమెకు ఏ కర్తవ్యమూ ఉండేది కాదు. ఆయనకు ఏ అవసరము ఉండేది కాదు. నిత్యము తపస్సులో ఉండేవాడు. చేసే పని ఏమీలేకుండా ఉండటం చేత ఆమె కూడా ఆయన మాదిరి ఎదురుగా కూర్చొని తపోనిష్ఠలో నిమగ్నమయింది. మహా తేజస్వినిగా, లోకపూజ్యురాలిగా ఆమె తపస్సు చేసింది. ఆరోజుల్లో భర్తను అనుసరించి ప్రవర్తించటం భార్య విధి, ధర్మము.

### అత్రి మహర్షి – తేజస్సంపన్నుడు

అత్రి మహర్షి చాలా కాలము తపస్సుచేసి ఆత్మానుభూతిని పొంది, ఆత్మజ్ఞానియై, బ్రహ్మజ్ఞానియై ఆత్మజ్ఞాన తత్త్వజ్ఞుడు అయిన తరువాత తీక్ష్ణంగా తపస్సు చేస్తూ ఉండిపోయాడు. ఆయనకు ఆత్మజ్ఞానం కలిగింది. ఆయనకు కోరికలు ఏమీలేవు. అయినా అఖండమైన తపస్సు చేస్తున్నాడు. ఆయన నేత్రముల నుండి బ్రహ్మాండమైన తేజస్సు వెలుగుతూ బయటకు వెలువడింది. ఆ తేజస్సు కళ్ళు తెరచి చూడటానికి వీలులేకుండా ఉన్నది. భయంకరంగాను ఉన్నది. దశదిశలా దానిని పంచుదామని పది దిక్కులకు ఇవ్వబోయాడు. ఆ పది దిశలు ఆ తేజస్సును స్వీకరించి, భరించలేక మళ్ళీ వెనక్కి వెళ్ళాయి. అది ఒక పెద్ద తేజఃపుంజంగా ఒక గోళంగా ఏర్పడింది. అప్పుడు దానిని అనంతంగా ఉండే సముద్రంలో వదిలేసాడాయన. ఆ తేజస్సును సముద్రం కూడా భరించలేక కుతకుత అన్నం మాదిరి ఉడుకుతూ ఉంటే, బ్రహ్మ భూలోకానికి వచ్చి ఆ తేజస్సుకు ఒక పురుషరూపాన్ని ఇచ్చాడు. వెంటనే దాని వేడి తగ్గి చల్లబడింది. ఆకాశంలో అది పురుషరూపంలో కనబడింది. ఆపద తప్పిందని దేవతలు సంతోషించి బ్రహ్మను సోమమంత్రములతో స్తుతించారు. తపస్సు వలన అనూహ్యమైన ఒక తేజస్సు వచ్చి, వింతలు చూపిస్తుందని అత్రిమహర్షి వలన తెలుసుకున్నాం. తపస్సు మహిమ, గొప్పదనం అటువంటిది.

"అత్రి మహర్షి తేజస్సులో నుంచి వచ్చిన దివ్య పురుషుడు అనసూయ గర్భమందు మళ్ళీ ప్రవేశించినపుడు అత్రికి కుమారుడు జన్మిస్తాడు" అని బ్రహ్మ చెప్పాడు.

### అనసూయాదేవి తపః ఫలము

కొంతకాలానికి అత్రి మహర్షి ఆశ్రమానికి త్రిమూర్తులు వచ్చారు. త్రిమూర్తులు అనసూయాదేవి పాతివ్రత్య మాహాత్మ్యాన్ని పరీక్షించదలచుకొని వచ్చారు. ఆ ముగ్గురు ఆమెను భోజనం వడ్డించమన్నారు. ఆమె అర్ఘ్యపాద్యాదులిచ్చి భోజనం వడ్డించుదామనుకుంటే, వారు "మాకు నీవు నగ్నంగా ఉండి వడ్డిస్తేనే తింటాము" అన్నారు. అనసూయాదేవి సరే అని

ఒప్పుకొని, తన తపస్సునంతా మంత్రజలంగా మార్చి ఆ త్రిమూర్తులమీద చల్లింది. వాళ్ళు ముగ్గురూ చంటిపిల్లలు అయినారు. ఆ చంటి పిల్లలు ముగ్గురుని ఊయలలో పడుకోబెట్టి వారు కోరిన విధంగా అన్నం పెట్టింది వాళ్ళకు. అత్రి ఆ ముగ్గురు పసికందులను దగ్గరకు తీసుకొని ఒకచోట చేర్చాడు. వాళ్ళు ఒకే శరీరము, మూడు ముఖాలు కలిగిన దత్తాత్రేయమూర్తి అయినారు.

అత్రి మహర్షికి, అనసూయా దేవికి జన్మించినటువంటి త్రిమూర్త్యాత్మకుడు దత్తాత్రేయుడు. అందుకనే ఆయనను గురువుగా భావించి నమస్కరిస్తారు. త్రిమూర్తులు అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. వీరు ముగ్గురూ ఒకే రూపముగా శిరస్సులు మూడుగా అవతరించారు. 'గురు బ్రహ్మ, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః" వాస్తవంగా ఇది వారి ధ్యానశ్లోకం. మనం ఊరికే స్తోత్ర శ్లోకంగా పఠిస్తాం. అయనే ధ్యాన స్వరూపమైన దత్తాత్రేయుడు. అనసూయాదేవి మహత్తువల్ల త్రిమూర్తులకు బాల్యదశ ఏర్పడి శిశువులుగా జన్మించటం జరిగింది. ఆ రూపమే ఇది అని సమన్వయం చేసుకోవాలి. వాళ్ళు ముగ్గురిని సమన్వయంచేసి ఒకే మూర్తిగా రూపకల్పన చేసినవాడు అత్రి మహర్షి.

## అత్రి మహర్షి దృష్టి - రాక్షస సంహారం

అత్రి మహర్షి తపఃశ్శక్తి వలన దృష్టితోనే రాక్షస సంహారం చేసిన విషయం తెలుసుకోవాలి. దేవతలకు, రాక్షసులకు ఒకసారి యుద్ధం జరుగుతున్న కాలంలో, రాహువు చేతిలో సూర్యచంద్రులు తీవ్రంగా దెబ్బలు తిని వాళ్ల తేజస్సులు పోగొట్టుకున్నారు. వాళ్ళు అత్రి మహర్షి దగ్గరకు వచ్చి ఆయన్ను శరణు కోరుకున్నారు. వెంటనే సూర్యచంద్రులకు ఆయన తేజోవంతమయిన శరీరాలను ఇస్తూ భవిష్యత్తులో ఎప్పుడూ వాళ్ళ శరీరాలు రాక్షస బాధనుండి రక్షింపబడుతాయి. రాక్షసులు వారిద్దరికి ఎటువంటి హాని చెయ్యలేరు, అని వరమిచ్చారు. ఆ రాక్షసులందరూ ఆయన వద్దకు వచ్చారు. వారందరినీ ఒక



తీక్షణమైన దృష్టితోనే చంపేసాడు. ఈ కార్యాన్ని ఆయన నోరెత్తకుండా, చెయ్యెత్తకుండా, మంత్రజలం చల్లకుండా, దర్భను మంత్రించకుండా కేవలం "తీక్షణమైన దృష్టి"తోనే సంహరించాడు. మహర్షుల తపఃశక్తి అంత గొప్పదని తెలుస్తోంది. లోకంలో ఇప్పటికీ కొంత మంది కళ్ళు ఆర్పకుండా తీక్షణంగా చూస్తే మనం భయపడతాం. "ఏమిటి అలా చూస్తున్నాడు" అని అనుకుంటుంటాం.

## అత్రిసంహిత

అత్రి మహర్షి "అత్రిసంహిత" అనే గ్రంథం రచించి అనేక ధర్మ సూక్ష్మములను వివరించాడని అంటారు. అనేకమంది ఋషులు, బ్రాహ్మణులు, ఒకప్పుడు అత్రి మహర్షిని దర్శించి "నీవు విశ్వవిదుడవు, ఋషి శ్రేష్ఠుడివి లోకానికి హితకరమైన ధర్మసూక్ష్మములను మాకు చెప్పవలసింది" అని అడిగారు. ఆ విషయాలన్నీ ఆ గ్రంథంలో ఉన్నాయని చరిత్ర చెబుతోంది. ఆ గ్రంథం నేడు అందుబాటులో లేదని పండితులు చెబుతున్నారు.

"విష్ణువును లోకమంతా వ్యాపించినటువంటి రక్షకుడిగా భావనచేసి ఆరాధించటమే ముక్తిదాయకం. అదే ఉత్తమము. మానవాళి అంతా విష్ణువును ఆరాధించి తీరాలి" అని చెప్పాడు. ప్రాతఃకాలము, సాయంత్రములయందు ఇంట్లో కానీ, దేవాలయములో కానీ ప్రతి బ్రాహ్మణుడు - భక్తి భావంతో పరమేశ్వరుని ప్రతిమను ఉంచి ఆ సాన్నిధ్యం కల్పించుకుని దాని ఎదురుగా అగ్నిహోత్రాది హోమములు చేయటం ఉత్తమమార్గమని అత్రి మహర్షి చెప్పాడు. ఇదే 'అత్రి సంహిత' అనే పేరుతో ప్రాముఖ్యత చెందింది. విగ్రహారాధనమేముంది, నేను నిత్యము, అగ్నిహోత్రము నిర్వహిస్తాను, అని నిత్యఅగ్నిహోత్రి గూడ అనుకోనవసరము లేదు. విగ్రహారాధన చేసి, విగ్రహానికి మూర్తిమంతంగా పూజాదికములు నిర్వర్తించి, దాని సన్నిధిలో అగ్నిహోత్రాన్ని చేసుకోమని అత్రిమహర్షి హితవాక్యం వివరించింది. చాలా విలువైన అంశం ఇది.

"అత్రి సంహిత" కర్మ, ప్రతిష్ఠ, పూజన, స్నపనోత్సవ, ప్రాయశ్చిత్తములు అనే విభాగములు క్రింద 5 భాగాలుగా వ్రాశారాయన. మొదటి భాగంలో దేవాలయ ఆగమశాస్త్రము అంతా ఉంది. ఇందులో దేవాలయ స్థల పరిశీలన, స్థలాన్ని ఎలా పరిశీలన చేయాలి? ఎట్లా ఎన్నిక చేయాలి? ఇవన్నీ ఉన్నాయి. అందులోనే దేవాలయ ఆయతన రూపము నిరూపణ చేయటము, భగవంతుడి ప్రతిమలు ఎలా ఉంటాయో వాటి విషయాలు అన్నీ వివరించారు. రెండవ భాగంలో పరివార దేవతలయొక్క ప్రతిష్ఠాకలాపం అంతా చెప్పారు. మూడో భాగంలో పూజావిధానం, నాల్గవ భాగంలో మహాభిషేకము, అయిదవ భాగంలో ఉత్సవ విశేషాలు చెప్పారు. "నిత్యోత్సవ నిబంధం" అనే ఒక గ్రంథం ఉంది. అందులో దేవాలయ ప్రతిష్ఠ, దేవాలయంలో సంవత్సరం పొడవునా ఏమి చెయ్యాలి, రోజూ నిత్యదీపోత్సవం ఎవరు ఎప్పుడు చెయ్యాలి, అనే విషయాలు అన్నీ ఉన్నాయి.

ఈ వైభవం వైదికమార్గంలో కూడా చెప్తారు. కేవలం వైఖానసం కాదు. వైదికమార్గంలో కూడా ఉంది. అందులో శివ పూజా విశేషం ఉంది. శివాలయ ప్రతిష్ఠ అయిదు భాగాలుగా చెప్పాడు అత్రి మహర్షి. ఆరవ భాగంలో పూర్వోక్త విధానంలో దోషం ఏమైనా వస్తే దానికి ప్రాయశ్చిత్తం చెప్పాడు. పరమేశ్వరోపాసనలో ఎక్కువ కులం, తక్కువ కులం అనే బేధ భావంలేకుండా మానవాళి అంతకూ మోక్షదాయకమని చెప్పాడాయన. ఈ విధానం అందరూ చేయవలసిందేనని ధ్రువీకరించాడాయన.

మహర్షులది ఎంతో విశాల దృక్పథం అని మనం గుర్తు పెట్టుకోవాలి. వారికి స్వార్థంలేదు. విశాల దృక్పథం అనేది మహర్షులలో తప్ప, మానవమాత్రులలో ఉండదు. మానవులు అది కావాలని అరచేవాళ్ళే తప్ప, అది ఉన్న వాళ్ళుకాదు. మనస్సులో అది లేదు కాబట్టి అలా అరుస్తారు. ఉన్నవాడు అరవడు, అలా జీవిస్తాడు అది నిజంగా ఉన్నవాళ్ళు మహర్షులు.



## అత్రి మహర్షి ఇతర గ్రంథాలు

అత్రి సంహితతోబాటు "అత్రిస్మృతి" కూడా ఉంది. 'ఆత్రేయ ధర్మశాస్త్రము' అని కూడా మరొకటి ఉన్నది. ఆ గ్రంథంలో ఆయన అనులోమ, విలోమ వివాహాలను అంగీకరించలేదు. కులాచారాలను పాటించమని చెప్పాడు. ఆత్రేయ ధర్మశాస్త్రములో తొమ్మిది అధ్యాయాలు ఉన్నాయి. సర్వమత ధర్మాలకంటే కూడా, మోక్షమార్గంలో ఏయే అనుష్ఠానాలు ఉన్నాయో వాటిని గురించి ఎక్కువగా చెప్పాడు. దాన ధర్మాల గురించి అధికంగా చెప్పాడు. రహస్య ప్రాయశ్చిత్తఖండంలో, ప్రతి మనిషి కూడా తను నిత్య కర్మానుష్ఠానం ఆచరించు సమయాలలో వచ్చే దోషాలకు, పాపాలకు ఎటువంటి ప్రాయశ్చిత్తం చేసుకోవాలో వివరించాడు. ఎందుకంటే "శంఖలిఖిత స్మృతి"లో, ప్రాయశ్చిత్తం వెళ్ళి అడిగి చేయించుకోమన్నారు. రాజు దగ్గరకు వెళ్ళలేక గురువు దగ్గరకు వెళ్ళి, "అయ్యా! నేను ఈ తప్పుచేసాను నాకేమి ప్రాయశ్చిత్తం?" అని అడిగితే ఆయన చెప్తాడు. రాజయితే శిక్షిస్తాడు. తను ఏ రాజ్యంలో నివసిస్తున్నాడో ఆ రాజు వద్దకు వెళ్ళి దోషం చెప్పి శిక్షించమని అడగాలి. అలా అయితే నీకు పాపం లేక దోషం పోతుంది. ఇక్కడ ఆ పాపాన్ని కడుక్కో" అని చెప్పాడు అత్రి మహర్షి. బ్రతికి ఉండగనే భూమి మీద ఉన్నపుడే దోష నివృత్తి చేసుకోవాలని అర్థం.

యోగశాస్త్రములను గురించి, యోగాంగములను గురించి అత్రిసంహితలో చెప్పాడాయన. అత్రిస్మృతులు చిన్నచిన్న గ్రంథాలు, చెల్లాచెదరుగా ఉన్నాయి. అవన్నీ ఒక చోట చేర్చి సంకలనం చేసిన వాళ్ళు ఎవరూలేరు. ప్రజలంతా ధర్మం, శాస్త్రసమ్మతంగా విధులు, భాధ్యతలు నిర్వర్తించి సుఖజీవనం చేయాలని భారతీయ మహర్షుల తపన. అందుకే వారు లోకోపకారానికి, లోకహితానికి గ్రంథాలను రచించి మానవాళికి అవగాహన కల్పించారు. అది వారి లక్ష్యం.

బ్రాహ్మణులు ఎలా ఉండాలో వారికి కొన్ని ధర్మాలు వివరించాడు అత్రి మహర్షి. అత్రిమహర్షి, అత్రి స్మృతులలో ప్రాయశ్చిత్తం, దానం, పితృమేధం,

ఆచారాలు, గురుప్రశంస, వర్ణ ధర్మం, జపముల యొక్క పవిత్రత మొదలైన విషయాలను గురించి తెలియచేసాడు.

## సమాజంలో అస్పృశ్యతలు

అత్రిమహర్షి అస్పృశ్యులను అంటరాని వారిగా అంగీకరించలేదు. వాళ్ళు అస్పృశ్యులు కారు అన్నాడు. అంటే రజకులు, పాదరక్షలు చేసేవాళ్ళు, నటకులు, వైవర్తకులు, వల్లె వాళ్లు (మేదరులు), కుమ్మరులు, భిల్లులు వీరందరికీ యాత్రలలో, వివాహాలలో, యజ్ఞయాగాదులలో వాళ్ళు అస్పృశ్యులు అనే నియమం ఉండదు అని చెప్పాడు. ఎంత సంస్కరణ ఉంది అందులో. అయితే కులాంతర వివాహాన్ని ఆయన అంగీకరించలేదు. కానీ అస్పృశ్యతను వ్యతిరేకించాడు. వర్ణ వ్యవస్థను కాపాడాలని చెప్పాడు. ఈ విశాల దృక్పథం, వివేకం ప్రస్ఫుటంగా కనబడుతాయి. ఇదికాక 'లఘు అత్రి స్మృతి' 'వృద్ధ ఆత్రేయ స్మృతి' అని రెండు స్మృతులు కూడా వున్నాయి. అత్రి మహర్షి చెప్పిన హితబోధలు సంస్కృత భారతంలో ఆనుశాసనిక పర్వంలో ఉన్నాయి. మహర్షుల చరిత్రలు చదువుతుంటే ఎన్నో సద్విషయాలు తెలుస్తాయి.

వరం ఇవ్వటం అనేది ఈశ్వరుడి ధర్మం. ఏది అడిగితే అదే ఇస్తాడు. విచక్షణ జ్ఞానంతో మనకు బోధచేసే బాధ్యతను ఈశ్వరుడు తీసుకోలేదు. అటువంటి బోధను అనుగ్రహించేందుకు ఋషులు, గురువులు మానవజాతికి నియమించబడ్డారు. ఇది ఆర్య సంప్రదాయం. "ఇది తప్పు నాయనా! ఇట్లాంటి వరం నువ్వు అడగకూడదు" అని ఈశ్వరుడు ఎప్పుడూ చెప్పడు. అలా చెప్పటం ఆయన తన ధర్మంగా ఎప్పుడూ అనుకోలేదు. ఆయన చెప్పటం వరకే సుమా! ఆచరించటం మన బాధ్యత. సక్రమంగా ధర్మంగా ఆచరిస్తే సత్ఫలితం మనం పొందుతాం. నేటి యుగంలో తల్లిదండ్రులు చెప్పిన సద్విషయాలు, పిల్లలు ఆచరించాలి. సద్విషయాలు అంటే మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నాగరికత, నియమ నిబంధనలు అని అర్థం. ఇంకా, ఎన్నో ఉన్నాయి. పెద్దల సలహాలు విని, ఆచరించటం పిల్లల బాధ్యత. చెప్పటం వరకే తల్లిదండ్రులు. ఆచరించటం మన విధి.



జగత్తులో ప్రకృతి అనేది ఎట్లా పనిచేస్తుందంటే సంకల్పము, విచక్షణ అనేది దానికి అసలు ఉండదు. సంకల్ప, విచక్షణ అనేవి రెండు ఈశ్వరుడు మానవులకే జన్మతః ఇచ్చాడు. ఉదాహరణకు చెఱువులో నీళ్లు ఉన్నాయి. ఒకడు వచ్చి అందులో మైలబట్టలు ఉతుకుతాడు, ఇంకొకడు బ్రాహ్మణుడు అర్ఘ్యప్రదానం చేస్తాడు. చెఱువు ఏమైనా అడ్డు చెబుతోందా! లేదు. అది అక్కడ ఉంది అంతే. ఆ చెఱువు ఏఏ పనులకు ఉపయోగించాలి, ఏఏ పనులకు ఉపయోగించకూడదు అని ప్రజలు విచక్షణా జ్ఞానం కలిగివుండాలి. ఈశ్వరుడి శక్తి గూడా అటువంటిది. ఎవరు ఎట్లా అడుగుతారో అట్లాగే లభిస్తుంది వాళ్ళకు. దాని యొక్క లాభ నష్టాలు వాళ్ళవే. ఈ విషయం బోధించటానికే గురువులు ఏర్పడ్డారు. "నాయనా! ఈశ్వరుని ఇలా అడుగకు. అడిగితే ఇస్తాడు సుమా! ఇవి ప్రమాదం ఈ విధంగా అడుగు" అని బోధిస్తాడు గురువు. అందుకే ఋషుల చరిత్ర మనకు ప్రమాణము. భగవంతుడికి విడిగా చరిత్రలేదు. మనుష్యుల చరిత్రే, అంటే ఋషుల చరిత్రే పురాణాలు. అదే భగవంతుడి చరిత్ర. మహాత్ముల చరిత్రలు మనకు పాపమును నశింపచేస్తాయి. అందుకే సాధువులు, పీఠాధిపతులకు మనం నేటికీ వెళ్ళి నమస్కరిస్తున్నాము. అంటే మహర్షుల చరిత్రలే మనకు శరణ్యం. వారి చరిత్రలే మనకు వారి ఆశీర్వచనాన్ని అందిస్తాయి.

## వ్యాస మహర్షి - భాగవతం - మహర్షులు

వ్యాసమహర్షి వ్రాసిన భాగవతం పూర్తిగా భగవత్కథలు, ఋషుల గాథలతో నిండి ఉంటుంది. ఋషులు సంతానవంతులు కావటంచేతనే మనకు ఈ సంస్కారం నిలబడి ఉన్నది. అంత గొప్ప సంస్కారం మనది. మనం ఆర్యులం అంటే ఋషుల సంతానం కాబట్టి. అదే ఆర్షధర్మము. భగవత్తత్త్వం తెలిసిన

వాళ్ళు కాబట్టి వారు ఋషులు. ఋషుల సంతానం అయిన మనం మరి ఎవరిని ఆశ్రయిస్తే ఈశ్వర తత్త్వం తెలుస్తుంది? ఎవరి గాథలు వినాలి? భగవంతుని కథవింటే ప్రత్యక్షంగా మనకు అర్థం చేసుకునే జ్ఞానం భగవంతుడు ఇవ్వవచ్చు. కానీ అలా అడుగుతామా! అంత తీక్ష్ణమైన ఏకాగ్రతతో, నాకు నిన్ను గురించి తెలుసుకోవాలని ఉంది అని అడుగుతున్నామా! అలాగ అడగటం లేదు. కాబట్టి మనుష్యుడి లోపల ఉండే అజ్ఞానంచేత, ఈశ్వర సాక్షాత్కారం కోరినా, ఒకవేళ అది లభించినా, ఇంకేదయినా అడగటం సంభవిస్తుంది అతడికి. అటువంటిదే జరుగుతుంది. కాబట్టి పరమేశ్వరుడిని ఎలా చేరాలి? ఏం చెయ్యాలి? అనే ప్రశ్నలు మానవుని ఎప్పుడూ పీడిస్తూనే ఉన్నాయి. ఆయన వస్తే ఏమని అడగాలి? ఇలా అడగటం సరైనదేనా? ఇలా అడగటం తప్పా! ఇలాంటి ప్రశ్నలు పీడిస్తున్నాయి మానవుణ్ణి.

ఏ ప్రశ్నకైనా ఈశ్వరుడు ప్రత్యక్షంగా సమాధానం ఇవ్వడు. గురువే బోధిస్తాడు. కనుక గురువు రూపంలో వున్న మహర్షులే మనకు ప్రమాణం. వేదములలో మంత్రములు, సూక్తములు అన్నీ వాళ్ళ ముఖంలో నుంచే మానవాళికి అందించారు. వాళ్ళ మనసులోకి బ్రహ్మ వాళ్లకు వినిపించదు. వాళ్ళకు అది 'శ్రుతి' కావచ్చు. మనకు 'శ్రుతి' కాదు. ఋషులకు 'శ్రుతి' మనకు 'ఋషి ప్రోక్తం' ఇది ఎప్పుడు మరచిపోకూడదు. ఇది శాశ్వతం.

అపౌరుషేయమైన వేదం, ఋషుల ముఖం నుండి వచ్చిందంటే, వారి మహత్తు, మంత్రశక్తి అటువంటిది. భగవంతుడు తనకు తాను తెలుసుకోవటానికి ఋషులను ఎందుకు ఎంచుకున్నాడు అంటే మహర్షుల మహోన్నత స్థితి తెలుస్తోంది.

మహర్షుల చరిత్ర ఎక్కువ ఆసక్తికరంగా ఉంటుంది. వాళ్ళ చరిత్రలు చెప్పుకున్నా, తెలుసుకున్నా, స్మరణ చేసినా అనుగ్రహం కలిగినా, మనలో మళ్ళీ ఆ చైతన్యం, ఆర్య చైతన్యం వస్తుందని చెప్పుకోవచ్చు అప్పుడు ఒక



దారి అంటూ మనకు ఏర్పడుతుంది. దారి చూపించే వారు కాబట్టి ఎల్లప్పుడు వారిని స్మరిద్దాం. పురాణాలలో అక్కడక్కడ మహర్షుల ప్రస్తావన తీసికొచ్చి ఒక చోట చేర్చి, ఒక పండితుడు ఋషుల చరిత్ర వ్రాసాడు. అది మనం దగ్గర ఉంచుకుని వారిని స్మరిస్తున్నాం. మనం నిత్య శుభకార్యాలలో, ఆబ్దికాలల్లో సంకల్పం చెప్పేటప్పుడు వంశ గోత్రాన్ని చెప్పుకుంటాం. ఆ గోత్రం ఋషి నామాలతో ఉంటుంది. రోజూ నిత్యం ఆచరించే త్రికాల సంధ్యావందనంలో, నిత్య తర్పణలో వంశ ఋషిని గోత్రరూపంలో స్మరిస్తూ ఉంటాం. దేవాలయాలకు వెళ్ళి అభిషేకాలు, అర్చనలు, పూజలు ఇతర భగవత్సేవలు నిర్వహించే సమయంలో సంకల్పం చెబుతారు. ఆ సమయంలో మన గోత్రం తప్పనిసరిగా చెప్పాలి.

## యోగాభ్యాసం

యోగాభ్యాసం చేయాలంటే నిద్రను జయించాలి. కాళ్ళు, చేతులు నొప్పులు రాకుండా చూచుకోవాలి. రెండు కాళ్లు ముడుచుకొని పద్మాసనం వేసుకొని కూర్చోవటం అలవాటు చేసుకోవాలి. ప్రాణాయామం చేయాలి. ఊపిరి బిగపట్టడం అలవాటు కావాలి. ఈవిధంగా మనవద్ద లేనటువంటి కొన్ని కొత్త లక్షణాలను సాధనచేసి సంపాదించుకోవాలి. ఏ మార్గంలో అయినప్పటికీ మనవద్ద లేనటువంటివి సంపాదించుకోవాలి. ఆ మార్గంలో మనం నిర్మాణం చేసుకోవాలి. అటువంటిది ఏమీలేదు. ఈ భక్తి మార్గంలో యథాతథంగా ఉన్నవాడు ఉన్నట్టుగానే పొందవచ్చు. "ఇప్పుడు భార్యను ప్రేమిస్తున్నావు. నీ ధనాన్ని ప్రేమిస్తున్నావు. నీ ప్రభువుకు సేవకుడిగా విశ్వాసంతో ప్రవర్తిస్తున్నావు. భక్తితో సేవ చేస్తున్నావు ఇంకెవడికో. ఈ లక్షణాలన్నీ ఈశ్వర పరంచెయ్యి. అంటే ఏమి చేసినా ఈశ్వర భావంతో ఈశ్వరునికే చేస్తున్నాను అని అనుకోవాలి. మనం ఏ పుణ్యకార్యం, ఏ సత్కార్యం సమాప్తం చేసిన తరువాత "పరమేశ్వరార్పణమస్తు" అని అంటాం. ఇది తప్పనిసరిగా నిత్య,

విశేష కర్మలలోనూ తూ.చ. తప్పక ఆచరించాలి. ఈశ్వరుడిని ప్రేమించు అంటే భక్తి పెంచుకో అని అర్థం. ఈశ్వరుడికి దాసోహం కా! నీవు నాకు భర్తవు. నీవు నాకు పుత్రుడివి. నీవు నా ధ్యేయం. నీ కోసమే నేను బ్రతుకుతున్నాను అని ఈశ్వరుడితో చెప్పు. ఈ గుణాలు నీలో ఉండనే ఉన్నవి. ఉన్న లక్షణములనే వాడుకుని ఈశ్వరుణ్ణి చేరుకో" అని భాగవతం చెబుతున్నది.

"ఈశ్వరుడిని చేరుకోవటం నావలన ఏమవుతుంది. అమ్మో! ఎంత కష్టము" అని అనుకుంటారు చాలామంది. అలా ఏమీలేదు. నీలో ఏయే గుణములు ఉన్నాయో ఆ గుణములనే నువ్వు ఈశ్వరునియందు ఆపాదించుకో! నీవు ఉన్న స్థితిని వదిలిపెట్టలేని స్థితిని పొందవలసిన అవసరంలేదు. ఉన్న స్థితిలోనే ఆయనను చేరుకోవచ్చు. ఏపని ప్రారంభించినా 'పరమేశ్వర' ప్రార్థనతో ప్రారంభించు, పని పూర్తయిన తరువాత పరమేశ్వరార్పణమస్తు' అని నమస్కారం చేయండి. సత్ఫలితాలు పొందండి. మోక్షమార్గం మానవుడిదే!.

* * *

## 7. విశ్వామిత్ర మహర్షి

పురాణేతిహాసాలలో ప్రముఖ వ్యక్తిగా పేరుపొందిన మహర్షి విశ్వామిత్రుడు. ఇతడు గాధి కుమారుడు. కుశనాభుని వంశంలోనివాడు. కుశనాభుని కుటుంబంలో జన్మించటం వలన ఇతనికి కౌశికుడు అనే పేరు కూడా ఉంది. ఇతడు పాలించిన రాజ్యం కన్యాకుబ్జం. కొంత కాలానికి విశ్వామిత్రుడు రాచరికం వదిలిపెట్టి ఋషి అయినాడు.

విశ్వామిత్రుడు బాల్యం నుంచీ సమస్త రాజభోగాలు అనుభవిస్తూ పెరుగుతున్నాడు. ఇతడు కుశాసనుడు అనే బ్రాహ్మణుడి ఆధ్వర్యంలో అస్త్ర విద్యను పూర్తిగా శిక్షణ పొందాడు. అనేక శస్త్ర, అస్త్ర విద్యా ప్రయోగాలను నేర్చుకొని, త్వరలో గొప్ప ధానుష్కుడైనాడు. కొద్ది కాలానికి తండ్రి గాధి స్వర్గస్థుడైనాడు. విశ్వామిత్రుడు మంచి పాలనాదక్షుడుగా ఖ్యాతి చెందాడు. ధర్మప్రభువు అని పేరు సంపాదించుకున్నాడు. సుఖంగానే ఉన్నాడు కానీ, వసిష్ఠ మహర్షితో సంభవించిన యుద్ధంలో ఓడిపోయాడు. ఆ అవమానం భరించలేక, తన కొడుకును రాజు చేసాడు. ఈశ్వరుడిని గురించి తపస్సుచేసాడు. విశ్వామిత్రుని తపస్సుకు మెచ్చి ఈశ్వరుడు సమస్త అస్త్ర, శస్త్రాలను ఇచ్చాడు. వసిష్ఠుని పోరాటంలో అవి అన్నీ నాశనమైనాయి. వసిష్ఠుని శక్తి ముందు అతడి బలం అంతా పనికిరాకుండా పోయింది. విశ్వామిత్రుడు ఘోరమైన తపస్సుచేసాడు. ఆ తపస్సుకు ఈశ్వరుడు మెచ్చి ఆయనను రాజర్షి అంటూ ఆ జ్ఞానాన్ని ఇచ్చి వెళ్ళాడు. మళ్లీ బ్రహ్మర్షి అవటానికి తపస్సు చేసాడు విశ్వామిత్రుడు. పుష్కర తీర్థం అనే ప్రదేశానికి వెళ్ళి బ్రహ్మర్షి పదవి పొందాలని గొప్ప తపస్సు చేసి దానిని సాధించాడు విశ్వామిత్రుడు.

### గాయత్రి మంత్రం

భారతీయులందరికీ విశ్వామిత్ర మహర్షి వర ప్రసాదమే 'గాయత్రీ మంత్రం' "విశ్వామిత్ర ఋషిః గాయత్రీ ఛందః" అని మనం నిత్యమూ త్రికాల

సంధ్యావందనంలో గాయత్రీ జపం చేస్తాము గదా! ఈ సమయంలో 'త్రిపదాషట్ కుక్షిః'' అని అనేక సందర్భాలలో ఉన్నది. ఆ గాయత్రి మహా మంత్ర మహత్తు ఎంతటిదంటే మూడు వేదములూ క్షుణ్ణంగా పారాయణం చేసి, వాటిని ముఖస్థం చేసుకుంటే వచ్చే పుణ్యమేదో గాయత్రీ స్మరణ చేస్తే వస్తుందని, దానికి సమానమైన మంత్రమే లేదు అని మహర్షుల హితబోధ. త్రిమూర్తుల శక్తులు అందులో ఉన్నాయి. సమస్త ప్రకృతి అందులో ఉంది. అది పరబ్రహ్మ వస్తువు. అందులో ఆద్యంతములు ఉన్నాయి. అదే మనకు రక్ష. గాయత్రీ మంత్ర ఉపదేశము వలన మనిషికి ద్విజత్వాన్ని, పశువుకు విప్రత్వాన్ని ఇస్తుంది. పశువుకు విప్రత్వాన్ని ఇచ్చేటటువంటి గొప్ప మంత్రం 'గాయత్రీ మంత్రం' అది జగత్తులో పూజ్యమయింది.

గాయత్రీ అనగా "గానా త్రాయతేతి గాయత్రి" గానము చేయువారిని రక్షింప చేయునది గాన గాయత్రీ అనబడును. ఏది గానము చేయవలయును? వేద గానము చేయవలయును. మన ప్రత్యక్ష దేవతయైన సూర్యభగవానుని యందు అవిచ్ఛిన్నముగా ఉన్న చైతన్యమునకు తనకును గల అభేద భావమే సంధ్య. తన్ను (వేదమును) గానము చేయువారిని కాపాడును అని అర్థము.

సంధ్యావందనము చేయు సంకల్పములో "ఉత్తిష్ఠంతు భూత పిశాచాః ఏతే భూమి భారకాః ఏతేషా మవిరో ధేనా బ్రహ్మ కర్మ సమారభే" అని చెబుతాము. సంధ్యోపాసన బ్రహ్మోపాసనయే కావున అది బ్రహ్మ కర్మమే. "ఈ భూమికి భావములైన భూత పిశాచములారా! నేను బ్రహ్మ కర్మ ప్రారంభించుచున్నాను. కావున మీరు ఇక్కడ నుండి వెళ్ళండి" అని అడ్డు లేకుండా చేసుకుంటాము. ఈ లలితాపరమేశ్వరికి గాయత్రికి భేదము లేదని తెలియటానికి "గాయత్రీ వ్యాహృతి సంధ్యా ద్విజ బృంద నిసేవితా" అనియు "భానుమండల మధ్యస్థాభైరవీ భగమాలినీ" అను నామములు సార్థకములైనవి.



## మంత్ర ప్రయోజనములు

ప్రతి ద్విజుడును, ప్రాణాయామముచేసి గాయత్రీ మంత్రము జపించుట వలన మానసికముగాను, శారీరకముగాను వృద్ధి కలుగుతుంది. ఈ మంత్రం నిత్యం పఠించుటవలన విద్యలో ముందంజలో ఉంటారని పెద్దల సలహా. మానవులకు సంభవించు కష్టాలు, బాధలు, సమస్యలు పరిష్కారమవుతాయని ఋషుల వాక్కు

## శ్రీరాముడితో సంభాషణ

విశ్వామిత్రుడు శ్రీరాముడితో తన చరిత్ర అంతా వివరించాడు. విశ్వామిత్ర మహర్షి మనోభావాలను గూడా ఈ సందర్భంలో తెలుసుకుందాం.

విశ్వామిత్రుడు తన తపస్సును వ్యయం చేసాడట. పూర్వం వలె తన తపస్సును వృధాచెయ్యటం మానేశాడు. పూర్వం తన తపస్సును లెక్కలేకుండా ఖర్చుపెట్టేవాడు, సంపాదించేవాడు, మళ్ళీ ఖర్చుపెట్టేవాడు, తనకు ఇష్టమైన వారికోసమే తపస్సును ఉపయోగించేవాడట. ఒకసారి మేనకకు ధారపోశాడు. ఇంకొకసారి త్రిశంకుడికి ధారపోశాడు. మరొకసారి వసిష్ఠుడితో యుద్ధంచేసి ఖర్చుపెట్టాడు. ఆయన చరిత్రలో కామం, క్రోధం, అహంకారం, మహా సర్పాలయి వచ్చి మాటు వేసి ఆయన తపస్సు హరించాయి. ఆ చరిత్ర అంతా ఆయనే శ్రీరాముడితో స్వయంగా వివరించాడు. శ్రీరాముడికి విశ్వామిత్రుడు అస్త్ర విద్యా గురువు.

"రామా! నా చరిత్ర లోకోత్తరమైనది. నేను చేసిన పనులు ఎవ్వరూ చెయ్యలేరు. నేను చేసిన తప్పులు ఎవ్వరూ చెయ్యలేరు. నా అంతటివాడు మరొకడు లేడు. కామ, క్రోధ, లోభ, మోహలక్షణాలు ఇంత తపఃశ్శక్తి కలిగిన నన్ను మహాసర్పాలవలె కాటువేసి నా తపస్సును హరించి, మహోన్నత పదవి నుండి క్రిందకు పడవేసాయి. "నేను పట్టుదల కలిగిన మనిషిని. తీవ్రమైన

తపస్సు చేసి ఇంత వాడిని అయినాను. నేను సంపాదించిన అస్త్ర బలం వసిష్ఠుడు కాదు గదా, ఎవరి వద్ద లేదు. ఇదంతా నీకు ఇవ్వాలని నిశ్చయించినాను", అన్నాడు విశ్వామిత్రుడు రాముడితో. ఆ అస్త్రాలను ఇచ్చి ఈ అస్త్ర బలంతో దశాంశం, శతాంశం సరిపోతుంది రాక్షసులను సంహరించటానికి, అంతే! నువ్వెపుడూ వాటిని ఉపయోగించే పని ఉండదు" అన్నాడు మహర్షి విశ్వామిత్రుడు.

అప్పుడు రామలక్ష్మణులకు ఒక సందేహం వచ్చి మహర్షితో "మీరు ఇంత అస్త్ర బల సంపన్నులు గదా! మీరే క్షణంలో ఆ రాక్షసులను సంహరించవచ్చును. మమ్మల్ని ఎందుకు తీసుకొని వచ్చారు" అని అడిగారు. వెంటనే విశ్వామిత్రుడు, "నాయనలారా! నేను బ్రహర్షిని అయిన తరువాత నా కర్తవ్యం ఇక ఏమీ ఉండదు. క్షత్రియులచేత చేయించవలసిన పనే ఉన్నది. నేను నిర్వహించాల్సిన యాగం లోక క్షేమంకోసమే!" అన్నాడు. ఆ నెపంతో రాముడి సన్నిధిలో యాగం చేద్దామని ఆయన సంకల్పం. సాక్షాత్తు విష్ణుస్వరూపుడైన శ్రీరాముడే ప్రత్యక్షంగా ఎదురుగా ఉండగా, ఇక విష్ణువును ప్రత్యేకంగా యజ్ఞంలో అవాహనచేసి, అక్షతలు వేసి విగ్రహం పెట్టడమెందుకు? "విష్ణు మావాహయామి స్థాపయామి" అనటం ఎందుకు? విష్ణువు ఎదురుగా ఉండగా! కాబట్టి మంత్రం మీద ఆధారపడక, విష్ణువు మీదనే ఆధారపడ్డాడు విశ్వామిత్రుడు. ఏ విష్ణువు అనుగ్రహంతో లోకంలో రాక్షస సంహారం చేయదలచుకున్నాడో, ఆయననే స్వయంగా తీసికొని వచ్చి నిలపెట్టాడు. అంటే శ్రీమహావిష్ణువే శ్రీరామావతారంగా త్రేతాయుగంలో జన్మించాడు గదా! కాబట్టి శ్రీరాముడే శ్రీమహావిష్ణువుగా భావించాడు.

## లోకోపకారం కోసం యాగం

లోకానుగ్రహంకోసం చేసే యాగాలు కొన్ని, స్వలాభం కోసం చేసేవి. కొన్ని దుష్టశక్తుల నాశనం చేసే యాగాలు ఉన్నాయి. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి



అయిన వాడు కాబట్టి ఆయనకు యజ్ఞంతో పనిలేదు. యజ్ఞాన్ని లౌకికంగా భూలోకంలో మానవాళి యోగక్షేమాలు కోరి చేయవలసిందే తప్ప దానివలన జ్ఞానం రాదు. ఇక్కడ ఒక రహస్యం కూడా ఉంది. యజ్ఞం పదిమందితో సాధ్యమయ్యే సామూహిక సత్కర్మ. అందువల్ల ఎవరికీ అది జ్ఞానాన్ని ప్రసాదించదు. కాని తపస్సు వ్యక్తికి సంబంధించినది. వ్యక్తికి అనంత శక్తిని, ముక్తిని ఇవ్వగలదు.

అయితే విశ్వామిత్రుడు జ్ఞానకర్మ కాని కర్మను ఎందుకు నిర్వహిస్తారు అంటే లోకక్షేమం కోసం, లోకోపకారం కోసమే చేసాడాయన. లోకక్షేమం కోసం అని శ్రీమహావిష్ణువును తీసికొచ్చి తన తపస్సు, అస్త్రబలం ఆయనకు ఇచ్చాడు. ఆయన సన్నిధిలో యజ్ఞం చేసాడు. రాక్షస సంహారానికి కారణమైనాడు. అంతటి మహాత్ముడు, విశ్వానికి మిత్రుడయినాడు.

## వర్షం - అన్న సమృద్ధి - లోకోపకారం

విశ్వామిత్ర మహర్షి తన తపస్సు ఖర్చు చేయకూడదనే లక్ష్యం ఏర్పరచుకున్నాడు మనస్సులో. తపస్సుతో నిమిత్తం లేకుండా వర్షం కురిపించి అన్నం సమృద్ధిగా ఏర్పరచి లోకోపకారం చేసాడు. అవి ఎట్లా సాధ్యమైంది? తెలుసుకుందామా?

ఒకప్పుడు లోకంలో కరువు వచ్చింది. దాన్ని తీర్చగల తపోబలం ఆయనకు ఉన్నది. ఆయన సంకల్పించుకుంటే కుంభవృష్టినీ, వర్షాన్ని ఇవ్వగలడు. ఇంకా చెప్పాలంటే వర్షంతో పనిలేకుండా ధాన్యాన్ని ఇవ్వగలడు. అయినా ఆయన కూడా అన్నం లేకుండా ఖాళీ కడుపుతో ఉన్నాడు. రాజు దగ్గరికి వెళ్ళి "రాజా! నాకు ఆహారం కావాలి. నేను ఊరికే తీసుకోను. నా కొడుకును నీవు సేవకుడిగా తీసుకో వాణ్ణి తీసుకొని ఆహారం ఇవ్వాలి" అని అడిగాడు. కుమారుడిని ఇవ్వటంలోని ఉద్దేశ్యం తపస్సు మీద ఉండే జాగ్రత్తను తెలియచేస్తోంది.

వెంటనే రాజు, "మహర్షి! సంకల్పం మాత్రంచేత మీరు అందరికీ అన్నం ఇవ్వగలరు. అట్టి మీరు మీ కుమారుడిని నా కివ్వటమేమిటి? నా దగ్గర ధనం, ఆహారం అడగటమేమిటి? నాకు అర్థం కావటం లేదు" అన్నాడు. అప్పుడు విశ్వామిత్రుడు తన సమాధానముగా "ఈ దేశాన్ని రక్షించుకోవటానికి అన్నం కావాలి. ఆ అన్నం కోసమని ఆత్మబలంతో చేసిన తపస్సును వ్యయం చేయమంటావా! ఈ శరీరాన్ని కాపాడుకోవటానికి అవసరమైన క్షుద్రమైన ఆహారం ఎవరిని అడిగినా ఇస్తారు. కాని ఉచితంగా అయితే నేను ఋణపడి ఉంటాను. మళ్లీ నేను నీకు ఏమి ఇవ్వాలి? కాబట్టి నా దగ్గర ఉండే పశుధనం మాదిరి నా కొడుకు ఉన్నాడు. నీకిస్తాను" అన్నాడు.

అందుకు సమాధానంగా రాజు "నాదే దోషం, దేశంలో కరువు వచ్చింది. మహర్షులు, బ్రాహ్మణులు అరణ్యాలలో ఉంటున్నారు. ఏం తింటున్నారో? లేదో? నేను వచ్చి విచారించలేదు. నా అపరాధం మన్నించి నేనిచ్చేది తీసుకొని వెళ్ళండి" అన్నాడు. దయతో ఆ రాజును దీవించాడు విశ్వామిత్రుడు. ఆ ఆశీర్వచన బలంతో వర్షం కురిసింది. అన్న సమృద్ధి కలిగింది.

తపస్సంపన్నులు చేసే ప్రతి పనికి ఒక కార్య కారణ సంబంధం ఉంటుంది. కానీ, అకారణంగా తపస్సులోంచి ఏ వస్తువును సృష్టించకూడదు. జ్ఞాని ఆ పనిని ఎప్పుడూ చెయ్యడు. ఒక కారణం ఉండాలి. కారణంలోంచి కారణం పుట్టాలి. తాను అన్నం యాచించకుండా కొడుకును ఇస్తానన్నాడు. రాజు తన రాజధర్మాన్ని గుర్తు చేసుకొని ఉచితంగానే అన్నం ఇవ్వాలి కదా అన్నాడు. ఆ రాజు తనకు నమస్కరించినపుడు, "నీ ధర్మానికి సంతోషించాను, రాజ్యం సుభిక్షమగుగాక!" అని ఆశీర్వదించాడు విశ్వామిత్రుడు. ఇక్కడ రెండు సందేశాలు ఉన్నాయి. ఒకటి లోకోపకారం, రెండవది రాజుకు ధర్మాన్ని గుర్తుచేసి, ఆచరింపచేసాడు. ఇదే మహర్షుల హితం.



## సంకల్ప బలం సత్యం

విశ్వామిత్రుడి ఆశీర్వచనమే, సంకల్పమే అక్కడ బలం, ఇక తపస్సు ధారపోయాల్సిన అవసరంలేదు. ఆశీర్వచనమనేది అనేక విధాలుగా ఉంటుంది. కోరిక కోసమని ఒకరు అడుగుతారు. అతడికి పుణ్యం ఉండదు. తపస్సు ధారపోయవలసిన అవసరం వస్తుంది. సంకల్ప బలం ఒకటి ఉన్నది. తపస్సుతో సంబంధం లేనటువంటి అమోఘమైన సంకల్పం. బ్రహ్మ తపస్సు నిర్వహించి సృష్టించటం లేదు. సంకల్ప బలంచేత సృష్టిస్తున్నాడు. సంకల్పములో నుంచే సమస్తమూ, భూతములు జనిస్తున్నాయి. బ్రహ్మకు ఎటువంటి శక్తి ఉన్నదో బ్రహ్మజ్ఞానికి ఆ సంకల్పమందు ఆ శక్తి ఉంటుంది. అది అతని వాక్ శక్తి. ఎందుచేతనంటే సత్యభావన యందే మనసు లగ్నమయి ఉండుటచేత భావన సత్యమవుతుంది. తపస్సుతో నిమిత్తం లేదు. తపస్సు దేహంతో, మనస్సుతో, ఇంద్రియములతో, చిత్తంతో ఆచరించబడి, లభించే ఒక శక్తి, ఒక ధనం అది. తపస్సుని వ్యయంచేయకుండా సత్య సంకల్పులు సంకల్ప బలం మాత్రంచేత ఏది భావన చేసినా అది సత్యమవుతుంది.

ఎప్పుడూ సత్యం పలికేవాడికి, జీవితంలో చెప్పింది సత్యమవటం మొదలవుతుంది.. ఇది సత్యం యొక్క శక్తి. ఏది చెప్పినా సత్యం కావటానికి తపస్సు కారణంకాదు. సత్యధర్మమే, సత్యవ్రతమే కారణం. ఇది తపోధనం కాదు. అతడికి సత్యం పలకటం పూర్వజన్మ సుకృతమే. ఒక లక్షణం, ఒక ఐశ్వర్యం. అది వ్యక్తి హృదయమందు పుట్టిన, మనస్సుయందు పుట్టిన ఒక ఐశ్వర్యం కాబట్టి, సత్యానికి అంతశక్తి ఉంది. రామాయణంలోని శ్రీరాముడు సత్యధర్మ పరాక్రముడు. అలాగే ద్వాపరయుగంలో, మహాభారత కాలంలో ధర్మరాజు సత్య ధర్మాన్నే ఆచరించాడు. అందుకే సశరీరంతో స్వర్గానికి వెళ్ళాడు. సత్యవ్రతం గురించి అంత కథ వుంది. ఆ సత్యవ్రతానికి అంతటి ప్రాధాన్యాన్ని ఇచ్చాడు హరిశ్చంద్రుడు. రాజ్యం పోయినా, కొడుకు పోయినా సత్యవ్రతమే

గొప్పదని సత్యాన్ని పలికాడు హరిశ్చంద్రుడు. అందుకే ఆయనకు సత్య హరిశ్చంద్రుడు అనే పేరు సార్థకమయింది లోకంలో.

త్రేతాయుగంలో రామలక్ష్మణులను ఎంతో గొప్పవాళ్ళను చేసిన ఖ్యాతి విశ్వామిత్రుడికి దక్కింది. రామాయణంలో ఆయన పాత్ర చాలా గొప్పది. "స్మృతి చంద్రిక", "కాలవివేకము" అనే స్మృతి శాస్త్రగ్రంథాలలో విశ్వామిత్రుడు చెప్పిన భావాలను మామూలుగా ఉదహరిస్తూ ఉంటారు. వేద కర్మల విషయంలో, సంస్కారాల విషయంలో మరిన్ని సందేశాలు ఇచ్చారు ఆయన. వేదాల యొక్క భావన అంతరార్థం తెలుసుకుని విజ్ఞానులయిన వారు ఏది ఆచరిస్తారో అదే ధర్మంగా స్వీకరించాలని సందేశం ఇచ్చాడు. తత్త్వజ్ఞాని అయిన బ్రాహ్మణుడు ఆచరించిందే ధర్మంగానీ, స్మృతులలో వ్రాసింది కాదు. కేవలం దానిని ధర్మ ప్రమాణంగా తీసుకోకూడదు అని చెప్పాడు. విశ్వామిత్రుడు వాక్కు అలా ఉంది గ్రంథాలలో.

మహాపాతకాలంటే ఏమిటో నిర్ణయింపబడి ఉన్నాయి. అనుభవించి తీరవలసిందే. ప్రాయశ్చిత్తం అనేది లేదు. ఇహ పరములు రెండూ తెలిసిన ఋషులు వ్రాసారు ఇలాంటివి. అన్నీ ధర్మాలు, సదాచారాలు తెలిసిన మహర్షులే వ్రాసారు ఇవన్నీ. ఋషులు వ్రాసినవన్నీ ఆచరించవలసిన ధర్మాన్ని చెప్పారు. కాబట్టి వాళ్ళ మాటలు, సందేశాలు, ఆదేశాలు మనకు శిరోధార్యములు.

**దానగుణం**

విశ్వామిత్రుడు సప్తర్షి మండలంలో ప్రవేశించి సప్తఋషులలో ఒకరుగా ఉండి, నిత్యుడు, శాశ్వతుడుగా ప్రకాశిస్తున్నాడు. ఆయనకు ఒక లోకం, పదవి వున్నాయి. శక్తి సంపన్నుడు. ఆయనను స్మరించి స్తోత్రం చేస్తే, ఉపాసిస్తే అనేక విశేషములయిన జ్ఞానములు కలుగుతాయి. ఆయన శక్తి ఎంతటిదో, ఆయన ఔదార్యం కూడా అంత గొప్పదే. ఆయనను ప్రార్థిస్తే ఏమైనా ఇస్తాడు.



ఇవ్వడంలో ముందు వెనుకలు లేవు. ఆయన గొప్పదాత క్షాత్ర లక్షణం కలిగిన దాత. అందువల్లనే బ్రాహ్మణుడు ఏం దానం చేస్తాడు, చేస్తే క్షత్రియుడే దానాలు చెయ్యాలి. లేకపోతే వైశ్యుడు ఇవ్వాలి అని ఒక సంప్రదాయం ఉన్నది. వాళ్ళే కాని బ్రాహ్మణులు ఎలా చేస్తారు? బ్రాహ్మణులు ఇవ్వరు, తీసుకుంటారు. అంటే దాత అనే వాడికి క్షాత్రగుణం ఉండాలి. రజో గుణం ఉండాలి, రజోగుణం లేకపోతే ఇవ్వలేడు. "వాడు అడిగింది నాకు లెక్కా! అడిగింది ఇస్తాను నా దగ్గర ఉన్నది ఇచ్చేస్తాను" అనుకుంటాడు దాత. దాతకు రెండో ఆలోచన ఉండదు. ఖర్చు చేసేటప్పుడు దాతృత్వ గుణానికి వెనకాల రజోగుణం ఉంటుంది. తీక్షణమైన సహజ స్వభావం ఉంటుంది. ఆ స్వభావానికి, దాత ఒక వీరుడు, ధీరుడు అయివుండాలి. "దాన వీరుడు" అంటారు అందుకే. కర్ణుడు మొదలైనవారు అలాంటి వాళ్ళే, దాన వీరులు వాళ్ళు.

**బ్రాహ్మణుడు - దానం**

సత్త్వ గుణంచేత - పుణ్యశీలి కాబట్టి వైశ్యుడు ఇస్తాడు, క్షత్రియుడు క్షాత్ర గుణంతో ఇస్తాడు. బ్రాహ్మణుడు లోభ గుణం కలిగివుంటాడు. భయస్థుడు కాబట్టి. సత్త్వ గుణంచేత ఇతడు దాత కాలేడు అని చెప్పి అనేక స్మృతుల్లో కూడా ఉంది. అయితే ఎవ్వరూ చెయ్యలేని దానం బ్రాహ్మణుడిని చేయమని స్మృతిలో ఒకచోట చెప్పబడింది.

మహాభారతంలో కూడ తపస్సుచేసి దానిని దానం చెయ్యమని ఉన్నది. తపస్సు చేసి లోకానుగ్రహం కోసం ఆ ఫలాన్ని ధారపోస్తే సహజంగా ముక్తి లభిస్తుంది. అందుకనే బ్రాహ్మణుడు చేసే కార్యాలన్నీ లోకానుగ్రహం కోసమే అంటారు. యజ్ఞ యాగాది క్రతువులు చేసి ఆ ఫలాన్ని లోక పాలకులైన ఈశ్వరుడు - బ్రాహ్మలకు, పరమేశ్వర భావనతో అర్పణం చేయటం - పరమేశ్వరార్పణం. ఆవిధంగా నిర్వహిస్తే లోకక్షేమం కలుగుతుందని చెబుతారు. బ్రాహ్మణుడు ధనం నిల్వ ఉంచకూడదని ఒక సూచన. ఆమాటకొస్తే

(1) ఐశ్వర్యవంతులయిన బ్రాహ్మణులు ఉన్నారు. (2) తపోవృత్తులయందు నిమగ్నమైన బ్రాహ్మణులు ఉన్నారు. అంతేగాక లోకంలో, సంఘంలో ప్రవర్తించే బ్రాహ్మణులుకూడా ఉన్నారు. తరువాత యుగాలు మారిన కొద్ది వారిలో అనేక మార్పులు వచ్చాయి. అనేక ధర్మాలు బ్రాహ్మంలో క్షాత్రం, క్షాత్రంలో బ్రహ్మణ్యం, ఇలాగ ఖచ్చితంగా గీతలు గీచి విడిగా చూపించటానికి లేదు. క్షాత్ర లక్షణం కలిగిన బ్రాహ్మణుడు, బ్రాహ్మణుడయిన క్షత్రియుడు, ఇలాగ చెప్పుకుంటూ పోతే అనేక ధర్మములు ఒక దానితో ఒకటి కలిసిపోయాయి. కలిలో ప్రధానమైనది, అందరూ విధిగా నిర్వర్తించవలసినది సత్య ధర్మములు. కలిలో అంతఃశౌచము చెప్పబడింది. శంఖులిఖిత ఇత్యాదిగా అనేక స్మృతి కర్తలు సత్యానికి, శౌచానికి ప్రాధాన్యత ఇచ్చారు.

## శౌచము - తపస్సు

మనస్సు, బుద్ధి, చిత్తములకు శుచి (శుభ్రత) ముఖ్యం. వందసార్లు స్నానంచేసి, అంతఃకరణలో శౌచము లేనటువంటి వాడు వ్యర్థుడు. శరీరానికి శుచి అనే మాట అసలు వర్తించదు. ఎన్నిసార్లు స్నానం చేసినా మాలిన్యం అనేది ఉండనే ఉంది కదా! సాన్నం చేసేది చర్మానికి మాత్రమే. స్నానం వలన లోపలి వస్తువు శుభ్రం అవుతుందా! చర్మాన్ని శుభ్రపరచటమే స్నానం అవుతుంది గాని, దీనివలన శుభ్రత చెందాడని అనుకోవటం పొరపాటే. పూర్వ యుగాలలో శారీరక శౌచము గూడా చాలా గొప్పగా ఉండేది. యోగబలంచేత వారు ఆహారం లేకుండా ఉండేవారు. ఆహారం లేకుండా ఎందుకు తపస్సు చేయాలి? శౌచం (శుభ్రంగా)లో నిరాహారంగా తపస్సు చేయాలని వాళ్ళ ఉద్దేశ్యం. నిత్యమూ ఆహారం తీసుకునేవారిలో శుభ్రతేలేదు. శుచి ఉండదు కాబట్టి, పరిపూర్ణమయిన (నూరుశాతం) శౌచ విధితో శరీరాన్ని తపస్సు యందు వినియోగించాలి. అంటే ఆహారం తీసుకోకుండా ఉండటమే. ఆహారం వలన లోపల అశుభ్రత ఏర్పడుతుంది గదా! శరీరం అనేది ప్రాణానికి



ఒక చిన్న గూడు వంటిది. శుష్కించిన శరీరం దమించబడిన ఇంద్రియాలు మహోగ్రమైనటువంటి అతఃకరణ - ఇదీ తపస్సు యొక్క స్థితి. శరీరాన్ని క్షీణింపచేస్తే, మనిషిలోపల ఉండే అతరంగ బలం ఎప్పుడూ క్షీణిస్తుందని అనుకోకూడదు. శరీరం శుష్కించుట వేరు. లోపల బలం, నేను అనే అహంకారం, జీవుని యందు వున్న ప్రాణశక్తి, దాంట్లో ఉండే బలం వేరు. అది తపస్సుతో పెరుగుతుంది. శరీరం క్షీణిస్తుంది.

ఒకడు ఎక్కువగా భోజనం చేసేవాడు ఉంటాడు. వాడికి అంతఃకరణలో (1) బలము ఉందా? (2) సంకల్ప బలము ఉందా? (3) భావనా బలము వుందా? (4) మనో బలము ఉందా? (5) బుద్ధి బలము ఉందా? (6) పట్టుదల ఉందా? ఉండకపోవచ్చు. మరి శరీరము అంత బలముగా ఉంది కదా! కాబట్టి శారీరక బలము, అనేక సందర్భాలలో, సమయాలలో విరోధులు కూడా కావచ్చు. శరీరం ఎంత బలంగా ఉన్నప్పటికీ, అంత అశుభ్రతగా కూడా ఉండవచ్చు. శరీరం ఎంత శుచిగా ఉంటే అంత క్షీణించి, లోపల ఆత్మబలం అంత వృద్ధి చెందవచ్చు. ఇదే తపస్సు. దీనికి నేడు యోగము అని పేరు. అంటే తపస్సు చేసే వాడికి అంతఃకరణ శుద్ధి అత్యంత అవసరము.

ఆహారం ప్రాణశక్తి కోసమే కదా! ఆ ప్రాణశక్తి సర్వత్రా వ్యాపించి ఉంది. ఉదకంలో ఉంది. ఆకాశంలో ఉంది, నీళ్ళలో వుంది, గాలిలో ఉంది, ప్రాణశక్తి తినే ముద్దలో మాత్రమే లేదు. కాబట్టి, ఆహారంతో నిమిత్తము లేకుండా నేరుగా ప్రాణశక్తిని ఎవరయితే తమలోకి తీసుకొని వెళ్లగలరో వాళ్ళు తపస్సుకు యోగ్యమయిన శరీరాన్ని కలిగినవాళ్ళు, అటువంటి వారు ఆహారం మీద ఆధారపడి ఉండాల్సిన అవసరము లేదు. ఇది శౌచవిధి.

నిత్య జీవితంలో మానవుడికి శారీరక శౌచం కంటే మానసిక శౌచం ప్రధానం. అంటే నిర్మలమైన మనస్సు ఉండాలని అర్థం. మానసిక కాలుష్యం పనికిరాదు. అందుకే నిత్య సంధ్యావందనం ప్రారంభించే సమయంలో

"సబాహ్యాభ్యంతరః శుచిః" అని చెప్పి బాహ్యము, లోపల కూడా శుద్ధికోసమని నీళ్ళు చల్లుకుంటాము. ఆచమనం చేస్తాము. ఈ ఆచమనం ఎందుకు? లోపల ఉండే అంతఃశౌచం కోసం అని ప్రాణాయామం చేస్తాము. లోపల ఉండే మాలిన్యం పోవాలని ఇవన్నీ ప్రయత్నాలు. ఇంతకీ వీటన్నింటికీ అతీతమైనది సంకల్పము. సృష్టిలో దేనియందైనా కరుణ, దయ, నిర్వికారము అలాగే అవమానము, సన్మానము రెండింటియందు సమానమైన దృష్టి - ఇవి శౌచానికి కారణములు అవుతాయి. ఎందుకంటే క్రోధం అశుచిని ఇస్తుంది లోపల, ఆశ ఆశుచిని ఇస్తుంది. లోభంతోనూ అశుచి వస్తుంది. దేనియందు అయినా ఆశ పెట్టుకొని అది కావాలంటే అది అశౌచం. అది అశుచి, ఆగ్రహం అశుచే లోభం, మోహం ఇవన్నీ కూడా! అంతఃకరణలో ఉండే దోషాలు, చెడు భావాలు అన్నీకూడా అశుచిని కలిగిస్తాయి. ఇవి ఉండకూడదు. ఇవన్నీ లేనప్పుడే శౌచధర్మం కలుగుతుంది. ఈ అశుచి వదిలిన వాడికి అంతఃకరణ పూర్తిగా వశమై, పరమ పవిత్రుడై అంతఃకరణలో తపస్సు చేస్తాడు.

ఆవిధంగా లేకపోతే శరీరం ఎన్ని సార్లు స్నానం చేసినా, ఆచమనం చేసినా, మంత్రోదకం చల్లుకున్నా తపస్సు పది నిమిషాల కంటే ఎక్కువ చెయ్యలేడు. వాయువును నిగ్రహించలేడు. కూర్చోలేడు. ఒక గంటసేపు నిలబడలేడు. ప్రాణాయామం చేయలేడు. కాబట్టి కలియుగంలో మితాహారము, అంతఃశౌచము అత్యంత అవసరం. దాని వలన ప్రాణాయామము మొదలైన నియమాలన్నీ లభిస్తాయి. వాటివల్ల మానవుడు తపస్సుకు యోగ్యమైన అర్హతలు కలిగి అంతఃశరీరం కలిగిన వాడు అవుతాడు. తపస్సుకు యోగ్యం కాని శరీరము వ్యర్థమైనటువంటిది. మానవజన్మకు తపస్సు తప్ప కర్తవ్యమేముంది? ఏది సంపాదించినా నశించేదే కదా!

**ఆత్మ గౌరవము - లక్షణాలు**

చాలా సంపాదించాం అనుకుంటాం. అవి ఉండగానే మనంపోతాం, మన పుణ్యం బాగుండకపోతే, మనము ఉండగానే అవి పోతాయి. రెండూ



దుఃఖమే! తపోధనం సంపాదించాలి. ఆ తపస్సుకు ఎటువంటి శరీరం కావాలి. ఎలాంటి మనస్సు ఉండాలి. అంటే అందుకు శౌచమే విధించారు. మితాహారం వల్ల అది వస్తుంది. ఎంత బలిష్టుడైనా, వాడికి రోగం వస్తే ఒక మూల పడుకొనే ఉంటాడు. వాడిని గౌరవిస్తావా? వాడి ఆత్మ గౌరవం అంతా ఏమయింది? వాడి గర్వం అంతా ఏమయింది? నశించలేదా? అతనికి కేవలం పశువుకు చేసినట్లు వైద్య చికిత్స చేయరా వైద్యులు. కాబట్టి ఈ శరీరాన్ని ఆధారం చేసుకొని ఉన్నటువంటి ప్రతిపత్తి, గౌరవం, దర్పము, దర్జా వీనియందు ఆధారపడి ఉండగూడదు. ఆత్మ గౌరవంతో తనను తాను గౌరవించుకునే స్థితిలో ఎప్పుడూ ఉండాలి. శౌచంచేత, గుణంవలన, నాలో దోషంలేదు, అని తనను తాను గౌరవించుకోవాలి. ఆత్మ గౌరవము అంటే, "ఏ లక్షణములు నాయందు ఉన్నాయో అవి గౌరవానికి కారణములు. నన్ను నేను అవమానపరచుకోవలసిన అవసరం నాకు లేదు. నా గుణముల వల్ల నాయందు నాకు గౌరవమేవుంది" అనుకోవాలి. అయితే అది అహంకారంకాదు. దర్పంకాదు. అట్టి ఆత్మ గౌరవానికి యోగ్యత సంపాదించాలి. అంతేకాని ఇతరులు ఇచ్చేది గౌరవంకాదు. తనయందు తనకు ఉండే గౌరవమే గౌరవం. కలియుగంలో ఈ ధర్మాలు ఎక్కువగా పురాణాలలో చెప్పారు. పెద్దలు చెబుతున్నారు. ఆనాటి యుగాల్లో ఆపద్ధతులు వాళ్ళు ఆచరించినటువంటివే అని అర్థం చేసుకోవాలి.

అటువంటి అపూర్వ ధర్మం నిర్ణయించిన వాడు విశ్వామిత్ర మహర్షి. దీక్షకు పట్టుదలకు మరోపేరు ఆయన. పట్టుదల లేనివాడు దానికోసం ఒకసారి ఆ మహర్షిని తలచుకోవాలి. బాగా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకొన్న తరువాత, ఎంత కష్టం వచ్చినా, దాని అంతు కనుక్కోవలసిందే. ఆ పట్టుదల ఆర్యుల లక్షణం. ఈ పట్టుదల రజోగుణం వల్లనే వస్తుంది. ఆ రజోగుణం లేనిదే తపస్సులు కూడా ఫలించవు.

ఇంతసేపూ చదివిన, తెలుసుకున్న అత్యద్భుతమైన ఆర్య ధర్మాలు, ధర్మ సూక్ష్మాల సాకార రూపమే విశ్వామిత్ర మహర్షి జీవనం. యుగాలు గడచినా తరిగిపోని శాశ్వతమైన తేజస్సు ఆయనది. ఆయన స్మరణం, చింతనం, మనకు కర్తవ్య బోధకం, ఇహపర సాధకం.

విశ్వామిత్ర మహర్షి సకలజనులకు సద్విషయాలను తెలియజేయటం లోకోపకారం కోసమే. మనుషులు మంచి వారయితే సమాజం, లోకం సన్మార్గంలో నడుస్తుందని తెలుసుకోవాలి.

ఓం శాంతిః శాంతిః శాంతిః

* * *

# 8. వ్యాస మహర్షి

పరాశరమహర్షికి ఉపరిచరవసువు కుమార్తె అయిన సత్యవతికి జన్మించిన వాడు వ్యాసుడు. వ్యాసుడు కృష్ణ ద్వీపంలో జన్మించాడు. ఈ ద్వీపం ధమౌలి, నేపాల్ దేశంలో ఉన్నది. కాబట్టి ఆయనకు కృష్ణద్వైపాయనుడు అని పేరు. ఆయన నల్లనివాడు. ఆయనకు జన్మనిచ్చినటువంటి ద్వీపం నది మధ్యలో ఉన్నది కనుక అది కృష్ణద్వీపం అయింది. వేదాలను విభజించటం వలన వేదవ్యాసుడు అయినాడు. ఇతడు గొప్ప ఇతిహాసమైన మహాభారత గ్రంథం 18 పర్వాలు వ్రాసి భారతజాతికి తన ధార్మిక సందేశాన్ని అందించాడు. మహాభారతాన్ని, పంచమ వేదమని' నామకరణం చేశారు. వ్యాసమహర్షి చెబుతుండగా విఘ్నేశ్వరుడు వ్రాసిన ప్రదేశము మన గ్రామం ఉత్తరాంచల్. అలాగే ఆయన 18 పురాణాలు రచించి ఆధ్యాత్మిక, ధర్మ, భక్తి సందేశాలను, ఉపదేశాలను, ఆదేశాలను గూడా జాతికి అంకితం చేసాడు.

నాలుగు వేదాలు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదములు విభజించి నలుగురు శిష్యులకు అందించి దేశమంతా ప్రచారం చేయమన్నాడు. వ్యాసమహర్షి తన శిష్యులకు వేదాలు, పురాణాలు బోధించిన ప్రాంతం నైమిశారణ్యం సీతాపూర్ జిల్లా, ఉత్తర్ ప్రదేశ్. ఈ రోజుకూ వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు భారతీయులు ఆదరిస్తున్నారు, గౌరవిస్తున్నారు. రక్షిస్తున్నారు అంటే దీనికంతటికీ అంకురార్పణ చేసినవాడు వేదవ్యాసుడు. ద్వాపరయుగం చివరలో మనశ్శాంతి కోసం భగవంతుని మహిమలు, చరిత్ర, లీలలుతో 'భాగవత' గ్రంథాన్ని రచించి మహోపకారం చేసాడు వ్యాసుల వారు.

## శ్రీహరి ఆదేశం

వేదవ్యాసుడు మనకు భారతం నుంచే పరిచయం అయినా ఆయన అంతకంటే పూర్వం వాడే, సనాతనుడు. అప్పటినుంచీ వస్తూనే ఉన్నాడని

చెబుతున్నారు. శ్రీహరి "నువ్వు నా సంకల్పాన్ని నెరవేర్చావు కాబట్టి, అన్ని మన్వంతరములలోనూ నీవు ఈ వేదవ్యాస క్రమంలో నన్ను సంతోషపెడుతూ ఉంటావు. సనాతనుడిగా శాశ్వతంగా పరిగణింపబడతావు. నా చరిత్రలన్నీ తెలుసుకున్న నీవు ఈ త్రిలోకాల యొక్క సృష్టి, అఖిల ధర్మాలూ తెలుసుకొని, త్రికాల జ్ఞానులైన మునీశ్వరులలో మధ్యన గొప్పవాడివై, ఉత్తమ గౌరవాన్ని పొందుతావు. ఎప్పుడూ ఈలోకాలలో సంచరిస్తూ ఉంటావు. ఈ రాబోయే మన్వంతరంలో నీవు వశిష్ట పౌత్రుడైన పరాశరుడనే మహర్షికి జన్మిస్తావు. నీవలననే జన్మించిన కురువంశపు రాజులు పరస్పర వైరంతో యుద్ధంలో నశించగా, అట్టి సంక్షోభ కాలంలో – ఏ వేదము ఉన్నదో, అది కూడా సంక్షోభం పొందుతుంది. నీ సంతానం సక్రమముగా నిలబడక పరస్పర శత్రుత్వంతో నశించటము అనే ఈ సంక్షోభం ఎప్పుడు జరుగుతుందో, అప్పుడు ఒక యుగాంతం సంభవించి వేదములు కూడా సంక్షోభం చెందుతాయి. ఆ సమయంలో నీవు ఆ నాలుగు వేదములను సముద్ధరణ చేసి, భవిష్యత్తులో ఆ వేదములను ఏ రూపంలో అధ్యయనం చేయాలో వెల్లడిస్తావు. నీవల్లనే వేదోద్ధరణ జరుగుతుంది". అని వ్యాసుడికి మార్గదర్శనం చేసాడు.

ఇంకా శ్రీహరి "ఎవరికి ఎటువంటి సందేహాలు కలిగినా ఆఖరుకు త్రికాల వేదులకు సందేహం వచ్చినా, వాటిని తీర్చేటువంటి "విజ్ఞానకోశం" నీనుంచే వెలువడుతుంది" అని కూడా చెప్పాడు.

వేదవ్యాసుడు పుట్టగానే పెద్దవాడయ్యాడు. తన తల్లి అయిన సత్యవతితో, "నీవు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు నాతో నీకు ఏదయినా కార్యము ఉంటే అప్పుడు కనబడుతాను, నాకు సెలవు" అని చెప్పి ఆమె అనుజ్ఞతో తపస్సుకు వెళ్ళాడు. ఆయనకు 'పారాశరుడు' అని 'సాత్యవతేయుడు' అని పేర్లు.

**కుంతికి ఓదార్పు**

పాండురాజు మరణించిన సందర్భములో కుంతీ దేవి దుఃఖపడుతోంది. ఆమెను వ్యాసుడు ఓదారుస్తూ ఒక్కమాట చెప్పాడు. "అమ్మా! కుంతీ! కాలం



యొక్క స్వరూపం తెలిసిన వాళ్ళు, ఎప్పుడూ కూడా భవిష్యత్తు కంటే గడచిన కాలమే మేలు అనుకుంటూ ఉపశమనం పొందుతారు. ఈ ఒక్క మాట వ్యాసమహర్షి గానం చేస్తుంటే గణపతి వ్రాసాడు. ఈ గ్రంథ రచనకు రెండున్నర సంవత్సరాలు పట్టగా వ్యాసుని శిష్యులు ప్రజల హృదయాలకు చేర్చటంలో కృతకృత్యులయ్యారు. గుర్తుపెట్టుకో! గడచిన కాలంలో ఉన్నటువంటి సుఖసంపదలను తలుచుకొని శాంతిని అనుభవిస్తూ, వర్తమానకాలంలో ఎటువంటి ఆశలు పెట్టుకోవద్దు" అని సలహా ఇచ్చాడు. ఈనాటికి లోకంలో ఒక సామెత వుంది. అది "గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్" అన్నారు పెద్దలు. భర్త చనిపోయి దుఃఖంలో వున్న స్త్రీని ఊరట కలిగించటం యుగ పెద్దగా వ్యాసుడు ఇచ్చిన సందేశం 'లోకంలో అందరికీ సలహా' అని భావించాలి.

వ్యాసుడు ఎటువంటి వేదసారము చెప్పలేదు. జీవితంలోని సత్యాన్ని చెప్పాడు. అందులో భవిష్యత్తు సూచన ఉంది. పాండవులు పుట్టారు. బాగున్నారు అని సంతోషిస్తే, భర్త కనుమరుగైనాడు. రాబోయేది మహాభారత యుద్ధం. గొప్ప మార్పు వస్తుంది వంశంలో. అది అందరినీ తీసుకొని వెళ్ళి సముద్రంలో కలుపుతుంది. ఎవరినీ ఉంచదు. ఆశలు కల్పించుకొని ఆశాజీవిగా బతకమని చెప్పటం తప్పు. ఎందుకంటే వివేకి అలా చెప్పడు. "ఉన్నది ఇదే యదార్థమని అనుకో. ఇంతకన్నా బాగుంటే అదృష్టవంతుడివి" అని చెప్పటమే మేలు. కఠినంగా ఉన్నప్పటికీ అదే సత్యం.

ఆ ఓదార్పు సందర్భంలో కుంతి "తనను ఏం చెయ్యమంటారని అడిగింది". అందుకు వ్యాసుడు "తపస్సు కంటే ఉత్తమకార్యం లేదు. జీవితానికి పరమార్థము ఈ కొడుకులు, ఈ సుఖమేనా! ఇంకేమయినా లేదా! అందుకని వీటిని వదలి తపస్సు చేసుకో" అని సలహా ఇచ్చాడు వ్యాసుడు.

## తపస్సు ప్రాధాన్యత

చాలా ఉత్తమ విషయమేమిటి అంటే, ఉన్నది ఉన్నట్లుగా యదార్థంగా గ్రహించి తపోబలంతో వైముఖ్యం పొందటం. ప్రపంచం వైపు చూడకుండా ధీరుడు తపస్సును ఆశ్రయిస్తాడు. తపస్సులో పెరుగుతాడు. తపస్సు లేని దుఃఖ భూయిష్ఠమైన జన్మ నశిస్తుంది. క్రమక్రమంగా అతడి తేజస్సు తగ్గిపోతుంది. ఆత్మ గౌరవం, మనోబలం నశించి ఇంకా క్షీణదశకు వెళ్ళి పోతుంది మనిషి జీవితం. తపోబలంతో మనిషి ఉన్నతుడవుతాడు. అందుకే తపస్సుకు అంత ప్రాధాన్యం!

## వ్యాసుడు పాండవులకు కొండంత అండ

పాండురాజు మరణించిన తరువాత పాండురాజు కుమారులు అయిదుగురు, తల్లి కుంతీదేవి, ధృతరాష్ట్రుడి ఆధీనంలో ఉన్నారు. ధృతరాష్ట్రుడి కుమారులు పాండునందనులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ధృతరాష్ట్రుడు రాజైనాడు. అనేక విధాలుగా పాండవులను సంహరించాలని దుర్యోధనుడు పన్నాగం పన్నాడు. ఇబ్బందులు పెట్టాడు. ఆ ఇబ్బందులు ఎదుర్కొని రక్షించుకోటానికి పాండవులకు, కుంతీదేవికి వ్యాసుడు అనేక విధాల రక్షణ మార్గాలను వివరించాడు. వ్యాసుడి సలహాతో వారు ఊరూ, వాడా తిరుగుతూ తలదాచుకుంటున్నారు.

పాండవులు, కుంతీ అందరూ ధర్మమార్గంలో నడిచేవారే. తల్లి కుంతీ సలహా సంప్రదింపులు తీసుకునేవారు. వ్యాసమహర్షి తన దివ్య దృష్టితో పాండవులకు రాబోవు కష్టాలను పసిగట్టి వారిని గట్టెంకించేవాడు. ధర్మవేదులకు ధర్మాత్ములే సలహా ఇస్తారు, కాపాడుతారు.

పంచపాండవులు, కుంతీ శాలిహోత్రముని ఆశ్రమం చేరారు. ఆ సయమంలో వారికి వ్యాసుడు కనిపించాడు. ఆయన ధర్మరాజుతో "మీరు సమస్త ధర్మములు తెలిసిన వాళ్ళు. ధర్మ మార్గంలో సంచరిస్తారని నాకు



తెలుసు. కానీ, బంధువులు మీకు కలిగించిన ఈ దుఃఖం అంతా పూర్వజన్మ కర్మ ఫలితంగానే జరుగుతోంది. అందుకు మీరు శోకించకండి. మీరు సబాంధవులై రాబోవు కాలాల్లో మీరు ఒక రోజు రాజ్యాన్ని సంపాదించు కుంటారు. ఈ శాలిహోత్రుడి ఆశ్రమం చాలా పవిత్రమైనది. ఈ ఆశ్రమంలో ప్రక్కన ఒక సరస్సు ఉంది. ఈ సరస్సులో స్నానము చేసిన తరువాత ఎవరికీ ఆకలి దప్పులు ఉండవు. ఆ ముని యొక్క మహత్తు అటువంటిది. ఈ ఆశ్రమంలో ఉండి, సరస్సులో స్నానంచేస్తూ ఆయన ఆశీర్వచనంతో ప్రశాంతంగా కొంత కాలం ఉండండి. దగ్గరలో ఏకచక్రపురం ఉంది. శాలిహోత్రుడు ఆదేశించగానే అక్కడికి వెళ్ళి బ్రాహ్మణ వేషధారులై ప్రచ్ఛన్న వేషాల్లో రహస్యంగా జీవించండి. మీరు సజీవంగా ఉన్నట్లు ధృతరాష్ట్రుడికి తెలియకుండా జీవించండి" అని వ్యాసుడు బోధించాడు.

తండ్రిలేని పిల్లలు, ధర్మవర్తనులు, తల్లి వైధవ్యం పొంది దిగులుతో ఉంది. ఇటువంటి వారికి భగవంతుడే సహకారిగా ఉండాలి. వ్యాసుడే భగవంతుడి రూపంలో వారికి సహాయం అందిస్తున్నాడు. మనకు ఒక సామెత వుంది "దిక్కు లేనివారికి దేవుడే దిక్కు" అని.

వ్యాసుడి సలహా పై వారు శాలిహోత్రుని అనుజ్ఞ, ఆశీర్వాదం తీసికొని ఏకచక్రపురం వెళ్ళారు. అచటవారు బ్రాహ్మణ వేషాలు ధరించి వారాలు చేసుకుంటూ భిక్షమెత్తుకుని తింటూ జీవిస్తున్నారు. ఆ పురంలోని వారు పంచపాండవులను చూచి బ్రాహ్మణులని భావించారు. వ్యాసుడు ఏకచక్రపురం వచ్చి పాండవులను కలసి, ద్రౌపది యొక్క వృత్తాంతమంతా చెప్పాడు. ద్రుపదుడు ఆమెకు స్వయంవరం ప్రకటించాడనీ, వారు వెళ్ళి ఆమెను వివాహం చేసుకున్న తరువాత భవిష్యత్తులో వారికి రాజయోగం ఉన్నదని అన్నాడు. వ్యాసుడు చెప్పిన విధంగా స్వయంవరానికి వెళ్ళారు. అర్జునుడు మత్స్యయంత్రం అనే ఒక పరీక్షకు నిలబడి, విజయం సాధించి ద్రౌపదిని సంపాదించాడు. ఇంటికి వచ్చిన తరువాత "అమ్మా మాకు ఒక ఫలం లభించింది" అని అర్జునుడు

అనగానే, తల్లి కుంతి అసలు విషయం తెలియక "నాయనా! అయిదుగురూ పంచుకోండి" అని అన్నది. ఆ సందర్భంలో కుంతీ పాండవులు సందేహంతో అడిగిన ప్రశ్నలకు జవాబుగా వ్యాసమహర్షి ద్రౌపది పూర్వజన్మ వృత్తాంతమంతా పూస గుచ్చినట్లు వివరించాడు. ఆమె కారణజన్మురాలనీ, పాండవులు అయిదుగురూ ఆమెను చేసుకోవచ్చునని, వారి ధర్మ సందేహం తీర్చాడు. మహాభారత కథ ఆవిధంగా కొనసాగింది. ధృతరాష్ట్రుడికి వ్యాసమహర్షి ఉపదేశం :

వ్యాసమహర్షి అనేక పర్యాయములు దుర్యోధనాదుల దుష్టబుద్ధిని నివారించటానికి ధృతరాష్ట్రుడి దగ్గరికి వచ్చి, "నీవు చేస్తున్నది, నీ కొడుకులు చేస్తున్నది అధర్మము. దీనివలన నీకు, నీ కొడుకులకు, నీ కుటుంబానికి క్షేమకరము కాదు. మీ క్షేమం, శ్రేయస్సు కోసం చెబుతున్నాను. ధర్మమార్గంలో వెళ్ళండి. పాండవులకు అపకారం చేయకండి" అని ఉపదేశం చేసాడు. వ్యాసుడు వాళ్ళు తలపెట్టిన అనేక దుష్టకార్యాలను అనేకసార్లు విరమింపచేసాడు.

**పాండునందనులకు హితబోధ**

పాండవులు అరణ్యవాసంలో ఉన్న సమయంలో రాబోవు కాలముల్లో యుద్ధం తప్పదని తెలిసిన తరువాత, తమశక్తి సామర్థ్యాలను గురించి చర్చించుకున్నారు. "కౌరవ పక్షంలో భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు ఉన్నారు. వాళ్ళను మనం జయింపగలమా? మనకు ఉన్న బలాబలాలు ఏమిటి? అని విశ్లేషించుకోవాలి. తమ వద్దకు వచ్చిన వ్యాసుడికి అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించిన తరువాత, ఆయన వారితో ఇలా అన్నాడు. "మీకు భీష్మ, ద్రోణ, కృపాచార్యులకంటే ఎక్కువ అస్త్ర సంపద ఎప్పుడూ ఉండాలి. అటువంటి అస్త్ర సంపద సంపాదించుకునే మార్గం నేను ఉపదేశిస్తాను. ఏ తపోబలం, యోగబలం ఉంటే దేవతలు ప్రత్యక్షమై తమవద్ద వున్న అస్త్రబలం మీకిస్తారో ఆ మార్గం నేను మీకు చూపిస్తాను" అని అన్నాడు.



"ప్రతి స్మృతి" అనే విద్యను అర్జునుడికి, ధర్మరాజుకి ఇచ్చాడు. దీని తపోబలంతో మీరు ఇంద్రుడిని, కుచేలుణ్ణి, యముడిని, వరుణుణ్ణి, ఆ తర్వాత క్రమంగా ఈశ్వరుణ్ణి కూడా ప్రత్యక్షం చేసుకొని వారివల్ల అస్త్రబలం సంపాదిస్తారు. ఇది మీ భవిష్యత్తుకు ప్రయోజనం చేకూరుస్తుంది. అప్పుడు మీరు యుద్ధానికి సంపూర్ణ యోగ్యత, అర్హత సాధిస్తారు. అప్పుడు మీరు భయపడనక్కరలేదు. భీష్మాదులు మీకు లెక్కలేదు. ఈ ద్వైత వనంలో ఎక్కువ సమయం ఉండకుండా వెళ్ళండి" అని చెప్పాడు.

**వ్యాసుడు పాండవులను రక్షించటం**

పాండవులు అరణ్యవాస ప్రారంభం నుంచీ వ్యాసమహర్షి వారి సలహాలు, హిత బోధలు చేస్తూ వెన్నంటి రక్షిస్తూనే ఉన్నాడు. పాండవులు ధర్మాన్ని ఆచరిస్తున్నారు. ఆ ధర్మాన్ని కాపాడటానికి వ్యాసుడి సలహాలు, సందేశాలు వారికి చక్కగా ఉపయోగపడుతున్నాయి. వ్యాసుడు చెప్పినట్లు వారు ప్రవర్తిస్తున్నారు. "ధర్మో రక్షతి రక్షితః" అనే వేదవచనం పాండవులకు వర్తిస్తుందనుటలో సందేహంలేదు. నాడు, నేడు గూడా ధర్మాన్ని ఆచరించే వారికి కష్టాలు ఉంటాయి. వాటిని అధిగమిస్తూ, సహనం, ఓర్పు, సంయమనం, సమయస్ఫూర్తి పాటిస్తే సత్ఫలితాలు వస్తాయని మహాభారతం ద్వారా తెలుసుకోవచ్చు.

పాండవులు అస్సాం సమీపాన ఉన్న తీరాన కామ్యకవనానికి వెళ్ళారు. ఒకచోట ఉండలేదు. క్షేమంకోసమని వాళ్ళను వ్యాసుడు ఒక ప్రదేశములో ఉండనివ్వలేదు. వ్యాసమహర్షి ఈ ప్రకారంగా పాండవులను అనేక విధాలుగా రక్షిస్తూ మార్గదర్శకుడిగా ఉన్నాడు.

ఒకరోజు ధృతరాష్ట్రుడు యుద్ధంవస్తే ఎవరు గెలుస్తారు అని అడిగాడు సంజయుణ్ణి. "నేను ఎట్లా చెబుతాను, నీవు వ్యాసుణ్ణి స్మరించు" అని సంజయుడు సమాధానమిచ్చాడు. వ్యాసుణ్ణి స్మరించాడు ధృతరాష్ట్రుడు. వెంటనే వ్యాసుడు

వచ్చి "పాండవులే జయిస్తారు, నీ కొడుకులు అపజయం పాలైపోతారు" అని చెప్పాడు. అయినా ధృతరాష్ట్రుడిలో ఏవిధమైన మార్పు లేదు. "నా కొడుకులను ఎలాగ కాపాడుకోవటం? నా తమ్ముడి కొడుకులకు, నా కొడుకులకు యుద్ధం జరిగినపుడు, నా తమ్ముడి కొడుకులూ క్షేమంగా ఉండాలని కోరుకుంటాను. సహజంగా దీనికి ఉపాయం చెప్పు" అని ధృతరాష్ట్రుడు వ్యాసమహర్షిని అడిగాడు. వెంటనే వ్యాసుడు ఈ విషయంలో శ్రీకృష్ణుణ్ణి ఆశ్రయించమన్నాడు. కాని ధృతరాష్ట్రుడు ఆ పని చేయలేదు. అధర్మపరులకు ఎవరు సహాయంచేస్తారు. ఇది వ్యాసుని మనోగతం అని తెలుస్తోంది.

## ఆనాటి ప్రత్యక్ష ప్రసారం (Live Telecast)

భారతయుద్ధం కురుక్షేత్రం వేదికగా జరగటానికి నిర్ణయించారు. యుద్ధం గురించి సంజయుడు రోజూ ధృతరాష్ట్రుడి దగ్గర కూర్చొని అతడికి అర్థమగు రీతిలో చెప్పగలిగే విద్య వ్యాసుడి వద్ద ఉంది. ఆ విద్యను సంజయుడికి వ్యాసుడే ఇచ్చాడు. పగలు రాత్రి పర్యంతములు, రహస్య ప్రసార సంభాషణలు, ఇతరుల మనోవృత్తిలోని భావాలు, అంటే యుద్ధరంగంలో అర్జునుడికి కృష్ణుడు ఏమి సలహాలు, సంకేతాలు ఇస్తాడో, అవి మనోగత అభిప్రాయాలు మొదలైనవి అన్నీ తెలుసుకొని చెప్పేశక్తి సంజయుడికి ఇచ్చాడు వ్యాసులవారు. అంతేగాక అతి శీఘ్రగమనము, శస్త్రాస్త్రముల వలన ఏమి బాధలు, ఇబ్బందులు లేకుండా సంజయుడికి ఇచ్చాడు. ఆ విద్యను ఉపదేశించటం వలన ధృతరాష్ట్రుడికి అంత స్పష్టంగా యుద్ధం గురించి వాఖ్యానంతో వివరించ కలిగాడు.

ఆనాటి మంత్ర విద్యలే ఈనాటి సాంకేతిక పరిజ్ఞానం అని తెలుస్తోంది. కొన్ని వేల సంవత్సరముల తర్వాత భారతీయులు దూరదర్శిని సృష్టించి సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నారు. ఈ ప్రసార విద్య ఆనాడే భారతదేశంలో పుట్టింది. దీనికి ఆద్యుడుగా వ్యాసమహర్షి, టెక్నీషియన్గా సంజయుణ్ణి చెప్పుకోవాలి. అన్ని విధాలైన శాస్త్రం విజ్ఞానం అంతా భారతదేశంలోనిదే.



## నారాయణాస్త్రం - వ్యాసుని తీర్పు

ఒకసారి కృష్ణార్జునులను ఒక్క బాణంతో నాశనం చేద్దామని అశ్వత్థామ నారాయణాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రం ఏక కాలంలో అనుసంధానం చేస్తే, కృష్ణపరమాత్మ సన్నిధికి వెళ్ళి ఆగిపోయింది. కిందపడి పోయింది. అశ్వత్థామకు అర్థం కాలేదు. నారాయణాస్త్రం వృథా అయిందేమిటని సందేహం తీర్చుకోవటం కోసం వ్యాసుడిని తలచుకొని, "నారాయణాస్త్రం కృష్ణుణ్ణి దహించకపోతే, అర్జునుణ్ణి చంపవచ్చు కదా"! అని అడిగాడు. అందుకు సమాధానంగా వ్యాసుడు, "ఇద్దరినీ కలిపి ఎప్పుడైతే ప్రయోగిస్తావో, చంపితే ఇద్దరినీ చంపాలి, లేకపోతే ఇద్దరూ రక్షింపబడాలి. అదొకటే మార్గం. వాళ్ళు వేరువేరు కాదు. నీ సంకల్పంలోనే ఉంది తెలివితక్కువతనం" అని చెప్పాడు. "మరి ఈ కృష్ణార్జునులు ఎవరు"? అని సందేహం తీర్చమని అడిగాడు అశ్వత్థామ.

ఈ విధంగా సందేహం నివృత్తి చేసాడు వ్యాసులవారు. "నారాయణుడు అనే ఋషి శివుడిని గురించి తపస్సు చేసి సకల శస్త్రాస్త్రములు నుంచి చావు, నొప్పి ఏమీ లేకుండా వరం పొందాడు. అతడే కృష్ణుడు" అని చెప్పాడు. "అతడి యొక్క మరొక అంశే అర్జునుడు. ఈయన నరుడనే ఋషి. నారాయణుడేమో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడి అంశములో ఉన్నవాడు. శివుని వరంవలన అతడికి ఏమీ జరగదు. ఎవరూ అపకారం చెయ్యలేరు" అని చెప్పాడు. "నేనూ శివారాధన చేసాను కదా!" అని అశ్వత్థామ అడిగాడు.

అశ్వత్థామ పూర్వ జన్మలో మృణ్మయలింగంతో (మట్టితో చేసిన లింగం) శివుడిని ఆరాధించాడు. తర్వాత దానిని వదలి రుద్రుణ్ణి ఆరాధించాడు. సాక్షాత్తు లింగాన్ని ఆరాధించటం వలన, కృష్ణుడి శివారాధన చాలా శ్రేష్ఠమైనది. దానిని మించిన ఆరాధన మరొకటి లేదు. కాబట్టి ఇద్దరూ ఒకే ఆరాధన చేసినప్పటికీ, వస్తువులో తేడా ఉంది.

## అర్జునుడు - శివానుగ్రహం

అర్జునుడు యుద్ధంచేస్తున్న సమయంలో ఒక మహాపురుషుడు త్రిశూలాన్ని పట్టుకొని అనేకమందిని సంహరిస్తున్నట్లు, తాను బాణాలు వేస్తుంటే ఆ త్రిశూలంతో ఆ మహాపురుషుడే చాలా మందిని సంహరిస్తున్నట్లు అర్జునుడికి ఒక దృశ్యం కనబడింది. ఆ మహా పురుషుడు ఎవరు? అని కృష్ణుణ్ణి అడిగాడు. వెంటనే కృష్ణుడు "వ్యాసుల వారిని అడిగితే ఆయన మనకు వివరిస్తాడ"ని అన్నాడు.

వెంటనే వ్యాసుల వారు యుద్ధ భూమిలో కనబడిన "ఆ మహా పురుషుడు రుద్రుడు" అని చెప్పాడు. ఆయన మహత్తు చెబుతా విను అన్నాడు వ్యాసుడు. "నీ యందు అతనికి చాలా దయ కలిగింది. నీకు పాశుపతాస్త్రం ఇవ్వటమే కాకుండా నీయందు అనుగ్రహం కలిగియున్నాడు. కాబట్టి నువ్వు ఎక్కడికి వెళ్ళినా నిన్ను రక్షిస్తూ ఉంటాడు. నీ యుద్ధం అతనే చేస్తాడు. శత్రువులను అతడే సంహరిస్తాడు" అని వ్యాసమహర్షి ఉపదేశం చేసి వెళ్ళాడు. ఈశ్వరుడిని బాగా భావనచేసి లింగ రూపంలో ధ్యానం చేస్తూవుండు. యుద్ధములో నిన్ను ఏ అస్త్రము దహించలేదు, సంహరించ లేదు" అని ధైర్యం చెప్పి సలహా ఇచ్చాడు.

## యుద్ధ పరిసమాప్తి - ధర్మా ధర్మములు

కురుక్షేత్రం సమాప్తి అయిన తరువాత ధర్మరాజు "ఇంత రక్తపాతం అయింది. వృద్ధులు, బంధువులు, పండితులు, గురువులు, మహిళలు మరణించారు. ఇలా గెలుచుకున్న రాజ్యం నాకక్కరలేదు" అన్నాడు. అప్పుడు వ్యాసమహర్షి ధర్మరాజుకు దర్శనమిచ్చి, "ఆవిధంగా ఆలోచించరాదు, ఈ వినాశనమంతా పూర్వం సంకల్పించబడినదే! విధివశాత్తు జరిగి ఉండవలసిందే! నీవు నిమిత్తమాత్రుడివి. నీవు యుద్ధం చేయకపోవటం నేరమే! అవుతుంది. యుద్ధంచేసిన తరువాత విజయం సాధించి రాజ్యం వద్దు అనటం రెండవ



నేరం. కాబట్టి నీవు ఏవిధంగానైనా రాజ్యపాలన చేయవలసిందే. రెండు అధర్మములు నీవల్ల జరగకూడదు. నీవు ధర్మవేత్తవు. క్షత్రియుడు అయినవాడు రాజ్యం తిరస్కరించటం అధర్మం అవుతుంది. నీవు క్షత్రియ ధర్మం ఆచరించాలి. ఈ అధర్మ దోషం నీకు అంటకూడదు" అని హితవు పలికాడు. అలా ధర్మాధర్మములు వివరించి చెప్పాడు. ప్రాయశ్చిత్త విశేషాలు, మరుత్తుడి చరిత్ర చెప్పాడు. ఆ తరువాత అశ్వమేథయాగం నిర్వహించమని సలహా ఇచ్చాడు. ఆ యాగాన్ని పాండవుల చేత చేయించాడు వ్యాసమహర్షి.

పుత్ర శోకంతో ధృతరాష్ట్రుడు ఎంతో ధుఃఖించాడు. అతనికి ఏదో విధంగా ఉపశమనం లేకపోతే, అతడి ఆవేదన పాండవులను ఎట్లా శపిస్తుందో అని భయపడ్డాడు. పాండవుల రక్షణ కోసమని వ్యాసమహర్షి ధృతరాష్ట్రుడి దగ్గరకు వెళ్ళి, ఆయనకు తత్త్వ బోధచేసి దుఃఖాన్ని తగ్గించాడు. అది పాండవుల క్షేమం కోసమే. ధృతరాష్ట్రుడు గుడ్డివాడైనా ఆయన బుద్ధి దుష్టబుద్ధే. ఇది గమనించిన వ్యాసుడు ధర్మవేత్తలకు అండగా వుండాలని పాండవుల శ్రేయస్సు వాంఛించాడని తెలుస్తోంది.

పాండవులను ధర్మమే కాపాడింది. ధర్మమూర్తులే వారిని రక్షించారు. ఇంకా తెలియని ధర్మ సూక్ష్మాలను తెలియజేసారు.

## వేదాలు - ప్రచారం

విష్ణు ప్రభావంతో ఆది జన్మ ఎత్తినటువంటి వ్యాసుడు బ్రహ్మ చేత మళ్ళీ నియమించబడిన వాడై, వేదములను నాలుగు భాగాలుగా విభజించి, మొదటి భాగాన్ని ఋగ్వేదం అనే పేరుతో పైలుడు అనే శిష్యుడికి అందించాడు. యజుర్వేదం అనే రెండవ భాగాన్ని వైశంపాయనుడు అనే శిష్యుడికి ఇచ్చాడు. మూడవ భాగమైన సామవేదాన్ని జైమినికి కేటాయించాడు. నాల్గవ భాగమైన అథర్వణ వేదాన్ని సుమంతుడికి అందించాడు. వాటిని ప్రచారం చేయమని ఆదేశించాడు వ్యాసుడు.

రోమహర్షణుడి కుమారుడైన సూతుడికి పురాణేతిహాసములు అన్నింటినీ ఇచ్చి, వాటిని వ్యాప్తి చేయమని చెప్పాడు. ఋగ్వేదాన్ని పైలుడి శిష్యులు అనేక వేల శాఖలుగా వ్యాప్తి చేసారు. యజుర్వేదం వైశంపాయనుడి శిష్యులతో వ్యాప్తిచెంది 27 శాఖలుగా ఉంది. యాజ్ఞవల్క్య మహర్షి శుక్ల యజుర్వేదమును సూర్యుడి నుంచి సంపాదించి శిష్యులతో వ్యాప్తి చేసాడు. జైమిని సామవేదాన్ని అనేక శాఖలుగా ప్రచారం చేసాడు. సూతుడు తన శిష్యులైనటువంటి అయతి, అగ్నివర్చుడు, మిత్రుడు, శంఖపాలుడు, కృతవ్రతుడు, సావర్ణి అనబడే ఆరుగురినీ ఆరు ద్వీపాలకు పంపించి, పురాణాదులను వ్యాప్తి చేయమని ఆదేశించాడు.

## 'సప్తద్వీపా వసుంధరా'

పురాణేతిహాసాలను భరత భూమిలోనే కాకుండా, 'సప్తద్వీపా వసుంధరా' అనబడే ఈ భూమండలమంతా కృష్ణద్వైపాయనుడి శిష్యుడైన సూతుడే వ్యాపింపచేసాడని, ఇతర ద్వీపాలకు కూడా అలా భారతీయ పురాణ సంస్కృతి గాథలు వ్యాపించాయని తెలుసుకోవచ్చు. జావా, బోర్నియా, మలేషియా, మారిషస్ మొదలైన దేశాలలో ఈ చరిత్రలు మరో పేరుతో – ఇతర నామాలతో వ్యాప్తి చెందాయి. ఇంకా రష్యా సింగపూర్, చైనా, థాయ్‌లాండ్ మొదలైన దేశాలలో కూడా పురాణేతిహాసాలను అధ్యయనం చేసి ఆచరణలోకి తీసుకొస్తున్నారు. ఇదంతా ఈ కాలంలో జరిగినట్లు చారిత్రకంగా కూడా తెలుసుకోవచ్చు. ఇలా వేదాలు పురాణాలు వ్యాసులవారు అతడి శిష్యులవల్లనే వ్యాప్తి చెందాయి.

ఈ కలియుగంలో కూడా పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు, చతుర్దశ విద్యలు, భగవద్గీత విదేశీయులు వారి భాషల్లోకి మార్చుకొని వారి దేశ ప్రజలకు జీవనయానానికి శిక్షణ ఇస్తున్నారు. భారతీయ విజ్ఞాన సంపదను వ్యాప్తి చేయటానికి వ్యాసమహర్షి మూల కారణము. మహర్షులు ఎప్పుడూ లోకకళ్యాణం, లోకక్షేమం కోసమే జీవితాలను ధారపోసారు. వారంతా చిరస్మరణీయులు, ప్రాతః స్మరణీయులు.



## జీవయాత్ర – ధర్మ సూక్ష్మాలు

వ్యాసులవారు మానవాళి జీవయాత్ర ఎలా నిర్వహించి, నడచుకోవాలో కొన్ని ధర్మ సూక్ష్మాలను, ధర్మసూత్రాలను తెలియచేసాడు. కొన్ని విషయాలు తెలుకుందాం.

"ప్రాతః కాలములో బ్రహ్మముహూర్తంలో స్నానం చేయాలి" అని చెప్పాడు. వ్యాసుడు దంతధావన అరోగ్యప్రదమైన చెట్ల పుల్లలతో పళ్ళు తోముకోమని చెప్పాడు. సూర్యోపస్థాన సంధ్యా వందనము నిత్యమూ చేసి తీరాలని చెప్పాడు. సంధ్యావందనం చేయనిదే పూజ, వ్రత, దాన విధానములు అన్నీ నిష్ప్రయోజనములు.

నిత్య కర్మ విధానము, దేవయజ్ఞ, పితృయజ్ఞ మొదలైన పంచయజ్ఞాలు చెయ్యమన్నాడు వ్యాసుడు. జపము, జపమాల విధి, తీర్థస్నానవిధి, అఘమర్షణ మంత్రం, ఆ ప్రభావం, శివపూజా విధానము, శివపూజ యొక్క మహత్తు, అన్నీ వివరంగా చెప్పాడు. ఇంకా వైశ్వదేవ కర్మ, భూత బలి, అతిథి పూజ, అన్ని ఆశ్రమములోని అన్ని వర్ణముల వారికి కూడా భగవధ్యానం, భక్తి, పవిత్ర జీవన విధానం గురించి చెప్పాడు. ఇవన్నీ కూడా 'వ్యాస సంహిత' లోనివి.

వ్యాస స్మృతి అని మరొక గ్రంథము కూడా వుంది. అందులో సంస్కారములను వివరించారు వ్యాసులవారు. వివాహ విధి, స్త్రీల ధర్మము, స్త్రీల నిత్యకర్మ కూడా అయన వివరించాడు.

యద్దదాతి యదశ్నాతి, తదేవ ధనినాం ధనమ్ ।
అన్యే మృతస్యైః క్రోడంతి దారైరపి ధనైరపి ॥

వంటివి 'వ్యాస స్మృతి'లోని శ్లోక రత్నాలకు మచ్చుతునకలు. 'ధనం' రెండు రకాలుగా ఉన్నాయి. నీవు అనుభవించింది, దానం చేసింది. ఈ రెండు కాకపోతే, మూడోది ఒకటి అది వినాశనం. అది నశిస్తుంది. భోగం, దానం, నాశనం అనే మూడే విధానాలు ధనానికి. ఎంత అనుభవిస్తే అంత తరిగి పోతుంది. ఇవాళ అన్నం తిన్నాం అదే మన ధనం. ఎవరికైనా ఇచ్చిందే మనధనం. అదే మనం నిజానికి దాచుకున్న ధనం. దాచుకున్నది మాత్రం నశించవచ్చు. అంతే కాదు, ధనం నశ్వరం, దారా ధనములన్నీ శాశ్వతము కాదు. అలాంటి శ్లోకాలు ఎన్నో 'వ్యాసస్మృతి'లో వున్నాయి.

ఇవి వ్యాసులవారు లోకానికి అందించిన సంత్సందేశాలు. మహాభారతం ద్వారా పాండవులకు ధృతరాష్ట్రుడికి ఉపదేశించిన ధర్మాలు, ఆచరించకూడని అధర్మాలు చెప్పారు. అవన్నీ వారికే కాదు. రాబోయే కలియుగంలో ప్రజలు ఎలా ప్రవర్తించాలో ఆయన మహాభారత రచన ద్వారా తేటతెల్లం చేసాడు. అందుకే మహాభారతం 'పంచమ వేదము' అని ఖ్యాతి చెందింది. వ్యాస భగవానుడు కారణజన్ముడు. పరమేశ్వర స్వరూపుడు. ఆ మహర్షిని ఎంత స్తుతించినా తనివితీరదు.

జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ అవతార విశేషాలను, గురు స్వరూప మహత్యాన్ని లోకానికి తేటతెల్లం చేసిన శ్రీ వ్యాసమహర్షి పవిత్ర జన్మదినాన్ని 5 వేల సంవత్సరముల నుంచీ "గురు పౌర్ణమి"గా ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నాము.

భారతచరిత్ర, వేద, ఇతిహాస, పురాణాలు, వ్రత, పూజాది సర్వ సంప్రదాయాలు, ధర్మ నిర్ణయాలు మానవాళికి వ్యాసమహర్షి ప్రసాదమే.

ఓం శాంతిః శాంతిః శాంతిః

* * *

## 9. అగస్త్య మహర్షి

అగస్త్యుడు సూర్యవంశమున జన్మించినవాడు. ఈయన వంశ వృక్షం విష్ణు–బ్రహ్మ– మరీచి – కశ్యప–సూర్య–అగస్త్య. అగస్త్యుడు తన ఇంద్రియాలను జయించి, ఆహారాన్ని త్యజించి, యోగబలంతోటే పెరగటం మొదలు పెట్టాడు. అతడు బ్రహ్మచారి. అరణ్యంలో తిరుగుతూ ఉండేవాడు. అలా అరణ్యంలో తిరుగుతున్నప్పుడు ఒక మహావృక్షాన్ని చూచాడు. ఆ వృక్షానికి ఉన్న కొమ్మలు నాలుగు దిక్కులా వ్రేలాడుతూ చాలా దూరం వరకు వ్యాపించివున్నాయి. కొందరు ఋషులు కాళ్ళతో కొమ్మలను పట్టుకొని తలక్రిందులుగా వ్రేలాడుతున్నారు. అగస్త్య మహర్షి అక్కడికి వెళ్ళి – "మహాత్ములారా! ఏమిటి మీకీ దురవస్థ, మీరు మీ కాళ్లమీద నిలబడలేరా? ఎందుకు ఆవిధంగా వ్రేలాడుతున్నారు? మీకు ఏదయినా శాపమా? ఎందుకు" అని అడిగాడు.

వెంటనే ఆ ఋషులు, "నాయనా! పితృ లోకంలో ఉండే పితృదేవతలము మేము. పితృదేవతలకు ఆరాధన తగ్గిపోవటం చేత, ఇక్కడ భూలోకంలో సంతానాభివృద్ధి లేకపోవటం చేత, మాకు నీళ్ళు వదలి పెట్టే వాళ్ళు లేక పితృలోకాల నుంచి భూలోకానికి వచ్చి అధోగతి పాలై ఇలా ఉన్నాము. ఎవరైనా ఒక మహాత్ముడు మమ్మల్ని తండ్రులుగా భావించి, వివాహితుడై, సంతానవంతుడై, మాకు తర్పణమిచ్చిన నాడు మాకు ఊర్ధ్వ లోకాలు లభిస్తాయి. ఆవిధంగా ఎవరో సామాన్య మానవుడు చేస్తే సరిపోదు. నీ వంటి మహాత్ముడు నిర్వహించాలి. కాబట్టి కారణ జన్ముడవైన నిన్ను మేము ప్రార్థిస్తున్నాము. నీవు ఈ కార్యము నిర్వహించాలి. నీవు జన్మిస్తున్నావని తెలియగానే మాకు ఆశ అంకురించింది. మా పితృలోకాలకు మేము వెళ్ళగలుగుతామని అనిపించింది" అని అన్నారు.

### పితృలోకం – తర్పణాలు

పితృ లోకాలలో ఎప్పుడూ అయిదుగురు దేవతలు శాశ్వతంగా ఉంటారు. ఇక్కడ మరణించిన జీవులు ఆ పితృలోకాలకు వెళుతారు. అక్కడ వీరు వారి

సంరక్షణలో ఉంటారు. ముందుగా ఆ దేవతలకు నమస్కరించి, తర్పణం ఇచ్చి, తరువాత మనం ఇక్కడ నుంచి వెళ్ళిన మన తాతలకు ఇస్తాము. పితృ, పితామహ, ప్రపితామహులకు తర్పణాలు ఇవ్వాలి. తండ్రిలేని వారే ఈ పితృ తర్పణాలకు అర్హులు.

వాళ్ళు ఇంకా ఇలా అన్నారు. భూ స్పర్శ లేకుండా ఇక్కడ ఉన్నాము మేము. నిన్ను వెతుక్కుంటూ ఎక్కడికి రావాలి? నువ్వు ఎప్పుడు వస్తావా? అని ఎదురు చూస్తున్నాము. నువ్వు బ్రహ్మచర్య దీక్షలో ఉన్నావు. అలా కాకుండా నువ్వు వివాహం చేసుకోవాలి. సంతానాన్ని కనాలి. అప్పుడు మమ్మల్ని రక్షించమని కోరుతున్నాము.

కొద్ది సంవత్సరముల తరువాత విదర్భరాజు కూతురు లోపాముద్రతో అగస్త్యుడికి వివాహం జరిగింది. వివాహం అయిన తరువాత ఆమెకు ఆశ్రమ జీవితం అలవాటు చేసాడు. ఆమెకు తన దర్భలకట్ట చేతికిచ్చాడు. "ఇదే నాకు నీవు చేసే సేవ. నాతో రా!" అని గంగానదీ తీరంలో ఆశ్రమం నిర్మించుకొన్నారు. అక్కడ ఆశ్రమ జీవితం చక్కగా గడుస్తోంది. అప్పుడు ఆయనకు పితృదేవతలకు తను చేసిన వాగ్దానం గుర్తుకువచ్చింది. ఆశ్రమంలో కొంతకాలం గృహస్థ జీవితం గడిపిన తరువాత అగస్త్యుడు, లోపాముద్రలకు ఒక కొడుకు జన్మించాడు. అతనికి "తేజస్వి" అని నామకరణం చేసారు.

## బ్రహ్మ దర్శనం - ప్రశంసలు

అగస్త్య మహర్షి నిర్వహించిన సత్కార్యాలకు బ్రహ్మమెచ్చి ఆయనను దర్శించటానికి ఆశ్రమానికి వచ్చాడు. వేలాది సంవత్సరములు తపస్సు చేసినా బ్రహ్మ దర్శనం లభించదు. పిలవకుండా, అడగకుండా, తపస్సు చేయకుండా బ్రహ్మ తానే వచ్చాడు. అగస్త్యుడు ఆశ్చర్యపడ్డాడు. బ్రహ్మ అగస్త్యుడితో "మహర్షీ నిన్ను చూడాలని అనిపించింది. అందుకే వచ్చాను" అన్నాడట. "అలభ్యం అంటే అదే, అనేకవేల సంవత్సరాలు తపస్సు చేస్తేకానీ దొరకని నీ దర్శనం



నాకు అలభ్యంగా దొరికింది. నా అదృష్టం. ఊరకే రావు కదా! నా మీద కరుణతో ఏమి ఆదేశిస్తారు" అని అడిగాడు అగస్త్యుడు.

"ఓ మహనీయా! తపోనిధీ! నీ వంటి ఉత్తమ మహర్షుల వలననే విశ్వం సక్రమంగా నడుస్తున్నది. మానవాళిలో సామాన్య ప్రజలు లక్షలకొద్దీ నేరాలు, అధర్మాలు - వాటినన్నిటినీ ఆహారంగా తీసుకొని, జీర్ణించుకొంటున్నారు. చక్కగా ఈ విశ్వాన్ని ధర్మబద్ధంగా నడిపించేటటువంటి వాళ్ళు మహర్షులే. మీ తపస్సులు లోకాలను కాపాడుతున్నాయి. నిరంతరమూ మహర్షులే మానవజాతికి ప్రాతః స్మరణీయులు, వందనీయులు. ఈ మాటలు చెప్పాలని వచ్చాను" అని బ్రహ్మ అన్నాడు. బ్రహ్మ అంతటి వాడు మెచ్చుకున్నాడు అంటే అగస్త్యుడి ప్రాముఖ్యత ఎంతటిదో తెలుస్తోంది.

## కావేరి నదీ పుట్టుక

కవేరముని వృత్తాంతాన్ని బ్రహ్మ అగస్త్యుడికి ఈ విధంగా వివరించాడు. "దక్షిణ దేశంలో కవేరుడు అనే ముని ఉండేవాడు ఆయన శివుడి గురించి తపస్సు చేసాడు. చాలా కాలానికి శివుడు ప్రత్యక్షమై "నీకు ఏం కావాలి" అని అడిగాడు. తన కుమార్తెని ఇమ్మని అడిగాడు కవేరుడు. "అది నేను నీకు ఇవ్వకూడదు, బ్రహ్మను గురించి తపస్సు చేయాలి. ఆయన ద్వారా అజ్ఞానము నశించి నీకు ముక్తి లభిస్తుంది" అని అదృశ్యమైనాడు శివుడు.

శివుడు అలా అనటానికి కారణం బ్రహ్మ చెప్పాడు. "పూర్వ జన్మల నుంచీ నీకు సిద్ధింపని కోరికలు కొన్ని నీకు ఉన్నాయి. లోకంలో అన్నిటినీ నడిపించే వాడిని నేను కాబట్టి ఆపని నాకిచ్చాడు శివుడు. నీకు కొంత కార్యక్రమం మిగిలి ఉంది. నువ్వు గృహస్థ ధర్మంలో ఉండాలి. నీ గర్భవాసంలో కారణజన్మురాలయిన ఒక కుమార్తె జన్మించిన తరువాత నీకు అవరోధాలు ఉండవు. అప్పుడు ముక్తికి మార్గం దొరుకుతుంది. ఆ కారణ జన్మురాలు సామాన్యురాలు కాదు. నీకు జన్మించ బోయే కూతురు నా కుమార్తెగా లోకంలో

భావించబడే విష్ణుమాయలో నుండి పుడుతుంది" అని బ్రహ్మదేవుడు కవేరుడితో చెప్పాడు.

కొంత కాలానికి బ్రహ్మ ఆదేశంతో గృహస్థ ధర్మంలోకి ప్రవేశించాడు. ఆయనకు ఒక కుమార్తె పుట్టింది. ఇక తపస్సు చాలించి ముక్తి కోసం ఎదురు చూస్తున్నాడు. కవేరుడి ముక్తి కోసం ఆయనకు కుమార్తెగా జన్మించిన విష్ణుమాయ తపస్సు చేస్తోంది.

బ్రహ్మ పై విషయాలన్నీ అగస్త్యుడికి చెబుతూ, "నీ భార్య లోపాముద్ర ఆ విష్ణుమాయలోని ఒక అంశమే. మరొక అంశ కవేరముని కూతురుగా జన్మించింది. అందువలన నీవు లోపాముద్రతో పాటు ఆమెను రెండవ భార్యగా స్వీకరించు" అని ఆజ్ఞాపించాడు. బ్రహ్మ ఆదేశానుసారం అగస్త్యుడు కవేరముని కూతురిని, లోపాముద్రతోబాటు రెండవ భార్యగా స్వీకరించాడు. అందుకోసమే అగస్త్యుడు దక్షిణ దేశానికి వచ్చాడు. కవేరముని కుమార్తె కాబట్టి ఆమెకు "కావేరి" అని పేరు ప్రసిద్ధి గాంచింది.

వివాహానికి ముందు ఆమె అగస్త్యుడితో "నేను నిన్ను వివాహం చేసుకోటానికి సిద్ధమే. నేను నా తండ్రి ముక్తికోసం తపస్సు చేసాను. ఆ తపస్సు ఫలించింది. విష్ణువు ఆజ్ఞ చేత నేను ఈ శరీరం వదిలిపెట్టి నది రూపంలో శాశ్వతంగా ఇక్కడే ఉండాలి. నది రూపంగా మారటానికి నేను సిద్ధమే. కాబట్టి నన్ను వివాహం చేసుకొని మీరు ఏమి సుఖపడతారు" అని అన్నదట కావేరి.

వెంటనే అగస్త్యుడు ఆమెతో "నదివైనా సరే నాకు పత్నిగా ఉండు. అలా చేయమని బ్రహ్మ నన్ను అడిగాడు" అన్నాడు. "భార్యగా శరీరంతో మిమ్మల్ని పొందటము, తరువాత నదిగా మారటము ఎందుకు? ఇప్పుడే నేను మీ కమండలములో ప్రవేశిస్తాను. జలస్వరూపంలో నన్ను మీరు మీ కమండలములో తీసుకువెళ్ళండి. నేను మీకు మరో పత్నిగా ఉంటాను."



అని కావేరి ఆయన కమండలంలో ప్రవేశించింది. అయితే ఈ కథ అంతా ఉత్తర భారతంలో జరిగింది. తరువాత అగస్త్య మహర్షి దక్షిణ భారతదేశం రావటం జరిగింది. ఆ తరువాత ఆ కమండలంలోని ఉదకం ఈవిధంగా దక్షిణదేశం ద్వారా ప్రవహించటం వలన "కావేరి" అయింది.

అగస్త్య మహర్షి వింధ్య పర్వతాలు దాటిన తరువాత ఆ ఉదకాన్ని వదిలిపెడితే, ఇక్కడ నదిలా ఆవిర్భవించింది. కవేరుడు వచ్చి దక్షిణ దేశంలో ఉన్న ఆ నదిలో స్నానం చేసాడు. కావేరి ఆయనకు కుమార్తెయే కదా! ఆవిడ కారణంగా తనకు ముక్తి కావాలని కోరి ఉన్నాడు. అది ఈశ్వరాజ్ఞ! ఇక్కడికి రాగానే ఆయనకు దేహాత్మ భావనలేదు. దేహాన్ని విసర్జించాడు. ముక్తిపొందాడు. ఎక్కడో ఉత్తరదేశం వ్యక్తి దక్షిణదేశం వచ్చి నదిలో మునిగి ముక్తి పొందాడు.

కావేరి నది దక్షిణదేశంలో ప్రవేశించటానికి అగస్త్య మహర్షే కారణం. ఆ కావేరి నది తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని పంట పొలాలకు నీరు అందిస్తోంది. మానవాళికి వివిధ ధాన్యాలను పండించటానికి కారణమైంది గదా! ఇది లోకోపకారం. మహర్షులు, బ్రహ్మ ఏ కార్యము నిర్వహించిన ముందు చూపుతోనే చేస్తారు.

## కాలకేయుల సంహారం - జీవకోటి రక్షణ

దేవతలు అగస్త్య మహర్షితో "జీవకోటి మీ రక్షణలో ఉంది" అని మెచ్చుకున్నారు. ఏ సందర్భములో, ఏ సమయములో అగస్త్యుడు సాధించాడు. అగస్త్య మహర్షి తపఃశక్తి ఎంతటిదో తెలుసుకుందాం.

వృత్రాసురుణ్ణి సంహరించిన తరువాత కాలకేయులు, ఇతర రాక్షసులను గూడా సంహరించటానికి ఇంద్రుడు ఉపాయాలు వ్యూహాలు ఆలోచిస్తున్నాడు. కాలకేయులు, రాక్షసులు చేస్తున్న పాపమే, లోకానికి చేసే అపకారములు చాలా తారా స్థాయికి చేరింది. అది ఏమిటంటే ఆ రాక్షసులు వసిష్టుని ఆశ్రమానికి వచ్చి అక్కడ తపస్సు చేసుకుంటున్న 197 మంది శిష్యులను

చంపారు. చ్యవన మహర్షి ఆశ్రమానికి వెళ్ళి 100 మందిని సంహరించారు. భరద్వాజ ఆశ్రమానికి వెళ్ళి 20 మంది ప్రియశిష్యులను మట్టుపెట్టారట. అంతమందిని చంపుట వలన మహర్షులు తీవ్ర చర్య తీసుకున్నారు. ధర్మవేత్తలు, వేద వేదాంగములు, సకల శాస్త్రములు అధ్యయనం చేసే శిష్యులను సంహరిస్తే ఎవరికి మాత్రం బాధ కలుగదు. అంత అపకారం చేస్తే గాని మహర్షులకు క్రోధం రాదు.

దేవతలు అందరూ వెళ్ళి ఇంద్రుడితో విన్నవించుకున్నారు. బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. బ్రహ్మ ఏమో విష్ణువు దగ్గరకు వెళ్ళమన్నాడు. మళ్ళీ దేవతలందరూ వెళ్ళి విష్ణువును ప్రార్థించారు. ఆయన "అగస్త్య మహర్షి ఉన్నాడు గదా! ఆయనను అడగండి. ఆయన తపఃశక్తి అమోఘము. సముద్రంలో దాగివున్న రాక్షసులను సంహరించగలడు. సముద్ర జలాలను ఇంకింపిచేసి వాళ్ళను బయట పెట్టగలడు. ఆ సముద్ర జలాలలో వున్న జీవకోటిని చావకుండా ఆయనే కాపాడగలడు. ఆయన రాక్షసులను సంహరించగలడు. జీవకోటిని రక్షించగలడు. అంత మహత్తు కలిగినవాడాయన". అన్నాడు విష్ణువు. ఆవిధంగా విష్ణువు సలహా ప్రకారం దేవతలు వెళ్ళి అగస్త్య మహర్షిని ప్రార్థించారు. ఇంద్రుడు వెళ్ళి అడిగాడు.

అగస్త్యుడు వాళ్ళకు సేవచేసే లక్ష్యంతో సముద్రజలం మొత్తాన్ని అరచేతిలోకి తీసుకొని ఆపోశన చేసుకున్నాడు. ఆయన చేతిలోకి సముద్రజలం మొత్తం మూడు చుక్కలుగా వచ్చింది. జీవకోటి అంతా అలాగే ఉండిపోయింది. కాలకేయులు బయటకు వచ్చారు. ఇంద్రుడు వాళ్ళను సంహరించాడు. అప్పుడు మళ్ళీ జలాన్ని సముద్రంలోకి వదిలాడు. ముల్లోకాలలో మానవులు అందరూ చాలా ఆశ్చర్యపోయారు. దేవతలు సంతోషంలో మునిగిపోయారు. ఈ విచిత్రం ఇదివరకెప్పుడు జరగలేదు. ఎవరూ చేయలేరూ. పురాణాలలో ఈవిషయం గురించి తేడాలున్నా, కథ సారాంశం ఒకటే. మానవాళిని రక్షించిన మహర్షి అగస్త్యుడు.



సముద్రాన్ని ఇంకింపచేసి విష్ణువు కాలకేయులను రాక్షసులను చంపగానే, మళ్ళీ దేవతలు అగస్త్యుడి దగ్గిరకు వెళ్ళి, "జీవకోటి మీ రక్షణలో ప్రాణంతో ఉంది. జలాన్ని వదిలి పెట్ట"మని అడిగారు. "ఆ సముద్రాన్ని ఆపోశనం చేసాను. సముద్రాన్ని వదిలిపెట్టమని మీరు నాకుచెప్పారు. అది జీర్ణమైంది. దాన్ని మళ్ళీ మీ కోసం వదలిపెడతాను" అని చెప్పి వదిలిపెట్టాడట ఆ నీటిని. "నేను జీర్ణం చేసుకొన్న పవిత్రమైన జలం అపవిత్రమైంది. అపవిత్రమైన జలం సముద్రంలోకి వదిలాను. కాబట్టి నిరంతరమూ సముద్ర స్నానం చేయకండి. పర్వదినాలలో, పుణ్య తిథులలో మాత్రమే స్నానం చేయండి. ఆ పుణ్య తిథుల ప్రభావంచేత దాంట్లో వున్న అపవిత్రత తొలగిపోతుంది. ఆనాడు మాత్రమే స్నానం చేయాలి" అని నిర్ణయం చేసాడు అగస్త్యుడు. మహర్షి నిర్ణయమే నేటికీ మానవాళి ఆచరిస్తున్నారు. ఆయా పర్వదినాలల్లో మకర సంక్రమణ దినాలల్లో చంద్రగ్రహణం, సూర్యగ్రహణం సంభవించిన రోజుల్లో మాత్రమే స్నానాదులు ఆచరిస్తున్నారు కదా! సముద్రస్నానం నిత్యం ఎవరూ చేయరు.

### దానధర్మాలు - అగస్త్యుడి సందేశం

రావణ సంహారానంతరం పుష్పక విమానంలో అయోధ్యకు తిరిగి వెళుతూ, శ్రీరాముడు అగస్త మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆయనకు నమస్కరించి, కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. యుద్ధంలో విజయం సాధించిన రాముణ్ణి ఆశీర్వదించి ఒక విచిత్రమైన ఆభరణం బహుమతిగా ఇచ్చాడు అగస్త్యుడు. ఆభరణం గొప్పగా ప్రకాశిస్తున్నది. రాముడు ధర్మ సూక్ష్మం తెలిసినవాడు. ఆయనకు ధర్మం ప్రధానం కదా! అందుకని అగస్త్య మహర్షితో "అయ్యా! నేను క్షత్రియుణ్ణి దానం పుచ్చుకోగూడదు. బ్రాహ్మణుడు దానం పుచ్చుకోవచ్చు. అలా చేస్తే క్షత్రియుడి క్షాత్రానికే తప్పు. అది అధర్మం. బ్రాహ్మణుడు దానం పుచ్చుకోవచ్చు. ధర్మం అలా ఉంది కదా! అన్నాడు. వెంటనే అగస్త్యుడు "రామా! దీనిని క్షత్రియుడు స్వీకరించవచ్చు. ఎందువల్ల

అంటే క్షత్రియుడు లోకాన్ని పాలించే ప్రభువు. సమర్పించవచ్చు. అది దానం కాదు. సమర్పణం. తేడా ఉంది కదా! దేశాన్ని పాలించే ప్రభువుకు ప్రజలు ఎవరైనా ఏదైనా సమర్పించవచ్చు. ప్రభువులు స్వీకరించటము ధర్మమే కదా! అయితే బ్రాహ్మణుడు దానం తీసుకొని ఆశీర్వదిస్తాడు. చెయ్యిచాపి అడుగుతాడు, తీసుకుంటాడు. దానం స్వీకరించేటప్పుడు బ్రాహ్మణుడి చెయ్యి క్రింద వుండాలి. ఇచ్చే వాని చెయ్యి పైన ఉంటుంది. కాని రాజు స్వీకరించేటప్పుడు ఇచ్చేవాడి చెయ్యి క్రింది ఉంచి అందిస్తే, రాజు చెయ్యిపైన ఉంచి స్వీకరిస్తాడు క్షత్రియుడు కాబట్టి. అలా తేడా వుంది. నువ్వు ఈ దేశాన్ని పాలించే ప్రభువు. కాబట్టి క్షత్రియుడివి అయినా నా దగ్గర తీసుకోవల్సిందే! ఇస్తున్నాను తీసుకో" అన్నాడు అగస్త్య మహర్షి.

**శాంతమూర్తి అగస్త్య మహర్షి**

అగస్త్య మహర్షి మహిమ వివరించే కథ ఇంకొకటి ఉంది. ఆయన ఎంత శాంతమూర్తి తెలుసుకుందాం!

ఆయన పన్నెండు సంవత్సరములు యజ్ఞం నిర్వహించాడు. ఆ సమయంలో అనేకమంది మహర్షులు, మునులు సమస్త వేదములతో యజ్ఞాన్ని నిర్విఘ్నంగా, వైభవంగా నిర్వహించారు. అయితే ఏ కారణంచేతనో ఆ పన్నెండు సంవత్సరాల కాలంలో, ఇంద్రుడు మాత్రం వర్షం కురిపించలేదు. యజ్ఞం జరుగుతుండగా లోకోపద్రవంగా తుఫాను రాకూడదు. వర్షం మాత్రం పడాలి. అది కూడా ప్రసన్నంగా, నాజూకుగా, వర్షం పడటం యజ్ఞానికి శుభసూచన. యజ్ఞాన్ని, పాకలను, లేచిపోయేటటువంటి వర్షం కురవటం శుభం కాదు. సాత్వికంగా ఉండాలి వర్షం.

ఆ యజ్ఞ నిర్వహణ కాలంలో వర్షం లేక ఆ చుట్టు పక్కల ఓషధులు, వనస్పతులు, అన్నీ ఎండిపోయాయి. ఓషధులు లేకపోతే అన్నదానం చెయ్యటం సాధ్యంకాదు. యజ్ఞానికి వచ్చిన వారందరూ భోజనం చేసి వెళ్ళడం ముఖ్యం.



యజ్ఞంలో మంత్ర స్వాహాకారం ఎంత ముఖ్యమో! అందరికీ భోజనం పెట్టటం అంత ముఖ్యం. అలా జరగకపోతే యజ్ఞం నిష్ఫలమౌతుంది. అందరినీ ఆహ్వానించి అన్నం పెట్టకపోతే యజ్ఞం చేసే యజమానికి బాధ్యత ఉంటుంది. అక్కడ ఎవరికి వివక్షత ఉండకూడదు. ఎవరు వచ్చి ఏమి అడిగినా కూడా అందరినీ యజ్ఞ పురుషుడితో సమానంగా గౌరవించి, భోజనం పెట్టడం సంప్రదాయం, సంస్కారం.

పన్నెండు సంవత్సరములు వర్షమే లేకపోతే అగస్త్య మహర్షి అన్నం ఎక్కడ నుంచి తెస్తాడు. ఎక్కడ పెడతాడు. పంటలు ఎలా పండుతాయి. ఇక మనకు గ్రాసం దొరికే అవకాశం లేదని అందరూ సంశయించడం మొదలు పెట్టారు. "రేపు సాయంకాలం లోపల వర్షం రాకపోతే నేను స్వయంగా వెళ్ళి, నా తపోశక్తితో ఇంద్ర పదవిని అధిష్టించి, ఆయన అధికారాలు నేను హస్తగతం చేసుకొని, భూలోకానికి మంచి వర్షాన్ని ఇస్తాను. రేపు సాయంకాలం దాకా గడువు ఇస్తున్నాను" అని అన్నాడు అగస్త్యుడు.

ఋత్విక్కులను, యజ్ఞం నిర్వహించే వాళ్ళను సేవించవలసిన ధర్మం యజమానికి ఉంది. వాళ్ళు భోజనాదులు ఎలా కావాలో ఆవిధంగా మర్యాద పాటించవలసిన బాధ్యత అతడికి ఉంది. అలాంటిది, యజమాని వాళ్ళకు అన్నం పెట్టకపోవటం, వాళ్ళు అన్నం కోసం అవస్థలు పడటం యజ్ఞానికి చాలా అవమానకరం గాదా! అగస్త్యుడికి కోపం వస్తుందేమోనని భయంవేసి, ఇంద్రుడు బృహస్పతితో సహా వచ్చి ఆయన పాదాల మీదపడి "మహర్షీ! నావలన అపరాధం జరిగింది. మీ శక్తి ఎటువంటిదో చూద్దామనే చాపల్యంచేత ఇటువంటి వంకరపని చేసాను. మీ ఋత్విక్కులకు, ప్రజలకు అందరికీ సుభిక్షంగా కావలసినవన్నీ సమగ్రంగా నేను ఇస్తాను" అన్నాడు. వెంటనే మంచి వర్షం ఇచ్చి, సద్యః ఫలాన్ని అప్పటికప్పుడు మొలిచే ధాన్యమైన శక్తివంతములైన బీజములను ఇంద్రుడు సృష్టించి, అన్నం అందించాడట ఆయనకు భయపడి. అగస్త్య మహర్షి ఏమీ కోపం లేకుండ, ఇంద్రుణ్ణి సన్మానించి

"నీకు స్వాహాకారాలు ఇచ్చి నేను యజ్ఞం చేయాలి కదా! సాక్షాత్తు నీవే వస్తే నేనేమి అనగలను. నీ అపరాధాన్ని లెక్క చేయను" అని చెప్పి, ఇంద్రుడిని, వరుణిడిని, బృహస్పతిని సన్మానించి సాగనంపాడు. అంతటి శాంత మూర్తి అగస్త్య మహర్షి.

అగస్త్య మహర్షి తపః శక్తికి ఇంద్రుడు భయపడి తానే స్వయంగా వచ్చి యజ్ఞ నిర్వహణ, అన్నం పెట్టడం సత్ఫలితాలను ఇచ్చింది. అగస్త్యుడు తన స్వార్థం కోసం యజ్ఞం చేయలేదు. మానవాళి శ్రేయస్సు కోసం యజ్ఞ నిర్వహించాడు. మహర్షుల విశాల దృక్పథం అర్థం చేసుకోవాలి.

## దక్షిణ – ఉత్తరదేశ సంబంధాలు

దక్షిణ దేశం – ఉత్తర దేశం మధ్యన అడ్డు తొలగించి రెండు ప్రాంతాల ప్రజల మధ్య సత్సంబంధాలకు అంకురార్పణ చేసిన ఖ్యాతి అగస్త్య మహర్షికి దక్కుతుంది. అది ఏమిటో, ఎలా జరిగిందో తెలుసుకుందాం.

పూర్వం వింధ్య పర్వతం విపరీతంగా పెరిగిపోవటం ప్రారంభమయింది. నేటికీ హిమాలయాలు పెరిగిపోతున్నాయని ఆధునిక శాస్త్ర పరిశోధకులు చెబుతున్నారు. దానికి భౌగోళిక కారణాలు ఉన్నాయి. వింధ్య పెరగటం విషయంలో ఒక చమత్కారమైన కథ ఉంది. సూర్యభగవానుడు ఒకసారి మేరు పర్వతం చుట్టూ తిరుగుతూంటే, నా చుట్టూ ఎందుకు తిరగటంలేదని వింధ్య పర్వతానికి కోపం వచ్చిందట. ఇది ప్రతీకాత్మకమైన వర్ణనగా మనం అర్థం చేసుకోవాలి. అలా వింధ్య పర్వతం పెరుగుతూంటే, దేవతలందరూ అగస్త్యుడి వద్దకు వెళ్ళి తమను కాపాడమని ప్రార్థించి, ఆయనతో, "భారతదేశంలో దక్షిణాపథానికి, ఉత్తర దేశానికి సంబంధాలు లేకుండా గోడలాగా వింధ్య పర్వతం పెరుగుతోంది" అని మొరపెట్టుకున్నారు. వాళ్ళు వింధ్య పర్వతం చరిత్ర ఆయనకు వివరించారు. "భూమి చాలా భయంకరమైన స్థితిలో ఉంది. జీవకోటి బ్రతికే ఆస్కారం కనబడుటలేదు. వింధ్య పర్వతం



పెరిగి కష్టాలు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. జీవకోటికి ఏదో భయంకరమైన ఒక పెద్ద ఆపద రాబోతున్నది. దానిని అడ్డగించి భూమిని క్షేమకరం చెయ్యవలసింది" అని ఆయనను అడిగారు వాళ్ళు. అప్పుడు అగస్త్యుడు ఆ పర్వతం దాటి దక్షిణానికి ప్రయాణిస్తూ వింధ్య పర్వతాన్ని "నేను మళ్ళీ వెనుకకు తిరిగి వచ్చేవరకు నువ్వు పెరగకుండా ఇలాగే ఉండు" అని ఆదేశించాడట. ఆయన మళ్ళీ ఉత్తరదేశానికి రాలేదు. దక్షిణ ప్రాంతంలోనే స్థిరంగా ఉన్నాడు. లంక దేశానికి వెళ్ళి అక్కడే స్థిర నివాసము ఏర్పరచుకున్నాడని అంటారు. దాంతో అది పెరగటం మానివేసింది. ఇది ఆయన మహిమకు నిదర్శనము.

## కొల్హాపుర అమ్మవారి దర్శనం – అగస్త్యుడి స్తోత్రం

అగస్త్యుడు దక్షిణ దేశంలో ప్రయాణిస్తూ కొల్హాపుర అనే మహాలక్ష్మీ క్షేత్రాన్ని దర్శనం చేసాడు. అష్టాదశ పీఠాలలో ఈ క్షేత్రం ప్రసిద్ధి చెందింది. ఆయన మహాలక్ష్మి అమ్మవారిని దర్శించి స్తోత్రం చేసాడట. ఆయన అమ్మవారిని స్తోత్రం చేసిన అర్థం ఈ విధంగా వున్నది.

"అమ్మా! నీవు చంద్రునిలో ఉండే వెన్నెలవు, సూర్యునిలో ఉండే తీక్షణమయిన ప్రకాశానివి. ఆ చల్లదనం, వేడి రెండూ నీవే! అగ్నిలో దహించే శక్తివి. మరి శరీరంలో వైశ్వానర అగ్నిగా ఆహారం పచనం చేసే శక్తివి (అది దహించే అగ్ని, ఇది ఉపకారం చేసి రక్షించే అగ్ని). ఆ రెండూ కూడా నీవే! అట్టి పరాశక్తీ! నీకు నమస్కారములు" అని చెప్పి ఆయన స్తోత్రం చేసాడు.

మహర్షులు తత్త్వం తెలిసి మాట్లాడుతారు. ఆ స్తోత్రంలో సత్యం ఉంటుంది. కాబట్టి ఆ స్తోత్రాలను మనం చదువుకుంటే, అందులో ఉన్న సత్యమే మనల్ని కాపాడుతుంది. నాశనంగాని, వినాశనంగాని అజ్ఞానం వలన ఏర్పడతాయి. మనిషికి ఆయుష్షు, భాగ్యం అన్నీ సత్యం, జ్ఞానం వలన కలుగుతాయి. మహర్షులు చేసే స్తోత్రములు కూడా సత్యములే. సృష్టిలో రహస్యంగా కనీకనబడకుండా వుంటే సత్యాలతో వారు చేసిన స్తోత్రములు నిండి ఉండట చేత, వాటికి ఆ శక్తి ఉంది. అవి వట్టి స్తోత్రాలు కావు.

"ఆ చైతన్యమే బ్రహ్మ, విష్ణు, రుద్రులలో ఉండే సృష్టి, స్థితి లయములకు కారణమవుతున్నది. ఎవరైనా సరే – ఒకడు సూర్యుడయినాడు, ఒకడు ధన్యుడయినాడు, ఒకడు మన్మథుడయినాడు అంటే అందంతా నీ కటాక్షమే తల్లీ! ఆయా జాతులందరికీ ఆ శక్తి రావటము నీ వలననే. పురుషుల విషయంలో నీవు భాగ్యానివి, భాగ్యరేఖవు. పురుషుని రంజింప చేయకలిగి నటువంటి ఆ విలాసము ఏదయితే ఉన్నదో, అది నీ వల్లనే స్త్రీలకు కలుగుతుంది. (మానసిక సౌందర్యము, అంతః సౌందర్యము, బాహ్య సౌందర్యములూ ఏక కాలంలో ఏ పురుషుని అశ్రయిస్తాయో, వాడు భాగ్యవంతుడు). ఆ విలాసము కలిగిన స్త్రీ నీ స్వరూపిణియే! నీవు ఎక్కడ ఉంటావో అది రసవంత మవుతుంది. నీవు లేని చోట రసహీనమవుతుంది. (అనగా – మంచి పుష్టిగా ఉండే చెరకు గడకు, ఎండకు ఎండిపోయిన పుల్లకు తేడా ఉన్నట్లు ఉంది. రసవంతము, రసహీనము అంటే అది). నీ కటాక్షం కలిగిన వాడే సమస్తము కలిగినవాడు."

"అమ్మా! నిన్ను సమస్త దేవతలూ వాళ్ళ వాళ్ళ సుఖం కోసం, భాగ్యం కోసం అర్చిస్తున్నారు. మానవ లోకాన్ని పాలించే దేవతలు గూడా నిన్ను కొలుస్తున్నారు. దేవలోకాలలో ఆ సౌకర్యాన్ని నీవల్ల పొందుతున్నారు. ఇక్కడ నీవు ఉద్భవించి భూలోకాన్ని అనుగ్రహిస్తున్నావు. భూలోకంలో నువ్వు, నీ మహత్తు తెలుసుకోలేని జీవుల మధ్యన, నీ కటాక్షంచేత ఉంటున్నావు. దేవేంద్రాదులు అక్కడ దేవలోకంలో నిన్ను అర్చిస్తున్నప్పటికీ అటువంటి నీవు ఇక్కడే ఉంటున్నావు. అంటే కోల్హాపుర్లోనే ఉన్నావని అర్థం. నీ కటాక్షం గొప్పది కదా!" అని అమ్మవారిని స్తుతించాడు.

ఆయన చేసిన స్తోత్రానికి అమ్మవారు సంతోషించి, కరుణించి అగస్త్యుడుకి దర్శనమిచ్చిందట. "ఓ మహర్షీ! నీ స్తుతిలో పరమ సత్యాలు ఉన్నాయి. ఇప్పుడు 28వ మహాయుగం జరుగుతోంది. తరువాత కలియుగం వస్తుంది. కలి తరువాత 29వ మహాయుగం వస్తుంది. అందులోనూ ద్వాపర యుగం ఉంటుంది. ఆ ద్వాపర యుగంలో నీవు మరలా కాశీ పట్టణానికి వస్తావు. ఆ యుగంలో నీవే వేద వ్యాసుడివి. అప్పటికీ వేదములన్నీ నశించి శిథిలమై పోతాయి. వేదములను మళ్ళీ ఉద్ధరించి జ్ఞాపకము పెట్టుకొని మళ్ళీ ఈలోకానికి వచ్చి మళ్ళీ వేదవ్యాసుడు అనే నామంతో నువ్వు లోకోపకారం చేస్తావు. భవిష్యత్తులో నువ్వు ఉండబోయే కాశీ పట్టణం లక్షణము, చరిత్ర, మరికొన్ని విషయములు కూడా నీకు ఈశ్వరాంశ సంభూతుడయిన కుమారస్వామి ద్వారా తెలుస్తాయి.



తుంగభద్రా నదీ తీరంలో 'స్వామిమల' అనబడే ఒక క్షేత్రం ఉంది. అక్కడికి వెళ్ళి అక్కడే ఉండు. అక్కడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గురువుగా భావించి, ఆయన దగ్గర ఉండి అన్నీ తెలుసుకో! నీకు కాశీ క్షేత్రము, లోకముల చరిత్ర అంతా ఆయన వివరిస్తాడు. కాశీక్షేత్ర మహత్తు తెలుసుకుంటే, అందంతా నీవు జీర్ణించుకొని భవిష్యత్తులో మళ్ళీ కాశీక్షేత్ర వాసివి అవుతావు నువ్వు" అని అగస్త్యుడికి ఉపదేశం చేసింది అమ్మవారు. లోపాముద్రా దేవికి గూడా ఆ మహాలక్ష్మి వరాన్ని ప్రసాదించింది.

"లోపాముద్రా సహిత అగస్త్య మహర్షిని ఎవరు స్మరిస్తారో, వాళ్ళకు సమస్త సుఖాలు, కళ్యాణము లభిస్తాయి. శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం వారికి సంపూర్ణంగా సిద్ధిస్తుంది" అని ఆ కొల్హాపుర నివాసిని అయిన సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి వరమిచ్చింది. ఈరోజుకీ మానవాళి ఆ అమ్మవారినే పూజిస్తున్నారు, నమస్కరిస్తున్నారు, ఆశీర్వచనం అందుకుంటున్నారు.

## నక్షత్ర మండలంలో అగస్త్యుడు

పురాణాలలో గోత్రకర్తలైన సప్తఋషులు వేరు. ఈ సప్తఋషులలో అనగా గోత్ర కర్తలలో అగస్త్య మహర్షి లేడు. కానీ నక్షత్ర మండలంలో ప్రకాశిస్తున్నాడు. ఒక యుగంలో ఆ నక్షత్రానికి అధిపతిగా, యజమానిగా ఉన్నాడాయన. అరుంధతీ వసిష్ఠులు ఎక్కడయితే ఉన్నారో, ఇప్పటికీ అక్కడే అగస్త్యుడు లోపాముద్రా సహితంగా నక్షత్ర మండలంలో ఉన్నాడు.

**"అగస్త్యసంహిత"**

శ్రీరాముడు, మహా విష్ణువు, వామనుడు ఇటువంటి అవతారములను ఏ ప్రకారం పూజ చేయాలో, ఏవిధంగా ఆరాధన చెయ్యాలో ఆ నామావళితో సహా పూజా విధానాన్ని లోకానికి ఇచ్చినవాడు అగస్త్యుడు. 'అగస్త్యకృత స్తోత్రం' అని చెప్పి అనేక ప్రదేశాలలో అందుబాటులో ఉంటుంది. అగస్త్యుడే పూజా పద్ధతులను గురించి అవతార పూజా చెప్పాడు. ఆయన పేరు ప్రతిచోట ఉంటుంది. విధానాలు అనేకములను ఒకచోట చేర్చి 'అగస్త్యసంహిత' అని పండితులు దానికి పేరు పెట్టారు. అష్టోత్తర శతనామాలు, సహస్రనామావళి, మొదలగు నామాలు మహర్షులే రచించి మానవాళికి అందించారు.

**మానసతీర్థములు, బాహ్య తీర్థములు**

అగస్త్యుడు తీర్థ యాత్రలు చేస్తూ, అనేక నదులలో స్నానాలు చేస్తూ, ఆయా క్షేత్రాలన్నీ దర్శనం చేస్తుంటే ఒక క్షేత్రంలో ఆయన భార్య లోపాముద్రా దేవి "ఏమండీ ఇలా తీర్థాలన్నీ సేవిస్తూ, దర్శిస్తున్నాం. దీనివలన మనకు ముక్తి లభిస్తుందా?" అని అడిగిందట. నేడు సామాన్య మానవులకు కూడా ఇటువంటి సందేహంతో కూడిన ప్రశ్న ఉదయిస్తుంది.

లోపాముద్రా దేవికి గూడా ముక్తిని గురించిన భయం వుంది. అంటే మనుష్య జన్మకు ఆ భయం ఎప్పుడూ ఉండాలి అనే దాని అర్థం. "నాకేమీ ఫరవాలేదు, నా తపస్సు అయిపోయింది. ఇప్పుడు నేను అన్నీ పనులూ చేయటానికి ఉన్నాను. లోకోద్ధరణ కోసం చేస్తున్నాను. నా తపస్సు ఎప్పుడో పూర్తయింది" అనలేదు ఆయన. అటువంటి మూర్ఖపు మాటలు బుద్ధి ఉన్నవారు ఎవరూ అనరు. ఎవరు జ్ఞాని అంటే, "అయ్యా! నాకు శరీరమున్నది. ఇంకా భయంగానేవున్నది" అన్నవాడు. దీనిని బట్టి జీవన్ముక్తుడు కూడా ఆ భయంతో ఉండటమే ధర్మమని ఆయన బోధగా అర్థమవుతోంది. భయంతో ఉన్నవాడే ధర్మం ఆచరిస్తాడు. భయంగా ఉన్నవాడే జాగ్రత్తగా వుంటాడు.



"తీర్థములు మానసములు ముక్తి ప్రదములు
బాహ్య తీర్థావళులు ముక్తి ఫలము నీవు".

మానస తీర్థములే ముక్తి హేతువులు. బాహ్య తీర్థముల కంటే ఇవి ఎంతో ఉపయోగము. సత్యము, ఇంద్రియ నిగ్రహము అసూయ, దానము, దయ, సంతోషము, బ్రహ్మచర్యము, ధైర్యము, యమము, సమత్వము, విజ్ఞానము వీటన్నిటినీ మానస తీర్థములు అంటారు. వీటిని ఆచరించకుండా, కేవలం బాహ్య తీర్థముల వలన ప్రయోజనంలేదు. అంటే మానసిక తీర్థములు అలవాటు చేసుకొంటేనే గానీ బాహ్య తీర్థముల వలన ప్రయోజనము శూన్యము. ఎవరు ఏమి ఇచ్చినా తీసుకొనక పోవటము, అహంకారము లేకుండుంట, కోపం చంపుకోవటం, ఆలస్యము చేయకుండుట, సత్యవ్రతము మొదలైనవి అన్నీ సత్ఫలితాలు ఇస్తాయి. ఎన్ని తీర్థములయినా కాశీ ప్రాప్తినే ఇస్తాయి. కాశీ తీర్థంలో స్నానం చేయనివారు లక్ష తీర్థాలను దర్శించినా మోక్షంరాదు. ఈ ధర్మాలు అన్నీ చెప్పటం జరిగింది.

**ఆదిత్య కవచం - లోకంకోసం**

శ్రీరామచంద్రుడికి ఆదిత్య కవచము, ఆదిత్య హృదయము ఉపదేశం చేసాడు. ఆదిత్య స్తోత్రం చేసాడు. ఇవన్నీ ఎందుకు చేసాడు. శ్రీరాముడికి అవసరం అని కాదు. మనకు ప్రసాదించాలి. మానవాళికి ఒక సన్మార్గం చూపించాలి కదా! అని ఈ స్తోత్రాలు, ఇవన్నీ ఆపత్తు సమయంలో చదువుకోమని మహర్షులు ఇచ్చారు.

శ్రీరాముడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారం. ఆయనకు అవసరంలేదు. అయినా మానవుడుగా అవతరించాడు. కాబట్టి ఆయనకు ఉపదేశం చేసాడు. అందువల్ల మానవులందరూ ఆపత్సమయంలో ఈ స్తోత్రం, కవచాలు చదివి విజయం వరిస్తుందనే భావనతో అగస్త్య మహర్షి లోకానికి తెలియచేసాడు. మహర్షులు ఏది ఇచ్చినా మంచినే అందిస్తారు. వారి తపన లోకోపకారమే.

### ఆదిత్యకవచము

జపాకుసుమ సంకాశం ద్విభుజం పద్మహస్తకం ।
సిందూరాంబర మాల్యంచ రక్తగంధానులేపనం ।
మాణిక్యరత్నఖచిత సర్వాభరణభూషితం ।
సప్తాశ్వ రథవాహంతు మేరుంచైవ ప్రదక్షిణం ।
దేవాసురవరైర్వంద్యం ఘృణిభిః పరిసేవితం ।
ధ్యాయేత్పఠేత్సువర్ణాభం సూర్యస్య కవచంముదా ।
ఘృణిః పాతు శిరోదేశే సూర్యఃపాతు లలాటకం ।
ఆదిత్యో లోచనేపాతు శృతీపాతు దివాకరః ।
ఘ్రాణంపాతు సదాభానుర్ముఖంపాతు సదారవిః ।
జిహ్వాంపాతు జగన్నేత్రః కంఠేపాతు విభావసుః ।
స్కంధౌ గ్రహపతిః పాతు భుజౌపాతు ప్రభాకరః ।
కరావబ్జకరః పాతు హృదయం పాతు నభో మణి ః ।
ద్వాదశాత్మ కటింపాతు సవితాపాతు సక్థినీ ।
ఊరూపాతు సురశ్రేష్ఠో జానునీపాతు భాస్కరః ।
జంఘే మే పాతు మార్తాండో గుల్ఫౌపాతు త్విషాంపతిః ।
పాదౌ దినమణిః పాతు పాతు మిత్రోఖిలం వపుః ।
ఆధిత్యకవచం పుణ్యమభేద్యం వజ్రసన్నిభం ।
సర్వరోగ భయాదిభ్యో ముచ్యతే నాత్ర సంశయః ।
సంవత్సరముపాసిత్వా సామ్రాజ్యపదవీం లభేత్ ॥

### ధ్యానమ్

అనేకరత్నసంయుక్తం స్వర్ణమాణిక్యభూషణం ।
కల్పవృక్షసమాకీర్ణం కదంబకుసుమప్రియం ॥



అశేషరోగశాంత్యర్థం ధ్యాయే దాదిత్యమండలం ।
తప్తకాంచనసంకాశం సహస్రకిరణావృతమ్ ॥
సిందూరవర్ణాయ సుమండలాయ
సువర్ణరత్నాభరణాయ తుభ్యం ।
పద్మాదినేత్రేచ సుపంకజాయ
బ్రహ్మేంద్ర నారాయణ శంకరాయ ॥
సంరక్తచూర్ణం ససువర్ణంతో యం
సకుంకుమాభం సకుశం సపుష్పం ।
ప్రదత్తమాదాయచ హేమపాత్రే
ప్రశస్తనాదం భగవంతమీడే ॥

ఒక సంవత్సరం కాలము ఆదిత్యకవచ పారాయణ చేస్తే సామ్రాజ్య పదవి వస్తుందని ఫలశ్రుతి చెప్పారు. అటువంటిది ఏదయినా ఆశ చూపిస్తేనే మానవాళికి ఆసక్తి కలుగుతుంది. వాటిపై ధ్యాస, తపన కలుగుతుంది.

అది అగస్త్య మహర్షి ప్రసాదించిన ఆదిత్య కవచం. శరీరాన్ని రక్షించే అంగములన్నీ దేవతలు రక్షణ పొందటాన్ని 'కవచం' అంటారు. 'మనోబలం', ఆత్మ బలం' అవి మనం ఉపయోగించే మాటలు ధైర్య స్థైర్యాలను ఈ కవచం ఇస్తుంది. వ్యక్తిత్వ వికాస ప్రసంగాలలో ఈ రెండు పదాలను ఎక్కువగా ఈ కాలంలో వాడుతున్నారు. శరీరంలో రోగ బాధలు వచ్చినపుడు ఆదిత్య కవచం పఠించాలి. అందరు దేవతలకూ స్తోత్రం ఉంటుంది. తరువాత కవచం, తరువాత హృదయం, తరువాత మంత్రము ఉన్నాయి. అవి అన్నీ ఆయా ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసారు మహర్షులు. అందుకనే శరీర బాధలు వచ్చినప్పుడు కవచం, దర్శన సిద్ధి కోసం మంత్రం చదువుకోవాలి.

### అగస్త్య మహర్షిని దర్శించు సమయం

నక్షత్ర మండలంలో నక్షత్ర రూపంలో ఉన్న అగస్త్య మహర్షిని భాద్రపద మాసంలో దర్శించుకోవాలని చెప్తారు. భాద్రపద మాసం అంటే ఆంగ్లమాసం

సెప్టంబరు. ఆకాలంలో రాత్రి సమయంలో సూర్యుడు కన్యారాశిలో ఉంటడం చేత, కన్య అస్తమించిన తరువాత ఉదయించే ధనూరాశి, పైకి వెళ్ళినపుడు అగస్త్య మహర్షి దర్శనం సరిగ్గా ధనూరాశి ప్రక్కనే అవుతుంది. ఇది పురాణం చెబుతోంది. అంటే మూల – పూర్వాషాఢ, ఉత్తరాషాఢ నక్షత్రాలకు ప్రక్కనే, అర్థరాత్రి సమయంలో మిణుకు మిణుకుమంటూ కొంచెం దూరంగా ఉంటుంది. దక్షిణ భాగంలో ధనూరాశి ప్రక్కన, అర్ధరాత్రి సమయంలో బాగా చీకటి పడినప్పుడు మాత్రమే అగస్త్య నక్షత్రం భాద్రపద మాసంలో కనపడుతుంది. ఎందుకంటే పాతాళంలో సూర్యుడు ఉండాలి, ధనుస్సుపైన ఉండాలి. ఆ చివరన పీలికలవలె వున్న నక్షత్రాలుగా అగస్త్య మహర్షి దర్శనం అవుతుంది. చూచిన తరువాత నమస్కరించి, నదీ స్నానం చేసి అర్ఘ్యములు ఇవ్వాలి.

### అగస్త్యమహర్షికి ధ్యానం, అర్ఘ్యం ఇవ్వటం

'ధర్మ సింధు'లో, ధర్మశాస్త్ర గ్రంథాలలో అగస్త్యుడికి అర్ఘ్యప్రదానం చేసే విషయం చెప్పారు. మహర్షులు దేవతల కంటే శాశ్వతులు. స్వర్గంలోని దేవతలు వస్తూపోతూ ఉంటారు. కాని అగస్త్యుడు శాశ్వతుడు. ఆయన అనేక మంది ఇంద్రులను చూచాడు. ఎప్పుడూ ఉండే ఆ మహర్షిని దర్శించటం వలన సమస్తమైన ఈతి బాధలు తొలగి పోవటమే కాకుండా జ్ఞానోదయమవుతుందని చెప్తారు.

అగస్త్య మహర్షి దర్శనం చేసిన తరువాత, అగస్త్య ప్రతిమ ఒకటి చిన్నదిగా చేసి, పూజలు చేసి, దాన్ని బ్రాహ్మణులకు దానం చేయాలి. సప్తర్షి పూజ అని ఒకటి ఉన్నది. 'ఋషి పంచమి' రోజున ఋషి పంచమి వ్రతం చేస్తారు. భాద్రపద మాసంలో ఈ శ్లోకాలతో ఆయనకు నమస్కరిస్తారు.

**కాశపుష్ప ప్రతీకాశ వహ్నిమారుతసంభవ ।**
**మిత్రావరుణయోఃపుత్ర కుంభయోనే నమోస్తుతే ।**
**వింధ్యవృద్ధిక్షయకర మేఘతో యవిషాపహా ।**



**రత్నవల్లభదేవేశ లంకావాస నమోస్తుతే ॥**
**వాతాపిర్భక్షితో యేన సముద్రశోషతః పురా ।**
**లోపాముద్రాపతిశ్రీమాన్ యో సః తస్మై నమో నమః ।**
**యేనో దితేన పాపాని విలయం యాంతి వ్యాధయః ।**
**తస్మై నమోస్త్వగస్త్యాయ సశిష్యాయచపుత్రిణే ॥**

మనసులో అగస్త్యుడిని ధ్యానించి పై శ్లోకాలు చదివి అర్ఘ్యం విడవాలి. మనుష్యులు చేసిన పాపంచేత, విషపు వర్షం కురిస్తే దాన్నించి లోకాన్ని ఆయన ఆ యుగాలలో రక్షించాడు.

రామాయణకాలం తరువాత ఆయన మళ్ళీ ఉత్తరదేశం వెళ్ళలేదు. ఎటువంటి కష్టాలు లేని విభీషణుని చేత పరిపాలింపబడే లంకలోనే ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నాడు. తరువాత ఏ ప్రదేశంలో ఉన్నాడో భారతంలో చెప్పలేదు. అయితే స్తోత్రంలో మాత్రం "లంకా వాస నమోస్తుతే' అని ఉంది.

అగస్త్యుని పేరు మీద దక్షిణాన చాలా క్షేత్రాలు వెలిసాయి. అగస్త్య మహర్షి గొప్ప శివాద్వైతి. 'శివోహం' అని అనుభవంలో తెలుసుకొని అతడు చెప్పిన మాట, వరాహ పురాణంలో తెలుగు పద్యంలో ఎక్కడో ఒకచోట ఉన్నది. శివుడు సాక్షాత్తు ఆయనకు చెప్పిన మాటలు :

"శివుడే దాత శివుండే భోక్త శివుడే
చేయున్ మఖాది క్రియల్
శివుడే విశ్వము నే శివుండ.... అన్నాడు.
లోపాముద్రా దేవిని కూడా ఈ శ్లోకంలో స్మరించుకుంటూ...
రాజపుత్రి మహాభాగే ఋషిపత్నీ వరాననే!
లోపాముద్రే నమస్తుభ్యం అర్ఘ్యంమే ప్రతిగృహ్యతామ్
అని అర్ఘ్యం విడువాలి.

అగస్త్యాయ నమస్తేస్తు అగస్త్యేస్మిన్ ఘటేస్థితః
అగస్త్యోద్విజరూపేణ ప్రతిగృహ్ణాతు సత్కృతః
అగస్త్య స్సప్త జన్మాఘం నాశయిత్వావయోరయం
అపత్యం విమలం సౌఖ్యం ప్రయచ్ఛతు మహామునిః"

సంస్కృత వాచస్పత్యంలో ఈ శ్లోకం ఉంది. ఈ స్తోత్రం చేస్తూ ఆయనకు నమస్కరిస్తారు. ఇతర ఋషుల మాదిరి కాకుండా ఆయన దేవతల కంటే ఎక్కువగా పూజింపబడ్డాడు. ఎవరయితే ఈ లోపాముద్రా సహిత అగస్త్య మహర్షికి నమస్కరిస్తారో, వాళ్ళకు భుక్తిని, ముక్తిని కూడా వారు ఇవ్వగలరని ఒక మాట చెప్పారు. మానవాళికి మార్గదర్శకుడిగా ప్రఖ్యాతి చెందిన ఋషి అగస్త్య మహర్షి అని పురాణాలలో కీర్తించారు.

యజ్ఞములన్నీ ఈశ్వరుడే చేస్తాడు. మన ఆంధ్రదేశంలో గూడా అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శివలింగ క్షేత్రాలు, దేవాలయములు ఎన్నో ఉన్నాయి. ఉదా: చిత్తూరు జిల్లాలో చంద్రగిరి సమీపాన తొండవాడ గ్రామంలో కళ్యాణీనది తీరాన అగస్త్యుడు తపస్సుచేసి అచట శివలింగ ప్రతిష్ఠ చేసాడు. ఆచట తరువాత దేవాలయ నిర్మాణం జరిగింది. ఆ దేవాలయానికి 'అగస్తేశ్వర స్వామి దేవాలయము' అని ప్రసిద్ధి వచ్చింది. తిరుపతి - చంద్రగిరి రహదారులలో వచ్చి తిరుపతికి 8 కి.మీ. దూరంలో ఈ దేవాలయము గలదు. తిరుపతి - తిరుమలకు వచ్చు భక్తులందరూ ఈ దేవాలయాన్ని తప్పక దర్శించి స్వామి అనుగ్రహం పొంది తరిస్తారు. దేవాలయములోనే అగస్త్య మహర్షి విగ్రహాన్ని గూడా ప్రతిష్ఠించి నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

* * *

## 10. చ్యవన మహర్షి

భృగుమహర్షి పులోమల కుమారుడు చ్యవనుడు. పుట్టుకతోనే చ్యవనుడు బ్రహ్మ తేజస్సు గలవాడు. అగ్నిహోత్రుడి కంటే ఎంతో తేజస్వంతంగా వెలిగాడు చ్యవనుడు. పసితనంలోనె పులోముడనే రాక్షసుని తన కంటి చూపుతో, అలా చూచాడట. వెంటనే ఆ రాక్షసుడు భస్మమైనాడు. అది చ్యవన మహర్షి మహిమ. చ్యవనునకు యుక్త వయస్సు రాగానే ఉపనయనాది సంస్కారములను భృగువు నెరవేర్చాడు. చ్యవనుడితో తానుచెప్పవలసిన హిత బోధనంతా చెప్పాడు భృగువు. "నాయనా! ఈ సృష్టిలో అంతిమంగా పొందదగినది జ్ఞాన మొక్కటే! ఇంకేమీలేదు. సృష్టిలో ప్రతి జీవుడికి నోచుకోదగిన అత్యంత విలువైన వస్తువు ఒకటి ఉన్నది. అదే జ్ఞానం, మోక్షం, అది తప్ప ఇక కావలసింది ఏముంది ఇందులో. నీవు తపస్సుకు వెళ్ళు" అని ప్రేరణ చేసాడు భృగువు. మహర్షుల సంతానము, భార్యలు గూడా తపస్సు మార్గాన్నే ఎంచుకొని తపఃశక్తిని సంపాదించిన వారే. చ్యవనుడికి తండ్రి హితబోధ నేటి మానవాళికి సందేశమే.

చ్యవనుడు వైదూర్య పర్వత ప్రాంతానికి వెళ్లి కొన్ని వేల సంవత్సరములు పరమేశ్వరుడిని గురించి తపస్సు చేసాడు. తపస్సులోనే గడిపి వృద్ధుడైనాడు. శర్యాతి అనే రాజు తన భార్యలతో సుకన్య అనే కూతిరితో వన విహారానికి వచ్చాడు. తపస్సులో ఉన్న చ్యవనుడితో సంప్రదించి సుకన్యను ఆయనకు ఇచ్చి వివాహం చేసాడు.

కొంత కాలమైన తరువాత చ్యవనుడు తపస్సులో ఉండగా అచటికి అశ్వినీ దేవతలు వచ్చారు. వారిద్దరు దగ్గరలో ఉన్న కొలనులో దిగి స్నానం చేసి వచ్చారు. వారి రూపులు మారి నవ మన్మథులుగా కనుపిస్తున్నారు. ఈ విషయం సుకన్య చ్యవనుడికి చెప్పింది. చ్యవనుడు వృద్ధుడు, గుడ్డివాడు, సుకన్య ఆమె వనంలో ఉంది. వెంటనే చ్యవనుడు ఆమెతో "వాళ్ళు వైద్యులు, నాకు ఈ జీర్ణమైన శరీరంలోంచి ఒక మంచి యౌవవనవంతమైన శరీరాన్ని

ఇద్దామనే ఉద్దేశ్యంతో వాళ్ళు వచ్చారు. నన్ను తీసుకొని వెళ్ళి స్నానం చేయించు" అని చ్యవనుడు భార్యతో చెప్పాడు. ఆమె సహాయంతో వెళ్లి స్నానం చేసి వచ్చాడు. అంతే దివ్యసుందర విగ్రహం కలవాడుగా మారాడు. అశ్వినీ దేవతలు సుకన్యను స్తోత్రం చేసి, "నీ పాతివ్రత్య ధర్మం గొప్పదమ్మా! నిన్ను పరీక్షచేసి, మహర్షికి సేవ చేద్దామనే భావంతో వచ్చాము. నీ వంటి పతివ్రతకు ఈ సౌఖ్యం లభించాలనే మా ఉద్దేశ్యం. అంతకంటే ఏమీలేదు" అని సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు. ఈ కథ సారాంశము భారతంలోని అరణ్య పర్వంలోనూ, దేవీ భాగవతంలో గూడ ఉంది. అశ్వినీ దేవతలు వైద్యులు ఎంతో గొప్పవారు. వీళ్ళు దేవతలకు వైద్యులుగా ఉండటం వలన అంత గొప్పవారైనారు. ఆనాడు అశ్వినీ దేవతలు వృద్ధులను, గుడ్డివారిని వారివారి యోగ్యత, అర్హత, శక్తిని బట్టి ధర్మానుగుణంగా యౌవనవంతులుగా, ఆరోగ్యవంతులుగా మార్చేవారు.

## అశ్వినీ దేవతలకు యాగంలో సహాయం

అశ్వినీ దేవతలు వైద్యులు కాబట్టి యజ్ఞంలో వాళ్లకు హవిర్భాగాలు లేవు. 'స్వాహా'కారంతో అగ్నిహోత్రంలో నెయ్యివేస్తాం. 'అగ్నయే స్వాహా అగ్నయ ఇదం న మమ' అంటాం. అగ్నిహోత్రుడికి, దేవతలకు హవిస్సులు ఇస్తాం. అశ్వినులకు అలాలేవు. వాళ్ళు వైద్యులు కావటమే ఇందుకు కారణం. తనకు యౌవనాన్ని ఇచ్చి, తనయందు ఇంత అనుగ్రహం చూపిన అశ్వినీ దేవతలకు ప్రత్యుపకారం చేయాలనుకున్నాడు చ్యవన మహర్షి. అశ్వినీ దేవతలు అపవిత్రులుగా పరిగణింపబడ్డారు. యజ్ఞ యాగాదులలో, సోమయాగంలోనూ వారికి హవిర్భాగాలు లేవు. వాళ్ళు అప్పుడు చ్యవన మహర్షితో వారికి జరిగిన అవమానము చెప్పుకున్నారు. "స్వామీ! వైద్యులమనే పేరుతో అగౌరవము జరుగుతున్నది మాకు. అన్యాయం జరుగుతున్నది. స్వాహాకారంతో మాకు ఒక నెయ్యి చుక్క కూడా ఇవ్వటంలేదు. యజ్ఞంలో మాకు సోమపానం చేసేటటువంటి అర్హత ఇంకనుంచైనా కల్పించవలసింది. యజ్ఞంలో ఈ



పద్ధతులు మార్పులు చేసి స్వాహాకారం పొందే అధికారం మాకు కల్పించవలసింది" అని ఆయనను అడిగారు అశ్వినీ దేవతలు.

"సోమయాగంలో మిమ్మల్ని సోమపీథులను చేసే పని నేను నిర్వహిస్తాను" అని వాగ్దానం చేసి చ్యవనుడు వాళ్ళను పంపేసాడు. సోమ విధులను మార్పు చేసేందుకు దేవేంద్రుడి ఆదేశం కావాలి. శాస్త్రములు, వేదములు, బ్రాహ్మణులు అందరూ అంగీకరించాలి. అది ఒకరివలన అయ్యే పనికాదు. ఇంద్రుడు అంగీకరించాలి. అనేక మంది ప్రమేయం ఉంది ఇందులో. అశ్వినులకు రేపటి నుంచి ఇవ్వండి అంటే ఇస్తారు! అయినా వాళ్ళకు ఆయన వాగ్దానం చేసాడు.

కొంత కాలానికి చ్యవనుడే స్వయంగా యజ్ఞం నిర్వహణకు సంకల్పించాడు. అశ్వినీ దేవతలకు సోమం ఇవ్వటానికే అయన యజ్ఞం ప్రారంభించాడు. దేవేంద్రుడు వచ్చి ఆటంకపరిచాడు. "అశ్వినీ దేవతలకు 'స్వాహా' కారం అనేది ఇవ్వటం ఇంతవరకు లోకంలో లేదు. ఆ పని నీవు ఎలా చేస్తావు? వాళ్లు నీచమైన వృత్తిలో వున్నారు. వైద్యులు, ఈ స్వాహాలు పొందటానికి వారికి అధికారం లేదు" అన్నాడు ఇంద్రుడు.

దేవేంద్రుడు మాటలు లెక్కచేయకుండా చ్యవనుడు అశ్వినీ దేవతలకు 'స్వాహా' కారం ఇచ్చేసాడు. ఇదే పద్ధతి లోకంలో మిగతవారు ఆచరిస్తారేమోనని ఇంద్రుడి భయం "అది దోషం, నువ్వు ఎంత గొప్పవాడివయినా నువ్వు చేసేపని తప్పు, అందుకని నిన్ను శిక్షిస్తాను, నిన్ను చంపుతాను" అని వజ్రాయుధాన్ని ఎత్తి చ్యవనుడిని చంపబోయాడు ఇంద్రుడు.

చ్యవనుడు స్వాహాకారం ఇస్తున్నపుడు, ఇంద్రుడు ఆయుధంపైకి ఎత్తి చ్యవనుడిని చంపబోయాడు. వెంటనే ఇంద్రుడి చెయ్యి నిలబడిపోయింది. కదలిక లేదు. మళ్ళీ చేతిని క్రిందికి దింపలేకబోయాడు ఇంద్రుడు. వజ్రాయుదంతో సహా, దేవేంద్రుడిని అగ్నిహోత్రంలో పడేయటానికి

సిద్ధమైనాడు చ్యవనుడు. అప్పటికీ గూడా శిక్షిస్తానని చ్యవనుడు భయపెట్టినా, ఇంకా వినయం కలుగలేదు ఇంద్రుడికి, ఇంక ఆలస్యం చేయకుండా ఇంద్రుణ్ణి వజ్రాయుధంతో సహా అగ్నిహోత్రంలో పడవేసాడు చ్యవనుడు. అది చ్యవనుడి తపఃశక్తి, మంత్రశక్తి ఫలితం.

ఇంద్రుడు ఒక మహర్షిని చంపటానికి ప్రయత్నించి అధర్మం చేసిన వాడయినాడు. ఆ సమయంలో ఆ ఆయుధం అధర్మమందు ప్రయోగింపబడి దుష్ట లక్షణం కలిగి ఉంది. ఏమయింది? అందులోంచి ఒక బ్రహ్మాండమైన రాక్షసుడు బయటికి వచ్చాడు. చ్యవనుడు ఇంద్రుడుని హోమ గుండంలో పడవేసినపుడు అందులో కేవలం అతడి భౌతిక రూపం మాత్రమే పడవేయబడింది. ఇంద్రుడి తేజస్సు మాత్రం అక్కడ మిగిలి ఉన్నది అంటారు. ఆ తేజస్సును కూడా మింగటానికి ఆ రాక్షసుడు వెళుతున్నాడు. తరువాత మళ్ళీ ఇంద్రుడి తేజస్సుకు శరీరాన్ని ఇవ్వగల సమర్థుడు చ్యవనుడే. అది కూడా చేయకపోతే ఇంద్రుడనే వాడే ఉండడు. అందువల్ల తేజస్సులో ఉన్న ఇంద్రుడు, తేజో రూపంలో వున్న ఇంద్రుడు – ఆయన కాళ్ళమీద పడి "అనుగ్రహించండి, నన్ను చంపవద్దు – చంపవద్దు. నా తప్పు క్షమించవలసింది. మీ కోరిక ప్రకారం భవిష్యత్తులో అశ్వినీ దేవతలకు యజ్ఞాలలో సోమం ఇవ్వటానికి నేను అంగీకరిస్తున్నాను" అన్నాడు దేవేంద్రుడు. ఇంద్రుడు వెంటనే బ్రతుకు జీవుడా అనుకొని స్వర్గానికి వెళ్ళాడు.

అప్పటి నుంచీ అశ్వనీ దేవతలకు యజ్ఞంలో సోమం అందుతోంది. ఎవరూ చేయని ఉపకారం తమకు చ్యవనుడు చేయటంవలన అశ్వినీ దేవతలు చ్యవనుడి దగ్గరకు వెళ్ళి ఆయనను అనేక విధాలుగా స్తోత్రంచేసి స్వర్గానికి వెళ్ళారు. అనుకున్న ప్రకారం చ్యవనుడు అశ్వినీ దేవతలకు ప్రత్యుపకారం చేయాలనుకొని, ఉపకారం చేసాడు. వారి కోరిక నెరవేర్చాడు. యజ్ఞాలలో వారికీ గౌరవం దక్కింది.



## అపకారికి ఉపకారం

చ్యవనుడిపై ఇంద్రుడికి కోపం ఉంది. ఏమీ చెయ్యలేక ప్రాణాలను దక్కించుకొని వెళ్ళాడు కానీ, అతడికి అంతరంగంలో ప్రశాంతత లేదు. చ్యవనుడిపై ప్రతీకారం తీసుకోవాలనుకున్నాడు. చ్యవనుడి మీద ఆగ్రహం ఉంది. మరోసారి అపకారం తలపెట్టాడు. ఇంద్రుడు. చ్యవనుడు అర్చీక పర్వతం మీద తపస్సు చేసుకుంటున్నాడు. ఆ సమయంలో మహర్షి మీదకు ఒక పెద్ద పర్వతాన్ని విసిరి వేసాడు. మహర్షి మేలుకొని, వెంటనే తన కమండలంలోని ఉదకాన్ని దానిమీద చల్లాడు. ఆ పర్వతం ఎవరు ప్రయోగించారో వారి మీదకు తిరిగి వెళ్ళింది. ఆ ప్రయోగం ఇంద్రుడి మీద పడి అతడు మూర్ఛపోయాడు.

ఇంద్రుడు ఇంత చేసినప్పటికీ, ఇంకా అతడిని శిక్షించే ఉద్దేశ్యం చ్యవనుడికి లేదు. ఇంత అపకారం చేసినా ఇంద్రుడిని క్షమించాడు చ్యవన మహర్షి "నీకు నామీద ఆగ్రహం ఉండటం న్యాయమే! ఇప్పటికి నీ పగ తీరింది కదా! ఇలాంటి దుష్టచర్యలు ఇంకెప్పుడూ చెయ్యవద్దు. నువ్వు నన్నేం చేయలేవు" అని అతడిని మందలించి పంపించాడు. ఇంద్రుడు సిగ్గుపడి వెళ్ళాడు. చ్యవన మహర్షి ఎంత దయాశీలుడో, ఉదార స్వభావుడో, ఈ సన్నివేశాన్ని బట్టి తెలుస్తుంది. అపకారికి కూడా ఉపకారం చేసి తనకు ఉన్నటువంటి అభేదభావాన్ని చాటి చెప్పాడు. లోకానికి ఇది ఒక నీతి కథగా చ్యవనుడు సత్సందేశాన్ని ఇచ్చాడు. మన మహర్షులలో ఇదే మనము గ్రహించవలసిన రహస్యం. ఈ రహస్యంలో నీతి, విలువలు, ధర్మం ఇమిడి ఉన్నాయి. ఇటువంటి విషయాలల్లో చ్యవన మహర్షి మానవాళికి మార్గదర్శకుడు.

## ఆనాటి గ్రంథాలయ ఉపయోగం

ఆ రోజుల్లో పురాణాలు అనేకమంది పండితులు, మహర్షులు వ్రాసారు. ఆనాడు కేంద్రీయ, జిల్లా గ్రంథాలయాలు, గ్రంథాలయాలపై హక్కులు గానీ లేవు. అటువంటి పురాణాలు నేటి వరకూ ఉన్నాయంటే ఆశ్చర్యమే!

ఆ రోజుల్లో గ్రంథాలు ఏవిధంగా వ్యాప్తి చెందాయంటే – ఉదా: ఒక పురాణం ఒకరి ఇంట్లో ఉన్నదని తెలిస్తే, దక్షిణ భారతదేశంలో ఎక్కడో వారి ఇల్లు ఉన్నదని తెలిస్తే ఆ పురాణ గ్రంథం కావాలని ఆసక్తి గలవారున్నారు. ఆ గ్రామం, పట్టణం ఎంత దూరమైనా ఆసక్తి గలవారు అక్కడికి వెళ్ళి ఆ పురాణం నకలు వ్రాసుకోవటం జరిగేది. అదీ వ్యవస్థ. ఒక ప్రతికి వేరొక ప్రతి తాయారయ్యేసరికి ఒక ఏడాది పడితే, ఆ ఏడాది పొడుగునా మరొకరు భోజనం పెట్టడం. ఇప్పుడు పుస్తకాలు ముద్రణ చాలా ఖర్చుతో కూడుకున్నదని మనమంతా అనుకుంటున్నాము. కాని గతంలో పోల్చితే అది ఏపాటిది. అలాంటి గ్రంథాల్లో ఓ అక్షరానికో, ఓ శ్లోకానికో ఒకరి అర్థం తెలియకపోతే తనకు అర్థమయ్యేలాగా దానిని అతడు దిద్దుకునేవాడు. ఈ ప్రకారంగా అనేక మార్పులు పురాణాలలో చోటు చేసుకున్నాయి. పురాణాలు రచయితలు, పండితులు వ్రాసిన గ్రంథాలలో సందేహాలు, విశ్లేషణలు ఉండటం సహజం.

**ఉదకవాస మహామంత్రం – అద్భుతాలు**

చ్యవన మహర్షి భాగీరథీ – యమునా పరీవాహక ప్రాంతానికి వెళ్ళి, కఠిన నియమాలతో “ఉదకవాస మహావ్రతం అనేటటువంటిది చేసాడు. ఈ వ్రతం నియమాలు: నీళ్ళు మాత్రమే త్రాగి ఉండటము, నీళ్ళల్లో నిలబడటము, ఆ నీళ్ళల్లో జలపానము – అంటే ఆచమనం చేయటము, ఇలాంటివి చేసాడు. నీళ్ళల్లోనే నిలబడి తపస్సు చేసాడు. ఆ నీటిలో వుండే చేపలకు ఆయన మీద గౌరవము, ప్రేమ కలిగాయి. అలా పన్నెండు సంవత్సరాలు ఆయన తపమాచరించాడు. నదీ జలాల్లో ఒక్కొక్కసారి ప్రవాహం పెరగటం, వరదలు రావటం, ఏదో చెత్త కొట్టుకొని వస్తూ ఉంటుంది, పెద్ద పెద్ద దుంగలు, చెట్లు కొట్టుకొని వస్తాయి. నీళ్ళల్లో ఉండే వారికి ఇవన్నీ ప్రమాదాలే కదా! అటువంటి ప్రమాదాలు రాకుండా ‘జలదేవత’ ఆయన చుట్టూ ప్రదక్షిణం చేసి, ఆయనకు ఏ ప్రమాదం లేకుండా వెళ్ళిపోతూ ఉందట. ప్రకృతి గూడ చ్యవన మహర్షి యందు అంతటి భక్తిని చూపించింది. తపస్సులో ఉన్న మహర్షులకు ప్రకృతి



గూడ సహకరిస్తుందని అర్థమైంది గదా! ప్రకృతిని మనం గౌరవిస్తే అది మనలను గౌరవిస్తుంది. నేటి శాస్త్రవేత్తలు పర్యావరణాన్ని రక్షించమని సూచనలు ఇస్తున్నారు గదా!

చ్యవన మహర్షి నీళ్ళల్లో మునిగి తపస్సు చేసుకుంటున్నాడు. ఒకసారి చేపలు పట్టుకునే వాళ్ళు వచ్చి పెద్ద వల వేసారు. చేపలతోబాటు ఆయన గూడా వలలో చిక్కాడు. అది గమనించిన చేపల వాళ్ళు “పొరపాటు అయ్యింది స్వామీ! దణ్ణం పెడుతున్నాం, మమ్మల్ని రక్షించండి” అని వేడుకున్నారు. చ్యవనుడు వాళ్ళతో “నాయనలారా! మీ కులవృత్తిని మీరు చేసారు. ఏం ఫరవాలేదు. నన్ను ఏదో విధంగా మీరు వలలో నుంచి తీసుకొచ్చి బయటపడేశారు. వలలో చిక్కిన వస్తువులన్నీ చేపలు పట్టే వాళ్ళకే చెందుతాయి. కాబట్టి అది వాళ్ళ సొమ్ము. ఆ సొమ్మును అమ్ముకోవటానికి వాడికే అధికారం. నన్ను గూడ మీరు బయటకు లాగారు కదా! ఎక్కడయినా అమ్ముకోండి. ఓ రెండు రూకలు వస్తే అమ్ముకోండి. నేను మీ వస్తువును అయినాను” అన్నాడు. తనకు తపోభంగం చేసినందుకు వాళ్ళను క్షమించాడు!

చేపలు పట్టేవాళ్ళకు సందేహం కలిగింది. “ధర్మం ఏమిటో ఆయనకు తెలుసుగదా! ఒకవేళ ఆయనను అమ్మినా ఎవరు కొంటారు. వాళ్ళు మాత్రం ఏం చేసుకుంటారు. ఆయన చెప్పినట్లు చేస్తే ఏం ప్రమాదం ముంచుకొస్తుంది!” అని అనుకున్నారు.

ఆ దేశాన్ని పరిపాలిస్తున్న నహుషుడు అనే రాజు దగ్గరకు వెళ్ళారు ఆ చేపలు పట్టేవాళ్ళు. జరిగిన విషయాలంతా రాజుకు విన్నవించారు. “అంతా విన్నారు మహారాజు! మా కర్తవ్యం ఏమిటో తెలియచేయండి” అని అడిగారు. జాలరులకు ఆయన విలువ ఎంతో తెలయదు. “సరే నన్ను మీరు అమ్ముకోమని చెప్పినప్పుడు ఎంత విలువ నిర్ణయించాలో నేనే చెప్తాను. మీరు అడగండి” అన్నాడు.

రాజును అడిగితే రాజు, "నూరు మాడలు ఇస్తాను. ఆ స్వామిని వదిలేయండి" అన్నాడు. వెంటనే చ్యవనుడు "నా విలువ నూరు మాడలుకాదు" అన్నాడు. మహర్షులలో కొందరి ప్రవర్తన వింతగా ఉంటుంది. అర్ధరాజ్యం ఇస్తానన్నాడు రాజు. "అయినా తన విలువకు సరిపోదు" అన్నాడు చ్యవనుడు. రాజ్యం ఇస్తానన్నాడు రాజు. అయినా తన విలువకు సరిపోదన్నాడు చ్యవనుడు.

అప్పుడు జాలరులు "ఇదేమి విపరీతం" అని ఆశ్చర్యం ప్రకటించారు. ఆయన చెప్పినదీ ధర్మమే! తన విలువ రాజ్యంకంటే ఎక్కువ అయింది.

ఇలా చర్చ జరుగుతుండగా అవిజాతుడు అనే బ్రాహ్మణుడు ఆ సభకు వచ్చాడు. ఈ వింత చూచాడు. "ఓ వెర్రి మహారాజా! రాజ్యం ఇస్తే మాత్రం మహర్షి విలువకు సరిపోతుందా! గో బ్రాహ్మణులు సమానమైన విలువకలవాళ్ళు. అందువల్ల ఒక గోవును జాలరులకు ఇచ్చి చ్యవనుణ్ణి విడిపించు" అని రాజుకు విలువైన సలహా ఇచ్చాడు. జాలరులకు ఆదాయం సున్నా. వారికి ఒక్క గోవు మాత్రము ముట్టింది. రాజ్యం ఇస్తానన్నా ఆ విలువ సరిపోదన్న వాడికి చివరకు ఓ గోవునిచ్చి ఆయనకు స్వేచ్ఛ ఇవ్వవలసి వచ్చింది రాజుకు.

"మేము చేపలు పట్టుకొని అమ్ముకొని జీవించే వాళ్లం కదా! ఆవును మేము ఏంచేసుకుంటాం?" అని జాలరులు అన్నారు. ఆ ఆవును వాళ్ళు రాజు నుండి స్వీకరించి చ్యవనుణ్ణి రాజుకు ఇచ్చారు. ఆవును తిరిగి చ్యవనుడికే సమర్పించారు. ఆయన జాలరులతో, "నా అంతటి వాడికి నాతో సమానమైన వస్తువును మీరిస్తున్నారు. రాజు ఇవ్వలేనటువంటి దానిని, రాజ్యంకంటే విలువైన దానిని, అంటే గోమాతను మీరు నాకు ఇస్తున్నారు. మీ ఋణాన్ని నేను ఎలా తీర్చుకోను? అందుకు ప్రతిఫలంగా మీకు స్వర్గాన్ని ఇస్తున్నాను" అని జాలర్లకు స్వర్గంలోకవాసం కల్పించాడు. వాళ్ళది ఏదో పూర్వం పుణ్యం. ఎందుకు జరిగిందో ఇదంతా! వెంటనే దివ్య విమానంలో స్వర్గానికి వెళ్ళారు జాలరులు.



గోవునైనా, జాలరులకు ఇచ్చి తనను విడిపించిన వాడు రాజు కాబట్టి, ఆయనకు కూడా వరాన్ని ప్రసాదించాడు. "ఈ శరీరం పడిపోయిన తరువాత కొంతకాలం నీకు ఇంద్రపదవి లభిస్తుంది! ఇంద్రుడిగా కొంతకాలం స్వర్గంలో రాజ్యమేలు" అని వరమిచ్చాడు. మరి తన విలువ చెప్పిన బ్రాహ్మణుడికి ఏమి ఇవ్వలేదేమిటి? అనే సందేహం కలుగవచ్చు. ధర్మం చెప్పటం బ్రాహ్మణ ధర్మం. అతడి ఉద్యోగమే అది. అంటే ఎక్కడయినా ధర్మ సందేహం వస్తే, బ్రాహ్మణుడు వెళ్ళి ఇది ధర్మం అని చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోవాలి.

చ్యవనుడి వర ప్రసాదం వలన నహుషుడు కొంత కాలం ఇంద్రుడు అయ్యాడు. స్వర్గానికి వెళ్ళిన తరువాత అశ్వమేధ యాగాలు చేసాడని పురాణాలు చెబుతున్నాయి. ఇంద్ర పదవికి వెళ్ళిన తరువాత యాగాలు చేసాడు. చ్యవన మహర్షి ఇలాంటి అద్భుతమైన పనులు చేస్తూ ఉండేవాడు. అవీ ధర్మ బద్ధంగానే నిర్వహించేవాడు. ఒక్కొక్క మహర్షిలో ఒక్కొక్క మహత్తు వుంటుంది. అది వాళ్ళు ఎన్నుకున్న తపస్సును బట్టి ఉంటుంది. వాళ్ళు కష్టాన్నంతా లోకోపకారం కోసమే ధారపోశారు.

## 'చ్యవనప్రాశ లేహ్యం'

ఆ యుగాలలోనూ ప్రజలు ఆరోగ్యంగానూ, బలిష్ఠంగా, పుష్టిగా ఉండాలని అనుకున్నాడు చ్యవనుడు. వారి వారి పనులు చక్కగా ఏ శారీరక, మానసిక బాధలు పడకుండా, నిర్వహించు కోవాలని ఆయన తపన. ఆయుష్షును వృద్ధిపరచేటటువంటి ఒక ఆయుర్వేద ఔషధాన్ని అశ్వినీ దేవతలు దగ్గర నుంచి గ్రహించి లోకానికి ఇచ్చాడు. చ్యవన మహర్షి ఆయుర్వేదంలో కొన్ని అవసరమైన మూలికలను ఇచ్చి, వాటికి ప్రయోగాలు చెప్పాడని కూడా శాస్త్రం చెబుతున్నది. "చ్యవనప్రాశ" అనేది ఆయన పేరు మీదుగానే నేడు వాడుకలో ఉన్న దివ్య ఔషధము.

ఈ ఔషధం "చ్యవనప్రాశ లేహ్యం' అని తెలియని భారతీయుడు లేడు. నేడు వివిధ ఆయుర్వేద కంపెనీలు, పల్లెటూరిలోని ఆయుర్వేద వైద్యులు, ఈ

ఔషధాన్ని తయారుచేసి ప్రజలకు విక్రయిస్తున్నారు. మహానుభావుడు చ్యవన మహర్షి భారతీయులకు ప్రాతః స్మరణీయుడు, చిరస్మరణీయుడు. చ్యవన మహర్షికి మనం ఋణపడి వున్నాం. ఇది అందరికీ తెలిసిందే! లోకక్షేమం, ఆరోగ్యం కోసం సృష్టించిన ఔషధం 'చవనప్రాశ'.

## లవణాసుర సంహారం – చ్యవనుడి వ్యూహ

ఒకానొక సమయమున మధుడు అనే రాక్షసుడు శివుణ్ణి గురించి తపస్సుచేసి ఒక భయంకరమైన, అజేయమైన శూలమును పొందాడు. ఆ శూలము తన తదనంతరము తన కుమారుడికి ఉపయోగపడాలి, అని కోరుకున్నాడు. శివుడు అందుకు అంగీకరించి, ఆ శూలము చేతిలో ఉన్నంత వరకు వారిని ఎవరూ జయించలేరని వరం ఇచ్చాడు. ఆ ఆయుధము చేతిలో లేకపోతే మాత్రం మరణం తప్పదని చెప్పి శూలం ఇచ్చాడు.

రాక్షసుల వరాలు హింసకు సంబంధించినవే. వారు ఎప్పుడూ తపస్సు చేసినా, అనేక మందిని సంహరించటానికి అనుకూలమైన ఆయుధాన్ని అడుగుతూ ఉంటారు. "ఒక బ్రహ్మాండమైన ఆయుధం నాకు ఇచ్చావంటే దానికి ఎదురు ఉండదు. దానితో ముట్టుకుంటూనే అందరూ చావాలి. బూడిద కావాలి". ఇటువంటి వరాలే అడుగుతారు. వాళ్ళకోసం అడగరు. లోక నాశనం కోసమే అడుగుతారు. లోకంలో ఆకలి లేకుండా చేయమని ఒకడు, లోకంలో తాము ముట్టుకుంటే చనిపోవాలి అని మరొకడు. రాక్షసులు ఇటువంటి వరాలే అడుగుతారు. అందరికీ లోకం మీదనే దృష్టి.

లంకానగర అధిపతి రావణుడి చెల్లెలు కుంభీనసిని మధుడు వివాహం చేసుకున్నాడు. వీరికి లవణుడు (లవణాసురుడు) అనే రాక్షసుడు జన్మించాడు. కొంతకాలం తరువాత మధుడు చనిపోతే ఆ శూలము లవణాసురుడికి వచ్చింది. తన తండ్రికి శివుడు ఇచ్చిన ఆ శూలాన్ని తన పూజామందిరంలో ఉంచి పూజ చేస్తున్నాడు.



లవణాసురుడు పెరిగి పెద్దవాడయిన తరువాత, చేతికి ఆయుధం చిక్కిందని ఆశూలంతో అనేక మంది మహర్షులను, సజ్జనులను బాధ పెడుతున్నాడు. వాడిని ఎవరూ జయించలేక పోతున్నారు. మరీచి, కశ్యపుడు, పులస్త్యుడు, ఋచీకుడు మొదలైన అనేక మంది మహర్షులు కూడా చ్యవనుణ్ణి ప్రార్థించారు. ఈ లవణాసురుణ్ణి సహరించటం ఎట్లాగో మాకు అర్థం కావటంలేదు. నువ్వు సహాయం చేయవలసిందే" అంటే వీళ్ళందరూ కలసి ఈ లవణాసురుడి వృత్తాంతం అంతా శ్రీరాముడికి చెబితే, తన తమ్ముడయిన శతృఘ్నుడికి తన బలంలో సగం ఇచ్చి రాముడు పంపించాడు. అంటే, శ్రీరామావతారం కాలం నడుస్తోంది. ఆ సమయానికి రావణ వధ జరిగి, శ్రీరాముడు అయోధ్యను పాలిస్తున్నాడు.

శతృఘ్నుడేమో లవణాసురుడి వధ కోసం వెళుతూ దారిలో వాల్మీకి ఆశ్రమంలో ఒక రాత్రి గడిపాడు. అక్కడ శతృఘ్నుడికి చ్యవనుడు దర్శనం ఇచ్చాడు. ఆయన "నీకొక ఉపాయం చెప్తాను. లవణాసురుణ్ణి చంపటం అంటే తేలికయిన పనికాదు. వాడి దగ్గర శివుడు ప్రసాదించిన శూలం ఉంది. లవణాసురుడు ఆ శూలంతో మహాబలసంపన్నుడైన మాంధాత అనే చక్రవర్తిని సంహరించాడు. వాడు అజేయుడు సుమా! ఆ రాక్షసుడి దగ్గర ఆయుధం లేనప్పుడు మాత్రమే వాడు మరణిస్తాడు. అది లేని సమయంలో మాత్రమే వాడిని సంహరించాలి అని బోధించి వెళ్ళాడు. అది లేని సమయంలో – రాత్రి సమయంలో – లవణాసురుణ్ణి శతృఘ్నుడు సంహరించాడని పురాణం ఒకచోట చెబుతోంది. లవణాసుర వధకై శతృఘ్నుడికి శక్తినిచ్చి, ఉపాయంకూడా చెప్పినవాడు చ్యవనమహర్షి అలా ఆయన కీర్తింపబడ్డాడు.

మహర్షులు గూడ దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించినవారే. భూలోకంలో ప్రశాంత వాతావరణం కల్పించాలనే వారి తపన. కోవలోకి చెందిన వాడే చ్యవన మహర్షి భృగు వంశంలో పరమ పవిత్రుడై, తపో నిష్ఠా గరిష్ఠుడై, మహాత్ముడై, దేవతలకు సహాయం చేసినవాడు చ్యవన మహర్షి.

ఇంద్రుడిని శాసించిన వాడైనందున చ్యవనుని కీర్తి ప్రతిష్ఠలు చతుర్దశ భువనాలలోనూ వ్యాపించాయి. అంతకు పూర్వం అర్హత లేనటువంటి అశ్వినీ దేవతలకు యజ్ఞాలలో సోమాన్ని ప్రసాదించినవాడు, నిగ్రహానుగ్రహసమర్థుడు. భారతీయ ఋషులలో అందరూ అగ్రగణ్యులే! మహాత్ములే!

మహర్షులు ఏది ధర్మమని చెబుతున్నారో, అది మనం అనుసరిస్తున్నాం తప్ప, వాళ్ళ కోసం చెప్పబడినటువంటి ధర్మాలు ప్రత్యేకంగా లేవు. మహర్షులు ధర్మ బోధకులు. ప్రజలు ఆ ధర్మాన్ని ఆచరించేవారు. మహర్షులు స్వతంత్రులని వాళ్ళను మనం గుర్తు పెట్టుకోవాలి, స్మరించుకోవాలి.

* * *

## 11. నారద మహర్షి

సృష్టికర్త బ్రహ్మ తన శరీర భాగాల నుంచి ఋషులను సృష్టించాడు. బ్రహ్మ తన మెడ నుంచి నారదుణ్ణి పుట్టించాడు. నారదుడి జన్మను గురించి భాగవతం చెబుతున్న కథ ఇది. నారదుడు జన్మించిన వెంటనే తల్లిదండ్రులను చూచాడు. బ్రహ్మను చూడగనే ఆయన తపస్సులో ఉన్నాడు. ఆయన మాట్లాడలేదు. తల్లి, సరస్వతి అమ్మవారు మాత్రం తనవైపు వాత్సల్యంతో చూస్తోంది. సరస్వతీ దేవి దగ్గరకు వెళితే ఇతనికి గాన విద్యను ఇచ్చింది. ఆ సంగీత విద్యను – గాన విద్యను ఆయన స్వీకరించి దానిని అభ్యసించి ఉత్తీర్ణుడైనాడు. నారదుడు మరుత్తులు పరిపాలించే లోకాలకు వెళ్ళాడు. అక్కడ వాయుదేవుడు కనుపించాడు.

వాయుదేవుడు నారదుడితో “నాయనా! నువ్వు శారదాదేవి దగ్గిర సంగీతాన్ని నేర్చుకున్నావు. ఇతర విద్యలన్నీ నేర్చుకున్నావు. నీకు ‘మహతి’ అనే వీణను ఇస్తున్నాను” అని అంటూ మహతిని ఇచ్చాడు. నారదుడు ఆ వీణను తీసుకొన్నాడు. తన కంఠాన్ని ఆ వీణతో లయం చేశాడు. ఏదో అద్భుతమైన నాదం అందులోంచి వినిపిస్తున్నది. ఆనందంలో ఉన్నాడు నారదుడు. ఎట్టి ప్రపంచ స్పృహలేదు. ఆయనకు తను, తన సంగీతం, తన వీణ అంతే, అదే లోకం ఆయనకు. ఆమూడు వస్తువులు ఒకే శృతిలో ఉన్నాయి. కాలక్రమేణా నారదుడు సప్త స్వరాలుగా ఆ నాదములను ఏడు భాగాలుగా చేయగలిగాడు. అవి మధ్యమ, పంచమ, గాంధార, ఋషభ, ధైవత, షడ్జ, నిషాదములు. సంగీతానికి ఆయన తండ్రి. ఒకటిగా ఉన్న నాదాన్ని ఏడు విభాగాలుగా చేసి, దానికి స్వరభేదం కల్పనచేసి, రాగములు అనేకములను ఆయన సృష్టించాడట.

ఆ విధంగా అనేక శుద్ధ రాగములను సృష్టించి భైరవి, భూపాళ, శ్రీరాగ, పడవంజరములు, వసంతము, ముళిని, బంగాళి, నాట, దేవక్రియ, మేఖరంజి,

మలహరి, జాళి, హిందోళము, భల్లాట, నవనీత, ఝుంకార ధ్వని, నాదనామ క్రియ, మరాళ, మంగళకౌశకి, గుండక్రియ, ఘూర్జరి, ధన్యాసి, శంకరాభరణము మొదలైన రాగోపరాగములు (అనేక రాగములను) నారదుడు సృష్టించాడు.

సంగీతానికి స్వరములే సరిపోవుకదా! అందుకని ఆయన కొన్ని వాయిద్యాలను కూడా సృష్టించాడు. మృదంగం, వేణువు ఈ విధంగా ఇటువంటి వాయిద్యాలను కూడా వర్ణించి ఆయన బ్రహ్మదేవుడికి చెప్పినవి, సాక్షాత్తు చదువుల తల్లి సరస్వతీదేవి తనకు బోధించిన జ్ఞానం నుండే ఆ వాయిద్యాలన్నీ ఆమె అంతరంగంలో ఉండి నిద్రిస్తున్నాయి. నారదుని జన్మతో అవి అన్నీ బయటకు వచ్చాయి. ఆ సంగీత విద్యను గ్రహించాడు.

పై విషయాలను పరిశీలించి విశ్లేషిస్తే సంగీతానికి, వాటి రాగములకు అంకురార్పణ చేసిన మహర్షి నారదుడు అని తెలుస్తోంది. ఈ సంగీత విద్య అంతా ఆయన తల్లి సరస్వతీదేవి - శారదాదేవి అనుగ్రహము, ఆశీస్సులే. నేడు లోకానికి సంగీతామృతాన్ని అందించిన వాడు నారద మహర్షి. దాన్ని ఆశ్వాదిస్తూ, గ్రోలుతూ ఆనందిస్తున్నారు ప్రజలు.

కొంత కాలం తరువాత నారదుడు, తనకు భూలోక సంచారం చేయాలని సంకల్పించి బయలు దేరాడు. ఆయన త్రిలోకసంచారి. అలా సంచారంచేస్తూ నారాయణ సరస్సు అనే పేరుగల ఆశ్రమానికి వెళ్ళాడు. నారాయణ సరస్సు హిమాలయ పర్వత ప్రాంతాలలో ఉన్నది.

ఆ ప్రాంతంలో దక్షప్రజాపతి కుమారులు తండ్రి అనుమతి ప్రకారము ప్రజలు పుట్టాలనే కోరికతో మహోగ్ర తపస్సు చేస్తున్నారు. నారదుడు వాళ్ళ దగ్గరకు వెళ్ళి "ఎవరు మీరు? ఎందుకు తపస్సు చేస్తున్నారు?" అని అడిగాడు వాళ్ళు ఆయనతో, "మా తండ్రి మమ్మల్ని చాలా మంది సంతానాన్ని కనటం కోసమని తపస్సు చేయమని ఆజ్ఞాపించాడు" అన్నారు.



వాళ్ళతో నారదుడు "తపస్సు అందరూ జ్ఞానం కోసం చేస్తారు. సంసారం అక్కరలేదని తపస్సు చేస్తారు. మీ నాన్న ఇలా చెప్పటమేమిటి. అని వాళ్ళకు జ్ఞానోపదేశం చేసి, ఆ తపస్సు మానిపించాడు. అంతేగాక వారికి యోగ మార్గాన్ని ఉపదేశించి స్వర్గానికి, బ్రహ్మలోకానికి వెళ్ళె మార్గాన్ని ఉపదేశించాడు. వాళ్ళు అయన చెప్పినట్లుగానే చేసి కొద్ది కాలంలో మోక్షం పొందారు.

ఇది ఇట్లు ఉండగా, నారదుడు స్వర్గానికి వెళ్ళి దక్షుడితో "నీ కొడుకులకు నీవు ఇలా దుర్భోధ చేశావు. వాళ్ళకు నేను జ్ఞానబోధ చేసాను. వాళ్ళు అ మార్గంలో తరించి వెళ్ళారు." అని చెప్పి తను వచ్చిన దారిన వెళ్ళాడు. దక్షుడు ఏంచేస్తాడు ఇతడు చేసింది అధర్మ మేమికాదు. మరి ఏమంటాడు. కొడుకులను పొట్టన పెట్టుకున్నాడని తిట్టుకుని బ్రహ్మ దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేశాడు దక్షుడు.

బ్రహ్మ ఆయనను ఓదార్చాడు. పోనీలే, పొయ్యేవాళ్ళు పోయారు. ఎందుకు రోదిస్తారు? నీకు శబళాశ్యులు అనే పేరుతో అనేక వేలమంది పుత్రులు కలుగుతారు" అని బ్రహ్మ దక్షుడికి వరం ఇచ్చాడు. బ్రహ్మ ఇచ్చిన వరంతో దక్షుడికి తిరిగి సంతానం కలిగింది. వాళ్ళనుగూడా దక్షుడు సృష్టికొరకు తపస్సు చేయమని ఆజ్ఞాపించాడు. వాళ్ళు అలాగే తపస్సు చేస్తున్నారు. నారదుడు మళ్ళి వెళ్ళి వాళ్ళకు కూడా ఇది వరకు వలెనే బోధచేశాడు. వాళ్ళు కూడా తపస్సు చేయుట మానివేశారు.

ఈ విషయం తెలుసుకొన్న దక్షుడు నారదుడి దగ్గరకు వెళ్ళి ఆయనతో "నువ్వు నాకు మహా అపకారం చేశావు. లోకానికే తీరని అపకారం ఇది. వీళ్ళు బతికిబట్టకట్టడం పది కాలాలపాటు ఉండి, సంతానం కని, యజ్ఞ యాగాది క్రతువులు చేస్తే దేవర్షి గణాలందరికీ ఉదకాలు దొరికేవి గదా! వాళ్ళు చేయాల్సిన సత్కర్మ, వైదికకర్మనంతా నిరోధించి వాళ్ళకు ఏ లోకంలోనూ స్థితి లేకుండా చేశావు. ఇందువలన మోక్ష మార్గం చూపించి, దేవ లోకానికి, పితృలోనికి, భూలోకానికి కూడా అపకారం చేశావు. నువ్వు అందరికీ గొప్ప

హానిచేశావు. నీవు భాగవతోత్తముడివే కావచ్చు. కాని దీనివలన నీకు అపకీర్తి వస్తుంది. మంచి కీర్తి రాదు. కలహ నారదుడు అని పేరు వస్తుంది.

నారదుడు దక్షుడితో "నువ్వు ప్రజాప్రతినిధిగా ఉండి ఎవరికీ మోక్షం లభించకుండా మోక్ష మార్గాన్ని నిరోధిస్తూ దుష్టమైన నామాన్ని ప్రేరేపిస్తున్నావు. వాళ్ళను కామ మార్గంలో పెడుతున్నావు. నువ్వు ఎంత అధర్మం చేస్తున్నావో తెలుస్తున్నదా! నీకు?" అని అడిగాడు.

దక్షుడు నారదునితో "అలా ఏమీ కాదు! తీక్షణమయిన విషయ సుఖ దుఃఖాలను అనుభవించిన తరువాత గాని, ముముక్షుత్యం మనుష్యులకు రాకుండును గాక! అందుచేత గురువు చెప్పిన తరువాత కూడా, తీవ్రమైన సంసార క్లేశం అనుభవించిన తరువాత, గురువు చేసిన బోధ వారికి అంతరంగంలోనే ఒక వివేకాన్ని కలిగిస్తుంది. దీనిని వదిలిపెట్టు.

నిస్సంగానికి వెళ్ళిపో అని చెప్పగానే, వాళ్ళు నివృత్తి మార్గాన్ని అనుసరించకుందురుగాక! బోధచేసిన తరువాత కూడా వాళ్ళు ఈ సంసారంలోపడి దుఃఖాన్ని, సుఖాలను బాగా తీవ్రంగా అనుభవించిన తరువాతనే గురువాక్యం వారికి అవగతమగును గాక! ఇప్పుడైతే సులభంగా నువ్వు చెప్పావు. వాళ్ళు వెళ్లిపోయారు. ఇంక ఎప్పుడు అలా జరుగదు అన్నాడు. అంతేగాక, ఇప్పటిదాకా నువ్వు ఎక్కడ ఉంటే అక్కడ ప్రమాదంగా ఉంది. కనుక నీవొక నిలకడ లేకుండా ఉందువుగాక! ఎప్పుడు త్రిలోక సంచారిగా ఉంటావునువ్వు" అని కూడా అన్నాడు దక్షుడు.

దక్షుడి శాపాన్నివిని నారదుడు చాలా సంతోషించాడు. ఆయనతో నారదుడు "నేను అడిగిన వన్నీ ఇచ్చావు నీవు, హాయిగా ఎప్పుడూ తిరగమన్నావు. బోధచేస్తూనే తిరుగుతూ ఉంటాను. ఆ తర్వాత నేను సంసారక్లేశం అనుభవించి బాగుపడుతానన్నావు కదా ! అది చాలు దివ్యమైన మార్గాన్ని ఉపదేశించావు. బాగుంది అలాగే చేస్తాను" అన్నాడు నారదుడు.



నారద మహర్షి జ్ఞాని కనుక దక్షుడితో అవిధంగా మాట్లాడ గలిగాడు. తరువాత అక్కడినుంచి వెళ్ళిపోయాడు. బ్రహ్మచారిగా త్రిలోకాలు తిరుగుతూ లోపల, బయట ఎప్పుడూ కూడా శ్రీ మహా విష్ణువును ధ్యానం చేస్తూ ఆయనను దర్శిస్తున్నాడు. సరస్వతి ప్రసాదించిన సప్తస్వరాలతో కలిపిన సంగీతాన్ని "మహతి" అనే వీణపై శృతిచేసుకుంటూ ముల్లోకాలు తిరుగుతున్నాడు. నిర్లిప్తతతో ఉండి పోయాడు. విష్ణువుకు నారదునిపై అనిర్వచనీయమైన వాత్సల్యం ఉంది. ఆయన తలచుకుంటే విష్ణువు కనపడేవాడు. అటువంటి స్థితిలో వెళ్ళాడు నారదుడు. నారదుడు ఆకాశమార్గంలో సంచరిస్తున్నా, ఎవరిదగ్గరకు వెళ్తున్నా ''నారాయణ నారాయణ'' అను నామం ఉచ్చరిస్తూంటాడు. నారాయణుడే నారదునికి సర్వదా రక్ష

**భాగవత రచన - నారదుడి ప్రేరణ**

ద్వాపరయుగం ప్రవేశించింది. వ్యాసమహర్షి వేదాలు విభజించాడు. 18 పురాణాలు రచించాడు, ఉపపురాణాలు వ్రాశాడు, మహాభారతం 18 పర్వములు రచించాడు. ఇంకా అనేక గ్రంథాలు రచించాడు. ఇంత మహత్ గ్రంథాలలోని ధర్మాలు వివరిస్తూ వ్రాసినా ఆయనలో ఏదో తెలియని అశాంతి చోటుచేసుకుంది. జగత్పూజ్యుడు, జగద్గురువు అని ఎవరినయితే గౌరవిస్తారో, అటువంటి వారికి ఒక వేదన కలుగుతుంది. "నన్ను గురువు అని నమస్కారం చేస్తున్నాడు. ఇతడి నమస్కారానికి నేను అర్హుణ్ణేనా? ఇతడికి చెప్పవలసినవన్నీ చెప్పానా? ఇతనికి నా వలన ఏ ఉపకారమైనా జరిగిందా? నా హితబోధ పూర్తి అయిందా" అనే వేదన గురువుకు ఉంటుంది. నమస్కారం స్వీకరించటం సులభమే కానీ దానికి ప్రత్యుపకారం చేయటం అంత తేలికగాదు. అశీర్వచనం చేయాలి. అది కూడా మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలి. ఇందులో శక్తి ఉండాలి. తపస్సు ఉండాలి. చిత్తశుద్ధి ఉండాలి. ఇది తెలికైన విషయమా! నమస్కారం ఎంతో సులభం.

జగత్తులో అందరూ వ్యాసమహర్షికి నమస్కరించారు. సృష్టిలో ఉండే విజ్ఞానాన్నంతా మాకు ఇచ్చావు మహర్షీ! మమ్మల్ని ధన్యులను చేశావు" అని స్తోత్రం చేశారు. సంఘంలో అట్టడుగున ఉండేవారిని సులభమైన సర్వ సామాన్యమైన మోక్షమార్గానికి ఉపదేశాన్ని నేను చేశానా? అని ఆయనకు ఒక వేదన కలిగింది. జరిగినదంతా ఒకసారి వ్యాసమహర్షి ఆత్మావలోకనం చేసుకొని అశాంతి, మానసిక వ్యథతో ఉన్నాడు.

ఆ సమయంలో వ్యాసమహర్షి వద్దకు త్రిలోక సంచారి నారదమహర్షి వచ్చాడు. నారదుణ్ణి వ్యాసుడు ఉచితాసనమున కూర్చుండబెట్టి సత్కరించి నారదునితో "నారదా! నేను వేదాలు విభజించాను, అష్టాదశ పురాణాలు, భారతము రచించినాను. కాని నా మనస్సు శాంతిని పొందలేదు. మానసికంగా ఏదో పోగొట్టు కున్నట్లు, అశాంతికి గురి అవుతున్నాను. ఇందుకు కారణం ఏమిటి?" అని అడిగాడు. వెంటనే నారదుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

"వ్యాసమహర్షీ! నీవు ఎన్ని వ్రాసినా, శాస్త్రములు వ్రాసినా, సలహాలు ఇచ్చినా, భగవంతుణ్ణి గురించి భగవద్భక్తుల గురించి ఏమీ వ్రాయనందున నీకు శాంతి లభించలేదు. కావున భగవంతుడి లీలలు, మహిమలు, చరిత్ర, వరాలివ్వటం భక్తుల గాథలు తెలియచేసే భాగవతమును తక్షణమే రచించవలసింది. తర్వాతే నీకు మానసిక శాంతి లభించగలదు." మానసిక బాధతో ఉన్న వ్యాసమహర్షికి ఒక మానసిక శాస్త్ర నిపుణుడుగా నారదమహర్షి ఉపదేశం చేశాడు. శ్రీ భాగవతమనే దివ్యౌషధాన్ని రచించి వ్యాసుల వారు కలియుగంలో మానవులకు సద్గ్రంథాన్ని అందించాడు.

మనశ్శాంతిని పొందటానికి భాగవతం మంచి మార్గాన్ని చూపిస్తుందనుటలో సందేహం లేదు. వ్యాస మహర్షి అంతటి వాడికి శాంతిని పొందటానికి భాగవతం ఒక సాధనగా ఉపయోగపడింది. ఇక సామాన్య మానవుడి సంగతి



చెప్పాలా? మానవజాతి భక్తిని పెంపొందించుకొని, ముక్తి మార్గం చేరటానికి భాగవతం ఒక దివ్య ఔషధమని చెప్పక తప్పదు.

మాధవుడికి మానవులకు భక్తి సంబంధాలు పెంపొందించటానికి భాగవతం ప్రచార సాధనంగా ఉపయోగపడుతుంది. ఈ ప్రచారానికి అంకురార్పణ చేసిన మహనీయుడు నారద మహర్షి.

## దేవతలు - మంత్ర స్వరూపులు

పూర్వకాలంలో పృథు చక్రవర్తి మనుమడు ప్రాచీన బర్హి అనేక యజ్ఞాలు చేశాడు. గొప్ప కర్మిష్ఠి!. ఒక రోజు నారదుడు ఆయన దగ్గరకు వెళ్ళి "రాజా! కర్మకు ఆధీనుడవైన నీవు ఏ శ్రేయస్సును ఆశిస్తున్నావు? ఇన్ని యజ్ఞాలు చేస్తున్నావు! చాలా బాగుంది. కానీ, నీవు పొందదలచుకున్నది ఏమిటి? దేనిని కోరి ఇవ్వన్నీ చేస్తున్నావు? నీకు ఆయుర్ధాయం ఇంకా చాలా ఉంది. ముందు ముందు నూరు యజ్ఞాలు చేస్తావు. నీకు విజ్ఞానం అంతా ఉంది. ఇంతకూ నీకు ఏది కావాలి?" అని అడిగాడు నారదుడు.

వెంటనే ప్రాచీనబర్హి "స్వామీ! నారదా! నాయందు ఇంత దయతో వచ్చావు. ప్రశ్న వేశావు. ప్రశ్నకు సమాధానం నేను చెప్పలేను. కాబట్టి నేను ఏది ఆశించాలో నువ్వే చెప్పాలి" అంటూ జ్ఞాన బోధను కూడా అడిగాడు.

నారదుడు ఆయనకు ఆధ్యాత్మిక తత్త్వమంతా వివరించి "రాజా ప్రాగగ్రములు అయినటువంటి ధర్భలతో ఈ భూమినంతా కప్పేశావు. అన్ని యజ్ఞాలు చేశావు. నీకు ఇంత చేసాననేటు వంటి అహంకారం రాలేదా! నేను చేశానని చెప్పి ఎప్పుదు సగర్వంగా, సంతోషంగా ఉంటారు కదా! ఇన్ని యజ్ఞాలు నామాదిరి ఎవరు చేశారు అని అనుకుంటున్నావు! దాని వలన నీకు వచ్చిన లాభం ఏమిటి? ఏది కోరి చేసావో తెలియకుండానే ఉన్నావు ఇప్పటికీ కూడా! ఇలాగే చేస్తూ ఉంటావు ముందు ముందు కూడా! ఏది కోరి చేయాలో తెలియనటువంటి వాడివి నువ్వు, ఏ పరమార్థంతో వేదం ఇవన్నీ

చేయమంటున్నది? ఎంత కాలం చెయ్యాలి? చివరగా ఎక్కడ ముగించ మంటున్నది? ఏంకోరుకోమ్మంటున్నది? వేదవాక్యం మాత్రమే విన్నావు. ఎక్కడ ముగించాలో తెలుసుకుని మరీ ఆచరించమని కదా పెద్దలు సలహా ఇస్తున్నారు. "సర్వేశ్వర పారితోషక" మేదో, అంటే సర్వేశ్వరుణ్ణి సంతోషపెట్టేది ఏది ఉందో దానికే ఉత్కృష్టకర్మ అని పేరు" అని బోధ చేశాడు.

దేవతలను పరమేశ్వరుని అంగాలుగా భావిస్తేనే సత్ఫలితం కలుగుతుందని తెలుసుకోవాలి. ఇతడే దేహాలలో ఆత్మగా ఉన్నాడు. భువనముల స్వరూపము అతడే. వాటి అధిపతి కూడా అతడే. అతడు నియామకుడిగా కూడా ఉన్నాడు. 'యన్తాచమే ధర్తాచమే క్షేమశ్చమే' అనే మంత్రానికి అర్థం, "అతడే నాకు నియామకుడు! నేను ఏం తినాలి? ఎక్కడ ఉండాలి? ఎలా బతకాలి? అనేవి నిర్ణయిస్తూ నాకు నియంతగా ఉన్నాడు. అతడియందు ఆ అధీనవృత్తినాకు ఉంది. నాకు అతడు ధర్త? - అంటే నన్ను ధరించిన వాడుగా ఉన్నాడు. ఆవిధంగా పరమేశ్వరుడు నాకు 'యక్త' (నియంత)గా, 'ధర్త' (ధరించినవాడు)గా ఉండటంచేత, నాకు 'క్షేమం' కలుగుతుంది (క్షేమశ్చమే) అని 'ఇలాంటి భావనతో ఎవరయితే ఉంటాడో, అతడిని వేదమాత రక్షిస్తుంది. అప్పుడు ఈ కర్మలన్నీ అర్థవంతమై మంగళ ప్రదమవుతాయి. 'అన్నాడు నారదుడు ప్రాచీనబర్హితో.

నారదుడు అతనిని ఈ విధంగా గూడ హెచ్చరించాడు "రోజు రోజుకూ మృత్యువుదగ్గరకు వస్తోంది. నువ్వు దేనికి ఆనందంగా ఉన్నావు. ఆయుర్దాయం క్షణంక్షణం గడచిపోవటంలేదా! నిన్నటి కంటే మృత్యువు ఈ రోజు ఈ వేళ దగ్గర పడుతోందిగదా! ఏం చేస్తూన్నానని మురిసిపోతున్నావు?'' అని హెచ్చరించాడు నారదుడు

"కనుక కామ్యకర్మలు వదలి నీవు చేసిన కర్మలు ఎవరిని గురించి చేసావో, వాటి గతి ఎలా పరిణమిస్తుందో తెలుసుకో! సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి" అంటే సర్వదేవ నమస్కారములు ఆ కేశవుడినే చేరుతాయి.



అంతేకాదు, సర్వనమస్కారములు ఎవరు ఎవరికి చేసినా, లోపలి వస్తువునకు, అంటే అందరిలోపల ఉండే కేశవునికే చెందుతాయి. అదిక్షేమకరం కాబట్టి నీవు ఇంద్రియలోలుడవై ఉండవద్దు, అలా ఉంటే అది మృగచేష్టతో సమానం సుమా!" అని చెప్పాడు.

"అంతా అసత్పదార్థముతో నిండిన ఈ దేహం నాది అనుకోరాదు. ఈ అసత్పదార్థములతో ఎలాగైనా, ఎప్పటికైనా వియోగం తప్పదు. ఈ అసత్పధార్థమునందున్న మనసుని వదిలిపెట్టి, శాశ్వతమైన, సమస్త జీవకోటికీ ఆశ్రయుడైన ఆ పరమేశ్వరుడిని ధ్యానిస్తూ ఈ లౌకిక జీవనవిధానములో అన్నిటియందూ విరక్తుడివై తరించు". అని నారదుడు ప్రాచీనబర్హికి బోధచేశాడు.

నారద మహర్షి అంతటి వాడు బోధ చేసేటప్పటికి, ప్రాచీనబర్హి భక్తితో నిస్సంగుడై, అంతర్ముఖుడై తపస్సు చేసి ఈశ్వరుణ్ని చేరుకున్నాడు. ఇదంతా భాగవతం చతుర్థస్కంధంలో ఉంది.

## నారదుడు - ధర్మరాజు - ధర్మాలు

నారద మహర్షి ద్వాపరయుగంలో ఒక సారి ధర్మరాజు దగ్గరికి వెళ్ళాడు. ధర్మరాజుతో రాజసూయ యాగం నిర్వహించటం మొదలైన విషయాలు అన్నీ చర్చించారు. ఆ సమయంలో నారదుడు వర్ణాశ్రమ ధర్మాలన్నీ ధర్మరాజుకు బోధించాడు. "నాలుగు వర్ణాలవారికి కొన్ని సామాన్య ధర్మాలు ఉన్నాయి. సత్యము, దయ, ఉపవాసాలు, తపస్సు మొదలైనవి. ఉపవాసము అంటే రెండు రోజులు ఏమి తినకుండా ఉండటము. అ మర్నాడేమో ఒక్కసారి తినటంకాదు. సదోపవాసి, నిత్యోపవాసి అని ఒకటి ఉంది. ఎప్పుడూ మితంగా తినేవాడు సద్యోపవాసి, అతడికి ఏకాదశి ఒక్కటే, పూర్ణిమ ఒక్కటే. ఎప్పుడు మితంగానే తినాలి. అది ఉత్కృష్టమైన వ్రతమని చెప్తారు. శౌచము, సదసద్వివేకము, మనోనియమము, బాహ్యమైన ఇంద్రియ జయము మొదలైన లక్షణాలు కలిగి ఉండాలి. జపమంటే ఏదో కోరికలను ఆశ్రయించి ఒక లక్ష

జపం చేయటముకాదు. యథోచిత జపం అంటే ఇష్ట దైవాన్ని ఎప్పుడూ సంతుష్టితో సుష్టుగా ప్రార్థించటం అని అర్థం. దాని వల్ల ఫలం తక్కువేమీకాదు. బ్రాహ్మణుడు తపోదాన యజ్ఞాదులవలన ఏఫలాన్ని పొందుతాడో, అటువంటి ఫలాన్నే ఆయన అనుగ్రహంచేత ఇట్టి జపంచేసినవాడు కూడా పొందగలడు." ఈ విధంగా పరమార్థం బోధించాడు ఆయన.

మరొక సందర్భంలో, ధృతరాష్ట్రుడితో బాటు ఇతరులు కూడా అరణ్యంలో చనిపోయారనే వార్తను నారదుడే ధర్మరాజుకు చెప్పాడట. ధర్మరాజు స్వర్గానికి వెళ్ళిన తరువాత కూడా తన మిత్రులెవరూ కనపడటం లేదని దుఃఖపడుతుంటే, నారదుడు ఆయనకు స్వర్గంలో దర్శనమిచ్చి, "నీ యందు మైత్రి కలిగి ఉన్నవాళ్ళు, నీకు ఎవరియందు స్నేహము ఉందో వాళ్ళు ఇదిగో ఇక్కడే ఉన్నారు," అని చూపిస్తే ధర్మరాజుకు అక్కడ వాళ్ళు కనపడ్డారు. కాని తనంతట తనకు కనబడలేదు వాళ్ళు. అంతటి మహత్తు నారదుడిది.

ఇలా ఆయనను గురించి చాలా కథలు ఉన్నాయి. పురాణేతిహాసాల్లో నారద మహర్షిది సుదీర్ఘమైన జీవితం. ఆయన చిరంజీవి. అనేక పురాణ ఘట్టాల్లో, గాథలలో, భగవంతుడి అనేక అవతారాలలో ఆయన జీవించి అనేక దైవకార్యాలు చేసినటువంటి మహాత్ముడు. కాబట్టి ఆయన చరిత్ర సుదీర్ఘంగా ఉంటుంది.

రామాయణ, భారత, భాగవతములు నారదుడి ప్రేరణ వలన గ్రంథాలుగా భారతావనిలో మానవాళికి అందించిన ఘనత ఆయనదే.

## భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు

నారద మహర్షి త్రిలోక సంచారం చేస్తూ అనేక మందికి భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు బోధించాడు. ఆయన పరమ భాగవతోత్తముడు. తనకంటూ స్వంత పని ఏమీ లేదు. మహర్షులకు కూడా ఒక్కొక్కసారి ఏదయినా పొరబాటు



భావాలు, విస్మరణ కలిగినపుడు, విస్మృతి కలిగినపుడు భగవద్విలాసాన్ని గురించి వాళ్ళకు చెబుతూ వాళ్ళను ప్రశాంత చిత్తులను చేశారు నారద మహర్షి.

అకంపనుడు అనేవాడు మృత్యువును గురించి దుఃఖపడుతుంటే "మృత్యువు అంటూ ప్రత్యేకంగాలేదు అది నీ భావనలోనే ఉంది" అని అతడికి అవగాహన కలిగేవిధంగా బోధించాడు నారదుడు. మహాత్ముడైన, సంజయుడికి గూడ షోడశ మహారాజుల చరిత్రను, తత్త్వజ్ఞానాన్ని గురించి విశదపరచాడు.

ధ్రువుడు, తపస్సుకు వెళుతుంటే, ఆయనకు నారదుడు "అష్టాక్షరీ నారాయణ" మంత్రం ఉపదేశించాడు. దర్శనము కలిగేటటువంటి తపః ప్రభావాన్ని ఆయన ప్రసాదించాడు. ఏకాగ్రతను, యోగాన్ని, మంత్ర దృష్టిని, దర్శన శక్తిని కల్పించాడు.

## రామలక్ష్మణులకు సహాయం

రామ లక్ష్మణులు ఇద్దరూ యుద్ధంలో ఇంద్రజిత్తు చేతిలో నాగాస్త్రంతో బంధింపబడ్డారు. అటువంటి సంఘటనలు యుద్ధంలో ఎంతటి వారికి అయినా సహజంగానే సంభవిస్తాయి. వారికి దాని నివారణోపాయం గుర్తుకు రాకపోవచ్చు. ఎప్పుడు గుర్తుకు వస్తుంది? ఆ భాధ అనుభవించే యోగం పోతేనే, ఎవరో ఒకరు గుర్తుకు తెస్తారు. కర్మబద్ధులై కష్టపడవలసిందే.

అలా నాగాస్త్రంతో బంధింపబడి ఉన్న రామలక్ష్మణుల దగ్గరకు నారద మహర్షివచ్చి "ఏమిటి ప్రభూ! ఇలా నిర్వీరంగా ఉన్నారు. మీలాంటి మహాపురుషులు ఇలా పడివుండుట యేమిటి? నీ భక్తుడు, నీ సేవకుడు అయిన గరుత్మంతుడు ఉన్నాడు. అతణ్ణి పిలువు స్వామి ఒక్క మాటు, ఈ నాగాస్త్రాన్ని ముక్కలు చెక్కలుగా ఛేదించి వెళ్ళిపోతాడు అని గుర్తుచేసాడు. ఆ గరుత్మంతుణ్ణి శ్రీ రాముడు స్మరించగానే అతడు వచ్చి నాగాస్త్రాన్ని క్షణంలో ఛేదించి వాళ్ళను విడిపించాడు. అప్పటికి ఆస్ఫూర్తిని వాళ్ళకు ఇవ్వటం

మహోపకారం. ఇటువంటి కార్యాలన్నీ నారదుడు నిత్యము నిర్వహిస్తూనే ఉన్నాడు.

నారదునికి గల సమయ స్ఫూర్తివలన రామలక్ష్మణులకు విముక్తి కలిగింది. ఇలాగా ఆయన అనేక మందికి సహాయం చేసాడు. ఆయన చరిత్ర పూర్తిగా వివరించటం ఎలా సాధ్యం అవుతుంది. ప్రతి కథలోను ప్రతి యుగంలోను ఆయన ఉంటాడు. ఎంత మందికో ఎన్నో భోదనలు చేసాడని పురాణాలు చెబుతున్నాయి.

**అనిరుద్ధుడు ఎక్కడ - నారదుని సమాధానం**

శ్రీకృష్ణుని కొడుకు అనిరుద్ధుణ్ణి బాణాసురుడు ఎత్తుకొని వెళ్ళాడు. కొడుకుని వెతికించమని రుక్మిణీ శ్రీ కృష్ణునితో చెప్పింది. ఆయన సరే అన్నాడు. కానీ దివ్యదృష్టితో చూచె ప్రయత్నం ఏది చేయలేదు.

అయితే అదే శ్రీకృష్ణుడు తనకు విద్య నేర్పిన గురువుగారు - విద్య పూర్తయిన తరువాత, తాను గురుదక్షణ కోరుకొమన్నాడు "చాలా కాలం క్రితం మృత్యుదేవులు నా కొడుకును ఎత్తుకు పోయారు, వాడిని మళ్ళీ తెచ్చిపెట్టు!" అని కోరాడు. మృత్యులోకంతో సహ ముల్లోకాలు వెతికి చివరకు ఆ కొడుకును కనిపెట్టి సజీవంగా తీసుకొచ్చి గురువుగారికి అప్పగించాడు. అది గొప్పచరిత్ర. ఆలాంటి వాడు తన కొడుకును ఎవరో ఎత్తుకు పోతే తనకు తెలియదు అని రుక్మిణితో అన్నాడు చిత్రంగా ఉంటుంది జ్ఞానుల ప్రవర్తన.

వెంటనే రుక్మిణి నారదుణ్ణి స్మరించింది. ఆయన తక్షణమే ప్రత్యక్షమైనాడు. ఆయనతో రుక్మిణి "నా కొడుకును ఎవరో ఎత్తుకు వెళ్ళారు" అని ఆందోళనపడుతూ చెప్పింది.

నారదుడు ఆమెతో తాఫీగా "ఆ ఏమి లేదు" నీ కొడుకు బాణాసురుడు కూతురు ఉష దగ్గర ఉన్నాడు. బాగా సుఖంగా పెళ్ళి కుమారుడుగా



ఉన్నాడు. నీ కొడుక్కి వచ్చిన ఆపద ఏమి లేదు నిశ్చింతగా ఉండమని ధైర్యము చెప్పాడు. అతడి వృతాంతమంతా వివరించాడు నారదుడు.

**కంసుడు మరణం - నారదుని చిట్కా**

కంసునికి తన పూర్వజన్మ వృతాంతమంతా చెప్పాడు నారద మహర్షి చెప్పి "ఊరకే భయపడితే లాభంమేమిటి?" ఆకాశవాణి చెప్పింది నిజము అవునో కాదో ఎవరికి తెలియదు. నీవు ఎంతో మహాపరాక్రమశాలివి. ఎవరో చిన్నపిల్లవాడు రావటమేమిటి? చంపడమేమిటి! ఒక వేళ పెరిగి పెద్దవాడై బలవంతుడైతే అప్పుడు చంపుతాడేమో! ఈ మాత్రం నీవు ఆలోచించలేదా! వాడిని ఏదో వంకన ఒక మాటు ఇక్కడికి పిలిపించి సంహరించు. కేవలం 11ఏళ్ళ బాలుడు కదా అతడు. అని కంసుడికి భోదించాడు నారదుడు. ఆ ప్రకారంగానే వెంటనే కృష్ణుడికి గూడా బోధచేసి ప్రేరేపించి కంసుడి దగ్గరకు పంపించాడు నారదుడు. ఇద్దరికి హోరాహోరి యుద్ధం జరిగింది. యుద్ధంలో కంసుడు మరణించాడు.

నారదుడు కంసుడికి, శ్రీకృష్ణుడికి కలహం కలిగించాడు. యుద్ధములో కంసుడు మరణించటం, మేనళ్ళుడైన శ్రీకృష్ణుడి చేతిలో కంసుడు మరణిస్తాడని చెప్పిన జోస్యం ఫలించింది.

ఇటువంటివన్నీ నారదమహర్షి లోకోపకారం కోసం తలపెట్టిన పనులే! ఇవన్ని ఎవరు చేయగలరు, అసలు విషయమేమిటంటే సృష్టిలోని అందరికీ కూడా నారదమహర్షి అంటే అపరితమైన పూజ్య భావం, గౌరవము ఉన్నాయి. ఆయన త్రికాలవేది. ఆయన చెప్పింది మంచి వాక్యమే. నా మేలుకోరే చెబుతున్నాడు అనే విశ్వాసం ఉంది వాళ్ళకు. ఆయన మాట, సలహా, సహాయం వారికి శిరోధార్యం.

దుర్మార్గులు, పాపముచేసిన వాళ్ళు కొందరు చిరంజీవులుగా ఆరోగ్యంగా ఉంటారు. ఎందుకంటే వాళ్ళకు పుణ్యం చాలా ఉంటుంది అది పూర్వపుణ్యం.

ప్రస్తుతం చేసేది పాపం వాడిచిట్టాలో ఉన్న అమితమైన పుణ్యం తగ్గితే తప్ప వారిని ఎవరు ఏమి చేయలేరు. ఆ పుణ్యం కూడా పోవాలంటే వాడి చేత ఏదో తక్షణం మహా పాపం ఒకటి చేయించాలి. అటువంటి పాపం చేసినపుడు పూర్వపుణ్యం తక్షణమే నశిస్తుంది. అందుకని లోకోపకారంగా, వారి పుణ్యం వెంటనే ఖర్చయ్యే విధంగా పాపచింతన వారిలో ప్రవేశ పెట్టాలి. వాడి చేత ఏదో పెద్ద పాపం చేయించి వాడి పుణ్యం ఖర్చు పెట్టిస్తారు. అప్పుడు వాడిని చంపించి లోకోపకారం చేస్తారు. నారద మహర్షివంటి కర్మతత్త్వవిదులు. ఈ లోకంలో దుష్టుడికి గల పూర్వ పుణ్యమే ఒక పెద్ద సమస్యకదా!

## లోకోపకారానికి నారదుని సలహ

జలంధరుడు అనే రాక్షసుడు దేవతలందరిని జయించి స్వర్గాన్ని ఆక్రమించుకొన్నాడు. అతడిని ఎవరు ఏమీ చేయలేక పోతున్నారు, ఆయన చాలా పుణ్యాత్ముడు. ఇది కాక ఆయన భార్య తులసి, ఒక మహాపతివ్రత ముందర ఆమె పేరు ఏదో ఉంది (తరువాత విష్ణువుయొక్క అనుగ్రహంతో విష్ణు తులసి దళమైనటువంటి తులసి బిల్వంగా జన్మించింది.) జలంధరుడు సుఖంగా ఉన్నాడు. స్వర్గం సంపాదించాడు, పైగా అతను ఏపాపము చేయడం లేదు, చాలా పూర్వపుణ్యం ఇంకా మిగిలి ఉంది. భార్య పాతివ్రత్యం కూడా ఆయనకు కలసి వచ్చింది. ఇన్ని అనుమతులు, పుణ్యాలు ఉంటే దేవతలు మాత్రం ఏమి చేయకలుగుతారు. ఏమి చేయలేక నిశ్శబ్ధంగా ఉన్నారు.

చివరకు వాళ్ళంతా నారదుడికి మొరపెట్టుకొన్నారు జలంధరుడి దగ్గరకు వెళ్ళి "నువ్వింత భాగ్యశాలివి కదా! అన్ని ఉండి ఒక పెద్దలోటుతో ఎలా బ్రతుకుతున్నావయ్యా" అన్నాడు. నారదుడు అంతటితో ఆగక "బాగుంది నీ భార్య పతివ్రతే కావచ్చు, ఉత్తమ ఇల్లాలే కావచ్చు కానీ నిన్ను దేవతలు మోసం చేసారు సుమా!" చూడు లక్ష్మీదేవి ఎంత చక్కగా నారాయణుడి ప్రక్కన కూర్చొంది. ఎప్పుడు సుఖంగా ఉంటుంది కదా! ఆ పార్వతిదేవిని కూడా



చూడు ఎంత చక్కటి మనిషి, ఎంత అందమైనది, ఏమి తేజస్సు, ఏమి అందము బూడిద పూసుకొని ఎప్పుడు స్మశానంలో తిరిగే ఆ రుద్రుడి ప్రక్కన ఉంటుంది ఆయనకు ఆవిడ ఎందుకు చెప్పు? నీవంటి వాడి దగ్గర ఉండాలి కదా!

చెడుమాటలు చెప్పటం సులభం ఇటువంటి మాటలు వింటే ఎవరికైనా అవి ఎంతో రుచిగా ఉంటాయి. ఆ విధంగా జలంధరుడిని ప్రేరణచేసి శివుడు మీదికి పురిగొల్పాడు, ఆయన వద్దకు పంపించాడు నారదుడు. జలంధురుడిని శివుడు బూడిద చేసేసాడు. ఆ ప్రకారంగా ఆ రాక్షసుని నాశనం చేయడానికి నారదుడే లోకోపకారమైన సలహా వారికి చెప్పాడు.

## ముక్తిపై కోరిక - నారదుని సందేశం

నారదుడు ఒక సారి వ్యాసాశ్రమానికి వెళ్ళాడు. వ్యాసమహర్షి, ఆయన కుమారుడు శుకమహర్షి ఉన్నారు. శుకుడు నారదుణ్ణి చూసి "మహర్షీ! భూలోకంలో జన్మించినవారికి హితమైనది ఏది? ఏది క్షేమకరమైనది? తెలుపవలసినది" అని అడిగాడు. నారదుడు ముక్తిమార్గము గురించి ఈ విధముగా వివరించాడు.

"ఈ లోకంలో మానవుడు జీవిత కాలంలో ఒక మారైనా ముక్తిని కోరుకోకపోతే ఆ మనిషి ప్రతి జన్మలోను ముక్తికి దూరమౌతుంటాడు "నేను ఇప్పుడు బాగానే ఉన్నానుకదా! అని ముక్తి కోరకపోతే అది ఏనాటికీ లభించదు. నేను పుణ్యాలు చేస్తూనే ఉన్నాను, ఈ యజ్ఞాలు చేస్తున్నాను నాకు ప్రతి జన్మలోను ఆయుర్దాయం బాగానే ఉన్నది. సుఖంగానే ఉన్నాను నాకు ముక్తి ఎందుకు? అని ఎవరైనా అనుకుంటే అది పొరపాటు. అతను ఆ ముక్తికి దూరమైపోతూ ఉంటాడు. కాబట్టి ముక్తిమీద ఎప్పుడో ఒక సారి ఏ కొంతైన కోరిక ఉండి తీరాలి. అలా ముక్తియందు కోరిక లేని వాళ్ళకు ఆ కోరిక వాళ్ళ మనస్సులో ప్రేరణ కలుగ చేయవలసిన ధర్మం బ్రాహ్మణులదే సుమా! చెప్పగా చెప్పగా ముక్తిమీద వాళ్ళకు కోరిక కలుగవచ్చు. ఆయన వారికి వెంటనే

ముక్తిపై ఉద్యుక్తులు కాకపోవచ్చు. ఆ భావనలో ప్రవేశించకపోవచ్చు. ఎప్పుడో తీవ్రమైన దుఃఖం బాధ కలిగినపుడు ఇతరుల దుఃఖాన్ని చూచినపుడు ఈ జన్మకు ముక్తి ముఖ్యం కదా! దానికంటే గొప్ప అంశములేదు అనే భావన వాళ్ళకు నువ్వు (శుకుడిని) కలిగించాలి. అది నీ ధర్మం" అని శుకుడికి హితబోధ చేసాడు నారద మహర్షి.

"నువ్వు ఆశ్రమంలో కళ్ళుమూసుకుని కూర్చుంటే లోకంలోని పని ఎవరు చేస్తారు? అందువలన ముక్తిని కోరుకొని మానవాళికి చెప్పలేకపోతే వాళ్ళు ప్రతి జన్మలోను ముక్తికి మరింత దూరమౌతారు. ముక్తిమార్గాన్ని చేరుకోవటానికి ప్రజలు దీక్ష వహించాలి" అని శుకుడికి తన లక్ష్యాన్ని చెప్పాడు నారదుడు. వెంటనే "మోక్షం మీద వాంఛ కలిగిన వాడికి మొట్టమొదట ఏం బోధించమంటావు" అని అడిగిన శుకుడు "అపరిగ్రహం" అంటే దేనినుంచి ఎవరినుంచి ఏది ఆశించి తీసుకోవపోవడం, ఏదైనా ప్రథమంగానే పరిత్యజించే త్యాగిగా ఉండటం, ఈ రెండు విషయాలు వాళ్ళకు బోధించు", అన్నాడు నారదుడు.

ఏదైనా తీసుకోవటం అనేది సంసారంలో మోక్షానికి వ్యతిరేక మార్గానికి వెళ్ళటం, మోక్షానికి సమీపానికి వెళ్ళటం కాదు. మోక్షమునందు కోరిక ఉన్నవాడికి మనస్సులో నిశ్శంకుడివై ఉండమని బోధించడమే సరైనదని చెప్పాడు నారద మహర్షి

పుణ్యం చేస్తే, దానం చేస్తే, దేవాలయాలు దర్శిస్తే జ్ఞానం కలుగుతుందా? దానివల్ల పుణ్యం రావచ్చును, ఐశ్వర్యం రావచ్చును, దానివల్ల కొడుకులు వృద్ధిలోకి రావచ్చును అదికాదు, మోక్షాన్ని కోరుకొనేవారు చేయవలసినవి ఏ పని చేయరు. ఏ పని నిర్వహించినా వైరాగ్య బుద్ధితో చేయాలి. తన మనుగడకు కావలసిన కనీస వసతులు ఎక్కడ లభిస్తే అక్కడ ఉండటమే. మోక్షంపై కోరిక కలిగినవాళ్ళు మార్గం ఇలా ఉంటుందని ఉపదేశము చేయమని శుకుడికి నారదుడు హితబోధచేశాడు.



ప్రతి మానవుడికి ముక్తిమీద కోరిక ఉండి తీరాలి. ఇది నియమము. జీవితములో ముక్తి సాధనకు ప్రయత్నించాలని నారదుడు లోకానికి ఒక సందేశం అందించాడు. ఎన్నో ధన, కనక, వస్తు, వాహనములు సంపాదించినా ముక్తిగూడ జీవితంలో ఒక భాగంగా ఉండాలని నారదుని భావన, లక్ష్యం.

## అప్సరసలు - నారద మహర్షి సందేశం

ఒక రోజు మానససరోవరంలో నారదుడు స్నానం చేసి జపంలో నిమగ్నమై ఉన్నాడు. ఆ సమయములో కొందరు అప్సరసలు విహారం చేస్తూ అక్కడికి వచ్చారు. వారు విలాసంగా తిరుగుతూ నారదుని చూసి కూడా అమర్యాదగా వెళ్ళిపోతూ వాళ్ళలో వాళ్ళు "ఇక్కడ నారద మహర్షి ఉన్నాడు" ఆయనను ఏమైనా అడుగుదాము అని అనుకున్నారు. వెంటనే ఆయనకు నమస్కారము చేయకుండా, "ఏమయ్యా! నిన్ను మహానుభావుడవని అంటారు విష్ణువు దర్శనము ఎలా అవుతుందో మాకు చెప్పు" అని అడిగారు". ఆవిధంగా అడగటంలో గౌరవం, శ్రద్ధ, వినయం వారిలో లేశమైనా కనిపించలేదు.

"పరిప్రశ్నేన సేవయా" అని గీతాచార్యుడు చెప్పినట్లు సందేహము వచ్చినప్పుడు పెద్దలు గురువులు దగ్గరకు వెళ్ళినప్పుడు నమస్కరించి సవినయంగా అయ్యా! నాకీ సందేహం వచ్చింది నీ వల్ల ఆ సందేహం తీరాలి అని ప్రార్థించాలి, అంతేగాని దూరంగా ఉన్నవాడిని తన దగ్గరగా పిలిచి, ఈ మాట చెప్పు అని అడుగ కూడదు. ఈ సన్నివేశంతో మహర్షుల మీద అప్సరసలలో ఉన్న నిర్లక్ష్య భావం వ్యక్తమైందని తెలుస్తుంది.

నారద మహర్షి ఆయుగంలో ఎవరికి ఏ సలహా ఇచ్చినా, సందేహం నివృత్తి చేసినా, ధర్మము భోధించినా, అన్ని నేటి యుగంలో మానవాళికి వర్తిస్తుంది అని గ్రహించాలి.

నారదుడికి అప్సరసల ప్రవర్తన కోపం కలిగించింది. ఆయన వారితో "మీకు వినయమే తెలియదు, అసలు మీ ప్రవర్తనకు, మిమ్మల్ని శిక్షించవలసిందే.

అయితే మీరు విష్ణు నామం చెప్పారు కాబట్టి మిమ్మల్ని శిక్షించడానికి వీలు లేకున్నది. ముందు మీలోని అహంకారాన్ని తొలగించుకోవాలి," అని హితవు పలికాడు. ఆ తరువాత అనంత ద్వాదశి వ్రతం వంటి కొన్ని వ్రతములు వాళ్ళకు చెప్పి వాటిని తు.చ. ఆచరిస్తే విష్ణువు దర్శనం అవుతుందని బోధించాడు.

"ఈ వ్రతం వలన మా కోరిక నెరవేరుతుందా?" అని అడిగారు అప్సరసలు. "ఈ వ్రతము వలన మీకు కార్యసిద్ధి కలిగే ఉపాయము ఒకటి ఆలోచనకు వస్తుంది. అది మీరు ఆచరించండి. ఈ మానస సరోవరం తీరంలోనే నివాసమున్న అష్టావక్ర మహర్షిని మీరు దర్శనము చేస్తారు. ఆయన వలన మీకు శాపము కలుగుతుంది. ఆ శాపము వలన మీకు హరి దర్శనము అవుతుంది. ఆ శాప ఫలితంగా మీరు శ్రీకృష్ణావతారంలో గోపికలై జన్మిస్తారు. మీకు అప్పుడు అహంకారం తొలగిపోతుంది. మీలో ఉన్నటువంటి అప్సరసలం, విద్యావంతులం, అందమైనవాళ్ళం అనే అహంకారం తొలగిపోతుంది. అష్టావక్రమహర్షి శాపముతో మీకు అనుగ్రహం కలుగుతుంది. అందువలన ఈ వ్రతము నిర్వహించండి." అని వ్రతోపదేశం చేసాడు నారద మహర్షి నారదుని పరిచయం వలన అప్సరసలకు గొప్ప శుభకార్యం చేయాలనే ఆలోచన, అవగాహన లభించింది.

మహర్షుల దర్శనం, వారి ఆదేశాలు, సందేశాలు, సత్ఫలితాలు, పొందవచ్చునని తెలుసుకోవచ్చు.

**నారద మహర్షి లోక పూజ్యుడు**

ఒక శుభ ఘడియలో నారదుడు శ్రీకృష్ణ పూజలందుకున్నాడు. ఆ సమయంలో ఉగ్రసేనుడు ఉన్నాడు. అప్పుడు ఉగ్రసేనుడు శ్రీకృష్ణుని అడిగాడు, "కృష్ణా! నారదుడు వస్తే ఘనంగా సన్మానంచేసి పాద పూజ చేశావు, నమస్కరించావు ఏమిటి అయన మహత్యం?" అని. దానికి సమాధానముగా



శ్రీకృష్ణుడు, "నేను గౌరవించే వ్యక్తి ఎవరు అంటే ఏ క్రియాహంకారము, ఏ కర్తవ్యకారణమూ, క్రియాభావన లేని వారెవరో వారే జగత్పూజ్యుడు. నాకు కూడా అట్లాంటి వాడే పూజ్యుడు కదా! వారి యందు తనకు గాని, ఇతరులకు గాని దుఃఖాన్ని బాధను కలిగించే అహంకారం లేదు. ఒకటి అహంకారం తనకు దుఃఖము కలిగిస్తుంది, ఇతరులకు కలిగిస్తుంది కూడా, అలాకాక తనకు, ఇతరులకు గౌరవము ఆదరణ ఇస్తున్నారా లేదా అని కూడా చూడకుండా నిస్పృహాయుడై ఉండే వాడు నారదుడు. అందుకనే అతడు పూజ్యుడు" అని సందేహ నివృత్తి చేసాడు.

మరి నారదుడు అప్సరసలను శపించాడు కదా! అంటే అది వాళ్ళను సక్రమ మార్గములో నడిపించడానికి ఆ శాపము కూడా వారికి భవిషత్తులో కళ్యాణ హేతువే అవుతుంది. బ్రహ్మదేవుడి అంశములో ఉండటం చేత వేదంలో ధర్మాలు ఎలా ఉన్నాయో ఆ ధర్మ మార్గములోనే నారదుడు నడుస్తూ ఉంటాడు. ఆయన ప్రవర్తనలో నిషేధమైనట్టి పని కాని, మాటగాని ఉండదు ఆ మహర్షి యందు ప్రీతి లేనటువంటి, అంటే దేనియందు ఇష్టము లేకపోవటం, కోపము, చాపల్యము, భయము లాంటి లక్షణములు ఉండవు. అదే అతనిలో ఉన్న విశేషము. ఒక పనిని గురించి క్షణము ఆలోచించి బాధ్యతను తెలుసుకొని ఆచరించి మరచి పోతాడు, అంతే కాని ఆ పనిని గురించి చిరకాలము ఆలోచించే స్వభావము ఆయనకు లేదు, తరువాత అతడి మనస్సులో ఏమి ఉండదు, ఆ పని ఎంతో లోకోద్ధరణకైనా, ఎంతో గొప్పకార్యమైనా తాను చేసినట్లుకూడా జ్ఞాపకము ఉండదు.

ఎన్నో మంచి లక్షణాలు, గుణాలు నారదుడిని గురించి చెప్తూ "నారదుడు కార్యశూరుడు, ఏకాగ్రతతో ఏ పని అయినా క్షణంలో నిర్ణయము తీసుకొని చేస్తాడు. లోభం చేతగాని, ప్రమాదం చేతగాని, భయం చేతగాని ఎప్పుడు అసత్యం అనేది ఆయన నోటి వెంట రాదు. శాంతుడు, దాంతుడు సర్వతత్త్వములు తెలిసిన వాడు. సత్యవాది, తేజస్సు, జ్ఞానము, వినయము,

వివేకము, కీర్తి ఇవ్వన్నికాక ఉత్తమ జన్మ. అంతే కాక ఆయన చేసిన తపస్సు మొదలైనవన్నీ నారద మహర్షి ఔన్నత్యాన్ని పెంచడానికి కారణం అయినాయి, మరి అటువంటి వారిని పూజ చేయక ఏంచేస్తాను. నారద మహర్షి ఏ పని చేసిన గొప్ప పుణ్యం, ధర్మం, లోక హితము తప్పని సరిగా ఉంటాయి. అవసరమైన పనులలో తల దూర్చడు. సత్ఫలితాన్ని ఇవ్వని కార్యము లోకకల్యాణానికి కారణముకాని కార్యము మహర్షి ఎన్నడు సంకల్పించడు. అతడి విష్ణు భక్తి దృఢమైనది, దానిని, ఎవరు చలింపచేయలేరు, అతడి శాస్త్ర జ్ఞానం అమోఘం, ముల్లోకాలలో పర్యటిస్తూ ఆధ్యాత్మిక దృక్పథాన్ని ప్రచారం చేస్తూ ఉండేవాడు. ఆకాశ మార్గములో తిరిగే నారదుడు ఒక విధముగా ఈ నేపథ్యములో సమాచారం గాలిలోని ఖాళీని భర్తి చేసేందుకు అవతరించాడు. నారదుడు సంక్షోభాలను ముందుగానే పసిగట్టి, వాటిని గురించి ప్రజలను అప్రమత్తం చేసేవాడు. ఆ సంక్షోభాలకు పరిష్కార మార్గములను కనుగొనే వాడు. ఇవన్నీ ఆయన గౌరవానికి కారణములేకదా! ఎన్నో సత్కార్యములు చేసికూడా నారదుడు సర్వసంగ పరిత్యాగియై ఉన్నాడు." అని విశదీకరించాడు శ్రీకృష్ణుడు.

ఇన్ని కారణాలచేత నారదుడు సర్వలోక పూజ్యుడు, లోక శ్రేయస్సును కోరుతాడు, రాక్షసులను సాక్షాత్ భగవంతుని దగ్గరకు పంపిస్తాడు. అది వారికి శ్రేయస్సే. ఆ నారదుడు త్రికాలజ్ఞుడు, నిరామయుడు ఎప్పుడూ కూడా సర్వలోకాలలోను ఈయనను పూజిస్తారు. ధర్మరాజుకు పాలన గురించి రాజధర్మాలను సమూలంగా వివరించాడు. పాలన అంటే ప్రజల మన్ననలు ఎలా పొందాలో వారి క్షేమం, శ్రేయస్సు, రక్షణ, నిఘావిభాగం మొదలైనవన్నీ బోధించాడు.

### నిజమైన జ్ఞాని ఎవరు?

సమంగుడు అనే ముని తపస్సులో నిమగ్నమై ఉన్నాడు. ఆయన గొప్ప శాంత స్వభావం కలవాడని పేరు. నారదుడు ఆయన ఆశ్రమానికి వెళ్ళి



"సమంగ మహర్షీ నీవు శోకము, మోహము లేకుండా నిత్యము సంతోషముతో ప్రకాశిస్తూ ఉంటావు. ఇంత ఓర్పు ఉండి ఉద్వేగము లేకుండా శాంతుడవై ఉండడానికి కారణము ఏమిటయ్యా?" అని అడిగాడు.

అందుకు సమాధానముగా సమంగుడు "మానవుల భూతభవిష్యత్ వర్తమానములు ఉన్నాయికదా! అవి ఎందుకు అలా ఉన్నాయో నాకు అర్థమైంది. ఎవరికైనా వారి వారి కర్మలు బట్టికదా ఫలములు ఉంటాయి. సుఖదుఃఖాలనేవి దైవము (అంటే ఇక్కడ లోకపాలక శక్తి అని అర్థం) వలన అంటే జీవుడుచేసే కర్మకు ఈ ఫలితం ఇలా జరగాలని నిర్ణయించగల ఒక మహాశక్తి వలన కలుగుతాయి. మానవులు కర్మలను అనుసరిస్తారు. ఇంద్రియాలు, మోహం, శోకం పొందుతాయి. మనిషి సుఖానికేమో పొంగిపోతాడు, దుఃఖానికి క్రుంగిపోతాడు.

అయితే సుఖదుఃఖాలలో ఏదీ కూడా ఈ ప్రపంచంలో నాకు కనుబడుటలేదు. కాబట్టి కష్టము వచ్చినప్పుడు నేను దుఃఖపడను, సుఖము వచ్చినప్పుడు ఆనందించను, రెండు లేవు నాకు, నేను దుఃఖాన్ని పరిత్యాగం చేసాను, శాంతిని పొందాను సమగ్రమైన సంపూర్ణమైన ధైర్యము కలిగింది. అందరూ సుఖపడేవాళ్ళమాదిరి కనిపిస్తారు. శోకం, మోహం, భయాదులు పెరిగినపుడు నాలోనే కాదు ఎవరిలోనైనా కూడా సాక్షిగా మాత్రమే చూస్తూ ఉంటాను. అర్థకామములు, తృష్ణ మోహములు నాకు దూరమైనాయి. ఒకసారి అమృతం సేవించిన తరువాత చావు, భయం ఎలా దూరమౌతాయో ఆవిధముగా భయం నన్ను విడిచి వెళ్ళింది. ఉద్రేకం లేకుండా ఉపశమనం కలిగి ఉన్నాను. నన్ను ఆశీర్వదించు" అన్నాడు సమంగముని. నారదుడు ఆయనతో నువ్వు నిజమైన జ్ఞానివి అని ఆశీర్వదించాడు.

సమంగముని లక్షణాలు గుణాలు నారదముని హితభోదలు పూజ్యులను గౌరవించడానికి అర్హతలు ఏమి కావాలి అనే సద్విషయములను మానవాళి గ్రహించి ఆచరించాలని మహర్షి ఉద్బోధ.

## సత్కారాలు - ధర్మాలు

పూర్వం గాలవుడు అనే ముని నారద మహర్షి దగ్గరకు వచ్చి "స్వామీ! జ్ఞాన ప్రవృత్తి ఎలా కలుగుతుంది? ఆశ్రమ ధర్మాలలో గృహస్థధర్మం, సన్యాసము అనే వాటిలో ఏది మేలైనది? అనేక శాస్త్రాలు అనేక మార్గాలు చూపిస్థాయికదా! ఉత్తమమైనవి నాకు వివరించండి అని అడిగాడు. వెంటనే నారదుడు గాలవునితో ఆశ్రమ ధర్మాలు నాలుగు ఉన్నాయని (బ్రహ్మచర్యం, గృహస్థధర్మం, సన్న్యాసం, వానప్రస్థం) నువ్వు విని ఉన్నావు కదా! శాస్త్రాలలో ఆశ్రమ ధర్మాలు పైకి పరస్పర విరుద్ధంగా కనిపిస్తాయి. అందులోని ధర్మసూక్ష్మం సద్గురువును ఆశ్రయిస్తేనే తెలుస్తుంది. స్థూలంగా చూస్తే ఒక ధర్మానికి మరొక ధర్మానికి వ్యతిరేక లక్షణం కనపడుతుంది.

గృహస్థధర్మములో జాగ్రత్తగా ధనం సంపాదించి దాచుకొని భార్యా పిల్లలను బాగా చూసుకో, అతిథి అభ్యాగతులను గౌరవించి వారికి భోజనం పెట్టు అని అంటారు. సన్యాసాశ్రమములో ధనం మాట ఎత్తవద్దు. ఆమాట అసలు మనస్సులోకే రానివ్వకు. అయితే ఈ విధముగా ఒక వస్తువుని గురించి వివిధ ధర్మాలు ఆయా ఆశ్రమాలను బట్టి ఉంటాయి. అసలు ధర్మం లక్షణమేమిటి? ఏది ఆచరిస్తే జీవాత్మకు క్షేమమో, జీవుడికి క్షేమకరమైన భవిష్యత్తు ఉంటుందో దానిని ధర్మము అంటాము. ఈ ఆశ్రమాలలోగూడా ఇవి సామాన్య ధర్మాలు, స్నేహంతో వచ్చిన వారియందు దయచూపించాలి. దయగల హృదయమే భగవన్నిలయం అన్నారు వేదవిదులు. సన్యాసికి గూడా ఇది వర్తిస్తుంది, అంతరంగంలో కర్తవ్యభావాన్ని నిగ్రహించుకోవడం వరకే సాధన.

ఇంకా నారద మహర్షి ఇలా వివరించాడు. పుణ్యకార్యము మాత్రం చేయాలి. అది చేయకుండా ఉండటానికి కారణం చూపించకూడదు. కారణం వెతకకూడదు. ఎప్పుడూ మంచివారి స్నేహమే కోరాలి. ఇవన్నీ శ్రేయస్సుకు మార్గాలు. దేవతల పూజ విధిగా చేయవలసిందే. పితృదేవతలను ఆరాధన



చేయవలసిందే, నిత్య పితృతర్పణం యథావిధిగా నిర్వహించ వలసిందే, అతిథిని సత్కరించవలసిందే, అహంకారాన్ని విడిచి పెట్టవలసిందే, సత్యము ఎప్పుడు చెప్పవలసిందే, ఏ ప్రమాదం సంభవించినా ఇవి తప్పవద్దు. ఇటువంటి సద్విషయాలన్నీ గాలవుడికి నారదుడు భోదించాడు. పెద్దవారు మహర్షులు ఎప్పుడూ మంచి విషయాలే చెప్తారు. మానవాళి ఆచరించవలసిందే.

## ఎవరు పూజ్యులు

నారద మహర్షి ద్వారకానగరంలో నివాసం చేస్తూ ఉన్న సమయములో కొంత మంది బ్రాహ్మణులు వచ్చారు, వారికి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి పాదపూజ చేసాడట నారదుడు. అప్పుడు కృష్ణ పరమాత్మ నారదా నువ్వు జగతః పూజ్యుడివి. మరి ఈ విధముగా బ్రాహ్మణులకు ఇట్లా పూజ చేయుట ఏమిటి అని అడిగాడు.

నారద మహర్షి ఈ విధముగా సమాధానం ఇచ్చాడు. "లక్ష్మీనారాయణులను, ఇంద్రావరుణులను, అగ్నిదేవుడిని, ధర్మాన్ని ఎవరైతే ఆరాధిస్తారో వాళ్ళు నాకు పూజ్యులు, బ్రహ్మదేవుణ్ణి, బృహస్పతిని, చంద్రుణ్ణి, సూర్యుణ్ణి, వేదములను, స్థానుడిని, స్కందుణ్ణి ఎవరైతే ఆరాధిస్తారో వాళ్ళందరూ నాకు పూజ్యులు. తపోధనులు, వేదాలను అధ్యయనము చేసినవారిని నేను పూజిస్తాను, గౌరవిస్తాను. స్వాధ్యాయ వ్రతనిష్ఠను మునులు అధ్యయనము చేసినవారిని నేను పూజిస్తాను. దేవతా పూజమయులైన గృహస్థులు, శిష్టాచారపరాయణులు కూడా నాకు పూజ్యులే. కాబట్టి, అధికారంతో నిమిత్తము లేకుండా పూజ చేసే ప్రతి వారిని నేను గౌరవించి పూజ చేస్తాను" అన్నాడు నారద మహర్షి,

నేటి యుగంలో మానవులంతా నారద మహర్షి వివరించిన ప్రకారం పైన చెప్పిన మహానుభావులందరినీ పూజించాలని గ్రహించాలి. నారద మహర్షి అంతటి వాడే పూజిస్తే సామాన్య మానవులు ఎదురు ప్రశ్నవేసుకోకుండా విధిగా వారందరినీ పూజించాలి. పూజ్యులను పూజించటం, గౌరవించటం వలన వంశాభివృద్ధి, చిరంజీవత్వం సిద్ధిస్తుందని గుర్తించాలి.

## నారదుని గ్రంథాలు

నారద మహర్షి, "నారద భక్తి సూత్రములు" అనే పేరుతో నవవిధ భక్తులు ఎలా ఉంటారో వారిని గురించి చెప్పాడు. నారదస్మృతి గూడా రచించాడు. నారదస్మృతికి అసహాయుడు అనే పండితుడు భాష్యం వ్రాసాడట. బృహన్నారదులు, లఘునారదము అనే గ్రంథాలకు గూడా ఆంగ్లంలో అనువాదం చేసారట. అందులో ఆస్తి పంపకాలు మొదలైన ధర్మాలన్ని చెప్పబడ్డాయి. ఈనాటికీ ఇది ఉపయోగపడుతుంది. నారదుడు రచించిన శిల్పశాస్త్రంకూడా ఒకటి ఉంది, నారదుడి శిల్పశాస్త్ర గ్రంథంలో గ్రామం ఎలా నిర్మించాలో వివరించాడు. వాస్తుశాస్త్ర లక్షణాలన్ని కూడా చెప్పబడినాయి. అగ్రహారీక గ్రామము, మహా గ్రామము, బ్రహ్మపద గ్రామము, శంకర గ్రామము, వాసవ గ్రామము, సంకీర్ణ గ్రామము, మంగళ గ్రామము, శుభగ్రామములాంటి పది రకములైన గ్రామములు ఎలా నిర్మింపచేయాలో వివరించాడు నారదుడు.

ద్రోణక, ప్రస్తర, నిగమ, పట్టణ, సర్వోతభద్ర, కార్ముక, పురంధర మొదలైన 14 రకాల పట్టణాలు ఎలా నిర్మాణం చేయాలి అనే విషయాలు ఇందులో ఉన్నాయి. సంగీతశాస్త్రం కూడా ఆయన సొమ్మే. సంగీత కౌశలం కోసం ఆయననే ప్రార్థిస్తారు.

పైన వివరించిన గ్రంధాల వైవిధ్యాన్ని బట్టి నారద మహర్షిని ఈ లోకములో మానవాళి పూజ్యభావంతో గౌరవిస్తున్నారు. అలాగే పరలోక జ్ఞానాన్ని ఇచ్చేటటువంటివి అన్ని తెలుసు. ఏ విషయములోనైనా ఆయనకు తెలియనిది లేదు. అందు వలన ఇహపరసాధకములైన అన్ని సద్విషయాలను నారద మహర్షి ప్రసాదించాడని ఆయన చరిత్ర వలన మనకు తెలుస్తోంది.

ఈ ప్రకారంగా నారద మహర్షి చరిత్ర అనంతంగా ఉన్నది. అందులో మనం తెలుసుకున్నది. స్వల్పమే! ప్రతి మనిషి జీవిత చరమాంకం వరకు మహర్షులచరిత్ర తెలుసుకొని మోక్ష మార్గాన పయనించాలి.



ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు గూడ నారద మహర్షి చరిత్రను పరిశీలించి, పరీక్షించి, పరిశోధించి, శోధించి, విశ్లేషించి ఈ విధంగా వివరించటం జరిగింది. దీనిని బట్టి ఆధునికులకు గూడ నారద మహర్షిపై గౌరవం పెంచుకొని మానవాళికి ఏ విధంగా ఉపయోగించాలో వివరిచారు. ఆ విషయాలను గూడా తెలుసుకుందాం!

## సంచార రాయబారి

దేవుళ్ళకు, దానవులకు, సామాన్య ప్రజలకు జ్ఞానబోధ చేస్తూ, సమాచారాన్ని తనదైన విలక్షణశైలితో చేరవేస్తూ, దౌత్యం నెరిపే మానవాతీత వ్యక్తి నారదుడు. ఆయనొక సంచార రాయబారి. దేవుళ్ళ వార్తాహరుడు. ఆయన సంక్లిష్ట సమస్యలను, అపోహలను దూరం చేసేవాడు. అధికారంలోవున్న వ్యక్తులలోని అహాన్ని రూపుమాపేవాడు. పారిజాతాపహరణంలో మనకు ఈ అంశం స్పష్టమవుతుంది. అందులో కృష్ణుడి భార్య సత్యభామలోని అహం అంతరిస్తుంది. కృష్ణుడి మరోభార్య అయిన రుక్మిణి ఔన్నత్యాన్ని, సమానత్వాన్ని ఆమె గ్రహిస్తుంది. ఆయన అన్నిచోట్లా భక్తులపాలిట మిత్రుడిగా, మార్గదర్శిగా, తాత్త్వికుడిగా వ్యవహరించేవాడు. ఆయనను ప్రత్యేకంగా ఆవాహన చేయకపోయినప్పటికీ ఎక్కడ అవసరం వుంటే అక్కడ ప్రత్యక్షమై తన భక్తులకు సలహాలు ఇచ్చేవాడు. ఒక ఋషిగా దివ్యజ్ఞానిగా అలాచేయడం తన విధ్యుక్తధర్మం అని ఆయన భావించేవాడు.

మహాభారతంలోని శాంతిపర్వంలో నారదమహర్షిలోని స్వాభావిక సుగుణాలు స్పష్టమవుతాయి. అటు దేవుళ్ళు ఇటు రాక్షసులూ అందరూ ఆయనను ఒక పవిత్రమూర్తిగా గౌరవించడం మనకు కనిపిస్తుంది. ఆయన ఘోటక బ్రహ్మచారి. ఐహిక వాంఛల పట్ల ఆయనకు ఏ మాత్రం ఆసక్తి ఉండేది కాదు.

ఆయన ఎప్పుడూ తన గొప్పతనాన్ని తను చాటుకోలేదు. ఆయన తనను తానొక నిస్వార్థజీవిగా, ఏ పక్షపాతదృష్టి లేకుండా ఇతరులకు సహాయపడేవాడిగా నిరూపించుకునేవాడు. అందుకే ప్రతి ఒక్కరికీ ఆయనంటే పరిపూర్ణ విశ్వాసం ఉండేది.

## గొప్ప లక్షణం

నారదుడి గొప్పతనం ఏమిటంటే ఆయన ఒక గొప్ప జ్ఞాని, వేద వేదాంగాల మీద ఆయనకు పరిపూర్ణమైన అవగాహన ఉండేది. సమాచార విధానంపై ఆయనకు గట్టిపట్టు ఉండేది. ప్రయోగాత్మక రీతిలో దానిని వినియోగించేవాడు. ఏ విషయం మీదనైనా మాట్లాడగలిగే, సూచనలు చేయగలిగే పరిజ్ఞానం ఉండేది. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. అహం, అసంతృప్తి, ఆగ్రహం, అనురాగం, భయం అభిమానం మొదలైన లక్షణాలు వాటివాటి స్థానాల్లో ఒదిగి ఉండేవి. ఆయన చాలా సాహసి. ఏ విషయంలోనూ మొహమాటం, జాప్యం ఉండేవి కాదు. అసంఖ్యాక ప్రజానీకానికి ఉపయోగపడే అనేక మంచిపనులు చేసే మహోన్నతు డాయన. మాటకారితనం ఉండేది. ఆయన మాటలు ఎంతో వైవిధ్యభరితంగా, ఆహ్లాదకరంగా ఉండేవి. ఎలాంటి విపత్కర సంక్లిష్ట పరిస్థితులనైనా మంచి అవగాహనతో ఎదుర్కోగలిగేవాడు. ఎల్లప్పుడూ తియ్యని మాటలతో సమర్థవంతంగా సంభాషించేవాడు. ఆ మాటలు వినేవాళ్లకి ఎంతో ఉల్లాసం కలిగించేవి.

## మంచి శ్రోత

సమర్థవంతుడైన కమ్యూనికేటర్ లక్షణం ఏమిటంటే, అతను చక్కని శ్రోత అయివుండటమే. అంటే ఇతరులు చెప్పే విషయాలను ఓపిగ్గా వినాలి. నారదుడు సమాచారాన్ని ఇతరులకు చేరవేసే ముందు వాళ్ల మాటలని బాగా ఆలకించేవాడు. ఇతరుల మాటలు విని వారిని అభినందించేందుకు సదా సంసిద్ధంగా ఉండేవాడు. స్వయంగా మహర్షి కాబట్టి ఇతరులు చెప్పబోయే



విషయాలు నారదుడికి ముందే తెలిసేవి. అయినప్పటికీ ఎంతో ఓపికతో, ఆసక్తిని కనబరుస్తూ, మధ్యలో జోక్యం చేసుకోకుండా ఇతరుల సంభాషణలని ఆలకించేవాడు. ఎంతో సహనంతో వినగలగడమే ఆయన వ్యక్తిత్వంలోని ప్రత్యేక లక్షణం.

## సంచార గాయకుడు

సాధారణంగా మునులు ఆత్మసాక్షాత్కారం కోసమో, విజ్ఞానం కోసమో ఒక చోటు నుండి మరో చోటుకి వెళుతుంటారు. అలా సంచారం చేయడం వల్ల, వాళ్లు మహాజ్ఞానులుగా మారుతారు. నారదుడు దేవ మహర్షి, ముల్లోకాలలో సంచరించగల శక్తి, భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను ముందుగానే గ్రహించగల దివ్యదృష్టి కలిగినవాడు. ఐతిహాసిక కురుక్షేత్ర మహాసంగ్రామమప్పుడు నారదుడు పాండవుల పక్షం వైపు వెళ్లి యుద్ధ ప్రారంభసూచనగా జ్యోతిని వెలిగించాడు. ఎందుకంటే యుద్ధంలో పాండవులనే విజయం వరించబోతున్నట్టు ఆయనకు ముందే తెలుసు.

## మధ్యవర్తి

రెండు పక్షాల మధ్య పోట్లాటలు పెట్టడం, అభిప్రాయ భేదాలు సృష్టించడం పట్ల నారదుడికి ఉన్న ఆసక్తివల్ల ఆయనకి కలహ ప్రియుడు లేదా కలహ భోజనుడు అనే పేరు వచ్చింది. అయితే నారదుడు పోట్లాటలు సృష్టించేవాడైనప్పటికీ ఆయన సమస్యకారుడు కాదు. పైగా ఆయా సమస్యల పరిష్కారంకోసమే అలా చేసేవాడు. నారదుడు ఎక్కడ కలహాల విత్తనాలు నాటినా అవి ప్రజల ప్రయోజనం కోసమే ఉపయోగపడేవి. మోసగాళ్ళను మంచివాళ్ళుగా, అహంభావులను వినయశీలురుగా, అధర్మవర్తనులను ధర్మవర్తనులుగా, అజ్ఞానులను జ్ఞానులుగా మార్చేందుకే ఆయన పెట్టే చిచ్చులు తోడ్పడేవి. ఆయన కమ్యూనికేషన్ టెక్నిక్‌లలో "గుసగుస సమాచార పద్ధతి ఒకటి" అయితే ఆయన అంతిమ లక్ష్యం మాత్రం లోక కళ్యాణమే.

మన పురాణాలలోని కథలన్నింటిలో ముఖ్యంగా అహానికి సంబంధించిన కథల్లో అంతఃసూత్రధారి నారదుడే. ఈ విషయంలో పారిజాతం గురించి కృష్ణుడికీ, సత్యభామకీ, రుక్మిణికీ మధ్య నడిచిన చిన్నపాటి నాటకంలో నారదుడు పోషించిన పాత్రను ఇక్కడ ప్రస్తావించడం సముచితంగా ఉంటుంది. అందులో నారదుడి ప్రధాన లక్ష్యం సత్యభామలోని అహంభావాన్ని తొలగించడమే. అలాగే మరోవైపు ఇంద్రుడి జీవిత భాగస్వామి శచీదేవి అహాన్ని కూడా రూపుమాపడం ఆయన ధ్యేయం.

సమాజ సంక్షేమం కోసం కమ్యూనికేషన్ వదంతులు ఎలా ఉపయోగపడతాయనేందుకు ఈ కథ ఒక ఉదాహరణ. సమాజ ప్రయోజనం కోసం సదవగాహనను పెంపొందించడం, అనుమానాలనే మబ్బులను చెదరగొట్టడం వంటి సమాచార సాంకేతిక నైపుణ్యాలు ఒక మంచి ప్రజాసంబంధాల వ్యక్తిత్వానికి ఎంతగా అవసరమో మనకు నారదుడిలోని సుగుణాలు అధ్యయనం చేసినప్పుడు బోధపడుతుంది.

* * *

## 12. శంఖలిఖిత మహర్షులు

బాహుదానదీ తీరంలో ఒక బ్రాహ్మణుడు ధర్మపత్నీ సమేతంగా తపస్సు చేస్తున్నాడు. ఆ తపః ఫలంగా వారికి ఇద్దరు కుమారులు కలిగారు. ఇద్దరు కుమారులలో మొదటి వాడి చేతిలో జ్ఞానయోగచిహ్నామైన శంఖం యొక్క చిహ్నాం ఉందట. అందువలన ఆ బాలునికి 'శంఖుడు' అని పేరు పెట్టారు. రెండవ వాడి నుదుటిమీద గొప్ప తపోదీక్షా పరతంత్రుడని ఎవరూ చెప్పకుండానే నుదురు చూచినంతనే తెలిసేటట్లు ఒక గుర్తు ఉండటం వలన అతడికి 'లిఖితుడు' అదితిరోరేఖ. ఈ విధంగా వారిద్దరూ జంట ఋషులుగా శంఖ లిఖితులుగా ప్రసిద్ధి చెందారు.

అన్నదమ్ములిద్దరూ అన్యోన్యం, అనురాగంతో చాలా ఉత్తములుగా పెరుగుతున్నారు వేదవేదాంగములు, సర్వశాస్త్రములు చదువుకున్నారు. మాతాపిత పాదసేవ చేసిన తరువాత వారిద్దరూ వాళ్ళ దగ్గరికి వెళ్ళారు. తల్లిదండ్రులను ఇలా అనుమతి అడిగారు. "మాకు జ్ఞానాన్ని పొందాలనే కోరిక ఉంది. అది సంపాదించటం కోసం తపస్సు చేయటానికి మాకు అనుమతి ఇవ్వవలసింది". అని అడిగి అనుజ్ఞపొంది బహుదానదీ తీరానికి ఇంకాపైన కొంత దూరంలో అరణ్యంలో వేరువేరుగా ఆశ్రమాలు నిర్మించుకొన్నారు. అచట బ్రహ్మచర్య దీక్షితులై తపస్సు చేసుకుంటున్నారు.

అన్నదమ్ములు ఇద్దరినీ చూచిన వాళ్ళకు నరనారాయణుల ఆశ్రమాలు జ్ఞాపకం వచ్చేవట. ఉత్తమమైన తపస్సు చేసుకుంటున్నారు. ఇద్దరూ కూడా పరమసాత్త్వికులు. శంఖలిఖితులు ఇద్దరూ ధర్మాన్ని గురించి చర్చ చేసుకుంటూ ఉండేవారు. లోకంలో ఉండే సత్యాన్వేషణ కొరకు పరస్పరం వారి అనుభవాలను పంచుకుంటూ ఉండేవారు. అది వారి అన్యోన్యతకు, జ్ఞాన పిపాసకు సంకేతం. చర్చలు అయిన తరువాత మళ్ళీ ఎవరికి వారు తపస్సులో నిమగ్నమై ఉండేవాళ్ళు.

అన్నదమ్ములిద్దరూ పరిహాసానికి గూడ అసత్యం చెప్పరు. అసత్యం వాళ్ళ నోటివెంట పలుకదు. అధర్మాచరణ వాళ్ల భావంలో కూడ లేదు. ధర్మదేవతలు ఇలా రెండు రూపాల్లో పుట్టిందా అనే విదంగా అశ్వినీ దేవతలవలే ప్రకాశిస్తున్నారు శంఖలిఖితులు.

ఒక రోజు లిఖితుడు అన్న శంఖుని ఆశ్రమానికి వచ్చాడు. అచట అన్నగారు కనుపించలేదు ఆశ్రమంలో ఫలవృక్షాలు అనేకంగా ఉన్నాయి. ఆ వృక్షాలలో మామిడి చెట్టుకు చక్కగా పండిన మామిడి పండ్లు మంచి వాసన వస్తూ ఉన్నాయి. వాటి వాసన చూస్తూంటే లిఖితుడికి ఆకలి వేసింది. రెండు మామిడి పండ్లు కోసుకుని తింటున్నాడు. ఆ సమయంలో అన్న శంఖుడు వచ్చాడు. పండ్లుతిని చేతులు శుభ్రంచేసికొని అన్న దగ్గరకు వచ్చాడు లిఖితుడు.

శంఖుడు తమ్ముడిని చూచి "ఇప్పుడు నీవు తింటున్న పండ్లు ఎక్కడివి నాయనా!" అని అడిగాడు లిఖితుడు "అన్నా! నేను నీ ఆశ్రమానికి వచ్చి చాలా సేపు అయినది. నీ రాక కోసం నిరీక్షిస్తూండగా, మామిడి పండ్ల మీద నా దృష్టి పడింది. అర మగ్గిన మామిడి పండ్లు కనబడ్డాయి. సువాసనలు గుబాళిస్తున్నాయి. ఆకలిగా ఉందని రెండు పండ్లు కోసుకొని తిన్నాను". అన్నాడు.

"అయ్యో! ఎంత పని చేశావు నాయనా! ఇది అధర్మంకదా! మన జీవన విధానంలో ధర్మానికే ప్రాధాన్యం అని అనుకొన్నాము. మరి, నీ చేత పూర్వవిధి ఈ విధంగా అధర్మాన్ని చేయించింది. ఇది నా ఆశ్రమంలో ఉండేటువంటి వృక్షం కాబట్టి ధర్మం ఏమి చెబుతున్నదంటే, కోసుకోవాలని అనుకునే ముందు యజమాని అనుమతి తీసికొని తినవలసింది. ఆ విధంగా చేయకుండా, నన్ను అడగకుండా తీసుకుని తినటం చేత నీవు అధర్మం చేసినట్లు అయింది. అందుకోసం నేను బాధపడుతున్నాను" అన్నాడు శంఖుడు.

లిఖితుడు తను చేసిన అధర్మాన్ని గ్రహించాడు. తనను మన్నించి అనుగ్రహించమని చెప్పి అన్న పాదాల మీద పడ్డాడు. శంఖుడు అయనతో



"నాయనా! నువ్వు నాయెడల ద్రోహం చేసావనికాదు నా అభిప్రాయము. నా ఫలంను అపహరించటంచేత నేను నష్టపోయానని కాదు నా అభిప్రాయం. ఒక అధర్మం నీవలన జరిగింది. దానితో నీకు దోషం వస్తుంది కదా! ఏం చెయ్యాలి? అని నేను భాధపడుతున్నాను. మనం అధర్మం చేసిన తరువాత ఇంకొకరికి ధర్మం ఎలా బోధించగలం. అనేక మంది మనలను ధర్మాన్ని అడగటానికి వస్తారు కదా! ఇక్కడ మనం పాపప్రక్షాళన చేసుకోకపోతే ఈ జీవుడు శరీరాన్ని వదలి పెట్టిన తరువాత యముడి దండన మనకు తప్పదు కదా! అటువంటి దుఃఖానికి లోనవుతావనే నేను బాధపడుతున్నాను.

వెంటనే లిఖితుడు అన్నతో, "నీవు చెప్పినది వాస్తవమే. నీవు ఏదయినా శిక్ష విధించి నన్ను పరిశుద్ధుణ్ణి గావింపు. నీవు నాకు ఏ శిక్ష విధించినా ఆనందంగా స్వీకరిస్తాను. నాకు నిష్కృతి చెప్పు, "అని అన్నాడు. శంఖుడు తమ్మునితో "నిన్ను శిక్షించే అధికారము నాకు లేదు. రాజు ఉన్నాడు కదా! సుద్యుమ్నుడు అనే రాజు ఈ దేశాన్ని పరిపాలిస్తున్నాడు అతడి దగ్గరికి వెళ్ళి దండన అడిగి తెచ్చుకో, ఆయన శిక్షిస్తాడు. ఆయన నిర్ణయించిన శిక్షను నీవు అనుభవిస్తే నీకు పాపక్షయం అవుతుంది" అన్నాడు.

అన్న సలహా ప్రకారము లిఖితుడు రాజు దగ్గరికి వెళ్ళాడు. లిఖితుడు తన దగ్గరకు వచ్చిన వెంటనే రాజు ఎదురుగా వెళ్ళాడు. లిఖితుడిని "మహాత్మా! మీరు ఏమిటి ఇలా దయచేశారు? నాతో ఏమిపని ఉంది, సెలవియ్యండి" అన్నాడు. లిఖితుడు ఆయనతో నేను ఏది అడిగితే అది ఇస్తావా అని అడిగాడు "మీరు ఏది అడిగితే అది ఇస్తాను. సూర్యభగవానుడు గతి తప్పితే తప్పవచ్చు గానీ, నేను మాత్రం మాట తప్పను, ప్రతిజ్ఞ చేస్తున్నాను" అన్నాడు రాజు. "అలా అయితే నేను నా అన్నగారి తోటలో మామిడి పండ్లు ఆయన అనుమతి లేకుండా తిన్నాను. ధర్మం తప్పినవాడినినేను. కనుక నేను శిక్షార్హుణ్ణి. కాబట్టినాకు శిక్షవేయండి. దండించవలసినవాణ్ణి దండించకపోతే రాజు రాజధర్మాన్ని తప్పిన వాడవుతాడు. నీకు దోషం ఆపాదించబడుతుంది జాగ్రత్త" అన్నాడు లిఖితుడు.

రాజు తనలో తాను "పరమపూజ్యుడైన ఋషి ఈయన, తనకు శిక్ష ఇవ్వమని అడుగతున్నాడు. ఏమిటి కర్తవ్యం" అని సందిగ్ధంలో పడి ఆలోచించాడు. చివరకు లిఖితుడుతో, "మహాత్మా! నీకు నేను శిక్షమాత్రం ఇవ్వలేను. నావలన కాదు. మీకు శిక్ష విధించకుండా పాపంచేసిన వాడిని అయినా ఫరవాలేదు. మీరు ఋషులు, మీకు శిక్ష నేను విధించట మేమిటి. నేను రాజధర్మం అతిక్రమించి పాపంచేసినవాణ్ణి అవుతాను. లోకానికి పరమపూజ్యుడువై పరమధార్మికమూర్తిగా ఇతరులకు అనుగ్రహాన్ని ప్రసాదించగల తపఃశక్తి సంపన్నుడివి, జ్ఞానివి అయిన నిన్ను నేను దండించుటయా! నేను ఆపని చేయలేను" అన్నాడు రాజు.

శిక్ష విధించమని లిఖితుడు, శిక్షవేయలేననిరాజు ఇలా వీరిద్దరి మధ్య చాలా కాలం వాదోపవాదాలు జరిగాయి. చివరకు లిఖితుడు రాజుతో "రాజా! ఆలస్యంచేయవద్దు. ఒక వ్యక్తి అధర్మం చేసాడని తెలిసిన వెంటనే ఆ వ్యక్తి ఎంత గొప్ప వాడయినా సరే, శిక్షించటంలో ఆలస్యం చేయకూడదు" అని తనకు శిక్ష ఇవ్వమని బలవంతపెట్టాడు.

ధర్మమూర్తి, యోగమూర్తి, తత్వవేత్త అయిన లిఖిత మహర్షికి రాజు నమస్కరించి, "నా రాజ్యంలో దొంగతనం చేసిన వారికి చేతులు నరికి వేయమని, అలా శిక్షించమని శాసనం చేసాను నేను, నిన్ను శిక్షించాలంటే ఆ శిక్ష నీకు ఇవ్వవలసివస్తుంది. అందుకే నేను దుఃఖపడుతున్నాను. ఒకరికి ఒక శిక్ష, మరొకరికి మరొకరకమైన శిక్ష విధించటానికి వీలు లేదు కదా! అందుకే బాధపడుతున్నాను" అన్నాడు. అప్పుడు ఆయనతో లిఖితుడు "అలా రాజశాసనం ప్రకారం చెయ్యి" అన్నాడు. రాజశాసనం ప్రకారం లిఖితుడి రెండు చేతులు నరకబడ్డాయి. ఆ విధంగా తాను చేసిన నేరానికి అతడు శిక్షకోరి అనుభవించాడు.

అన్న శంఖుడి దగ్గరకు లిఖితుడు వెళ్ళి సంతోషంతో, "నేను శిక్షపొందాను, నేను చేసిన పాపం నుంచి నన్ను విముక్తుణ్ణి చెయ్యి" అని అడిగాడు. తమ్ముడిని



శంఖుడు ప్రేమతో కౌగిలించుకున్నాడు ఆయనకు దుఃఖం, సంతోషం, ఒకేసారి కలిగాయి. "పరిశుద్ధిడివయినావు కాని పాపం చేసి శిక్ష పొందిన నీకు చేతులు లేవు కదా! ఇందుకు నేను చాలా బాధపడుతున్నాను. పంచ మహాపాతకాలలో దొంగతనం ఒకటి. బ్రహ్మజ్ఞాని, పూజ్యుడు అయిన అన్న ఆశ్రమంలో ఒక పండు దొంగతనం చేయటం అనేది నీ చేత చేయబడింది. విధి బలీయమైంది. అందువలననే ఈ శిక్ష నీవు అనుభవించవలసి వచ్చింది. ఎంతటి వారైనా, ఎవరైనప్పటికీ అధర్మంగా ప్రవర్తిస్తే దండనీయుడే గదా! పరమపూజ్యుడివి, వంశోద్ధారకుడివైన నీ కీర్తి లోకాలన్నింటిలో వ్యాపిస్తుంది. ధర్మపరిపాలన చేయటంచేత నీకు కీర్తి దక్కుతుంది" అన్నాడు శంఖుడు.

ఆ రోజు సంధ్యా సమయం అయింది. అర్ఘ్యాలిచ్చే సమయం వచ్చింది. అయితే తర్పణాలు ఇవ్వటానికి చేతులు లేవు అనే భావన కలిగింది లిఖితుడిలో. నదిలో స్నానంచేస్తూ మునిగి లేచేటప్పటికి యథాప్రకారం చేతులు తిరిగి వచ్చాయి. ఆ చేతులు కోరుకోవటం కూడా ధర్మంకోసమే! అర్ఘ్యప్రధానం కోసమే చేతులు లేవే అను కున్నాడు కానీ, తన స్వార్థం కోసం కాదు. ఆ దుఃఖం కూడా ధార్మికం. స్నానం చేసి బయటకు వచ్చే సమయంలో లిఖితుడికి రెండు చేతులు వచ్చాయి. లిఖితుడు చేసిన పాపం నశించి యథాపూర్వం అయినాడు. బాహువులు వచ్చాయి కాబట్టి "బహుదా" అని ఆ నదికి పేరు వచ్చింది.

మహర్షులు తప్పు చేసినా, తెలుసుకుని, వారే శిక్షను పొందారు. పాపం ప్రక్షాళన చేసుకున్నారు. తెలియకచేసిన తప్పును క్షమించమని కోరుతూంటారు ఋషులు. ఆ తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటారు. మానవులు ఇటువంటి విషయాలను ఆకళింపు చేసుకొని సన్మార్గంలో నడవటానికి ప్రతిజ్ఞచేయాలి. ఇటువంటి ధర్మసూక్ష్మాలనే ఋషులు లోకానికి అందించారు. ఋషులే మనకు మార్గదర్శకులు.

## అన్నదమ్ములు స్మృతి కర్తలు

మానవాళికి శంఖలిఖితులు ఒక స్మృతిని అందించారు. వాళ్ళిద్దరూ కూడా గొప్ప స్మృతికర్తలు అయినారు. సదాచార సంపన్నులు, ధర్మకర్తలు, ధార్మిక జీవనాన్ని తు.చ. తప్పక ఆచరించినవారు. లఘుశంఖస్మృతి, శంఖస్మృతి, లిఖితస్మృతి, శంఖలిఖిత స్మృతి అవి నాలుగు స్మృతులు వారి పేర్లతో లోకానికి ప్రసాదించారు.

ఒక్కొక్క స్మృతిలో కొన్ని ధర్మాలను, నియమాలను, శాస్త్ర విషయాలను పొందుపరచారు.

1. 'లఘుశంఖ స్మృతి'లో ఇష్టాపూర్వక కర్మ ఫలము, గంగా నిమజ్జన స్వర్గప్రాప్తి వర్ణనము, సపిండీకరణము, శ్రాద్ధాది కర్మలు మొదలైన వాటిని గురించి వ్రాశారు.
2. 'శంఖస్మృతి'లో బ్రాహ్మణాది కర్మవర్ణనము, బ్రాహ్మణ సంస్కారము, దాని వర్ణన, బ్రహ్మచర్య ఆచార వర్ణనము, వివాహ సంస్కారము, పంచ మహాయజ్ఞాలు, గృహస్థాశ్రమ ప్రశంస, అతిథి వర్ణనము, వానప్రస్థ ధర్మనిరూపణము, సన్యాస ధర్మ ప్రకరణము, ప్రాణాయామ లక్షణము, ధారణ ధ్యాన, యోగ నిరూపణము, సన్యాసధర్మము, నిత్య నైమిత్తికాది స్నాన లక్షణ వర్ణన, ఆచమన విధి వర్ణన, అఘమర్షణ విధి వర్ణన, గాయత్రీ జపవిధి, వర్ణన, తర్పణ విధానము, శ్రాద్ధాది సమస్త కర్మవివరణ, జననమరణ శౌచవర్ణన, ద్రవ్యశుద్ధి, మృణ్మయాది పాత్రశుద్ధి, వివిధ వ్రత విధాన వర్ణన, అఘమర్షణ, పరాక, వారుణ, కృచ్ఛ, అతి కృచ్ఛ, సాంతపనాధి వ్రత వర్ణనము ఉన్నాయి.
3. 'లిఖిత స్మృతి'లో షోడశశ్రాద్ధ వర్ణన, ఉదక ప్రదానము, అగ్నిస్థానము, అపుత్రయోద్ధిష్ట శ్రాద్ధవర్ణన, అంటే పుత్రులు లేని వారికి చేయవలసిన శ్రాద్ధము - ఇవన్నీ చెప్పాడు. శుక్లయజుర్వేద శాఖీయులయిన వాజసనేయులు శంఖ లిఖిత ధర్మశాస్త్రాలను ప్రత్యేకాభిమానంతో చూచుకుంటారు" అని 'తంత్రవాచకం'లో ఉన్నది.



యాజ్ఞవల్క్యుడు శంఖలిఖిత స్మృతిని అనేక చోట్ల ఉదహరించాడు. పరాశర ధర్మశాస్త్రంలో గూడ కృత, త్రేత, ద్వాపర, కలియుగాలలో వరుసగా మను, గౌతమ, శంఖలిఖిత, పరాశర స్మృతులే ధర్మానికి ప్రమాణాలుగా చెప్పారు. అంటే ప్రస్తుత కలియుగంలో పరాశరస్మృతి, ద్వాపరయుగంలో శంఖలిఖిత స్మృతి అని పరాశర మహర్షి భావన.

## లోకహితం

ఋషులు లోకక్షేమం కోసం ధర్మశాసనం చేశారు. అంటే మనం ఈలోకంలో సుఖంగా జీవించటానికి, ఆవిధంగా ఏయే ధర్మాలను మనం ఆచరిస్తే ఆముష్మికమైన ఉత్తమమార్గాలలో మనం ఉత్తమగతికి వెళు తామో, ఆ మార్గాన్ని చెప్పాయి వారి స్మృతులు. ఋషి గోత్రాలు, ఈ సంప్రదాయాలు లేక పోతే భారతీయత ఏమిటి? భారతీయ సంప్రదాయాలంటే కేవలం వర్ణ ధర్మమేకాదు. సమస్త వర్ణాలకు సమస్త ఆశ్రమాలకు ధర్మాలు ఉపదేశించి మానవాళి క్షేమాన్ని ఆశించిన వారు మహర్షులు. అటువంటి వారి స్మృతిని మనం విస్మరిస్తే వాళ్ళ అనుగ్రహం మనకు ఎలా కలుగుతుంది ?

భారతీయ మహర్షులు ఆదేశించిన, ఉపదేశించిన సందేశాన్ని అందించిన బోధలు, వారు మనకిచ్చిన ప్రాపంచికమైన కర్తవ్యాలు మరచిపోయామని, గుర్తుచేసుకోవాలి. వారు లోకోపకారం, క్షేమం, శ్రేయస్సు కోసం ఎన్నో ధర్మాలు చెప్పారు. తమ సంతానం మాత్రమే బాగుపడాలనికాదు. మహర్షుల లక్ష్యం తమ సంతానం వలన లోకానికి ఉపకారం జరగాలి. తద్వారా సంతానం పుణ్యశ్లోకులు కావాలి.

రోజూ ఒక సారైనా జీవకోటి కోసం ప్రార్థన చేయాలి. 'గోబ్రాహ్మణేభ్యః శుభం భవతు' అని నమస్కరించాలి. అంటే అర్థం "గోవు నుంచి సమస్త

పశువులు, బ్రాహ్మణులనుంచి సమస్త మానవులు శుభాన్ని పొందుతారు.” అని దాని అర్థం. అందుకే మన మహర్షులు 'సర్వేజనాః సుఖినోభవన్తు' అని బోధ చేశారు.

ప్రతి మహర్షి ఉపదేశానికి ఎంతో లోతైన విశాలమైన, సమస్త జగత్తుకూ హితం చేకూర్చే భావం కలిగిన అర్థాలు ఎన్నో ఉన్నాయి. మహర్షుల జీవిత చరిత్ర, వారు లోకానికి చేసిన ఉపకారం, ధర్మాలు, బోధలు, ప్రతిభారతీయుడు చదవాలి, అర్థం చేసుకోవాలి, ఆచరించాలి.

* * *

## 13. శుక మహర్షి

శుక మహర్షి వేద వ్యాసుని కుమారుడు. ఇతడు ఆధ్యాత్మిక స్థితితో, బ్రహ్మజ్ఞానిగా జన్మించాడు. శుక మహర్షి కారణజన్ముడు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. అవి: ఆయన జన్మించగానే, ఆకాశగంగ స్త్రీ రూపంలో వచ్చి శుకునికి మంగళ స్నానం చేయించింది, ఆకాశం నుంచి కృష్ణాజినము, దండము ఆయన ముందుపడ్డాయి. జన్మించగానే శిశువుగా లేడు. అయిదు సంవత్సరాలు కలిగి ఉన్నాడు. దేవతలు పుష్ప వర్షం కురిపించి సగౌరవంగా ప్రత్యక్షమైనారు, పార్వతీ సమేతంగా పరమేశ్వరుడు శుకునికి ఉపనయన సంస్కారం నిర్వహించాడు. దేవేంద్రుడు ఆయనకు మహోజ్వలంగా వెలుగులు నింపే కమండలం ఇచ్చాడు. దేవతలు ఎన్నడూ మాసిపోని, జీవితంలో మార్చుకొనే అవసరం లేకుండా శాశ్వతంగా ఉండే వస్త్రాన్ని ఇచ్చారు. ఆ వస్త్రం ఆయన జీవితానికి సరిపడేలా ఉన్నది. మృగములు, పక్షులు అన్నీ ఆనందంగా ఆయన జన్మదిన మహోత్సవ సంబరాలు, వేడుకలు జరుపుకున్నాయి. జన్మతః ఇన్ని సౌకర్యాలు ఉద్భవించాయంటే ఆయన మహిమ, ఉపకారం, సేవలు భవిష్యత్తులో ఏవిధంగా ఉంటాయో అంచనా వేయవచ్చు.

తండ్రి వేదవ్యాసుని వలె ఆయనకు కూడా వేదములన్నీ జన్మతః సిద్ధించాయట. అయినా గురువు అంటూ ఒకరు ఉండి తీరాలి గదా! వ్యాసుడి అనుమతి తీసికొని తన అయిదు సంవత్సరాల వయసులోనే బృహస్పతి దగ్గరికి వెళ్ళి వేదములు చదువుకున్నాడు. ఆయన ముఖతః విన్నాడు. వేద వేదాంగములు, ధర్మశాస్త్రములు, రాజనీతి వ్యవహారములు అన్నీ విన్నాడు. బ్రహ్మచర్య వ్రతముతో బృహస్పతి సన్నిధిలోనే నియమ, నిష్ఠలతో తపస్సు ఆచరించాడు.

సకల విద్యాభ్యాసాలు పూర్తి కాగానే బృహస్పతి “నాయనా! నీవు తెలుసుకోవలసిన వన్నీ తెలుసుకున్నావు. నీ తండ్రి దగ్గరికి వెళ్ళు” అని అనుమతి

ఇచ్చాడు. ఆయన ఆజ్ఞ ప్రకారం శుకుడు వ్యాసుడి దగ్గరికి వెళ్ళాడు. తండ్రికి నమస్కరించాడు. అప్పటికి ఆయనకు ఏడు సంవత్సరాలే! ప్రాపంచిక విషయాలపై నిస్పృహుడు కూడా అలాగే ఉంటాడు కదా! అలాగే ఉన్నాడు శుకుడు. ఈ ప్రపంచంలో దుఃఖం ఎందుకు ఉన్నదో, ప్రజలు ఎందుకు ఇలా కష్టపడుతున్నారో, వాళ్ళకు చేసే మార్గోపదేశం ఎలా ఉంటుందో, దానికిన్నీ – అతడికి – తేడా ఎలా ఉంటుందో, అటువంటి ప్రాపంచిక విషయాలన్నీ తెలియజేసాడు.

శుకమహర్షి వెంటనే తండ్రిని "మోక్షమార్గం అనేటువంటిది ఏమిటో, అసలు జీవులకు మోక్షమార్గమంటే ఎలా ఉంటుందో ఉపదేశించమన్నాడు". నీవు మోక్ష మార్గం గురించి తెలుసుకోవటానికి జనకరాజు వద్దకు వెళ్ళి తెలుసుకోమని చెప్పాడు". "ఆయన జగత్పూజ్యుడు, అహంకార మమకారాలు లేనివాడు. నువ్వు ఆయన దగ్గరకు పాదచారివై వెళ్ళు. ఆయన ఆస్థానానికి వెళ్ళి అన్ని విషయాలు తెలుసుకో!" అన్నాడు తండ్రి వ్యాసుడు శుకుడితో.

తండ్రి ఆనతితో శుకుడు విదేహ దేశంలోని మిథిలా నగరానికి వెళ్ళాడు. రాజ ద్వారం వద్దకు చేరుకున్నాడు. అక్కడ ఉన్న ద్వారపాలకులు శుకుని లోపలికి పంపకుండా అడ్డుకున్నారు. "చిన్న పిల్లలకు లోపల ప్రవేశం లేదు. రాజుతో నీకేమి పని?" అని అడిగారు. "ఏదో పండితులు, బ్రాహ్మణులు వచ్చారంటే లోపలికి పంపిస్తాం. కానీ మీలాంటి పిల్లలను లోపలికి పంపించము" అన్నారు. శుకుడు ఏమి సమాధానం ఇవ్వకుండా ప్రశాంతంగా అక్కడే కూర్చున్నాడు. వాళ్ళతో ఏమీ వాదించలేదు. ఈ విషయం జనకుడికి తెలిసింది. వ్యాసమహర్షి కుమారుడు శుకుడు వచ్చి ద్వారం వద్ద ఎదురు చూస్తున్నాడని తెలిసింది. వెంటనే రాజు తనే స్వయంగా వచ్చి అర్ఘ్యపాద్యాదులు ఇచ్చి ఆయనను సగౌరవంగా లోపలికి తీసుకొని వెళ్ళాడు. కాంచన సింహాసనం మీద కూర్చోపెట్టాడు. అక్షతలు, పువ్వులతో పూజించాడు. అర్చన, భోజనాలు



ముగిసిన తరువాత, మరుసటి రోజు ఊరి ప్రజల సమేతంగా శుకుణ్ణి దర్శించి ఆయనను స్తుతించి, వచ్చిన పనిని గురించి అడిగాడు జనకరాజు.

రాజుతో శుకుడు "మా తండ్రి గారు చెప్పిన విధంగా మోక్షమార్గాన్ని తెలుసుకుందామని మీ దగ్గరికి వచ్చాను. బ్రాహ్మణుడి కర్తవ్యం ఏమిటి? ఆయన మోక్షం ఎట్లా పొందుతాడు?" అని అడిగాడు జనకుణ్ణి. జనకుడు ఆయనతో "బ్రాహ్మణుడు ఉపనీతుడై, బ్రహ్మచర్యము, వేదాభ్యాసము నడిపి వివాహం చేసుకొని సంతానం పొంది, దేవ పితృ విధులు ఆచరించి, వాన ప్రస్థాశ్రమానికి వెళ్ళి హుతవహ ప్రయత్నముగా వ్రతపాలనచేసి, ఆ తర్వాత సన్న్యాస స్వీకారము చేసి, బ్రాహ్మాశ్రమ పదము పొంది, తరువాత జీవన్ముక్తికి తపస్సు చేయాలి" అని హితవు పలికాడు.

జనకుడు చెప్పిన సమాధానం విన్న శుకుడు ఆయనతో, "రాజా! నీవు చెప్పినది క్రమబద్ధంగానే ఉన్నది. కానీ జ్ఞానోదయమై ఉండగా ఆశ్రమత్రయాన్ని క్రమంగా నడుపలేనా? జ్ఞానియైన నా ఆశ్రమత్రయన ఆశ్రమములు విడువరాదని వేదములు చెపుతాయా? అని అడిగాడు. వెంటనే జనకుడు "మునీంద్రా! జ్ఞాన విజ్ఞానములు మోక్ష సాధనములే! గురూపదేశంతో అవి లభించగా మోక్షం పొందిన వాడు వాటిని వదలి వేస్తాడు. కానీ లోకచ్ఛేదకము, కర్మవ్యాకులత జరగకుండ ఉండటం కోసం లోకానికి అతడు ఉదాహరణగా, ఆదర్శప్రాయంగా ఉండాలి. అంతేగాని, కర్మభ్రష్టుడనే భ్రాంతి లోకానికి కలుగరాదు. కాబట్టి పూర్వం మునులు నాలుగు ఆశ్రమాలను క్రమంగా సక్రమంగా నడిపించారు. కానీ మొదటి ఆశ్రమంలోనే సుస్థిర జ్ఞానం లభించిన వాడికి మిగిలిన మూడు ఆశ్రమాలతో పనిలేదు.

## జ్ఞాని – లోభి తారతమ్యం

అందరియందు సమానమైన భావం కలిగిన ముని ఇతరులవల్ల తనకు, తన వల్ల ఇతరులకు భయంలేనివాడు. అంటే – "ఈ ప్రపంచంలో నాకు

ఆశ కలుగుతుందేమో!" అని గాని, అప్సరసలు, దేవతలవలన గాని జ్ఞానికి భయముండదు. ప్రపంచంలో ధనం, కనకం, వస్తు, వాహనములు, ఆస్తులు, ఇంకా ఏమేమో ఉన్నాయి. అవి అన్నీ బాధలకు, ఆపదలకు హేతువులు. వాటి వలన తనకు ఆపదలు లేవు. అవి మనసులోకి ప్రవేశించి కోరికలకు కారణమవుతాయి. ఇవి లోకులను భ్రష్టులను చెయ్య కలుగుతాయి. కాని ఇతరుల వస్తువులను, ఆస్తులను మనసు ఆశించదు.

"లోభి అనగా పిశినారి అంటాం. లోభి అయిన ధనవంతుడు ఉంటాడు. వాడికి జ్ఞాని వలన ఆపదలేదు. ఎందుకంటే ఆస్తిని, వస్తువులను ఆశించదు. ఈ ప్రకారంగా నిస్పృహుడై ఉండటంచేత అతడు జీవన్ముక్తుడై ప్రకాశిస్తాడు. అనామకవృత్తి – కోరిక లేకుండా ఉండటము తపోరీతి తపస్సులో లీనమవటం – ఈ రెండే అతడు ఎల్లప్పుడు ఆచరించేవి. అతడి యదార్థస్థితి ఇంతే. అతడు బ్రహ్మజ్ఞాని. బ్రహ్మదృష్టి కలిగి ఉంటాడు. మట్టి అయినా, బంగారమైనా అతడికి సమానమే! నింద, కీర్తి ఈ రెండింటినీ అతడు సమదృష్టితో చూస్తాడు. ఇటువంటి వారిని సమదర్శి అనవచ్చు. అతడు ఇంద్రియ నిగ్రహశక్తి కలిగి ఉంటాడు. ఆ దశలో అతడికి శివజ్ఞానము, శివదర్శనము కలుగుతాయి. ఈ విశేషాలన్నీ నీలో ఉన్నాయి నాయనా!" అన్నాడు జనకుడు. నీలో ఏ దోషము లేదు. నీవు ముక్త పురుషుడవే అని ధైర్యం చెప్పాడు జనకుడు.

ఆ మాటలకు శుకుడికి శాంతి, ఆనందము కలిగాయి. ఆనందంతో ప్రశాంత చిత్తుడై తండ్రి ఆశ్రమానికి వెళ్ళాడు. జనక మహారాజుతో జరిగిన సంభాషణ అంతా శుకుడు చెప్పగా వ్యాసుడు తనలోనే దాచుకున్నాడు. ఏ విషయం పైనైనా సందేహం కలిగినపుడు తండ్రిని అడిగి నివృత్తి చేసుకుంటున్నాడు శుకుడు.

శుకుడు సమస్త శాస్త్ర విజ్ఞానాన్ని తండ్రి వ్యాసుడి ద్వారా తెలుసుకున్నాడు. విజ్ఞానం అంతా తెలుసుకోవాలని లేదు. జీవన్ముక్తుడికి ఇవన్నీ తెలియాలి



అని లేదు. సమాచారం తెలుసుకోవాలనే తపన గల వయసు శుకుడిది. ఇటువంటి ప్రపంచ విషయం తెలుసుకోవాలి కాబట్టి ఆయన అడిగాడు. వ్యాసుడు చెప్పాడు. "యోగ సంఖ్యాధ్వర్య ప్రజ్ఞా విశేషాలలో దేనివల్ల పరబ్రహ్మము పొందవచ్చు" అని అడిగాడు శుకుడు.

"ఇంద్రియ నిగ్రహము, కామ క్రోధ లోభ మోహాదులు పోగొట్టుకోవటము. ధృఢ విద్య – అంటే ఇది సత్యము అనే సంగతి ఎప్పుడూ మరచిపోకుండా ఉండటము. భయంకరమైన స్థితిలో సముద్రంలో మునిగిపోతున్నా, బడబానలంలో చిక్కుకున్నా సత్యమనే వస్తు జ్ఞానము ఎప్పుడూ వెలుగుతూ ఉంటుంది. "ప్రాణం పోయినా అబద్ధం చెప్పను" అంటుంటారు లోకంలో కొంత మంది, అంటేవారు ఎల్లవేళలా సత్యమునే పలుకుతారని అర్థం. అది ఎప్పుడూ కూడా ఆరిపోదు. ధృఢవిద్య అని దానికి పేరు. ఈ విధంగా నడచుకునే వాడు ఏ మార్గంలో ఉన్నా బ్రహ్మపద ప్రాప్తి కలుగుతుంది.

"ఏ మార్గము అంటే యోగంచేత కాని, మౌనంచేత గాని, తపస్సు చేతగాని, ప్రాణోపాసన చేతగాని, సరైన మార్గం ఏమీ లేకుంటే అలా పడి ఉండటం చేత కూడా ఏ మార్గం ద్వారా అయినా కాలాంతరంలో జ్ఞానం కలుగుతుంది" అని చెప్పాడు. తరువాత "బ్రహ్మచర్యము, బ్రహ్మవిద్యా వ్యాప్తి ఇవన్నీ కూడా తెలుసుకోవలసిన అవసరం ఉంది" అని చెప్పి అంతర్యాగ ప్రాశస్త్యం వివరించాడు. ఇంద్రియ నిగ్రహమే ఉత్తమోత్తమ ధర్మం. ఆ ధర్మం కూడా అంతర్యామిని ప్రవేశించవలసిందే అని యోగ విషయాన్ని శుకుడికి బోధించాడు. శుకుణ్ణి యోగీశ్వరుడు అంటారు. వ్యాసుడు గోవు యొక్క మహత్తును కూడా తెలియపరచాడు.

ఈ ప్రకారంగా శుకుడు సమస్త సందేహాలు నివృత్తి చేసుకొని, విజ్ఞానాన్ని సంపాదించుకున్నవాడై పరబ్రహ్మ అనుసంధానంతో అవధూత మూర్తిగా నిలిచి బ్రహర్షులు కూడా గౌరవించే స్థానాన్ని పొందాడు. తండ్రి ఆజ్ఞ తీసుకొని

భూప్రదక్షిణ చేస్తానని వెళ్ళాడు. ఎక్కడా కూడా స్థిరంగా ఉండకూడదనే నియమంతో బయలుదేరి వెళ్ళాడు. ఆవు పాలు పితకటానికి ఎంత సమయం పడుతుందో అంత సమయమే ఒక ప్రదేశంలో ఉండేవాడు.

## పరీక్షిత్తు - ముక్తి సాధన

పరీక్షిత్తు మహారాజుకు ఏడు రోజులలో మరణం సంభవిస్తుందని బ్రాహ్మణశాపం తగిలింది. అతడు మరణానికి దగ్గరలో ఉన్నాడు. ఏడు రోజులలో ఏవిధంగా ముక్తి సంపాదించాలా అని మథనపడుతున్నాడు. ఆయన దగ్గర అనేకమంది మునులు, యోగులు, పండితులు వచ్చి అనేక విషయాలు బోధిస్తున్నారు. అయినా చివరకు వారంతా ఏక కంఠంతో శుకమహర్షిని పిలిపించి ఆయన చెప్పినట్లుగా చెయ్యమని సలహా ఇచ్చారు.

స్మరణ మాత్రంచేత శుకుడు ప్రత్యక్షమైనాడు. పరీక్షిత్తు ఆయనతో జరిగిన వృత్తాంతం అంతా వివరించాడు. "మహాత్మా! నాకు ఇవ్వబడిన శాపాన్ని మళ్ళించుకొని జీవిద్దామనే ఆశలేదు. నా ఆయుష్షు ఇంక ఏడు రోజులే మిగిలింది. నేను ముక్తి కోరుకుంటున్నాను. అందుకని ముక్తి మార్గం చెప్పవలసింది" అని అడిగాడు.

శుకమహర్షి అందుకు బదులుగా ఆయనతో "రాజా! నీకు ముక్తి మార్గం ఒక్కటే శరణ్యం. హరి భక్తిని గురించి నీకు ఉపదేశిస్తాను. నీవు అందులో సాంఖ్య యోగంవలన ముక్తి పొందగలవు. ద్వాపరయుగం చివర నా తండ్రి కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు) భాగవతం రచించాడు. అందులో హరిచరిత్ర అంతా ఒకచోట వ్రాసాడు. కాబట్టి ఆ వృత్తాంతం అంతా వినిపిస్తాను. విష్ణుసేవా బుద్ధితో మోక్షం కోరుకునే వారు ఎవరైతే భాగవత కథలు వింటారో, వారికి ముక్తి లభిస్తుంది" అన్నాడు. ఈ సందర్భంలో పూర్వం ఖట్వాంగుడు అనే రాజు ఎలా ముక్తిని పొందాడో వివరించాడు. ఆ కథ విందాం!



"ఖట్వాంగుడు అనే రాజు ఏదో కారణంచేత మరణం సంభవించి, పుణ్యమూర్తి కావటం వలన దేవ లోకానికి వెళ్ళాడు. వెళ్ళిన తరువాత ఆయనకు ఇంకా రెండు ఘడియలు ఆయుర్దాయం ఉండగానే అక్కడకు రావటం జరిగింది అని తెలిసింది. అందువలన ఆయన భూలోకానికి తిరిగి వచ్చాడు. వచ్చిన వెంటనే తన పురోహితులకు ఈ సంగతి చెప్పి, భార్యా, పుత్రులు, రాజ్యం వదిలి పెట్టి ముక్తి లభించటానికి మార్గాన్ని అడిగాడు. ఆ పురోహితులు ఆ రాజును 'హరినామస్మరణ' చేయమన్నారు. వెంటనే ఆ రాజు గాఢమైన వైరాగ్య భావంతో హరినామ సంకీర్తన చేసి ముక్తిని పొందాడు. ఆయన కేవలం రెండు ఘడియల ఆయుర్దాయం కాలంలోనే ఇది సాధించాడు". "నీకు ఏడు రోజులు ఉంది గదా! అంటే చాలా సమయం ఉంది గదా! కాబట్టి హరి కీర్తనలు వింటూ హరినామస్మరణ చెయ్యి" అని సలహా ఇచ్చాడు శుకుడు.

ఇంకా సత్సందేశాన్ని వినిపిస్తూ పరీక్షిత్తుతో "భాగవత కథ నీకు సూక్ష్మంగా వినిపిస్తాను. ఇది విన్న తరువాత శుచిగా ఉన్న ఒక ప్రదేశానికి వెళ్ళి నిష్ఠతో ప్రణవ మంత్రాన్ని జపిస్తూ మనసులోంచి అన్ని ఇతర విషయాలను పారద్రోలు. మనోబుద్ధి బలంతో ఇంద్రియాలను నిరోధించి హరిపాదములను స్మరణ చెయ్యి. మనసులో ఉన్న కల్మషాలన్నీ మటుమాయమై పోతాయి. భక్తి లక్షణమైన యోగమును నీవు ఆవిధంగా ఆశ్రయించిన వాడవు అవుతావు. సర్వమయుడైనటువంటి పరమేశ్వరుడు నీ యందు సత్త్వ రూపంగా దర్శనమిచ్చి అతడి యందు నిన్ను నీవే అనుసంధానం చేసుకొనే శక్తిని ప్రసాదిస్తాడు. అప్పుడు నువ్వు ముక్తుడవు అవుతావు.

శుకమహర్షి ద్వారా లోకానికి 'హరినామస్మరణ" ముక్తి మార్గమని సందేశం ఇవ్వటం అయింది. "కలౌస్మరణాన్ ముక్తిః" అన్నారు ఋషులు. కలియుగంలో భగవన్నామస్మరణ వలన ముక్తి లభిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. పండితులు, ఉపన్యాసకులు తమ ప్రసంగాలలో ప్రజలకు సందేశాన్ని ఇస్తున్నారు. కాబట్టి 'హరినామ స్మరణ' శక్తివంతమయిన

ఆయుధంగా ముక్తిని పొందటానికి సాధనము అని మానవాళి తెలుసుకోవాలి. దేశంలో క్రిమి, కీటకాదులు వ్యాపించి అల్లకల్లోలం సృష్టిస్తున్న సమయంలో 'హరినామ' స్మరణ ఉత్తమమైన ముక్తి మార్గం.

''దీనిని బట్టి భక్తే ప్రధాన సాధనమని తెలుస్తోంది. భక్తిని పెంపొందించుకోటానికి ప్రణవోపాసనము, ధ్యానంలో కూర్చోవటం, నిర్మలమైన మనస్సు, శుచిగా ఉండటం, ఇంద్రియనిగ్రహం ఎంతో అవసరం. ఇవన్నీ ఉపాంగములు. బ్రహ్మ కూడా వేదములను మూడు పర్యాయములు భావనచేసి, తననుంచి వాటిని బహిర్గతం చేసుకొని వేదములను సంపాదించటం కోసం 'హరి'ని ధ్యానం చేసాడయ్యా! యోగంచేత కాదు అంతర్ముఖత్వంచేత కాదు. భక్తితో హరిని చింతన చేసాడు. అప్పుడే వేదాలు లభించాయి. ఆయనకు వేదాలు లభించడానికి 'భక్తే కారణం' అని చెప్పి పరబ్రహ్మానికి దారి చూపించాడు. తరువాత శుకుడు అక్కడ నుంచి వెళ్ళాడు. పరీక్షిత్తు ఆయన చెప్పిన విధంగా ఆచరించి ముక్తిని పొందాడు.

బ్రహ్మ అంతటి సృష్టికర్తే వేదాలు పొందటానికి 'హరి' నామస్మరణే కారణం. సామాన్య మానవులం అయిన మనం 'హరి' నామస్మరణే ముక్తి దాయకమని తెలుసుకొని ఆచరించాలి. మహర్షులు ఏ సలహా ఇచ్చినా లోకకళ్యాణం కోసమే అని గుర్తించాలి.

## జన్మలో ముక్తిపై కాంక్ష

ప్రతి వ్యక్తికి ఏదో ఒక జన్మలో ముక్తి అవసరం. ముక్తియందు ఆకాంక్ష కలగాలి. వేద వేదాంగములు చదవటం, యజ్ఞ యాగాది క్రతువులు నిర్వహించటం, సత్యము, శౌచము ఇవన్నీ జన్మలో చేస్తాము. ఇవన్నీ వచ్చిన తరువాత గూడ ఆ జన్మలో ముక్తియందు కాంక్ష లేకపోతే, మరి ఏ జన్మలోనూ ముక్తి యందు కోరిక కలుగదు, ముక్తి లభించదు" అని అన్నాడు నారదుడు. ముక్తిని పొందే ప్రయత్నం చేయకపోతే, అది ఇక ఏ జన్మలోనూ లభించదు.



అంటే ఆ తరువాత, కోరుకోవలసిన బాధ్యత జీవుడిపై ఉంటుంది. విద్య, వేదాంగములు, సత్యము, ఇవన్నీ ఉన్న తరువాత కూడా ముక్తి కోసం కాక తపస్సు అనేక కారణములచేత చేయవచ్చు. కోరికల కోసం కూడా తపస్సు చేస్తారు. అహంకారంతో తపస్సు చేస్తారు. దుఃఖం చేత తపస్సు చేస్తారు. క్రోధం చేత కూడా తపస్సు చేస్తారు. ఏకారణం కోసం తపస్సు చేసినా తమ తేజస్సును ఇనుమడింప చేసుకోవటానికే చేస్తారు. ఎన్ని చేసినా, ఎంత విద్య చదివినా, అసలు ముక్తి కాంక్ష ఉందా, లేదా? అనేదే ప్రశ్న.

ఈ విషయంలో సనత్కుమారుడు ఇలా అన్నాడు. "ముక్తియందు కోరిక కలిగినవాడు కామ క్రోధాలు జయించాలి. అపరిగ్రహం, సర్వారంభ పరిత్యాగం, అహింస, ఇంద్రియ జయం – వీటిని ఆశ్రయించినపుడు ముక్తి కరతలామలకం అవుతుంది. వీటిని త్యజించాలనే సంకల్పం కలిగినపుడు ధర్మం, అహింస వలన అధర్మం నశిస్తుంది. అంటే మోక్షం లభించటానికి ధర్మాధర్మములు రెండూ ఉండరాదు. ముక్తిని కాంక్షించేవాడు సర్వారంభపరిత్యాగి, సంకల్ప రహితుడు కావాలి. ధర్మము సుఖ ప్రదమైనది, క్షేమకరమైనది. కాని మోక్ష సాధనలో భౌతిక, లౌకికక్షేమం కూడా అతడిని విసర్జిస్తుంది. సత్యాసత్యాలు రెండింటిని విడువవలసి ఉంటుంది. సర్వదేహ సంపత్తి, సత్యాసత్యములు ప్రారంభ దశలోనే ఉంటాయి. జీవిత చరమాంకంలో శోక భయ కారణములు కనిపించినా చలించకుండా ఉండాలి. ప్రపంచంలో తన చుట్టూ ఎన్ని సంఘటనలు జరుగుతున్నా నిస్పృహతో ఉండాలి. అప్పుడు ముక్తి హేతువును అన్వేషించాలి. అటువంటి వారు ముక్తిని పొందుతారు. అని నారదుడు సనత్కుమారుడి మాటలుగా చెప్పాడు.

## శుకమహర్షి బ్రహ్మ బలం

తరువాత కొంత కాలానికి శుకుడు తండ్రి దగ్గరికి వెళ్ళి ఆయనను ప్రదక్షిణచేసి "యోగ సిద్ధి పొందుతాను, అనుమతి ఇవ్వవలసింది అని అడిగి

అనుమతి పొంది వెళ్ళాడు. అయినా వ్యాసుడు ఆయనను "ఒక్కసారి నిలబడు, నిన్ను నేను చూస్తాను" అని అంటున్నా కూడా, నీ స్నేహము, నిస్సంశయము కలిగిన స్థితియందు ఉండటంచేత ఆమాట వింటూనే శుకుడు వెళ్ళిపోయాడు, అక్కడ నిలువలేదు. ఆవిధంగా ప్రయాణం చేసి కైలాస పర్వతానికి వెళ్ళి గొప్పయోగమందు ప్రవేశించి తపస్సు చేసాడు. ఆ సమయంలో నారద మహర్షి వచ్చినా చలించలేదు. మళ్ళీ సంచారం ప్రారంభించాడు. ఒక చోట మహా పర్వత శృంగములు రెండు బాగా పెరిగి శుకుడి మార్గానికి అడ్డు వచ్చాయి ఆయన శరీరానికి పర్వతాగ్రములు తాకగానే అవి పిండి పిండి అయినాయి. ఆయన ప్రయాణం అప్రతిహతంగా సాగుతున్నది. ఇదంతా ఆయన శారీరక బలముగానీ, యోగబలం కాని కాదు. అది బ్రహ్మబలం. బ్రహ్మ వస్తువు ఆయన శరీరంలో ఉన్నది. దాని ముందర పాశుపతం వంటి అస్త్రములు కూడా నిలువవు.

శుకుడిని వెతుక్కుంటూ వెంటబడి నడుస్తున్నాడు వ్యాస మహర్షి. తండ్రి వస్తున్నాడనే స్పృహ గూడా లేదు. శుకుడు ఒక్కొక్క భూతాన్ని దాటి వాయు మార్గాన్ని దాటి ఆకాశానికి వెళ్ళాడు. భూమి చుట్టూవున్న వాతావరణాన్ని, దాని మీద ఉన్న అంతరిక్షాన్ని దాటి వెళ్ళాడు. ఆయన వేగానికి ఎవరూ తట్టుకోలేక ఎదురుగా రాకుండా తప్పుకుంటున్నారు. పర్వత శృంగాలు పిండి పిండి అయిపోవటము చూచి ఆయన ఎక్కడికి వెళుతున్నాడో తెలియక పక్కకు తొలగి నిలబడ్డారు.

## వ్యాసుడికి పుత్ర వ్యామోహం

వ్యాసుడు వెంబడిస్తూ 'శుకా'! అని పిలిచాడట. బదులుగా పంచభూతములు "ఓ" అని బదులు పలికాయి. అంటే ఆయన పంచభూతాల్లో వ్యాపించి ఉన్నాడు. సృష్టి అంతా వ్యాపించి ఉండటం చేత ఆయన పేరు ఎక్కడ పిలిచినా అక్కడ వృక్షములు, ఆకాశము, పర్వతాగ్రములు, పంచభూతాలు "ఓ" అని



బదులు పలికాయి. అది శుకమహర్షి వ్యాప్తి లక్షణం. ఆ విషయం వ్యాసుడికి అర్థమయిందట. ఆయన ఇంకా పుత్ర వ్యామోహంలో ఉన్నాడు. శుకుడు ఈ విషయంలో నిస్సంగుడు. తనకు తనే సిగ్గు పడ్డాడు వ్యాసుడు. ఏం చేయాలో తోచక వ్యాసుడు అక్కడ కూర్చొని శివుడిని తలచుకున్నాడు.

వ్యాసుడికి రుద్రుడు ప్రత్యక్షమైనాడు. "కొడుకు కోసం ఎందుకు దుఃఖపడతావు? పంచభూతాలతో తుల్యమైన కొడుకు కావాలని నన్ను ప్రార్థించావు కదా! అలా కలిగిన నీ కొడుకు నీ దగ్గర ఉంటాడా? పంచభూతములు ఏవిధంగా స్వతంత్రులుగా సంచరిస్తున్నవో అలాగే నీ కొడుకు శుకుడు కూడా వ్యవహరిస్తున్నాడు. అటువంటి పుత్రుడి మీద నీకు ఎటువంటి అధికారమూ లేదు. అతడు వెళ్ళి పోయాడు. నీవు దుఃఖపడవద్దు" అన్నాడు. "దేవతలు కూడా పొందనటువంటి ఉత్తమ స్థితిని ఆయన పొందాడు. నీ కుమారుడు అనే భావన వదలి పెట్టి అటువంటి పుత్రుని కన్నందుకు నీ కీర్తి శాశ్వతముగా ఉంటుంది. ఈ లోకంలో నీవు ఇంతకన్నా కోరుకునేది ఏముంది?" అని అనునయ వాక్యాలతో వ్యాసుడిని ఓదార్చి శివుడు అంతర్ధానమైనాడు.

ఇది శుక మహర్షి చరిత్ర. ఆయన చిరంజీవి. నేటికీ ఉన్నాడని చెబుతారు. ఆయన యోగమార్గావలంబియై, పరబ్రహ్మ స్వరూపుడై భవ్యవిఖ్యాతి నార్జించాడు. ఆ మహామహుని చరిత్ర పవిత్ర స్మరణము, భవభయ నాశకరము. ఇహపర సాధకము. భారతం శాంతిపర్వములో ఈ మహర్షిని గురించి తెలుసుకోవచ్చు.

* * *

## 14. మైత్రేయ మహర్షి

అత్రి మహర్షి వంశపరంపరలో జన్మించిన వాడు మైత్రేయుడు. ఈయన పరాశర మహర్షికి శిష్యుడు. ఎప్పుడూ 12 సంవత్సరముల వయస్సు గల పిల్లవాడి వలె కనబడతాడు. మైత్రేయుడు పరాశర మహర్షి దగ్గరికి వచ్చి, తనకు వేదవేదాంగములన్నీ ఆయనవల్ల నేర్చుకొని సృష్టి రహస్యమంతా తెలుసుకోవాలని ఉందని అన్నాడు.

పరాశర మహర్షికి ఉన్నటువంటి త్రికాల జ్ఞానము అంటే సృష్టిలో సమస్త విషయముల యొక్క విజ్ఞానము అనన్య సామాన్యమైనది. ఆయనకు తెలిసిన విషయములు వేరే ఎవరికి తెలియవు. ఆయనను ఆశ్రయించి సమస్త విజ్ఞానము తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో వెళ్ళి ఆయనను మైత్రేయ మహర్షి గురుభావనతో ప్రార్థించాడు. పరాశర మహర్షి తన విజ్ఞానాన్నంతా మైత్రేయుడికి ధారపోసాడు. ఆయనకు అనేకమంది శిష్యులు ఉన్నారు. తన విద్య యావత్తు ధారపోస్తే స్వీకరించే అర్హత గలవాడు మైత్రేయుడే తప్ప ఇంకెవ్వరు కనపడలేదు. మైత్రేయుడిలో అటువంటి లక్షణాలు, యోగ్యతలు, అర్హతలు ఉండటం వలన తనకున్న విజ్ఞానాన్నంతా ఆయనకు అందించాడు. మైత్రేయుడు సమస్త విజ్ఞానం నేర్చుకున్న తర్వాత పరాశర మహర్షితో సమానమైనాడు. విద్య అంతా నేర్చుకున్న తర్వాత మైత్రేయుడితో, పరాశర మహర్షి "నాయనా! నీవు సమస్త విద్యలూ నేర్చుకున్నావు. నీకు ఇంకా నేను చెప్పేది ఏమీ లేదు" అన్నాడు. మైత్రేయుడు మాత్రం ఆయన అట్లా అన్నప్పటికీ కూడా, సృష్టి చరిత్ర దానికి కారణభూతు లెవ్వరు? దానికి పరిణామమేమిటి? జీవులకు అత్యుత్తమమైన మోక్షమార్గానికి సులభోపాయం ఏది! మొదలైన విషయాలన్నీ అడిగాడు. యోగము, వైరాగ్యము, తపస్సు, సర్వోత్తమమైన వైదిక కర్మల యొక్క ఫలము లభింపచేసే ఒక్క మార్గమేదైనా ఉందా?

ఆ ఫలం లభించటానికి ఏది సులభమైన మార్గం? మొదలైనటువంటివి అన్నీ అడిగాడు.

దానికి సమాధానంగా పరాశర మహర్షి "ఈ జగత్తంతా విష్ణుమయమే! ఆ విష్ణువే సమస్త దేవతల రూపంలోనూ ఉన్నాడు. అతడే త్రిమూర్తులు, అతడే ప్రకృతి, అతడే పురుషుడు, అతడే జీవుడు, అతడే బంధనము, అతడే ముక్తి" అని బోధించాడు. ఈ విషయాలన్నీ విష్ణు పురాణంలో ఉన్నాయి. విష్ణు పురాణం సమగ్రమైన ఒక చరిత్ర. విజ్ఞాన సర్వస్వం. అనేక చరిత్రలు అందులో ఉన్నాయి. గంధర్వులు ఎవరు? దేవతలు ఎవరు? విద్యాధరులు ఎవరు? మొదలైన విషయాలు అందులో ఉన్నాయి. సమస్త విషయాలు నిక్షిప్తమైన సమగ్రమైన పురాణం విష్ణుపురాణం. ఈ పురాణం అంతా పరాశరుడు మైత్రేయుడికి సమాధానంగా చెప్పిన కథ. మన్వంతరాలు, వాటి ప్రమాణము, కాలజ్ఞానము మొదలైన విషయములు కూడా అందులో ఉన్నాయి. అలా సృష్టి విషయమంతా పులస్త్య బ్రహ్మ ద్వారా తెలుసుకున్న పరాశర మహర్షి మైత్రేయుడికి చెప్పాడు. ఇంతకన్నా సృష్టిలో తెలుసుకోవలసిన వస్తువు ఇంకొకటి లేదు. అంతా నేను నీకు ఇచ్చాను. ఇంక నీకు చెప్పవలసిన విషయాలు ఏమీలేవు" అన్నాడు పరాశరుడు. మైత్రేయుడితో "నీవు అడిగిన సమస్త విషయములూ నీకు వివరించాను. ఇక నీవు వెళ్ళ వచ్చు అన్నాడు". పరాశర మహర్షి, మైత్రేయుడు విష్ణుస్మరణ చేస్తూ అక్కడ నుంచి వెళ్ళాడు.

సమస్త విషయాలు తెలుసుకున్న మైత్రేయుడు తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు, నదులు, వాటి పుట్టుక, ఋషుల వాటికలు ఎవరెవరు ఉన్నారు. అన్ని విషయాలు తెలుసుకుంటూ ఆయా స్థలాలకు వెళ్ళి చూచాడు. ఆ యాత్రలలో కామ్యకవనం అనే ప్రదేశాన్ని చేరుకున్నాడు. చిన్న చిన్న వనములు, ఉపవనములు అనేకం అక్కడ ఉన్నాయి.

### పంచపాండవుల దర్శనం

మైత్రేయ మహర్షి కామ్యకవనంలో ధర్మరాజు, ఇతర' పాండవులను చూచాడు. అక్కడ వారి దీనావస్థ గమనించాడు. ఘోరమైన అన్యాయానికి

బలి అయిన వారు, ధర్మవర్తనులు, భవగంతుడి భక్తులు, ఈ విధంగా కష్టాలుపాలైనారని తెలిసి ఆయనకు మనసు కరిగింది. మైత్రేయ మహర్షి కామ్యకవనం చేరే సమయానికి కౌరవులకు పంపిన రాయభారాలన్నీ విఫలమైనాయి. ఇంకా చేయాల్సిన ప్రయత్నాలు ఏమీ లేవు. యుద్ధం తప్పనిసరి అనే నిర్ణయంలో ఉన్నారు అందరూ. నిజంగా ఎవరు జీవిస్తారో యుద్ధమంటూ జరిగితే ఎవరికీ శాంతి ఉండదు. ఎవరు మరణిస్తారో తెలియని పరిస్థితి. ఈ వంశంలో, ఈ కుటుంబంలో అంతా క్షేమంగా ఉంటారో లేదో తెలియదు. అంతా అగమ్యగోచరంగా ఉన్నది. దు:ఖంతో ఉన్నాడు ధర్మరాజు.

## ధర్మరాజు - రాజ ధర్మం

మైత్రేయ మహర్షి, ధర్మరాజు పరస్పరం కలిసినపుడు వారి సంభాషణలో ఎక్కువగా ధర్మం గురించి, కౌరవుల దురాగతాల గురించి చర్చకు వచ్చాయి. ధర్మరాజు మైత్రేయుడితో "మహర్షీ! ఈ యుద్ధం జరగకుండా ఉంటే బాగుండును. ఇప్పటికీ నేను అదే కోరుతున్నాను. నేను ఎక్కువగా ఏమి అడగటంలేదు. మాకు వారి మాదిరి దురాశలేదు. మేము ధర్మవర్తనులమని అందరూ చర్చించుకుంటున్నారు. ఆఖరుకు మా రాజ్యం కూడా అవసరంలేదు. అయిదు ఊళ్ళు మాత్రమే అడిగాము. అవి కూడా మాకు లేకపోతే మా కుటుంబం దారిద్ర్యానికి నేనే కారణం అవుతాను కదా! నా తమ్ముళ్ళు, భార్య, కొడుకులు వాళ్ళందరి దుఃఖానికి నేనే కారణము అవుతాను! రాజ ధర్మంలో వీళ్ళ పోషణ కోసమని అయిదు ఊళ్ళు ఇవ్వమని అడిగాను.

## మైత్రేయుడు ధృతరాష్ట్రుని కలియుట

ధర్మరాజు చెప్పినదంతా విని మైత్రేయ మహర్షి "ధృతరాష్ట్రుడికి అందరూ సలహాలు ఇచ్చారు కదా! వాళ్ళందరినీ కాదన్నాడు. ఇప్పుడు నేను కూడా వెళ్ళి ఒకసారి అతడితో చెప్పి చూస్తాను", అని అన్నాడు. వెంటనే ధృతరాష్ట్రుడి దగ్గరికి ప్రయాణమైనాడు. వ్యాసమహర్షి తన దివ్య దృష్టితో ఈయన రాకను గ్రహించి, వెంటనే సంభ్రమంతో ధృతరాష్ట్రుడి వద్దకు వెళ్ళి "నాయనా! నీకు చివరిసారిగా మరొకమారు సలహా ఇవ్వాలనుకున్నాను. జగత్పూజ్యుడైన మైత్రేయ మహర్షి నీ ఆహ్వానం లేకుండానే నీ దగ్గరకి వస్తున్నాడు. ఎంత వారైనా పిలిచి ఆరాధించినా ఆయన ఎవరి ఇంటికీ కూడా రాడు. ఎప్పుడో, ఎక్కడో నీవు పుణ్యం చేసుకున్నావు. అందువలన ఇప్పుడు మీ ఇంటికి వస్తున్నాడు. చివరి సారిగా అతడు చెప్పిన హితబోధ వింటావా, నీ కొడుకు చేత వినిపిస్తావా! మీరందరూ క్షేమంగా ఉంటారు. మీ అన్నదమ్ముల పిల్లల మధ్య సత్సంబంధాలు పెంచుకోవటం, పంచుకోవటం జరుగుతుంది కదా! మైత్రేయుడు ధర్మ పక్షపాతి, న్యాయ పక్షపాతియే కానీ, మనుష్య పక్షపాతి కాడు. ఆయన వాక్కు అమోఘం సుమా! పరాశర మహర్షి అంతటివాడు ఆయనకు విజ్ఞాన సర్వస్వాన్ని బోధించాడు. ఆయన ఏ విషయంలోనూ బ్రహ్మకంటే తక్కువేమీ కాదు" అని శ్లాఘించి చెప్పాడు వ్యాస మహర్షి.

## మైత్రేయుని పలకరింపులు

ముందుగనే వ్యాసుడిచేత మైత్రేయుడి రాక గురించి తెలిసింది కాబట్టి. స్వాగతం పలుకటానికి ధృతరాష్ట్రుడు సిద్ధంగా ఉన్నాడు. ఆయన రాగానే ఎదురు వెళ్ళి నమస్కరించి అర్ఘ్యపాద్యాదులిచ్చి, పూజించి, కూర్చోబెట్టి, "మహాత్మా! తమరు ఎక్కడి నుంచి వస్తున్నారు? తమరిరాకకు కారణం ఏమిటి? మాకు ఆజ్ఞ ఏమిటి? చెప్పండి. మీ ఆజ్ఞ శిరసావహిస్తాను" అని పలికాడు.

"నేను పాండవుల ఆశ్రమం నుంచి వస్తున్నాను" అని మైత్రేయుడు అనగా, "పాండవులు క్షేమంగా ఉన్నారు కదా"! అని అమిత వాత్సల్యంతో అడిగాడు ధృతరాష్ట్రుడు. అప్పుడు మైత్రేయుడు ఆయనతో, ''పాండవులు ధర్మపరాయణులు, వాళ్ళు ఆహ్వానించకపోయినప్పటికీ పాండవులను అనేకమంది మునులు, మహర్షులు వచ్చి ఆశీర్వదించి వెళుతారు. వాళ్ళకు అది క్షేమంకాక మరేమవుతుంది. వాళ్ళు కుశలంగానే ఉంటారు. కుశలంగా

లేని వాడివి నువ్వు. నేను రాబోయే ఆపద గురించి తెలిసే నీమీద దయతలచి బోధ చేయటానికి వచ్చాను. పాండవులు ఇదివరకు తాము చేసిన ప్రతిజ్ఞలు తప్పినా, ధర్మం తప్పినా సూర్య చంద్రులు తమ గతులు తప్పుతారు. పాండవులు వారు చేసిన ప్రతిజ్ఞలు తప్పరు. ధర్మం కూడా తప్పరు వాళ్ళు. ఈ రెండు విషయాలు గుర్తు పెట్టుకో!" అని సులభంగా అర్ధమయ్యే విధంగా ఒక్క మాటలో చెప్పాడు.

ఇంకా ఆయన పలుకులు కొనసాగిస్తూ మైత్రేయుడు అటువంటి ధర్మవర్తనులకు నీ కొడుకైన దుర్యోధనుడు అకారణంగా కేవలం మాత్సర్యం వలన, అసూయ వలన, దుష్టబుద్ధితో అపకారం చేసాడు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. కురువంశానికి అంతటికీ క్షేమకరమైన మార్గం ఒక్కటే ఉంది. పాండుపుత్రులు ఒక్కొక్కరూ ఇంద్రుడితో సమానమైన మహా పరాక్రమవంతులు. నూరు ఏనుగులు బలపరాక్రమములు, రణధీరులు, ఉగ్రాయుధులు, ఉత్సాహపరులు, వారిలో భీముడు ఒక్కడే హిడింబుడిని, కిమ్మీరులను చంపగలిగినవాడు. మామూలుగా మానవ బలం చూచుకున్నా మీరంతా వాళ్ళతో సమానం కాదు. మీకు ధర్మబలం అసలేలేదు. కాబట్టి మీ క్షేమం కోరి చెబుతున్నాను. వాళ్ళతో స్నేహం చేసుకోండి. సత్సంబంధాలు పెంచుకోండి, వంశాభివృద్ధికి పాడుపడండి" అని హితబోధ చేసాడు మైత్రేయుడు.

## దుర్యోధనుని వెకిలి చేష్టలు

మైత్రేయ మహర్షి హిత వాక్యములు విన్న దుర్యోధనుడు నిర్లక్ష్యంగా ఆయనతో "నువ్వు మాకు ధర్మపన్నాలు చెప్పటానికి వచ్చావా? పాండవులు నిన్ను ప్రార్థిస్తే మాకు చెప్పటానికి వచ్చావు కాబోలు. మా దయను కోరి మా దగ్గర స్తోత్రం చేస్తున్నావా?" అని తిరస్కార భావంతో మాట్లాడాడు. అయినప్పటికీ మైత్రేయ మహర్షి శాంత స్వభావంతో, "పాండవులకు



వాసుదేవుడు, ధృష్టద్యుమ్నుడు బంధువులు, సహాయకులు. జరామరణాలు పొందే మానవ మాత్రులెవరూ వాళ్ళను యుద్ధంలో జయించలేరు, చంపలేరు! మళ్ళీ మీకు చెబుతున్నాను. వాళ్ళతో సంధి చేసుకో! క్షేమంగా ఉండు. నీ రాజ్యభాగం తీసికొని పాలించు. సుఖసంతోషాలతో జీవించు. అదే నువ్వు చేయదగిన సత్కార్యం", అని బోధ చేసాడు మరొకమారు.

మైత్రేయ మహర్షికి ఎదురుగా వినయంగా కూర్చోవటము, మాట్లాడడము, వాళ్ళకు ఇష్టంలేదు. దుర్యోధనుడు ఆయన ఎదురుగా సమానంగా కూర్చొని కాలి బొటనవ్రేలును నేల మీద రాయటం, మీసాలు దువ్వటం, కోపంతో కళ్ళు ఎర్రచేయటం, పళ్ళు పటపట కొరుకుతూండటం, గద త్రిప్పటం, తొడలు గట్టిగా కొట్టుకుంటూ వికటంగా నవ్వటం మొదలగు వెకిలి చేష్టలు చేసాడు. "నాకు బోధ చెయ్యటానికి వచ్చావా! అని పరిహసించాడు.

పెద్దల ఎదురుగా, అందునా మహర్షుల ఎదురుగా సభ్యత, సంస్కారం, గౌరవం లేకుండా దుర్యోధనుడు ప్రవర్తించాడు. దుర్యోధనుని చర్యలకు మైత్రేయ మహర్షికి కోపం వచ్చింది. ఆ కోపంలో దుర్యోధనుడిని, "ఓరీ దుర్యోధనా! నీ క్షేమంకోరి, ఏ పక్షపాతం లేకుండా నీకు హితబోధ చేయటానికి వస్తే నన్ను అవమానించావు. ఎలాగైనా యుద్ధం తప్పదు. నా మాట నిజమై తీరుతుంది. దానికి తిరుగులేదు. ఆ యుద్ధంలో ఎలాగూ నీకు ఓటమి తప్పదు. యుద్ధంలో ఓటమిపాలై తొడలు విరిగి నేల మీద మట్టిలో పొర్లుతూ అతి నీచమైన మరణంతో చస్తావు. అయినప్పటకీ నీకు అహంకారం మాత్రం పోదు" అని శపించాడు.

## ధృతరాష్ట్రుడి గృహం - పాప క్షేత్రం

ధృతరాష్ట్రుడు, కొడుకు పక్షాన మైత్రేయ మహర్షి పాదాలమీద పడి క్షమించమని అడిగాడు. అప్పుడు ఆయన ధృతరాష్ట్రుడితో "నా శాపం మిమ్మల్ని బాధ పెట్టకుండా ఉండాలంటే ధర్మమార్గంలో, నేనుచెప్పిన ప్రకారం

నడచుకోవాలి. అప్పుడు అది మిమ్మల్ని బాధించదు. క్షేమంగా ఉంటారు. దుర్బుద్ధితో ఉన్న మార్గంలో మీరు వెళితే, నా శాపం అప్రతిహతమవుతుంది" అని అక్కడ నుంచి వెళ్ళి పోవటానికి సిద్ధమవుతున్నాడు. వెంటనే ధృతరాష్ట్రుడు ఇంకేమైనా బోధ చేయమని ప్రార్థించాడు మైత్రేయుడిని. ఆయన కోపంతో "ఇక్కడ ఇంక ఒక్క క్షణం కూడా ఉండను. పరమ నీచమైన పాపక్షేత్రం నీ ఇల్లు. నా వంటి వాడిని అవమానించినటువంటి ఈ క్షేత్రంలో నేనే కాదు ఎవరూ కూడా ఏ సుజనుడు కూడా ఉండడు. నేనూ వెళ్ళి పోతున్నాను" అని లేచాడు. "మాకు ఉపదేశం చేసి జ్ఞాన బిక్ష పెట్టవలసిన వారు మీరే కదా! అనుగ్రహించండి" అని ధృతరాష్ట్రుడు అన్నాడు. అంటే, విదురుడిని అడుగు, ఆయన బోధ చేస్తాడు", అని వివరించి వెళ్ళాడు మైత్రేయ మహర్షి.

మైత్రేయ మహర్షి బోధల వలన అనేక ధర్మాలు, సద్విషయాలు విశ్లేషిస్తే నేటి యుగాలలో ప్రజలు వాటిపై అవగాహన పెంచుకొని జాగరూకలుగా మెలగాలని గుర్తించుకోవాలి అవి.

రాజ్యం కోసం, ఆస్థి పంపకాలు కోసం, మనస్పర్థలు వచ్చినపుడు సామరస్య పూర్వకంగా, సత్సంబంధాలు పెంచుకొని, ధర్మ మార్గంలో నడచుకోవాలని మైత్రేయ మహర్షి హితవాక్కు.

అన్నదమ్ముల మధ్య, అన్నదమ్ముల పిల్లల మధ్య రాజ్యకాంక్ష, పదవీ కాంక్షలకు తావు ఇవ్వకుండా దురాశలకు పోకుండా ధర్మమార్గంలో, న్యాయమార్గంలో ఎవరి భాగాలను వారు పంచుకొని సుఖంగా జీవించాలని మహర్షి సందేశం.

మహర్షులు, మహాత్ములు, పూజ్యులు, గురువులు ఇంటికి వచ్చినపుడు వారిని గౌరవించటం నేర్చుకోవాలి. సంస్కారవంతులుగా ప్రవర్తించాలి. దుర్యోధనుడి మాదిరి ప్రవర్తించగూడదని తెలుసుకోవాలి. దుష్ప్రవర్తనతో నడచుకుంటే వంశ ప్రతిష్ఠ, కుటుంబ గౌరవం భ్రష్టుపడతాయని తెలుసుకోవాలి.



వినయం, విధేయత, గౌరవం, భక్తిభావంతో మెలగాలి అనే అవగాహన పెంచుకోవాలి.

మహర్షులంతటి వారి మాటలు, హిత బోధలు పెడచెవిన పెట్టి వారిని అవమానిస్తే వారి శాపం తగులుతుంది. దుర్యోధనుని గతి ఏమైంది. ఒకసారి గుర్తించి, అలా ప్రవర్తించి శాపానికి గురి కాకూడదని తెలుసుకోవాలి.

మహర్షులు ఏ హిత వచనాలు ఉపదేశించినా, ధర్మపన్నాలు అందించినా లోకకళ్యాణం కోసం, మానవాళి మనస్సులలో సద్భావనలు చిగురించాలనే వారి తపన. నేటి భారతీయులకు మహర్షుల మాటలు, ఆశీస్సులే శిరోధార్యం.

## ప్రాయశ్చిత్తం అంటే

విదురుడు మైత్రేయ మహర్షి ఆశ్రమాన్ని వెతుక్కుంటూ గంగానదిని చేరుకున్నాడు. అక్కడ యోగనిష్ఠలో పద్మాసనాసీనుడై వున్న పుణ్యపురుషుడైన మైత్రేయ మహర్షిని దర్శించాడు విదురుడు. మైత్రేయ మహిర్షికి నమస్కరించి, "మునీంద్రా! లోకంలోని ప్రజలు, మనస్సులో అనేక సుఖాలను కోరి వాటిని సంపాదించుట కోసం కర్మలను ఆచరిస్తారు. తుదకు దైవోపహతులై వ్యర్థులవుతారు. కర్మ బంధకములైన దుఃఖములే వాని సుఖమును ఇచ్చేవి కావు కదా! అవి పాపాలను పారద్రోలేవి కావు. పాపాన్ని కడిగి వేసే ఏ కర్మ కూడా లేదు" అన్నాడు విదురుడు. ఇంకా, ఏదేని కర్మతో ఒక పాపానికి ప్రాయశ్చితము ఉంది కదా!" అని అడిగాడు.

మైత్రేయ మహర్షి, "ధర్మశాస్త్రాల్లో ప్రాయశ్చిత్తాలు ఉన్నాయి. పాపం చేసిన తరువాత ప్రాయశ్చిత్తం అనే మాటకు అర్థం ఏమిటంటే, అది ఒక కర్మ కాదు. తను యదార్థంగా దుఃఖపడి మనసులో చింతించుట. 'ఒక పాపం నేను చేసాను, ఆ పాపం నన్ను వదలునుగాక! ఆ పాపం నేను చేతులు, కాళ్ళతో చేసాను. యధార్థమైన నా మనోభావన ఆ పాపం నుండి నివృత్తి

కావాలి అని కోరుతున్నాను. కాబట్టి నిమిత్తమాత్రంగా ఈ ప్రాయశ్చిత్త కర్మ చేస్తున్నాను' అని భావించాలి" అని బోధించాడు.

ప్రాయశ్చిత్తం అంటే వినూత్నమైనటువంటి ఒక కొత్త చిత్తం కాదు. వినూత్నమైన జ్ఞానసిద్ధిని పొంది తాను చేసిన పాపానికి ధుఃఖిస్తూ ఇప్పుడు శాంతిని, శుచిత్వాన్ని, శుద్ధతను అవలంభించిన చిత్తము అన్నమాట. దానివల్ల నిమిత్తమాత్రంగా చేసిన కర్మ ఫలాన్ని ఇస్తుంది కానీ, కర్మను నశింపచేసే కర్మ అనేది ఒకటి లేదు.

మైత్రేయ మహర్షి కాశీలో ఉంటే వ్యాసమహర్షి ఆయన వద్దకు వెళ్ళి అనేక విషయాలు తెలుసుకున్నాడు. కల్మషమనేది తపస్సు చేయటం వలన పోతుంది. దుఃఖమును పోగొట్టటానికి పుణ్య కార్యము నిర్వహించాలి. ఇటువంటి ఎన్నో విషయాలు భోధనచేసి ఆయనకు తృప్తి కలిగించాడు.

నేటి యుగాలలోని ప్రజలకు మైత్రేయ మహర్షి ఇచ్చిన పై సందేశం ఎంతో ఉపయోగకరమవుతుంది. కల్మషం పోవాలంటే తపస్సు చేయాలి. దుఃఖం పోవాలంటే పుణ్యం చేయాలి. మహర్షుల సందేశాలు కూడా లోకోపకారం కోసమే. ప్రజలు సన్మార్గంలో నడవాలని, శుద్ధమైన ఆలోచనలు చేయాలని మహర్షుల కోరిక.

* * *

# 15. కాశ్యప మహర్షి

కశ్యప ప్రజాపతి వంశంలో జన్మించిన వాడే కాశ్యప మహర్షి. కాశ్యపుడు బ్రహ్మదేవుణ్ణి గురించి తపస్సు చేసాడట. లోకాన్ని బాధిస్తున్న సర్పాల జాతి నశించాలనే కోరికతో తపస్సు చేసాడు. "ఉదార చరితానాంతు వసుధైక కుటుంబకం" అనే లోకోక్తి ఉంది. ఆ విధంగా అర్థం కోసం కాకుండా, పరుల కోసం, లోకహితం కోసం తపస్సు చేసిన త్యాగధనుడు కాశ్యప ప్రజాపతి. మహర్షుల లక్ష్యమే లోకహితం కోసం గదా! ఆవిధంగా ఆయన సర్పజాతి క్షీణించటానికి కారణమయ్యాడు. సర్పాల వల్ల మానవాళి ఎన్నో బాధలు పడుతున్నారు. అంతేకాక సర్పదృష్టి సోకిన వాడికి మళ్ళీ జన్మను పొందటానికై, ప్రాణం ఇవ్వటానికై కావలసిన ప్రక్రియలన్నీ వ్రాసి వాటిని ప్రచారం చేసాడు.

## పరీక్షిత్తు - సర్పదృష్టి

కాశ్యప మహర్షి తపోదీక్షలో ఉన్నాడు. ఆ సమయంలో పరీక్షిత్తు మహారాజుకు శృంగి శాపంతో ఏడు రోజులు ఆయుర్దాయం మాత్రమే మిగిలి ఉందని తెలుసుకున్నాడు. "అయ్యో! ధర్మమూర్తి అయిన పరీక్షిన్మహారాజు సర్పకాటుకు మరణించటమా! నేను తపస్సు చేసి సర్పజాతిని నాశనం చేస్తాను. నేను తలచుకుంటే తక్షకుడి విషం ఆయనను ఏమీ చేయజాలదు. ఆయనను నేను కాపాడుతాను "అని" కాశ్యపుడు హస్తినాపురానికి ప్రయాణమైనాడు.

## తక్షకుడి పన్నాగం

తక్షకుడు ఒక వృద్ధ బ్రాహ్మణ వేషంలో దారిలో కనపడి, "ఓ బ్రాహ్మణుడా! ఎవరు నువ్వు? ఎక్కడికి వెళుతున్నావు" అని కాశ్యపుడిని పలుకరించాడు. "నేను కాశ్యపుడిని. కశ్యప వంశంలో పుట్టినవాడిని. లోకంలోని భయంకరమైన సర్పజాతిని నాశనం చేసిన వాడిని నేనే! అందుకోసం తపస్సు నిర్వహించాను. పరీక్షిత్తు మహారాజును తక్షకుడు కొద్ది రోజుల తర్వాత కాటువేసి చంపుతాడని

విన్నాను. ఆయనను కాపాడటానికి వెళుతున్నాను. పరీక్షిత్తు అజాతశత్రువు, మహాత్ముడు, గొప్పరాజు. అతడిని నేను బ్రతికిస్తాను" అన్నాడు కాశ్యప మహర్షి.

వెంటనే ఆ బ్రాహ్మణుడు సమాధానమిస్తూ, "బ్రాహ్మణ వేషంలో వున్న నేనే ఆ తక్షకుడిని. నా విషం సంగతి నీకు తెలియదు. నేను కరిచిన తరువాత నా విషజ్వాలలకు ఆహుతి అయిన వాడిని ఆ బ్రహ్మదేవుడు కూడా మళ్ళీ జీవం పోయలేడు. ఈ విషయం నీకు తెలియదా?" అని అడిగాడు. అప్పుడు తక్షకుడితో కాశ్యపుడు, "అలానువ్వు అనుకుంటున్నావా! నీ విష ప్రభావం అంతటిదా! నీ సంగతి నాకు బాగా తెలుసు. సర్పజాతి యొక్క చరిత్ర, విష ప్రభావము, దాని శక్తి అంతా నేను తెలిసిన వాణ్ణి" అన్నాడు.

"అయితే నీ శక్తి పరీక్షిస్తాను" అని దగ్గరలో ఉన్న నవనవలాడుతున్న మర్రిచెట్టును చూపించాడు కాశ్యపుడికి. ఆ చెట్టు శాఖోపశాఖలుగా విస్తరించి ఉంది. ఆ చెట్టుమీద వేలాది పక్షులు గూళ్ళు నిర్మించుకుని నివసిస్తున్నాయి. ఆ చెట్టును ఆసరాగా చేసుకొని అనేక ప్రాణులు జీవిస్తున్నాయి. ఆ చెట్టును చూపించి, నవనవలాడుతున్న ఆ చెట్టును కాటువేసి నా విషజ్వాలలతో దగ్ధం చేస్తాను. నీ ప్రతాపం, శక్తి చూపించు" అని తక్షకుడు ఆ చెట్టును కాటువేసాడు. ఆ చెట్టు, దానిమీద నివశిస్తున్న పక్షులు క్షణం కాలంలో భస్మమైనాయి.

## కాశ్యపుని మంత్రశక్తి

"నువ్వు చేయగలిగింది ఇంతేనా" అని కాశ్యపుడు తన మంత్రబలంతో ఆ బూడిద మీద జలం చల్లాడు. అంతే! క్షణకాలంలో ఆ పక్షి సంతతితో బాటు ఆ మర్రి చెట్టుగూడ సజీవంగా కళ్ళముందు నిలిచింది. యథా ప్రకారంగా! అప్పుడు తక్షకుడికి భయం వేసింది. కాశ్యపుడితో "నువ్వు ఏమి ఆశించి ఆయనను బ్రతికిద్దామని వెళుతున్నావు? ధనమా! ఇంకేమైనానా!" అని అడిగాడు.



"ధనం ఆయన ఎలాగూ ఇస్తాడు. నేను తీసుకుంటాను. అయితే అదేకాక, ఆయన జీవించి ఉండటం చేత ధర్మ సంరక్షణ జరుగుతుంది. ఆ లక్ష్యంతోనే నేను ప్రయాణమవుతున్నాను" అన్నాడు కాశ్యప మహర్షి తక్షకుడితో.

"శృంగి శాపం ఆమోఘమయిన బ్రహ్మర్షి శాపం, దానిని ఎవరూ తప్పించలేరు. విధి అలా వుంది. విధిని ఎవ్వరూ మార్చలేరు. నేను తక్షకుడిగా వెళుతున్నానే కానీ, నేనూ నిమిత్తమాత్రుడనే. యముడు అతణ్ణి ఆయుస్సు హరించాడు అయిపోయింది. ఈ సాయంకాలంతో ఆయన ఆయుర్ధాయం సమాప్తి అవుతున్నది. సృష్టిలో ఏ ధర్మం ఎలా జరగాలో జరగనివ్వాలి. దానికి మనం అడ్డుపడకూడదు. విధి జరుగుతూనే ఉంటుంది కదా! నీ మంత్ర బలంతో దానికి అడ్డు రావద్దు" అని ఆయనతో చాలాసేపు సంభాషించి, బోధచేసి, వెనుకకు పంపించి వేసాడు. ఆయనకు ధనం కూడా ఇచ్చాడు. కాశ్యపుడు తిరిగి వెళ్ళిపోయాడు, అలా శృంగి శాపం నెరవేరింది. ఆ తరువాత కాశ్యపుడు చాలా తపస్సు చేసాడు. గృహస్థ ధర్మంలో కూడా ఉన్నాడు.

వీరిద్దరి సంభాషణల ద్వారా మరణాన్ని ఎవరూ తప్పించలేరనీ, వాయిదా వేయలేరని, విధి వ్రాతను మార్చలేరని అర్థమవుతోంది. ఇది ధర్మం. ధర్మాన్ని ఆచరించటం, అంగీకరించటం మానవాళి కర్తవ్యమని ఋషులు హిత వాక్కు.

## మార్గోపదేశం - ధర్మశాసనం

కాశ్యప మహర్షికి ఒకసారి సిద్ధుడు కనపడ్డాడు. ఆ సిద్ధుడు త్రికాలవేది. విజ్ఞాన సాగరం, లోకతత్త్వం తెలిసినవాడు. ఆయనతో అనేక మంది శిష్యులు ఉన్నారు. ఆ సిద్ధుడి మహిమలు, తపఃశక్తి వారి దివ్యతేజస్సు గమనించిన కాశ్యపుడు ఆయన వెంటపడ్డాడు పరీక్షిద్దామని. ఆ సిద్ధుడికి నమస్కరించి, "నిన్ను నేను గురువుగా భావిస్తున్నాను, నువ్వెవరు? నాకు మార్గం చూపించు" అని అడిగాడు కాశ్యపుడు, వెంటనే సిద్ధుడు, "నీకేం కావాలి?" అని అడిగాడు. "మీరెవరో నాకు తెలియదు. అయినా నమస్కరించటానికి వచ్చాను" అన్నాడు

కాశ్యపుడు. అనేక జన్మలలో కలిగిన సుఖదుఃఖాలను అనుభవించి చివరకు ఈ లోకాన్ని గురించిన విషయం తెలుసుకుని నేను తపస్సు చేసాను. ఆత్మ సిద్ధినిపొంది నేను సిద్ధుడిని అయినాను. ఈ లోకంలోని సుఖదుఃఖాలు నాకు అసలు అంటవు. నేను దేనినీ చూడను. నా ఆనందంలో నేను ఉంటాను. అది నాకు కరతలామలకం అన్నాడు.

అన్ని విషయములు విన్న కశ్యపుడు తనకు “మార్గోపదేశం” చెయ్యమని అడిగాడు సిద్ధుడిని. ఆ సిద్ధుడు బోధ చేసాడు. “ఈ శరీరం ధర్మశాసనం కోసమే పుట్టింది. ధర్మ పరిజ్ఞానం వల్ల లోకంలో ఏది ధర్మమో తెలుస్తుంది. ఆత్మహితం కోరి ధర్మాచరణ కోసమని శరీరాన్ని కాపాడుకోవాలి తప్ప, దాని యందు మోహబుద్ధి ఉండకూడదు” అని బోధించి, ఆహారము, ఉపవాసము ఇవన్నీ ఎంత వరకు ఉండాలో, ఎంతకు మించి ఉండకూడదో ఇలాంటివన్నీ చెప్పాడు.

“ధర్మాన్ని బాగా ఆచరించిన వాళ్ళు, ధర్మమార్గంలో ఉన్నవాళ్ళు పుణ్యం చేస్తే స్వర్గం వస్తుంది. స్వర్గసుఖాలు సమాప్తమైన తరువాత వాళ్ళు సూర్య చంద్ర నక్షత్ర లోకాల్లో ఎప్పుడూ ఉంటారా! అక్కడ నుండి పతనమై మళ్ళీ భూమిపై జన్మిస్తారు. ఈ శరీర గతమైన ఆత్మకు సుఖదుఃఖాలు తప్పవు. మన కర్తవ్యం ఒకటే. సుఖదుఃఖములకు అతీతమైన మోక్ష మార్గమునే మనం అన్వేషించాలి. దానికి యోగమే మార్గము. సుఖ దుఃఖాలను ఏక కాలంలో వదిలివేయాలి. సంకల్పం అనేదాన్ని వర్జించాలి. ఇక ధర్మమే జీవనమార్గంగా ఉండాలి, మోక్షం ప్రధానం కావాలి. ధర్మం ప్రధానం కాదు, అప్రధానం, మోక్షమే అత్యంత ప్రధానమైన విషయం. అధర్మం మనకు దోషాన్నిస్తుంది. కాబట్టి తపస్సును భంగం చేస్తుంది. కనుక జీవన విధానంలో ధర్మం ఉండాలి. ధర్మం ఎందుకు ఆచరిస్తున్నామంటే, మోక్షం కోసమని చెప్పాలి. కాబట్టి ప్రధానమైన పురుషార్థం ఇదే!” అని చక్కటి సందేశం ఇచ్చాడు సిద్ధుడు.



ధర్మం విలువ, ధర్మంవల్ల పుణ్యం లభించటం, మోక్షం కోసం ధర్మాచరణ మొదలైన సద్విషయాలు సత్కర్మలు గురించి సిద్ధుడు అందించిన సందేశం నేటి మానవాళికి ఎంతో ప్రయోజనం. ధర్మం, మోక్షం అనేవి మనుషులు కోసమే. ఆలోచనా శక్తి, విచక్షణా జ్ఞానం, విశ్లేషణా తెలివిని భగవంతుడు మనుషులకు జన్మతః ఇచ్చినదే. అందువల్ల ప్రజలు ధర్మ మార్గాన్ని జీవితంలో ఆచరించి మోక్షసాధన పొందాలని మహర్షుల హితబోధ.

* * *

# 16. యాజ్ఞవల్క్య మహర్షి

కురు, పాంచాల దేశాలలో ప్రవహిస్తుండే గంగానదీ తీరంలో చమత్కారపురమనే అగ్రహారం ఉండేది. ఆ గ్రామంలో ఒక బ్రాహ్మణశ్రేష్ఠుడు ఉండేవాడు. అతడు యజ్ఞాలు, వేదాలు, సలక్షణంగా అధ్యయనం చేయటంవలన ఆయనకు యజ్ఞవల్క్యుడు అని పేరు వచ్చింది. అతడు ఎప్పుడూ అన్నదానం చేసేవాడట. అందువలన ఆయనకు 'వాజసని' అనే పేరుకూడా ఉందిట. అందుకే ఆ పదానికి అన్నయాగం అనే పర్యాయపదం కూడా ఉన్నది. అందరికీ అన్నం పెట్టటమే ఆయన వృత్తి.

నేటి యుగంలో అన్నదానాలు, అన్న సత్రాలు స్థాపించి అన్నం పెడుతున్నారంటే ఆనాటి ఋషుల సంప్రదాయం ఆచరిస్తున్నామని గుర్తించాలి. పెద్దలు చెప్పారు, ఆచరిస్తున్నారు. ఇది సత్సంప్రదాయం, భారతీయ సంపద. రెండు, మూడు వందల సంవత్సరాల క్రితం అన్నదానాలు, అన్నసత్రాలు రాజులు, దాతలు నిర్మించి పాదచారులకు అన్నదానం చేసేవారు. రాత్రి బస చేసేవారికి సత్రాలలో వసతి కల్పించేవారు. సమాజ సేవకు, సమాజ క్షేమానికి ఋషుల మార్గాలనే భారతీయులు అనుసరిస్తున్నారు.

ఈశ్వర ప్రసాదంగా ఆయనకు ఒక కొడుకు జన్మించాడు. అతడికి 'దేవరాతుడు' అని పేరు. దేవరాతుడికి సునంద అనే కన్యను ఇచ్చి పెళ్ళి చేసారు. దేవరాతుడు, సునందలు బ్రహ్మవిద్య వ్యాపనం కోసమని బ్రహ్మదేవుడిని గురించి తపస్సు చేసారు. బ్రహ్మదేవుడు దర్శనము ఇస్తే, వాళ్ళు ఆయననే తమ కుమారుడిగా జన్మించమన్నారు.

ఆ విధంగా సునంద గర్భం నుంచి ఒక కుమారుడికి జన్మనిచ్చింది. ఆయన రూపు రేఖలు, తేజస్సు, చూచి భగవంతుడే, బ్రహ్మదేవుడే ఇలా ఉద్భవించాడని అన్నారు. తండ్రికి ఉన్న పేర్లను బట్టి అతడికి యాజ్ఞవల్క్యుడని పేరు వచ్చింది.



## యాజ్ఞవల్క్యుడి విద్యాభ్యాసం

ఈ యాజ్ఞవల్క్యుడికి తండ్రి అయిదవ ఏటనే అక్షరాభ్యాసం, ఎనిమిదవ ఏట ఉపనయన సంస్కారం చేసాడు. విద్యాభ్యాసానికి పంపించాడు. బాష్కలుడు అనే ఋషి దగ్గరకు వెళ్ళి ఋగ్వేదం చదువుకున్నాడు. జైమిని వద్ద సామవేదం నేర్చుకున్నాడు. ఉద్దాలకుడి దగ్గరకు వెళ్ళి అథర్వణవేద అధ్యయనం చేసాడు. యజుర్వేదం తండ్రి వద్దనే నేర్చుకున్నాడు. కుమారుడు త్వరగానే నాలుగు వేదములూ నేర్చుకోవటం చేత సంతోషించాడు తండ్రి. వైశంపాయనుడి వద్దకు తీసుకెళ్ళి యాజ్ఞవల్క్యుడిని అప్పగించాడు తండ్రి. ఆయన యాజ్ఞవల్క్యుడు రాగానే, ఆ పిల్లవాణ్ణి, అతడి లక్షణాలను చూచి తన శిష్యులలో అత్యంత ఉత్తముడు అని గ్రహించి అతని శిష్యత్వాన్ని అంగీకరించాడు.

## గురుభక్తి

తండ్రి యాజ్ఞవల్క్యుడితో "నాయనా! మన సుకృతం గొప్పది. ఈ మహర్షి నిన్ను శిష్యుడిగా స్వీకరించాడు. ఇకమీదట, నీకు తల్లి, తండ్రి, గురువు, దైవము ఈ గురువే! గురువు తప్ప వేరే దైవము ఉన్నాడని భావించకు సుమా!" అని వివరించాడు. "గురువు వేరు, దైవము వేరు అని భావించే వానికంటే అజ్ఞాని త్రిలోకాలలో వెతికినా దొరకడు. అంతకంటే అజ్ఞానము వేరేలేదు. నీ సర్వస్వమూ ఇతడే, ఈ గురువే!" అని గురుభక్తిని బోధించాడు తండ్రి.

యాజ్ఞవల్క్యుడు, గురువు కంటే ముందే నిద్రలేచి ఆయనకు సేవ చేసేవాడు. ఆయనకు ఎప్పుడు ఏది అవసరమో గ్రహించి తానే సేవిస్తున్నాడు. గురువు గారి హృదయాన్ని చాలా రంజింప చేసేవాడు. ఈయన యందు ఎంతో అనుగ్రహం కలిగింది. యజుర్వేదమంతా ఈయనకు చెప్పిన తరువాత అనేక రహస్య విద్యలన్నీ గురువు బోధించాడు. బ్రహ్మ తేజస్సు, గురుసేవ వల్ల వచ్చిన పుణ్యము రెండూ ఈయనకు లభించాయి.

## అహంకారం పతనానికి దారి

యాజ్ఞవల్క్యుడు సత్త్వగుణ సంపన్నుడైనాడు. స్వతంత్రుడైన తరువాత అతడిలో సాత్త్వికాహంకారం వచ్చిందట. సాత్త్విక గర్వము. తను పరమ సాత్త్వికుడనని, ప్రథమ జ్ఞానినని, తనకు ఆగ్రహమేలేదని – ఇలాంటివి అనుకునేవాడు. అదో గర్వం, అతడిలో వచ్చిన గర్వం, అహంకారం గురువు ఒక్కడే గుర్తించాడు. అతడికి తెలియదు. వైశంపాయనుడు క్రమంగా, "వాడి అహంకారం అదే పోతుంది, ఫరవాలేదు" అనుకొని అతడిని ఉపేక్షించాడు. యాజ్ఞవల్క్యుడు గురుశుశ్రూష వలన వచ్చిన తన పుణ్యం గొప్పదని భావిస్తున్నాడు.

ఒకనాడు గురువు దగ్గర శిష్యులందరూ కూర్చొని ఉండగా, తనను గురించి గొప్పగా చెప్పుకున్నాడు యాజ్ఞవల్క్యుడు. "నేను ఎంతో పుణ్యం చేసాను. గురువు అనుగ్రహంతో నాకు ఎంతో తపోబలం, జ్ఞానం కలిగినవంటే, గురువుగారికి బ్రహ్మహత్యాపాతకమే వస్తే, నేను దానిని పోగొట్టుతాను" అని అన్నాడు. తనకు తానే ప్రశంసించు కుంటున్నందున గురువు గారు ఏమీ మాట్లాడక నిశ్శబ్దంగా ఉన్నాడు.

ఒక రోజున వైశంపాయనుడి మేనల్లుడు తప్పు చేసాడట. అందుకు వైశంపాయనుడు ఆగ్రహించి వాడిని కాలుతో తన్నాడట. తన్నటం అన్నది బ్రహ్మహత్యతో సమానమైన పాపం అని వైశంపాయనుడు అన్నాడట. ఆ మహర్షి తనకు బ్రహ్మహత్యా దోషం వచ్చిందని శిష్యులందరినీ పిలిచి, అది పోయే ఉపాయం చెప్పమని అడిగాడు.

అంతకు ముందు యాజ్ఞవల్కుడు ప్రతిజ్ఞలు చేసి గొప్పలు పలికాడు కదా! "గురుదేవా! ఇంతమందిలో దీన్ని గురించి అలోచించవలసిన పని ఏమున్నది. నేనున్నాను కదా! నేను ఈ బ్రహ్మహత్యా దోషం తీసివెయ్యగలను. ఇందుకు నన్ను మించిన సమర్థుడు ఎవరున్నారు? మీరు తీసివేసుకోలేరు. వీళ్ళు చేయలేరు. నేనొక్కడినే ఇందుకు సమర్థుడిని, అన్నాడు.



వెంటనే వైశంపాయన మహర్షి ఆగ్రహించి, "ఓరీ మూర్ఖుడా! నాకు లేని శక్తి నీకు వచ్చిందని ఎలా అనుకుంటున్నావు? బ్రాహ్మణులైన ఈ శిష్యులను కూడా దూషించావు. ఏ విద్యలయితే నేర్చుకున్నానని ఈనాడు గర్వపడుతున్నావో అవన్నీ, వేదముతో సహా నా దగ్గర నేర్చుకున్నవే కదా! కాబట్టి ఈ విద్యలు ఇక్కడ విసర్జించి వెళ్ళిపో, ఆ విద్యలనన్నింటిని వమనం (వాంతి) చెయ్యి. గరువుకు ద్రోహం చేసావు. నీకు అహంకారం పెరిగింది. సాటి వాళ్ళను అవమానించావు. ఈ దోషం చాలా పెద్దది", అని కఠినంగా పలికాడు.

అప్పుడు యాజ్ఞవల్యుడు గురువు పాదాలపైపడి, "మహాత్మా! నిజంగా మీయందు నాకు గురుభక్తి మాత్రమే వుంది. లోపం ఏమీలేదు, ఆ గురుభక్తి చాలా పెద్దది, చాలా నిష్ఠ కలిగి ఉండటంచేత సహజంగానే నాలో అహంకారం పెరిగింది. నన్ను క్షమించండి" అని అడిగినాడు.

అయినా వైశంపాయన మహర్షి శాంతం లేనివాడై యాజ్ఞవల్క్యుడితో, "నిన్ను, నీ అహంకారాన్ని చాలా కాలంగా భరిస్తూవున్నాను. నీ అహంకారానికి ప్రతిఫలంగా నీవు నేర్చుకున్న విద్యలన్నీ ఇక్కడే విసర్జించి వెళ్ళు" అని అన్నాడు.

ఆయన అంత పట్టుపట్టినందుకు యాజ్ఞవల్క్యుడు ఆయనతో, 'సరే, తప్పేదేముంది! గరువాజ్ఞ నాకు హితమైనా, కష్టమైనా గురువాజ్ఞ శిరసావహిస్తాను నేను. మీ దగ్గర నేర్చుకున్నటువంటి యజుర్వే విద్యనంతా కూడా నా శరీరంలోని రక్తం రూపంలో ఇక్కడే విసర్జిస్తాను. కానీ నేను ఇంతకు ముందు ప్రతిజ్ఞ చేసాను కదా! ఏడు రోజులలో మీకు వచ్చిన బ్రహ్మహత్యా పాతకదోషాన్ని తొలగిస్తానన్నాను! ఆ ప్రకారంగా గురువు ఋణం తీర్చుకుంటాను" అని తాను నేర్చిన వేదాలు రక్త రూపంలో బయటకు తెప్పించి, తన రక్తతర్పణంలో ఆ విద్యనంతా విసర్జించాడు. తన తపోబలంతో వైశంపాయనుడికి వచ్చిన బ్రహ్మహత్యా పాతకం గూడ తొలగించాడు.

యాజ్ఞవల్క్యుడు వమనం చేసిన రక్తం రూపంలో వేద విద్యనంతా తిత్తిరిపక్షులు వచ్చితిన్నాయి. అవి మళ్ళీ వాటి వాక్కుల ద్వారా చెప్పబడుట చేత దానిని 'తైత్తిరీయం' అని అన్నారు. ఈ విధంగా పక్షులు వేదాలు నేర్చుకున్నట్లు అయింది. ఆ పక్షులు మళ్ళీ వాటిని విసర్జించాయి. పక్షి పలుకులు రూపాలలో అదే 'తైత్తిరీయ ఉపనిషత్తు'గా ప్రసిద్ధి చెందింది.

ఈ కథ ద్వారా, ధర్మసూక్ష్మాన్ని అర్థం చేసుకోవచ్చు. గురువు దగ్గర నేర్చుకున్న విద్యను గురువు ఎలాగూ స్వీకరించడు. అక్కడ ఉన్న మిగతా శిష్యులూ తన దగ్గర ఉన్న విద్యను స్వీకరించరు. అందుకని తన విద్య నంతా కూడా ఆ పక్షులకు ధారపోసి, తన జన్మతః ఉన్నటువంటి తపోబలం మాత్రం మిగుల్చుకున్నాడు. వాటికి తన వేద విద్యనంతా ఇచ్చేసి, "ఇక దీనిని వాడుకోను, ఇది నాకు లేదు" అనుకున్నాడు దానినే 'విద్యా సన్న్యాసం' అనుకోవాలి.

యాజ్ఞవల్క్యుడి కథ ద్వారా "ఎంత విద్య నేర్చుకొని గొప్పవారమైనా, అహంకారం, గర్వం దగ్గరకు చేరనీయకూడదు. గురువు దైవస్వరూపము. గురువు చెప్పినట్లు చేయాలి. గరువు దైవస్వరూపుడు గదా! గురుధిక్కారము, అవమానించటం మహాపాపం. నేర్చుకున్న విద్య అంతా నేలపాలైనవి గదా! అహం పనికిరాదని గుర్తించాలి.

## గురువును మించిన శిష్యుడు

ఆ తర్వాత యాజ్ఞవల్క్యుడు ఏకాగ్రతతో తపస్సుచేసి సూర్యభగవానుడిని ఆరాధించాడు. సూర్యుడు అశ్వరూపంలో దర్శనము ఇచ్చి, "నీ భక్తికి సంతోషించాను, ఏదైనా వరం కోరుకో"! అన్నాడు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు, "నా గురువు వైశంపాయనుడికి ఆగ్రహం రావటం వలన ఆయన వద్ద నేర్చుకున్న విద్యను వదిలిపెట్టాను. నాకు ఇప్పుడు ఆ విద్య కావాలి. నిన్ను అడుగుతున్నాను. కాబట్టి ప్రసాదించు" అన్నాడు.



అందుకు బదులుగా సూర్యభగవానుడు ఆయనతో, "యాజ్ఞవల్క్యా! నేను నీకు గరువు రూపంలో, మీ గురువుకు తెలియనటువంటి విద్యను నీకు బోధిస్తాను. అవే శుక్లయజుర్వేదములు. వాటి వలన నీవు గురువుకంటే అధికుడవు అవుతావు. ఇతర విద్యలకై సరస్వతిని ఆరాధిస్తే, ఆమె నీకు ప్రసాదిస్తుంది" అని చెప్పి అంతర్ధానమైనాడు.

వెంటనే సరస్వతీ దేవిని గురించి తపస్సు చేసాడు యాజ్ఞవల్క్యుడు. ఆమె అతడికి ప్రత్యక్షమై సకల విద్యలు హృదయ ఫలకం మీద కనపడేటట్లుగా అనుగ్రహించింది. యాజ్ఞవల్క్యుడు కృతజ్ఞతతో ఆమెను స్తుతించాడు. ఆమె అతడిని ఆశీర్వదించి వెళ్ళింది. ఈవిధంగా యాజ్ఞవల్క్యుడు అమానుష విద్యానిధియై ప్రకాశించాడు.

యాజ్ఞవల్క్యుని వలన శుక్లయజుర్వేద శాఖలు, 'వాజిశాఖలు' అనే పేరుతో విశ్వవ్యాప్తమైనాయి. అనేక మంది శిష్యులు ఆశాఖలతో ఖ్యాతి చెందారు. ఆయనకు ప్రథమశిష్యుడు కణ్వుడు. ఈయన శాఖకు చెందినవాడే ప్రథమ శాఖీయులనీ, కాణ్వులనీ ప్రసిద్ధి చెందారు. ఆ ప్రకారంగా యాజ్ఞవల్క్యుడు ఒక వేదశాఖకు కారణమైనాడు. ఆ తరువాత ఆయన అక్కడనుంచి వెళ్ళాడు. ఆ వేదంలో 15 శాఖలు ఇప్పుడు లేవు. చాలా కనపడకపోగా, కొద్దిగా మిగిలి ఉన్నాయి.

## "యోగీంద్రుడు" బిరుదు ప్రధానం

మహర్షులందరూ ఒకసారి సమావేశమై "యోగీశ్వరీశ్వరుడు" అని బిరుదు ఎవ్వరికీ ఇవ్వవచ్చు? ఎవరికి యోగీశ్వరుడిగా పట్టాభిషేకం చేయవచ్చు? అత్యుత్తముడు ఎవరు? అన్న ప్రశ్నలు వేసుకొని, వారందరూ యాజ్ఞవల్క్యుడి దగ్గరకు వెళ్ళి పరమరహస్య యోగములు అన్నీ అతడివలన విని, "ఎంతో జ్ఞానం కలిగినవాడు. ఈయన తప్ప ఆ బిరుదుకు అర్హుడు లేడు" అని నిర్ధారించి, అతడికి 'యోగేంద్రుడనే' పేరుతో పట్టాభిషేకం చేసారు. ఆ మహర్షులతో

ఆయన చెప్పిన మాటలనే 'యోగ యాజ్ఞవల్క్యము' అనే యోగశాస్త్ర గ్రంథంగా ఉన్నది. 12 అధ్యాయాలతో ఉంది ఆ యోగ శాస్త్ర గ్రంథం.

## భార్యలకు ధర్మబోధ

అనేక సభలలో అనేకమందికి అనేక విషయాలు బోధించాడు యాజ్ఞవల్క్యుడు. వృద్ధాప్యం వచ్చిన తరువాత సన్యాసాశ్రమం స్వీకరించదలచాడు. సన్యాసానికి వెళ్ళిపోతూ కాత్యాయనీ, మైత్రేయిలనే భార్యలనుపిలిచి "మీకేమి కావలెనో కోరుకోండి" అని అడిగాడు. ఆయన అంతకు ముందు ధనం సంపాదించి ఉన్నాడు. ఇద్దరి భార్యలనూ ఏం కావాలి? అని అడిగాడు. నా సంపదలను మీ ఇద్దరికీ పంచుతానని అన్నాడు. వారిద్దరు "మాకేమీ అక్కర లేదు. జరామృత్యువులు లేని మోక్షమార్గాన్ని తెలియచేయండి" అని అడిగారు.

వెంటనే యాజ్ఞవల్క్యుడు ఇద్దరి భార్యలకూ ధర్మబోధ చేసాడు. భర్త భార్యకు ప్రియుడు అంటాము కానీ, ఆత్మ కోరికే ప్రియుడు. అంటే తన కొరకే ప్రియుడు అవుతున్నాడు. అంటే భార్యను భర్త ప్రేమించటం తన ఆనందం కోసమే. ఎవరూ ఎవరినీ నిస్వార్థంగా ప్రేమించరు. తనకు అనేక రహస్య విద్యలన్నీ గురువు బోధించాడు. బ్రహ్మ తేజస్సు, గురుసేవ వల్ల వచ్చిన పుణ్యము రెంటినీ ప్రేమిస్తారు. పుత్రమిత్రాదులనే కాక, సమస్తాన్ని కూడా ఆత్మ ప్రయోజనం కోసమే ఎవరైనా ప్రేమిస్తారు.

అందుచేత, "నా కోరకే, నేనే అంటున్నావు కదా! ఎవరీ నేను"! అని కొంచెం విచారణ చేయండి. వినేది, మననం చేసేది అంతా ఆత్మయే (ఆత్మవా అరే ద్రష్టవ్యో శ్రోతవ్యో, మంతవ్యో నిధిధ్యాసితవ్యో) – అని ఆ విషయాలన్నీ చెప్పాడు. పరమాత్మ సకల సమస్త కార్యాలకు కారణం. ఈ వేదశాస్త్రాలన్నీ ఆ పరమాత్మ యొక్క నిట్టూర్పులే! అని చెప్పి తత్త్వములన్నీ బోధించాడు. ఆత్మజ్ఞానమే అమృత తత్త్వమని వారికి బోధించి, తాను సన్యసించాడు.



## యాజ్ఞవల్క్య స్మృతి

వేదాలు, శాస్త్రాలు, తపశ్శక్తి పుష్కలంగా సంపాదించిన మహర్షుల వద్దకు వచ్చి విషయాలను తెలుసుకుంటారు. ధర్మసందేహాలు తీర్చుకుంటారు. ఆ ప్రకారం మిథిలా నగరంలోని బ్రాహ్మణులు, ఋషులు యాజ్ఞవల్క్యుడు దగ్గరికి వచ్చి వర్ణాశ్రమ ధర్మాలను గురించి వివరించమన్నారు. అతడు 'యాజ్ఞవల్క్య స్మృతి' వారికి ఇచ్చాడు. ఆచారము, వ్యవహారము, ప్రాయశ్చిత్తము, అనే మూడు కాండలతో ఆ గ్రంథాన్ని చెప్పాడాయన. మొదటి కాండలో 14 విద్యలు, పరిషత్తులు, సంస్కారములు, సాపింఢ్య వివాహములు, స్నాతక విధులు, పురోహిత ధర్మాలు ఇవన్నీ వివరించాడు. రెండవ కాండలో న్యాయస్థానములు, శిక్ష, స్త్రీ ధన విషయాలు ఉన్నాయి. అసలు స్త్రీకి ఆస్తిలో హక్కు ఉందని చెప్పినవాడు యాజ్ఞవల్క్యుడు. ఆ స్మృతిలో స్పష్టంగా ఉన్నది ఆ మాట.

మూడవ కాండలో అపరకర్మల శౌచశుద్ధి, యతిధర్మాలు, మోక్ష మార్గము అవన్నీ చెప్పాడు. సత్త్వ రజస్తమో గుణాలవలన దోషాలు, యమ నియమాలు, ప్రాయశ్చిత్తము మొదలైనవన్నీ కూడా అందులో ఉన్నాయి.

ఋషులంతా ఎన్నో స్మృతులు విడివిడిగా వ్రాసారు. ప్రతి స్మృతిలోనూ లౌకిక విషయంలో, సంసారంలో ఈ ధర్మాల విషయాలలో బేధాలుంటాయి. ఇది తప్పదు. అయితే వారి స్మృతులు ఆద్యంతం అన్నిటినీ వివరిస్తాయి. అంటే తత్త్వం ఒక్కటే, భావం ఒక్కటే! పరమమైన నాలుగో పురుషార్థానికి (మోక్షానికి) చేరుకోవటానికి ఎలా ధర్మాన్ని ఆచరిస్తే మంచిదని వాళ్ళు అనుకున్నారో, అది ఆచరించమని చెప్పారు.

ఇవి పురుషార్థములు నాలుగు అని తెలుసుకోవాలి. అవి ధర్మ, అర్థ, కామ, మోక్షము అనునవి.

నేటి యుగంలో ఋషులు వ్రాసిన స్మృతులు అందుబాటులో లేవు. కొన్ని ఉన్నాయి. అవి గూడా కొద్ది ప్రదేశాలలో, గ్రంథాలయాలలో

అందుబాటులో ఉన్నాయి. ఆ గ్రంథాలయాలకు వెళ్ళి స్వయంగా వ్రాసుకుని అవగాహన కలిగి, ఆచరించాలి. ఋషులు మనకు అందించిన విజ్ఞాన సంపద ఇదే. దీనిని రక్షించుకోవాలి. కాపాడుకోవాలి. భావితరాలకు అందించాలి. అప్పుడే మనం సంస్కారవంతులం.

* * *

# 17. మార్కండేయ మహర్షి

మృకండు మహర్షికి, మనస్వినికి జన్మించిన వాడు మార్కండేయుడు. మార్కండేయుడు చిరంజీవి అని భారతీయులందరికీ తెలిసిన విషయమే. ఎవరినైనా ఆశీర్వదించే సమయంలో మార్కండేయుని మాదిరి దీర్ఘాయుష్మంతుడై ఉండాలని ఆశీర్వదిస్తారు. ఆ మహర్షి ఇప్పటికీ జీవించే ఉన్నాడు. అందుకే ఆయనను చిరంజీవి అన్నారు.

## మృకండుని వివరాలు

మృకండుముని ఒకప్పుడు హరిహరులిద్దరిని గురించి తపస్సు చేస్తే, ఆ హరిహరులిద్దరూ ఒకసారే ప్రత్యక్షమై మృకండుని వరం కోరుకోమని అడిగారు. చాలా గుణవంతుడు, కీర్తివంతుడు, మంచి వాడు అయిన కుమారుని ప్రసాదించమని హరిని వరం అడిగాడు మృకండుడు. మనిషికి అవసరమయిన సలక్షణములతో ఒక కుమారుడు కావాలని వరం అడిగాడు. “అటువంటి కుమారుడు కలుగుతాడు” అని హరి ఆయనకు వరం ఇచ్చాడు.

కొడుక్కి ముసలితనము, శరీరంలో రోగాలు మొదలైన బాధలు లేకుండా చెయ్యమని శివుణ్ణి వరం అడిగాడు. చిరంజీవిని చెయ్యమని అడుగలేదు. జ్వరాదుల వలన మాత్రమే బాధలు లేకుండా చెయ్యమని అడిగాడు. “జ్వరాదుల వలన బాధలు లేకుండానే ఉంటాడు” అన్నాడు శివుడు. అయితే “నీ కొడుకు అల్పాయుష్కుడు అవుతాడు” అన్నాడు విష్ణువు.

ఆ పిల్లవాడికి జ్వరం వలన (వార్ధక్యం వలన) బాధ లేకుండా ఉండాలని రుద్రుణ్ణి అడిగితే ఆయన సరే అన్నాడు. మంచి గుణవంతుడు అయిన కొడుకు కావాలంటే ఆయన ప్రసాదించాడు. అల్పాయుష్కుడు అంటే పదహారు సంవత్సరములు ఆయుర్ధాయమే ఉండేవాడు అని అర్థం. అయితే అతడికి ఆయుర్ధాయమే లేదని అన్నాడు మళ్ళీ విష్ణువు! ఆవిధంగా జన్మించిన వాడే మార్కండేయుడు. మృకుండుడి కుమారుడు కాబట్టి మార్కండేయుడు.

## మార్కండేయుడి తపస్సు - చిరంజీవి

తండ్రి మృకండుడు మార్కండేయుడితో, "నాయనా! నీవు హరిహరాదుల వరప్రసాదంగా జన్మించావు. నువ్వు అల్పాయుష్కుడివని విష్ణువు చెప్పటం వలన మాకు దుఃఖంగా ఉన్నది" అన్నాడు. అందుకు మార్కండేయుడు తల్లిదండ్రులకు నమస్కరించి, "మీరు మీ శరీరాలను శుష్కింపచేసి, కష్టపడి తపస్సులు చేసి సంసారంలో ఉంటూ కూడా, మీరు అనేక క్లేశములతో ఉండి ఈ శరీరానికి కారకులయినారు. ప్రసాదించిన ఈ బౌతిక శరీరాన్ని నేను సద్వినియోగం చేయక పోతే ఇటువంటి తక్కువ ఆయుర్ధాయం, రోగ భూయిష్ఠమైన ఈ శరీరానికి తల్లిదండ్రులు కావటం వలన మీకు వచ్చే మంచి గతి ఏముంది? నేను నా జన్మ సార్థకం చేసుకోవటం కోసమని ఈశ్వరుణ్ణి గురించి తపస్సుచేసి మృత్యువును జయించి మీ దుఃఖాన్ని పోగొడుతాను. చిరంజీవిని అయ్యే వరం పొందుతాను" అన్నాడు 16 సంవత్సరములు వయస్సు ఉన్న మార్కండేయుడు. వెంటనే తల్లిదండ్రులు మార్కండేయుణ్ణి ఆశీర్వదించి తపస్సు చేసుకోవటానికి పంపారు.

మార్కండేయుడి ఆలోచన, భావన విశ్లేషిస్తే తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో సేవ చేయాలనే తపన ఉన్నది. మాతా పితరులకు పుత్రులు సేవ చేస్తేనే జన్మకు సార్థకత ఉంటుంది. వారికి సేవచేసే భాగ్యం పొందటానికి హరిహరాదుల గురించి తపస్సు చేసి వరం పొందాలనే భావన వ్యక్తపరిచాడు.

నేటి యుగంలోని భారతీయ యువత మార్కండేయుని ఆదర్శంగా తీసికొని తల్లిదండ్రులకు సేవ చేయాలనే కోరిక పెంచుకోవాలి. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు సేవ చేస్తే లభించే ప్రయోజనం ఎంతో ఉంటుందని గ్రహించాలి.

## మరొక కారణం ఏమిటంటే

యౌవనంలో బలము, ఓపిక ఉన్నంత కాలము మనుష్యులలో పారమార్థిక చింతన కలగటం లేదు. అది వృద్ధాప్యం వచ్చిన తరువాత మాత్రమే



కలుగుతుంది. పరమేశ్వరుని యందు భక్తి శ్రద్ధలు కలగటం, దేవాలయ దర్శనం, వృద్ధాప్యం వచ్చిన తరువాత మాత్రమే ఆలోచన వస్తోంది. మరి అటువంటి భావన కలిగిన వెంటనే మరణిస్తే ఎలాగ! ఇక ఆ భక్తికి ఉపయోగమేమిటి? మరి తపస్సు ఎప్పుడు? అందుకనే సుదీర్ఘమైన వృద్ధాప్యం కోరుకునే సంప్రదాయం కూడా ఒకటి ఉంది. అలా అడగమని కూడా చెప్తారు. ఉపనయన సంస్కార సమయంలో, జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసే సమయంలో "శతాయుష్మాన్ భవ" అనీ, "ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిరస్తూ" అనీ ఆశీర్వదిస్తారు పెద్దలు, పండితులు. ఉత్తర భారతదేశంలో "చిరాయురస్తు" అని కాకుండా, "జరాయురస్తు" అని ఆశీర్వదిస్తారు. (జరాయురస్తు అంటే వృద్ధాప్యం కలగాలి అని).

## శివ భక్తి - మృత్యుపాశం

మార్కండేయుడి శివభక్తి ఎట్లాంటిదంటే సృష్టిలో చరాచరము, ప్రతి చెట్టు పుట్ట అన్నీ కూడా శివమయంగా కనపడుతున్నాయి. అటువంటి ఘోర తపస్సు చేశాడు. అల్పాయుష్కులంటే 16 సంవత్సరాల ఆయుర్ధాయం కలిగినవాడు అని అర్థం. అది విష్ణువు ఆజ్ఞ. శివభక్తితో శివ భక్తి తత్పరుడై ఉన్నాడాయన. అలా పదహారు సంవత్సరాలు పూర్తి అయ్యేసరికి, మృత్యు దేవత వెంటనే ఆయనను తీసుకొని వెళ్ళటానికి వచ్చింది. ఆ జీవుడి మెడ చుట్టూ మృత్యుపాశం వేసింది. మార్కండేయుడు తన మెడకు మృత్యుపాశం తగలగానే ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళి ఆ లింగాన్ని ఆలింగనం చేసుకున్నాడు. తనను రక్షించమని శివుణ్ణి ప్రార్థించాడు. సాధారణంగా, శరణాగతి పొందిన వారికి ఏ ఆపద వచ్చినా మామూలు వీరుడైన క్షత్రియుడే సహించడు. సాక్షాత్తూ పరమేశ్వరుడినే శరణు అంటే తన సన్నిధిలోకి వచ్చిన యముణ్ణి సహిస్తాడా! వెంటనే త్రిశూలం పట్టుకొని మృత్యువును చంపటానికి వచ్చాడు. శరణు అని ఆయన పాదాలమీద వ్రాలాడు మృత్యుదేవత.

"నా భక్తుడయినవాడు. సదా నన్ను స్మరించే వాడిని మృత్యు దేవత అయిన నీవు ఎప్పుడూ పాశం వేయటానికి వీలులేదు. శాశ్వతంగా ఇది నా శాసనం. మరణ సమయంలో మృత్యువును జయిద్దామనే కోరికతో జీవించాలనే ఆశతో నన్ను స్మరణిస్తూ ఉన్న వాడిని నువ్వు ఏమీ చెయ్యకూడదు. శివస్మరణ చేస్తూ తనువు చాలించే వాళ్ళు మాత్రమే వెళ్ళి పోతారు" అని పరమేశ్వరుడు మృత్యువుతో చెప్పాడు. ఈ ఘట్టం బ్రహ్మాండపురాణంలో వివరించబడింది.

చిన్నవాడే అయినా, మార్కండేయుడు మృత్యుదేవతతో పోరాడి శివుడి రక్షణతో చిరంజీవి అయినాడు. అంటే తరువాత మృత్యువు లేదు ఆయనకు. కాకపోతే శరీరాన్ని వదిలిపెట్టి ఉండవచ్చు. దానిని మృత్యువు అనగూడదు. ఆ అర్థంలో అతడు చిరంజీవి. యోగ బలంతో శరీరాన్ని వదిలి పెట్టడమే ఆర్యుల అత్యుత్తమమైనటువంటి విజయం. చాలా గొప్ప సాధన చేసాడు ఆయన. మృత్యువాత పడటం ఇష్టం లేదు. జీవించి వృద్ధులయిన మాతా పితరులకు సేవ చేయాలనే ఆరాటం ఉన్నవాడు మార్కండేయుడు.

నేటి యుగంలోని ప్రజలు మాతాపితరుల సేవ చేయటానికి మార్కండేయ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి. ఇది ఆ మహర్షి సందేశం.

### పితృ దేవతలు - శ్రాద్ధాది కర్మలు

గౌరముఖుడు అనే రాజు విష్ణు భక్తుడై తపస్సు చేస్తూ విష్ణువును ఆరాధిస్తున్న సమయంలో, మార్కండేయుడు అక్కడికి వచ్చాడు. "మహాత్మా! తమ దర్శనం అపురూపమయింది. పితృదేవతలనే వాళ్ళు ఉంటారని చెబుతున్నారు కదా! వాళ్ళు ఉంటారా? ఉంటే ఎలా ఉంటారు? అందరూ ఇదే మాదిరి ఉంటారా? అనేక వర్గాలలో ఉంటారో వేరువేరుగా ఉంటారా? ఈ విషయాలన్నీ సవివరంగా చెప్పాల్సింది" అని ఆ రాజు ప్రశ్నించాడు.

"మార్కండేయ మహర్షి సవివరంగా సమాధానం ఇలా ఇచ్చాడు. "ఓ రాజా! బ్రహ్మ పూర్వం ఏడుగురు ఋషులను సృష్టించాడు. తరువాత



తనను ఆరాధిస్తూ ఉండమని వాళ్ళతో బ్రహ్మదేవుడు చెప్పాడు. మరీచుడు మొదలైన మునులు బ్రహ్మమాట వినక, అంత:కరణలో పరమేశ్వరుడి గురించి తపస్సు చేసారు. ఇది ప్రవృత్తి, నివృత్తి మార్గాల విషయం.

"బ్రహ్మ తనను ఆరాధించమనటంలో అర్థం, వారిని ప్రవృత్తి మార్గంలో నిలపటానికి (అంటే తన మార్గంలో నడపటానికి). కానీ వాళ్ళు నివృత్తి మార్గంలో మహేశ్వరుడిని అంతఃకరణలో ఆరాధించారు. (సృష్టికర్త బ్రహ్మ ఆదేశంలో కాకుండా వారు ఎంచుకొన్న మార్గంలో ఆరాధించటం - నివృత్తి). అందుకు బ్రహ్మకు ఆగ్రహం వచ్చి "మీ బ్రహ్మ విజ్ఞాన శక్తులు ఏవైతే ఉన్నాయో అవి నశించుగాక!" అని. వాళ్ళలోని జ్ఞానాన్ని హరించాడు. అంటే వారిని అజ్ఞానుల్ని చేసాడు అని అర్థం.

"ఆ తరువాత వారు ప్రవృత్తి మార్గంలో వివాహాలు చేసుకున్నారు. పుత్రులను కన్నారు. స్వర్గస్థులైనారు. అజ్ఞానం రాగానే మృత్యువు ఆవరించింది వాళ్ళను. మృత్యువు - అవిద్య, అజ్ఞానం యొక్క లక్షణం. స్వర్గానికి వెళ్ళి భూలోకంలో తమ కొడుకులు క్రమం తప్పకుండా తమకు శ్రాద్ధాలు నిర్వహిస్తుంటే చూచి సంతోషించటం వాళ్ళకు సంప్రదాయమైంది. చనిపోయిన తరువాత తమకు పుత్రులు శ్రాద్ధాదిక్రియలు నిర్వహించటం వల్ల వాళ్ళకు ఆనందం. సంవత్సరానికి ఒకరోజు శ్రాద్ధం చేయుటం వలన పితృ, పితామహ, ప్రపితామహులను గుర్తు చేసుకోవటం. ఆ శ్రాద్ధానందాలలో వాళ్ళు సుఖంగా ఉన్నారు. అసలు వాళ్ళు దేవతలకు తండ్రులు, మొట్టమొదట బ్రహ్మ సంతానంగా జన్మించారు. తరువాత వాళ్ళనుంచే పుట్టారు. అంటే దేవతలకు కూడా వాళ్ళు తండ్రుల్లాంటివారు. ఆ ఏడుగురిలో అమూర్తులు ముగ్గురు, సమూర్తులు నలుగురు. అంటే రూపంలేని వాళ్ళు ముగ్గురు, రూపం కలిగిన వాళ్ళు నలుగురు. వీరిని దేవతలు గూడ గౌరవించటం జరుగుతూ ఉంటుంది ఎప్పుడూ.

జన్మనిచ్చి బాల్యంలో సేవ చేసిన మాతాపితరులను జీవితాంతం శ్రాద్ధ కర్మ రూపంలో సేవించాలి, నమస్కరించాలి, పూజించాలి.

శాశ్వతులైన పితృదేవతలకు ప్రతివాళ్ళూ శ్రాద్ధాది కర్మలు నిర్వహించటం అనేది మన సంప్రదాయం. మన విధి, బాధ్యత, పితృ సర్గంలో ప్రథమ పితృ సర్గం ఇది. అదికాక అనేకమంది పితరులు సప్త లోకాల్లోనూ నిలిచి ఉన్నారు.

భూలోకంలో ఉండేవారు భువర్లోక వాసుల్ని ఆరాధిస్తారు. సువర్లోకంలో ఉండేవాళ్ళు మరీచాదులు. దాని తర్వాత మహర్లోకం ఉంది పైన. సువర్లోక వాసులు కల్పాది వాసులైన మహర్లోకవాసులను, మహర్లోక వాసులు సనకాదులను అంటే జనాలోకవాసులను, జనాలోకవాసులు విరాగులైన తపోలోక వాసులను, వారు ఆపైనవున్న సత్యలోక వాసులను పూజిస్తారు. క్రింది వారు పై వారిని ఆరాధన చేయటమే పితరులు ఆరాధన. నేడు మనం ఆరాధించే ప్రక్రియ ఇదే. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు అందరికీ కూడా సమంగానే పూజింప తగిన వాళ్ళు వీరు.

"వసువులు, రుద్రులు, ఆదిత్యులు, సాధ్యులు, అశ్వినులు, మరుత్తులు – వీరందరికీ సమానంగా ఆరాధ్య దేవతలే వాళ్ళు. రుద్రులకు ప్రత్యేకంగా పితృదేవతలంటూ లేరు. కాబట్టి ఈ దేవతలనే వారు కూడా ఆరాధించవలసి వస్తున్నది" అని వివరించాడు మార్కండేయ మహర్షి.

త్రివర్ణములైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు అనుష్ఠించు మత వ్యవహారాలలో ఆయా మత విధి విధానంగా, పురాణోక్తంగా, మంత్రోక్తంగా పితృదేవతలను ఆరాధిస్తారు. శ్రాద్ధ కర్మలకు కాలము, యోగ్యులు, అయోగ్యులు ఎవరో అవన్నీ కూడా మార్కండేయ మహర్షి వివరించాడు. ఆ కర్మలన్నీ నిర్వహిస్తూ, పురుషోత్తముడిని ఎవరైతే భక్తితో ప్రార్థిస్తారో, పూజిస్తారో వారికి ఐహికము, ఆముష్మికము లభిస్తాయి. అంటే పై లోకవాసుల్ని ఆరాధించటం



వలన పైలోకానికి ఇతడు చేరగల స్థితి ఏర్పడుతుంది. విష్ణుభక్తి చేత, పాపక్షయమవుతుంది. ఒకవేళ మోక్షం కోరకపోతే, ఉత్తమ లోకాలకు వెళ్తారు.

శ్రాద్ధాది క్రియల విషయంలో ధర్మశాస్త్రంలో ఒక విశేషం వుంది. సాధారణంగా ఒకడు ఏ తిథినాడు మరణిస్తాడో ఆ తిథినాడే అతనికి ప్రతి సంవత్సరం శ్రాద్ధం (ఆబ్దికము) నిర్వహిస్తారు. అలా నిర్వహించి తీరాలి. నేడు ఈ పద్ధతే అందరూ ఆచరిస్తున్నారు. శ్రద్ధతో చేసేది కనుక శ్రాద్ధం అంటారు. పితృ కార్యాల్లో శ్రద్ధతో మడి, ఆచారాలు, సంప్రదాయాలు తప్పక పాటించాలి. ఈ విషయాల్లో లోటు ఉండకూడదు.

వ్యాసుడు అష్టాదశపురాణాలు వ్రాసాడు. అందులో మార్కండేయపురాణం ఒకటి. జైమిని మహర్షి చెప్పినదంతా కలిపి మార్కండేయపురాణం అని పిలవబడుతోంది. ఈ పురాణంలో అనేక ధర్మసందేహాలను మార్కండేయుడు వివరించాడు.

* * *

## 18. భృగు మహర్షి

బ్రహ్మదేవుడి హృదయం నుంచి పుట్టిన నవబ్రహ్మలలోని వాడు భృగుమహర్షి. ఈ భృగుమహర్షి వంశంలో పుట్టిన గొప్పవాళ్ళు - చ్యవన మహర్షి, జమదగ్ని, శుక్రాచార్యుడు, దధీచి, ఇంకా శ్రీమహావిష్ణువు పరశు రాముడిగా అవతరించాడు. అటువంటి మహాత్ములు పుట్టిన గొప్ప వంశం ఆ వంశానికి మూల పురుషుడు భృగుమహర్షియే. భృగుమహర్షి కర్దమ ప్రజాపతి కుమార్తె ఖ్యాతిని వివాహం చేసుకున్నాడు. ఈయనకు ధాత, విధాత అనే కుమారులు. శ్రీ అనే ఒక కూతురు జన్మించారు. ఈయనకు ఉశన అనే భార్య వున్నది. ఆమె యందు ఆయనకు కవి అనే కొడుకు జన్మించాడు. ఆయనే రాక్షసుల గురువైన శుక్రాచార్యుడు. పులోమ భృగువు యొక్క మరొక భార్య. ఆయనకు పులోమ యందు చ్యవన మహర్షి పుట్టాడు. ఈవిధంగా భృగు మహర్షి అనేక మందిని సంతానంగా కని భృగు వంశాన్ని వృద్ధిచేసారు. ఆనాడు మహర్షులు బహు సంతానానికి జన్మనిచ్చి వంశాభివృద్ధి, భూ మండలాన్ని సస్యశ్యామలం చేసారు. వాళ్ళు మహాత్ములు, వాళ్ళకు ఎంతమంది సంతానం ఉంటే అంత దేశానికి క్షేమకరం కదా! అలాగే ఉండాలి. ఆ అనేకమంది సంతానం సామాన్యులుకారు, మాన్యులు.

### దేవతలు - రాక్షసుల సంహారం

దేవతలు రాక్షసులు అందరినీ సంహరించి తరిమికొట్టారు. రాక్షసులు అపజయం పొంది గురువు అయిన శుక్రాచార్యుడి వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. మమ్మల్ని రక్షించండి అని ప్రార్థించారు. అప్పుడు శుక్రాచార్యుడు కైలాసపర్వతానికి వెళ్ళి తపస్సు చేసి శివుడిని సంజీవిని మంత్ర ఉపదేశం చెయ్యమని అడిగాడు. ఆయన అనుగ్రహంతో సంజీవినీ మంత్రం వచ్చింది శుక్రాచార్యుడికి. ఆ మంత్ర ప్రభావంతో చచ్చిపోయిన రాక్షసులనందరినీ బతికించటం ప్రారంభించాడు. అలా రాక్షసులు మరణించకుండా మళ్ళీ బతుకుతున్నారు.

అయితే శుక్రాచార్యుడు చాలాకాలం పాటు తపస్సు చేస్తున్నాడు. అందువల్ల రాక్షసులకు ఆయన అందుబాటులో లేడు. వారు శుక్రాచార్యుడి తల్లి ఉశన దగ్గరకు వెళ్ళి "ఇప్పుడు మా గురువైన శుక్రాచార్యుడు మాకు అందుబాటులో లేడు. మాకు ఆయన రక్షణ లేకపోవటం చేత అనాథలమైనాము" అని అన్నారు. వెంటనే ఉశన "మీ గురువు అయిన శుక్రాచార్యుడు వచ్చేదాకా నేను మిమ్మల్ని రక్షిస్తాను" అని వాళ్ళకు అభయం ఇచ్చింది. ఆమె తపోబలంతో ఇంద్రాది దేవతలను స్తంభింపచేసింది. ఎక్కడి వాళ్ళను అక్కడే అలాగే కదలకుండా, గమనం లేకుండా చేసింది. ఆమె మహత్తు అటువంటిది. ఆమె శుక్రాచార్యుడి తల్లి.

తరువాత దేవతలు విష్ణుమూర్తిని ధ్యానంచేసి "మమ్మల్ని రక్షించండి" అని వేడుకున్నారు. దేవతలు భయంకరమైన ఆపదలో ఉన్నారు. ఉశనా దేవిని సంహరిస్తే తప్ప ఆవిడ శక్తి ఉపసంహారం కాదు, అని విష్ణువు గ్రహించాడు. అయితే ఆమె స్త్రీ అని సంహరించటానికి సందేహిస్తున్నాడు. వెంటనే ఇంద్రుడు ఆయనను "దేవతలను రక్షించటానికి, స్త్రీ అయినా ఆమెను సంహరించవలసిందే. ఇదే ధర్మం" అని ప్రార్థించాడు. ఆమెను సంహరించటానికి ఒక భయంకర రూపందాల్చి ఆమెను భయపెట్టి ఆమెను చంపటానికి ప్రయత్నించాడు శ్రీ మహావిష్ణువు. ఉశనా దేవికి తీవ్రమైన క్రోధం వచ్చింది. విష్ణువుతో, "నీవు మహావిష్ణువు లోకాలను రక్షించాలి. నువ్వు అందరిని సమభావనతో చూడాలి. శరణు అన్న రాక్షసులను రక్షిస్తున్న స్త్రీని నేను. పతివ్రతను, ఇంద్రుడి ప్రేరణతో దుర్బుద్ధితో నన్ను సంహరింప చూస్తున్నావు. కనుక ఇంద్రుడితో సహా భస్మం కావల్సిందే" అని శాపం విధించటానికి సంకల్పించింది. శాపాక్షరాలు ఆమె కంఠంలో నుంచి బయటికి రాకుండా ఆమె కంఠాన్ని ఒక పదునైన బాణంతో ఛేదించాడాయన.

ఆమె (ఉశన) నోటి నుంచి శాపాక్షరాలు బయటికి వస్తే తనకు, ఇంద్రుడికి ప్రమాదం కనుక, ఆమెను చంపటానికి ఆయనకు అలా ఒక కారణం

ఏర్పడింది. ఉశనా దేవి కంఠం తెగి మరణించింది. కొంతమంది రాక్షసులు వెంటనే ఈ సంగతిని భృగుమహర్షికి వివరించారు. చనిపోయి నేలపై పడి ఉన్న భార్య దగ్గరకు వచ్చాడు భృగుమహర్షి ఆయనకు ఆగ్రహం కలిగి విష్ణువుతో, "దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేయవలసిన నువ్వు మహా పతివ్రత అయిన స్త్రీ కంఠాన్ని ఛేదించి చంపావు. నువ్వు చేసిన ఈ దోషానికి ప్రతిఫలంగా నీవు భూలోకంలో సుఖదుఃఖాలను కూడా మామూలు మానవుల వలెనే అనుభవిస్తూ ఉంటావు" అని శపించాడు.

## భృగువు - విష్ణువు సంవాదం

విష్ణువు అందుకు బాధపడకుండా, ఆ మహర్షికి తాను ప్రసాదించిన ఆ శక్తి తనపట్ల వమ్ముకావటం ఇష్టంలేక ఆయనను శరణువేడాడు. అయినా భృగు మహర్షి జగత్పూజ్యుడు. ఆయన శాపం శిరోధార్యం, గౌరవించదగినది అనుకొని విష్ణువు భృగువును ప్రార్థించాడు. "మహర్షీ నువ్వు త్రిలోక పూజ్యుడివి. బ్రహ్మజ్ఞానివి. సత్యాన్ని, ధర్మాన్ని పోషించే బాధ్యత ఉండటం వలన నీ భార్యను సంహరించవలసి వచ్చింది. ఆమెను నేను స్వార్థంతో గానీ, అహంకారంతోగానీ సంహరించలేదు కదా! దేవతలను రక్షించే బాధ్యత కలిగిన ఆమెను సంహరింపక తప్పలేదు. నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాను. నీ భార్య యందు నాకు ఏ మాత్రము అవిధేయత లేదు" అన్నాడు.

వెంటనే భృగు మహర్షి "మహాత్మా! ఇదంతా నీ లీల, ఈశ్వరేచ్ఛ ఇది. నీ సంకల్పం ఎవరికి తెలియదు. విధి వ్రాత ఇలా వుంది. నా భార్యకు కాలం తీరింది. నిన్ను నేను శపించవలసి వచ్చింది. అందరి తపస్సులకు ఫలం ఇచ్చే నిన్ను శపించటం అనేది నిమిత్త మాత్రమే! కాబట్టి నీవు నా పాదాలను తాకి శరణు అనవద్దు. శాపాన్ని గౌరవంగా తీసుకుని దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి ధర్మ సంస్థాపనము చేసి లోకకళ్యాణం చెయ్యి" అని అన్నాడు విష్ణుమూర్తితో. అంటే శాపవిమోచనం లేదని అర్థం.



ఇంకా శ్రీ మహావిష్ణువుతో భృగువు "నీ అవతారములు, భూలోకంలో నీ జనన మరణములన్నీ కూడా లోకకళ్యాణం కోసమే ఉపయోగిస్తావు. నీవు ఏ పని చేసినా అవి అన్నీ లోకకళ్యాణ ప్రదమవుతాయి. నీ అవతారములు అన్నీ వేదములు. నిన్ను ఎలా స్తోత్రం చేస్తున్నాయో, అలా ప్రజలు పురాణములు, ఇతిహాసములు నిన్ను స్తోత్రం చేయుగాక. నీవు, నీ చేష్టలు జగత్కళ్యాణ కారకాలవుతాయి", అని మంత్రజలాలను చల్లి విష్ణుమూర్తికి శుభాశీస్సులు అందించాడు. వెళ్ళేముందు తన భార్యను ఆ మంత్ర జలాలతో బతికించుకున్నాడు. వెంటనే ఆమెకు శిరస్సు వచ్చింది. ఆమె పునర్జీవితు రాలయింది. ఇంద్రాది దేవతలు భృగుమహర్షి మహిమకు ఆశ్చర్యపడి తమతమ స్థానాలకు వెళ్ళారు. విష్ణుమూర్తి అంతర్ధానమైనాడు. ఈ కథ అంతా లింగ పురాణం చదివి తెలుసుకోవచ్చు.

## లోకక్షేమం కోసం తపస్సు

పరశురాముడు వచ్చి ఒకసారి భృగు మహర్షిని దర్శనం చేసుకున్నాడట. తన వంశంలోని వాడు, మహానుభావుడు కాబట్టి ఆయనను తన దగ్గరే ఉండి తపస్సు చేసుకోమని అన్నాడు భృగువు. పరశురాముడు తీవ్రస్వభావుడు. అతని తపోబలం అతడి శరీరాన్ని దీప్తి మంతం చేసింది. ఆ తపఃశక్తి వలన ఆయనలోనుంచి విపరీతమయిన వేడి, కాంతి పుట్టాయి. ఆయన ప్రక్కన ఉన్న ఆశ్రమవాసులు ఆ వేడిని, కాంతిని భరించలేకుండా ఉన్నారు. దుర్భరమైన తేజోమూర్తి అయినాడు పరశురాముడు.

అప్పుడు భృగుమహర్షి ఆయనతో "నాయనా! పరశురామా! కేవలం నీ తపోబలం పెంచుకోవటానికి బదులుగా లోకార్థం తపస్సు చెయ్యి. లోకానికి అది మేలు చేయాలి. తపస్సు చేసేటప్పుడు నీలో తపోబలం పెరిగి నీ దీప్తి బలంచేత అన్ని లోకాలు వశం చేసుకునే శక్తి నీలో పెరుగుతుంది. అది దాని ఫలం. అటువంటి కోరికను వదలిపెట్టు. నీ తపోబలం చేత లోకాలకు క్షేమం

కలగాలని సంకల్పించు. అలా కోరుకో. లోకహితం కోసమని అలా తపస్సు చేసినప్పుడు దుర్భరమైన తేజస్సు నీలో ఇలా వుండగా చల్లగా కనుపిస్తావు అందరికీ" అని సందేశం అందించి పంపించాడు.

ప్రతి తపస్సుకు ఒక దిశ వుంటుంది. హిమవత్పర్వత ప్రాంతంలో పరశురాముడు లోకహితం కోసం తపస్సు చేసాడు. ఆ తపస్సుకు మెచ్చుకొని పరమేశ్వరుడు ప్రత్యక్షమై "వత్సా! లోకహితం కోసం నువ్వు చేసిన తపస్సు ఫలిస్తుంది. నువ్వు అడక్కపోయినా, ఫలం ఇవ్వవలసిందే. ఆ లోకహితం నీవల్లనే నెరవేరుతుంది. అధర్మాన్ని నీవే నాశనం చేస్తావు" అని శివతేజస్సు కలిగిన 'భార్గవాస్త్రాన్ని' ఆయనకు ప్రసాదించాడు.

**భరద్వాజ మహర్షి సందేహాలు తీర్చుట**

కైలాస పర్వత ప్రాంతంలో భృగుమహర్షి తపస్సులో నిమగ్నమైనపుడు ఆయన దగ్గరికి ఒకనాడు భరద్వాజ మహర్షి వచ్చాడు. ఆయనకు అర్ఘ్యపాద్యాదులిచ్చి గౌరవించారు? ఆయుగంలో మహర్షులు ఒకరికొకరు గౌరవించుకోవటం సంప్రదాయం. "మహాత్మా! నీ దగ్గర కొన్ని విషయాలు తెలుసుకుందామని వచ్చాను. నీవు సందేహాలు నివృత్తి చేయాలి అని అడిగాడు. ఈ భూత సృష్టి ఏవిధంగా జరుగుతున్నది? ఈ సృష్టిలో జీవులు, శరీరాలు, జీవన్మరణాలు ఎలా జరుగుతున్నాయి? నీ వలన తెలుసుకోవాలని తపనగా ఉంది" అని అడిగాడు భరద్వాజుడు. సత్యం ఒకరికి తెలిసినా, మరొకరి నోటివెంట ఎదుటివారి ముఖంలోని మాట, ఆ భాష ఇంకొక మాదిరి నూతన భావాన్ని కలుగజేస్తుంది. దానినే "ముఖే ముఖే సర్వస్వతీ" అనటం అలవాటు. కాబట్టే భృగువును అడిగాడు భరద్వాజుడు.

భృగువు, "భరద్వాజా! సనాతనుడు, అవ్యయుడు, అనంతుడు, అయినటువంటి నారాయణుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. ఈ భూత సృష్టి చేయటానికి తనలోని ఒక సహస్రాంశ భాగాన్ని బయటికి తీసికొచ్చి ఆయన మనస్సు అనే ఒక జరామృత్యువులు లేనటువంటి అనుపమానమైన వ్యక్తిని



సృష్టించాడు. ఆ పద్మంలోంచి బ్రహ్మ పుట్టాడు. బ్రహ్మ యొక్క భావన చేత ఆకాశము, దాని యందు జలము, జలం నుంచి వాయువు, ఆ వాయువు నుంచి అగ్ని దానివల్ల మరుత్తులు, దాని వల్ల భూమి సృష్టించాడు. ఆ బ్రహ్మ అఖిలభూతాత్ముడై అతడికే కారణమైన వాడు విష్ణువు. ఈ విధంగా విష్ణువు వల్లనే "విశ్వం" అంతా సృష్టింపబడింది" అని అన్నాడు.

ఆ తరువాత భరద్వాజుడు, "ఈ ఆకాశాది పంచభూతముల పరిమాణం ఎంత?" అని అడిగాడు. ఇది చాలా సరియైన ప్రశ్న ఇప్పటికీ శాస్త్రవేత్తలకు ఇదే ఒక పెద్ద ప్రశ్నగా, సవాలుగా ఉన్నది. విశ్వం పరిమితమా? అపరిమితమా? అన్న ప్రశ్నకు సమాధానం ఇంకా కనుపించలేదు. ఆధునిక శాస్త్రవేత్తలు గూడ పరిశోధనలు నిర్వహిస్తూనే వున్నారు. అన్వేషిస్తున్నారు.

భరద్వాజుడి ప్రశ్నకు భృగుమహర్షి, "ఈ భూతములన్నీ అనంతముగా ఉన్నాయి" అని జవాబు చెప్పాడు. ఇవి నిరవధికములు. వాటికి అవధులు లేవు. ఇంత అని హద్దులేదు. అప్రమేయములు – అంటే కొలతలు వేయలేవు. 'ఇంత' అని పరిమాణము చెప్పలేవు. అదంతా ఆయన శరీరమే, కాబట్టి వాటి యందు వ్యాపించినవాడు కాబట్టి, విష్ణువుకు అనంతుడు అనే పేరు వచ్చింది. విష్ణువు అనంతుడు అయితే అనంతుడు అంటే ఆయన సృష్టికి అంతం ఎలా ఉంటుంది. అంతులేనివాడని అర్థం. అనంతుడనే పేరులోనే వుంది ఆ అర్థం. ఆకాశమే ఆయన నుంచి పుట్టిందని చెబుతున్నారు. అందువలన అనంత తత్త్వాన్ని, అంటే విష్ణువును మానవ మనస్సుతో అవగాహన చేసుకోలేమని గుర్తించాలి.

ఇంకా భృగువు భరద్వాజుడికి, "వసువుల చరిత్ర" చెప్పాడు. ఇంద్రియాలు ఏవిధంగా పనిచేస్తాయో వివరించాడు. మనసు క్రమ క్రమంగా ఏయే స్థానాలను పొందుతుందో చెప్పాడు. మనసు ప్రథమంగా విషయంలోకి ప్రవేశిస్తుంది. తరువాత ఇంద్రియాన్ని చూస్తుంది. తరువాత అంతరాత్మ ద్వారా ప్రదర్శన

కూడా చేస్తుంది. అటువంటి శక్తి మనసుకు ఉంది. మనసు, బుద్ధి, చిత్తములు అనేక స్థాయిలలో ఉంటాయని దాని అర్థం.

**చాతుర్వర్ణ్య ఆశ్రమాలు**

చాతుర్వర్ణ్యాశ్రమాల గురించి భృగువు ఇలా చెప్పాడు. "సత్యమే తపస్సు యొక్క స్థానము. అంటే తపస్సు యొక్క లక్ష్యం సత్యం. తపస్సు సత్యమందు నిత్యం పరినిష్ఠమై ఉండాలి. దేనిని గురించి తపస్సు చేస్తున్నావు, అంటే 'సత్యాన్ని గురించి చేస్తున్నాను. సత్యమే నా ధ్యేయం' అని చెప్పాలి. సత్యాన్ని గురించి చేసే ధ్యానం తపస్సే అవుతుంది. అది సత్పదార్థ లక్ష్యమైనది. తపస్సు యొక్క చిట్టచివరి దశ సత్యం. అనగా తపస్సు సత్యాన్వేషణము అని తేలుతుంది, దీనిని బట్టి సత్యమే బ్రహ్మము. అదే సృజనాత్మకశక్తి. ధర్మాధర్మములు, జ్ఞానాజ్ఞానములు, స్వర్గనరకములు, సుఖదుఃఖములు, ఇవన్నీ కూడా వ్యావహారిక శబ్దములు మాత్రమే".

సత్యాసత్య వివేకి అనటం వట్టి లౌకిక, వ్యావహారిక వాక్యం మాత్రమే అని భృగువు వివరించాడు. "అసత్యమును అణగించుకోవటం కోసమనే బుధులు నియమ నిష్ఠలను ఆచరించుతారు" అన్నాడు. అసత్యాన్ని పోగొట్టుకోవటానికే చేస్తారు వాళ్ళు. దాని వలన కొద్ది కాలంలోనే శారీరక మానసికమయిన దుఃఖాలు దూరమవుతాయి. దివ్యజ్ఞానం కలుగుతుంది. కష్టాలు ఎప్పుడయితే పోతాయో, అప్పుడిక వాళ్ళు సుఖాలను వదిలేస్తారు. దుఃఖాలను మాత్రమే పోగొట్టుకోవాలని చేసే తపస్సు తపస్సుకాదు. సుఖము, దుఃఖము రెండూ కూడా మన అనుభవాలే! ఆ రెండు పోవటానికి కూడా తపస్సు చేస్తారు. అవి ద్వంద్వములు, దుఃఖంలో ఉన్నంతసేపూ సుఖం కోసం నిరీక్షిస్తాడు. సుఖంలో కూడా సుఖాంతమనే భయం ఒకటి ఉంది. సుఖం అంతా పోతుందనే భయం గూడా ఉంటుంది.

"నేటి ప్రపంచంలో మంత్రి పదవిలో సుఖాలను అనుభవించి అయిదు సంవత్సరములు చివరలో మంత్రి పదవి పోతుందనే భయం. ఈ భయమే దుఃఖము. సుఖదుఃఖములను సమానముగా భావించి జీవనము చేసేవాడే స్థిత ప్రజ్ఞుడు అని అంటారు".



చాలా సుఖము, చాలా ఐశ్వర్యములు చాలా యోగము అన్నీ ఉన్నవి. ఇప్పుడు ఇవన్నీ ఉన్నా కూడా, ఎప్పుడు మనిషికి శాశ్వతంగా ఉండేది మృత్యువు. తప్పనిసరిగా మృత్యువు ఉంటుందని మన అందరికీ తెలుసు. మిగిలిన వాటి విషయం మనకు తెలియదు. కానీ యదార్థంగా ఉన్నదని, అందరికీ బాగా అవగాహన కల్గినది మాత్రం మృత్యువు. కాబట్టి మృత్యువే జగుత్తకు - ఆ జీవుడికి సంబంధించింది జగన్నాశనం. అంటే వాడికి జగత్తు వినాశన మయిపోయింది. మృతి పొందినవాడికి జగత్తు లేదు. కాబట్టి మృత్యువు వస్తే జగత్తంతా వెళ్ళినట్లే. కాబట్టి ఆ అర్థంలో కూడా జగత్తు అసత్యమని మనిషి తెలుసుకోవచ్చు.

భృగుమహర్షి లోకానికి ఎన్నో సందేహాలు నివృత్తి చేసాడు. ప్రజలకు వాటిపై అవగాహన కలగాలి. మహర్షులు మానవాళికి అనేక వేదాంత, ఆధ్యాత్మిక, శాస్త్ర విషయాలను అందించారు.

ఆ ప్రాచీనయుగంలో కూడా ఒక ఋషికి తెలియని ధర్మసందేహాలను, ధర్మసూక్ష్మములను, ఇతర శాస్త్ర విషయములను తెలుసుకోవాలనే తపనతో మరొక ఋషి వద్దకు వెళ్ళి తెలుసుకోటం అనేది ఉన్నదని అర్థమవుతోంది. ఎవరికివారు నేను గొప్ప ఋషిని అనే భావన వారిలో లేదని అర్థమవుతోంది. ఆ కాలంలో ఋషులు, సత్సంబంధాలు, సన్నిహిత సంబంధాలు కలిగి పరస్పర చర్చలు జరిపారు. సత్ఫలితాలు సాధించారు.

**యజ్ఞఫలం**

ప్రాచీన యుగాల నుంచీ చాలా మంది యజ్ఞం చేస్తున్నారు. అశాశ్వతమైనటువంటి లౌకిక భౌతిక సుఖాన్వేషణ కొరకే యజ్ఞం చేయబడుతుంది. అది జ్ఞానప్రదం కాదు. జ్ఞానం కోసం ఎవ్వరూ కూడా యజ్ఞం చెయ్యరు. యజ్ఞం వలన జ్ఞానం పొందటానికి వీలుంటుందా? అని

సందేహం కలుగుతుంది. యజ్ఞం వల్ల జ్ఞానం రానేరాదు. అవిద్య, అజ్ఞానంలోంచి యజ్ఞం జరుగుతున్నది. యజ్ఞం అనేది మంత్రములు, అందులో ఋత్విక్కులు, వారు చేసే హెూమం, అది ఇచ్చే ఫలితాలు యజమానిని సుఖవంతుణ్ణి చేస్తాయి. యజమానిని సౌఖ్యవంతుణ్ణి చేస్తూ, పుణ్యలోకాలకు పంపించే మార్గం చూపిస్తాయి. యజమానిని కీర్తి వంతుణ్ణి చేస్తాయి. ఆ విధంగానే ప్రతీ మంత్రం చెబుతున్నది.

నిజానికి యజమానీ శాశ్వతుడు కాదు. కాబట్టి కొన్ని పరిధులకు లోబడి మనం ఆలోచించాలి. ఈ భరతవర్షంలో, "ఈ భారతదేశంలో సుజనులు, సత్త్వగుణ సంపన్నులు ఎవరైతే ఉన్నారో అలాంటి వాళ్ళకు భౌతికమయిన కష్టము, దుఃఖము రాకుండునుగాక!" అని, అంతవరకే చాలా పరిమితంగా యజ్ఞఫలం ఆశించి నిర్వహించాలి. అలా అయితేనే ఫలం లభిస్తుంది.

"నేను వేద శాస్త్రాలు చదివాను. చాలా తపస్సు చేసాను. ఇక నేను మోక్షానికి అర్హుణ్ణి" అని ఎవరూ తనకు తాను గొప్పలు చెప్పుకోకూడదు. అనంత కళ్యాణగుణ సంపన్నుడయిన, కరుణామయుడైన ఆ హరి మాత్రమే ముక్తిని ఇవ్వాలి. అలా కోరుకోవాలి. సత్కర్మలు ఆచరించాను. కాబట్టి మోక్షం రావాలంటే, అలా వీలులేదు. కర్మకు, ముక్తికి సంబంధంలేదు. కర్మలు ఆచరించటం వరకే మన బాధ్యత. ఫలితాలు ఇవ్వటం శ్రీమన్నారాయణుని కర్తవ్యం.

కర్మ ముక్తి అయితే ఎలా? కర్మ బంధనం కదా! కర్మ వలన మనం జన్మించాం. మళ్ళీ కర్మచేసి మోక్షము పొందటమేమిటి? అది తప్పు. సుఖదుఃఖాలు దూరం చేసుకోటానికి తపస్సు చేస్తే, ఆ తరువాత సుఖాలు కూడా అధిగమించబడి దాటబడుతాయి. అదీ పరిణామ దశ. అట్టివాడు వైరాగ్య ప్రవృత్తి యందు ఖచ్చితమైన నిష్ఠ కలిగి ఉన్నవాడు పరమపదం పొందుతాడు" అని భృగు మహర్షి బోధించాడు.



**ఇహ లోకానికి, పరలోకానికి బేధం**

భరద్వాజ మహర్షి "ఇహ లోకానికి, పరలోకానికి తేడా ఏమిటి? అని అడిగాడు భృగు మహర్షిని. దానికి సమాధానంగా భృగువు "ఈ ఇహ లోకమంతా కర్మ భూమి, భోగాస్పదమైనటువంటిది. ఎక్కువ దుఃఖము, తక్కువ సుఖము కలిగినది. చాలా ఎక్కువ సుఖము అనంతమైన సౌఖ్యప్రద మైనటువంటిది స్వర్గలోకము అని పిలవబడుతుంది. ఆ సుఖానికి భూలోకానికీ హస్తిమసకాంతరము. ఏనుగు-దోమ పరిమాణాలంత తేడా వుంది. అక్కడి సుఖానికి, ఇక్కడ సుఖానికి తేడా అంత.

**మమకారము, అహంకారము**

ఇంకా భృగుమహర్షి మమకార, అహంకారాల గురించి సందేశము అందిస్తూ "ఆ రెండూ వదలినటువంటి జ్ఞానులు పుణ్య మార్గము, పాప మార్గము రెండు కూడా విసర్జించిన వాళ్ళు. కాబట్టి వాళ్ళ లోకాలలో దిమ్మరులై సంచరిస్తారు. వాళ్ళనే లోకదిమ్మరులు అంటారు. కర్మలుచేసి పుణ్య లోకాలకు వెళ్లి మరల వస్తారు పుణ్య జీవులు. వాళ్ళూ దిమ్మరులే. కాని మొదటి రకం వారు కూడా అలా తిరుగరు. శాశ్వతమైన ఆనందం ఉన్నచోటే అనుభవిస్తారు. లోకం బయట ఉన్న ప్రపంచాన్ని కోరరు. యధార్థంగా నశ్వరమైన ఈ శరీరంలో ఇంద్రియాలలో ఉండేటటువంటి ఈ శరీరంలోనే ఉండి శాశ్వతమైన ఆనందాన్ని పొందే ప్రయత్నం చేస్తాడు వివేకి. దానికి దివ్య శరీరము, దివ్య లోకాలు, చాలా పుణ్యాలు, యజ్ఞాలు, దానాలు, తపాలు మొదలైనవి అవసరంలేదు. ఉత్తమ లోకాలకు వెళ్ళాలని కోరుకోడు. ఇక్కడ నశ్వరమైన శరీరము, అల్పమైన ఆయుర్దాయము, ఇంద్రియములు, సుఖదుఃఖములతో ఉండే ప్రపంచము, దారాపుత్రులతో కలసి ఉన్న జీవితము - ఈ రకమైన జీవనాన్ని చూచి భయపడక, శాశ్వతమైన శాంతి కలగటానికి ఇక్కడ ప్రయత్నం చేస్తాడు వివేకి". ఈ విధంగా భృగు మహర్షి భరద్వాజ మహర్షికి అనేక విషయాలను వివరించాడు.

* * *

## 19. కపిల మహర్షి

సృష్టికర్త బ్రహ్మ కర్దమ ప్రజాపతిని సృష్టించి, సృష్టిలో అనేక ప్రాణికోటిని సృష్టించమని ఆదేశించాడు. వెంటనే కర్దముడు సరస్వతీ తీరానికి వెళ్ళి తపస్సు చేసాడు. ఒకరోజు విష్ణువు ప్రత్యక్షమై "నీ భార్య దేవహూతి వలన నీకు తొమ్మిది మంది కుమార్తెలు జన్మిస్తారు. తరువాత నా అంశతో ఒక కుమారుడు కలుగుతాడు" అని వరమిచ్చాడు విష్ణువు. ఆమెకు విష్ణువు చెప్పిన విధంగా తొమ్మిది మంది కుమార్తెలు జన్మించారు. వారి పేర్లు – కళ, అనసూయ, శ్రద్ధ, హవిర్భువు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతి ఈ పేర్లు అన్నీ విజ్ఞానానికి సంబంధించినవి, ఉత్తమ లక్షణాలు, సద్గుణాలకు చెందినవి. వారికి పెట్టుకున్నారు. అరుంధతి కూడా ఆయనకు పుట్టినపిల్ల. అలాగే శాంతి కూడ! ఆ తరువాత కొంత కాలానికి దేవహూతి గర్భవతియై శ్రీమన్నారాయణుడి అంశతో 'కపిలుడు' అనే కుమారుణ్ణి కన్నది. ఆయన జన్మించినందుకు దేవతలు సంతోషించారు. దేవ దుందుభులు మ్రోగాయి. ఆయన అంతటి పుణ్య పురుషుడు. బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి పిల్లవాడిని ఆశీర్వదించాడు. గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు గానం చేసారు. అప్సరసలు నాట్యం చేసారు. ఈయన జన్మదిన మహోత్సవం వలన సృష్టిలో ఆయన అవసరం ఎంతో ఉన్నదని తెలుస్తోంది. కపిలుడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమే!

### కుమార్తెల వివాహము

కర్దమ మహర్షి మహర్షులను ఆహ్వానించి తన కుమార్తెలను వివాహం చేసుకోమని కోరాడు. తన తొమ్మిది మంది కుమార్తెలకు శాస్త్రోక్తంగా వివాహం ఈ ప్రకారంగా చేసాడు. అత్రి మహర్షికి అనసూయను, అంగీరసుడికి శ్రద్ధను, పులస్త్యుడికి హవిర్భువును, పులహుడికి గతిని, కృతాయువుకు క్రియను, భృగువుకు ఖ్యాతిని, వసిష్ఠునికి అరుంధతిని, ధర్ముడికి శాంతిని, మరీచికి కళను ఇచ్చాడు. వారందరినీ అత్తవారింటికి పంపించాడు. మహర్షుల



కూతుళ్ళు వేరే మహర్షులకే భార్యలు కావటం ఆనాటి సంప్రదాయం. నేటి యుగంలో వేద పండితులను, స్మార్త పండితులను వివాహం చేసుకోటానికి ఆడపిల్లలు ముందుకు రావటం లేదు. తల్లిదండ్రులు గూడ కూతుళ్ల మార్గంలోనే ఆలోచిస్తున్నారు. మన సంప్రదాయాలు చదువులు, వృత్తులను పోషించే వారిని వివాహం చేసుకోవటం పుణ్యంగా, పవిత్రంగా భావించాలి. ఆనాడు మహర్షులను వివాహం చేసుకోటానికి బాలికలు ముందుకు వచ్చేవారు. తల్లిదండ్రుల మాటను వినేవారు. ఈ విషయాన్ని ఈనాటి తల్లిదండ్రులు, బాలికలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

'ధర్మపత్ని' అనే మాటకు అర్థం ఆనాటి వివాహాలవలన లోకానికి భార్యాభర్తలు ధర్మాన్ని ఆచరించి ఆదర్శ దంపతులుగా శాశ్వతంగా నిలిచారు.

### కర్దముని ప్రార్థన

ఒకనాడు కర్దముడు తన ఇంట కపిల రూపంలో జన్మించిన మహావిష్ణువును సమీపించి "పురాణ పురుషా! సర్వమానవులు నీ చరణ సేవలో ముక్తిధామం చేరుతారు. మా అదృష్టవశాత్తు మాకు కుమారుడవై జన్మించి మాకు తరుణోపాయం చూపించావు. ఇక నేను సంసారం వదలి వనానికి వెళ్ళి యోగమార్గాన ముక్తి సాధించుకుంటాను" అన్నాడు.

### తండ్రికీ, తల్లికీ కపిలుడి సందేశం

కపిలుడు మందహాసం చేసి, "ఈ మానవులందరినీ ఉద్ధరించటానికే నేను కపిలమునిగా అవతరించాను. సాంఖ్యయోగ ప్రయోగంతో వీరిని తరింపచేస్తాను. నువ్వు నిశ్చింతగా పరంజ్యోతి ధ్యానంతో కైవల్యం పదం చేరు" అని తండ్రికి హితబోధ చేసి పంపించాడు. కర్దముడు ప్రశాంతంగా తపోవనం చేరి యోగనిష్ఠతో ఈశ్వరధ్యానంతో పరమ భాగవతోత్తముల స్థానం చేరారు.

## తల్లికి తత్త్వోపదేశం

బిందువరం దగ్గర దేవహూతి కపిల మహిర్షి వద్దకు వచ్చి తనకు తత్వం ఉపదేశించమని కోరింది. కపిలుడు చిరునవ్వు వదనంతో "తల్లీ! ఈ జీవుడున్నాడే, వీని మనస్సు భవ బంధాలను త్రెంచగలదు. కాని అది సత్వ, రజస్తమోగుణాలకు లొంగిపోతే సంసార బంధనంలో గిరగిర త్రిప్పుతుంది. అదే మనస్సు నారాయణునిపై లగ్నమైతే మోక్ష మార్గాన సాగుతుంది".

"ఈ మనస్సు అహంకార మమకారాలకు లొంగి కామ, క్రోధ, లోభ మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలతో బంధితమై పాప కర్మాలకు పురికొల్పుతుంది. వాని నుండి వదిలించుకున్నవాడు పరిశుద్ధమై పరంజ్యోతి స్వరూపుడైన పురుషోత్తముని యందు మనసు లగ్నమవుతుంది. జ్ఞాన వైరాగ్యయుక్తమై ఆ నారాయణుని యందు ఉండే మనసు మాత్రమే సక్రమ మార్గాన్ని చూపుతుంది" అని భక్తులు అంటున్నారు.

"ఈ ఇంద్రియాలు ఎప్పుడూ ఏదో ఒక వాంఛతో సతమతమవుతూనే ఉంటాయి. అవన్నీ దోషభరితాలు. వాని నుండి మనస్సుతోబాటు ఇంద్రియాలను మరలించి అంతఃకరణను మంచి పనుల మీదనే కేంద్రీకరిస్తే అది మోక్షమార్గం వైపు నడుస్తుంది". మానసిక కాలుష్యమే మానవుడి నాశనానికి కారణం.

"భూత కోటినంతా తన వలనే భావిస్తూ, ఓర్పుతో, సంయమనంతో, శాంత హృదయంతో, నిష్కామకర్మ చేస్తూ, నిరంతరం హరినామ స్మరణ చేస్తూ, నారాయణ లీలా గాథలు పాడుకుంటూ, వింటూ ఉండేవారు ఆనందోత్సాహాలకు లోనవుతారు. వీరు భాగవతోత్తములు".

"అమ్మా! ముక్తికంటే భగవత్సేవా భాగ్యం గొప్పది. శరీరంలోని జఠరాగ్ని మనం తిన్న ఆహారాన్ని జీర్ణంచేసి శక్తిని ఎలా ఇస్తుందో, ఆ విధంగానే ఈ హరిసేవ మన లింగ శరీరాన్ని నశింప చేస్తుంది.



ఇంకా కపిల మహర్షి తన తల్లితో "అమ్మా! ఇక తత్త్వం విషయం వివరిస్తాను. ప్రకృతి– పురుషుడూ ఈ ప్రపంచానికి కారణభూతులు. ఇందులో ప్రకృతి చతుర్వింశతి (ఇరవైనాలుగు) తత్త్వాలలో వుంటుంది".

పంచభూతాలు, పంచతన్మాత్రలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పది, మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం అని అంతఃకరణ చతుష్టయం, – ఇవి ఇరవై నాలుగు తత్త్వాలు, ఇదంతా సగుణ బ్రహ్మస్థానం.

తామసాహంకారం వల్లనే శబ్ద, స్పర్శ, రూప, రసం, గంధాది తన్మాత్రలు, ఈ తన్మాత్రల వల్ల పంచమహాభూతాలు, పంచేంద్రియాలు పుట్టాయి. ఇంతలో సృష్టి ప్రారంభమయింది. భూత పంచక సమ్మేళనం వల్లనే అది సాగుతుంది.

"అమ్మా! ఈ సృష్టిలో దుర్లభమైన నరజన్మ సాధించినవాడు నారాయణ చరణసేవతోనే మోక్షం పొందుతాడు. "సర్వ లోకేశ్వరుడైన మహా విష్ణువు కృపవల్లనే వాయువు చలించటం, ఇంద్రుడు వర్షించటం, సూర్యచంద్ర తారాదులు ప్రకాశించటం, సముద్రం చెలియలికట్ట దాటకుండా ఉండటం, నదులు ప్రవహించటం, చెట్లు పుష్పించి ఫలాలు ఇవ్వటం అన్నీ జరుగుతున్నాయి".

ఈ విషయాలన్నీ తెలియక ఇల్లు, భూమి, పశువు, భార్య, పిల్లలు, ధనం ఇవే శాశ్వతమని భావించే వాడు వాటిమీద వ్యామోహంతోనే జీవితాన్ని నరకం చేసుకుంటున్నాడు. ఆ వ్యామోహం కోసం ఎందరినో హింసించి, మోసగించి, కుట్రలతో, కుతంత్రాలతో ధనం సంపాదిస్తారు.

నిర్మలమైన, శాశ్వతమైన జీవనం కోసం భాగవతోత్తములను మార్గదర్శకులుగా ప్రేరణ పొందాలి.

"వయస్సు మళ్లి వార్ధక్యం మీదపడుతుంది. దున్నటానికి పనికిరాని ఎద్దుని రైతు వదలిపెట్టినట్లు, ముసలివాడికి బంధుమిత్రులందరూ దూరంగా ఉంటారు.

ఈ బాధలతో మిత్రులందరూ దూరంగా ఉంటారు. ఈ బాధలతో శరీరం వికారరూపం పొందుతుంది. వీడు నేడో, రేపో శరీరం వదలుతాడని బంధువులు భయపడుతారు. గడపదాటి కాలుబయట పెట్టే ఓపిక ఉండదు. కుక్క బ్రతుకు అవుతుంది. పెట్టింది తినటం, పడి ఉండటం అవుతుంది. మానవ సంబంధాలు క్షీణించిపోతాయి".

"జఠరాగ్ని మందగిస్తుంది. ఆకలి పడిపోతుంది. శ్లేష్మం ఎగదన్ని గొంతులో గురగుర పుడుతుంది. నాలుక పలుకదు. ఇంద్రియాలు సక్రమంగా పనిచేయవు. మరణయాతన సంభవించే సమయానికి విపరీత భయంకరాకారంతో యమదూతలు వచ్చి మెడకు తాడు బిగించి లాక్కుపోవటం ప్రారంభిస్తారు".

"చేసిన పాపాలకు, అధర్మాలకు, అన్యాయాలకు, అత్యాచారాలకు యమపురిలో కఠిన శిక్షలు – అనగా కొరడా దెబ్బలు, వేసవి ఎండకు కాలే ఇసుకమీద నడవటం, ఆకలి దప్పికలు పీడించటం, సలసల కాగే నూనెలో పడవేయటం జరుగుతుందని తెలుసుకోలేక పోతున్నారు మానవులు".

భగవత్సేవ నిస్వార్థ సేవగా, మానవ జన్మ లేకుండా చేసుకోవాలి అనే అవగాహన మానవాళిలో కలిగించాలి.

పాప ఫలితం యమపురిలో అనుభవించి, మరల మనుష్య జన్మతో భూమిన పడుతాడు. మళ్ళీ మానవ జన్మలో కష్టాలు, వ్యామోహాలు మొదలగునవి ప్రారంభమవుతాయి. దీనికి అంతమెప్పుడు.

దయ సత్యశౌచాలు వదిలేస్తాడు. మానాభిమానాలుండవు. మనశ్శాంతి పోతుంది. శరీరమే ఆత్మ అనుకుంటాడు. స్త్రీ సంగమమే సుఖం అనుకుంటాడు.

అన్ని దుష్కార్యాలు వదలి, ధర్మ బుద్ధితో, న్యాయంగా సంపాదించి దానిని యోగ్యులకు, అర్హత గల వారికి దానం చేసి, దేవ పితృకార్యాలు శ్రద్ధగా ఆచరించి వేదోక్త కర్మలు చేసేవారు చంద్ర లోకం చేరి పుణ్యఫలం పూర్తి



కాగానే మళ్లీ జన్మిస్తారు. ఈ కర్మలన్నీ విడిచి నిరంతరం శ్రీమన్నారాయణుడినే స్మరించిన వారికి పునర్జన్మ భయం ఉండదు.

కపిల మహర్షి తన తల్లికి ఉపదేశించిన భక్తి మార్గం ఆమెతోబాటు ప్రతియుగంలోని మానవాళికి అవసరమని గ్రహించాలి. ఇందంతా ఆయన మానవులకు అందించిన ఉపదేశమే. మహర్షులు నిర్వహించే లోకోపకారం ఇదే. ఇదే వారి నిత్యవ్రతం.

ఇదంతా విని దేవహూతి కొంచెం సమయం దుఃఖించి, తరువాత ఉపశమనం పొంది 'నారాయణుడి' యందు మనసు నిలిపి ఆయనలో ఐక్యమైంది.

**మహారాజుకి కపిలుని సందేశం**

ఏ మహర్షి ఎవ్వరికి ఏ సందేశం, ఉపదేశం బోధించినా అది వారికే పరిమితము కాదు. అన్ని యుగాలకు ప్రజలకు అవసరమైనవే. అవన్నీ మన శాస్త్రాలు చెప్పినవే. అదే వారి లోకోపకార వ్రతం. ఒక మహారాజుకి కపిల మహర్షి ఇచ్చిన సందేశం చదవండి.

పుండరీకుడు అనే మహారాజు వేటకు వెళ్ళాడు. కపిల మహర్షి ఆశ్రమ సమీపంలో నీరు ఉండటం చేత, ఆ చెఱువులోని నీళ్ళు త్రాగి విశ్రమించాడు. ఆ రాజు మృగయా వినోదం కోసం వచ్చాడు కనుక, ఒక లేడిపిల్ల తన ముందు నుంచి వెళ్ళటం చూచాడు. వేట ఆయనకు అలవాటు కనుక ఆ లేడి పిల్ల మీద బాణం వేసాడు. ఆ లేడి పిల్ల బాధలో ఉండి కపిల మహాముని పాదాల దగ్గర వాలి ప్రాణాలు వదిలింది. సహజంగా ఆశ్రమాలలో తిరిగే సాధుజంతువులను ఎవరూ చంపరు. ఈ సంగతి రాజుకు తెలుసు. పొరపాటున ఆ రాజు ఆ లేడి పిల్లను చంపాడు. తన తప్పును తెలుసుకొని రాజు గజగజ వణుకుతూ మహర్షి దగ్గరకు వెళ్లి "మహర్షీ ఈ తప్పు నేనే చేసాను. నన్ను క్షమించవలసింది. నేను పుండరీకుడు అనే రాజును" అని ఆయన వంశ గోత్రాలను చెప్పి మన్నించమని అడిగాడు.

వెంటనే కపిల మహర్షి "ఓ రాజా! నీటి బుడగ వలె క్షణం మాత్రమే జీవించే మనిషి పశువు కంటే ఎక్కువ బుద్ధి, జ్ఞానం కలిగి ఉండి కూడా, తానే శాశ్వతంగా జీవించి ఉండటం లేదని తెలిసి కూడా, తన కంటే అల్పమయిన జీవి, నోరులేని జీవిని, తనకు ఎలాంటి అపకారం చేయనటువంటి పశువును వధించి పాపం సంపాదించుకున్నావు. ఇటువంటి దారుణమైన పాప కర్మను నువ్వు ఎందుకు ఎంచుకున్నావు? విద్యావంతుడివి, దేశాన్ని పాలించే రాజువు కూడా! ఈ ధర్మం నీకు తెలియదా? ప్రజలను ధర్మమార్గంలో నడిపించే రాజే ఇలా చేస్తే ప్రజలు ధర్మం ఆచరిస్తారా! అధర్మం రాజ్యం ఏలుతుంది, గదా!"

కపిలుడు ఇంకా రాజుతో "నీకు రక్త మాంసాలు, ఆకలి దప్పికలు ఉన్న నీ దేహం ఎటువంటిదో, దాని దేహం కూడా అటువంటిదే! దానికీ ఆకలి, నిద్ర, మైథున క్రియ, సంతానం కలగటం, తన సంతానం మీద ప్రేమ, అనురాగం అన్నీ ఉన్నాయి. నిజంగా ఆ పశువుకు, నీకు తేడా ఏమీ లేదు. నీ శరీరం మీద నీకు మోహం ఎటువంటిదో, దాని శరీరం మీద దానికి గల మోహం అటువంటిదే! ఇవన్నీ తెలిసి ఉండి కూడా ఎలా చంపగలిగావు. నీకు మనసు ఎలా వచ్చింది" అన్నాడు.

మహర్షి కపిలుడు రాజుతో మళ్ళీ ఇలా అన్నాడు. "ఒక వేళ చంపాలనుకోవటం విలాసము, సరదా, వినోదం కోసం అయితే నీకు లభించే లాభం ఏమిటి? ఆనందం ఏమిటి? ఇంకొక జీవి హింస పడుతూంటే, అది గిలగిల తన్నుకుంటూ ప్రాణం విడిచి పెడుతుంటే, నీకు విలాసం వినోదం ఎట్లా అవుతుంది. ఇంకొకరిని బాధించటం, ఇంకొకరి దుఃఖము నీకు విలాసం ఎట్టా అవుతుంది. నీవు పండితుడివైన రాజువు, అందువలన నేను నిన్ను శిక్షంచను. ఎందుకు శిక్షించను అంటే ఇప్పుడు నేను నీకు చెప్పిన హితోక్తులు నాకూ వర్తిస్తాయి. నువ్వు లేడిని చంపటం పాపం అయితే, నేను నిన్ను చంపటం పాపమే కదా! నీకు జ్ఞానమార్గం ఉపదేశించాను. బుద్ధిగా జాగ్రత్తగా



జీవించు. ఈ తుచ్ఛమయిన శరీరము, ఈ విలాసాలు, ఆనందము మొదలైన వాటిమీద మనసుపెట్టుకోకు" అని ఆయన హితబోధ చేసాడు.

ఏ జీవినైనా సంహరించాలని అనుకున్న సమయంలో ప్రతివ్యక్తి కపిలమహర్షి సందేశాన్ని గుర్తుంచుకోవాలి. అన్ని ప్రాణులు సమానమే అనే భావనతో ధర్మమార్గాన్ని ఆలోచించాలి. మహర్షి వాక్కు ధర్మవాక్కు,

వెంటనే ఆ రాజులో మానసిక పరివర్తన వచ్చింది. తీవ్రమైన దు:ఖానికి, ఆవేదనకు గురి అయినాడు. మహర్షి మాటలు రాజుకు శూలాల్లాగా పొడుచుకున్నాయి. తాను చేసిన నేరాన్ని మహర్షి చెప్పిన మాటలతో, తనను తాను క్షమించుకోలేక పోయాడు. క్షమించమని ఆడగాల్సిన పని కూడా లేకపోయింది. నిన్ను వదిలేసానని ఆయనే అన్నాడు. శిక్ష విధించినా బాగుండేది. నిన్ను ఏమీ చెయ్యను పొమ్మని అన్నాడు. ఆయన గొప్ప అహింసావాది అని ఈ సందేశాన్ని బట్టి తెలుస్తున్నది. అపారమైన క్షమ గలవాడు.

"కపిల మహర్షి రాజుకు ఇచ్చిన సత్సందేశంతో నేటి కలియుగంలోని మానవాళికి మానసిక పరివర్తన కలగాలని ఆశిద్దాం. నేటి కలియుగంలో మనిషిని మనిషే చంపుతున్న రోజులు, మహిళలను, బాలికలను, కుటుంబ సభ్యులను భార్య భర్తలు ఒకరినొకరు చంపుకొను స్వభావం కలిగివున్నారు. ఈ దురదృష్టకర సంఘటనలు, అత్యాచారాలు, అనాచారాలు, భ్రష్టాచారాలు నివారించటానికి ప్రతివ్యక్తి మానసిక మార్పుకు ప్రయత్నించాలి. మానవీయ విలువలు, నీతి, నిజాయితీ, ధర్మాచరణవైపు ప్రజలు అవగాహన పెంచుకోవాలి. పంచుకోవాలి. కపిలమహర్షి సందేశం అన్ని యుగాలకు, రాజులకు, ప్రభువులకు, అన్ని వర్గాల వారికి, అన్ని మతాల వారికి అన్వయిస్తుందనుటలో సందేహంలేదు".

కొంత సమయమైన తరువాత రాజు వెంటనే తన ఒరలోంచి కత్తిని తీసి పొడుచుకుని చచ్చిపోదామని ప్రయత్నించాడు. వెంటనే కపిలుడు

ఆయనను అడ్డగిస్తూ "ఈ ఆత్మహత్య వలన మరో పాపం చేయబోతున్నావు. నీ ప్రాణాన్ని రక్షించుకోవటానికి నీవు ఎలా చేస్తావో, ఆ లేడి పిల్లకూడా ఆ విధంగా పారిపోయి చివరకు ప్రాణాన్ని రక్షించుకోలేక నా ఆశ్రమం వద్ద పడి చచ్చిపోయింది. నిన్ను నీవు చంపుకున్నా అది హింసే అవుతుంది. దీనివలన జ్ఞానమోక్షాలు ఎలా కలుగుతాయి" అని అన్నాడు. ఆ రాజు వెంటనే తనకు జ్ఞానోదయం చేయవలసిందని ప్రార్థించాడు మహర్షిని.

## రాజుకు జ్ఞానబోధ

గత జన్మలో మనం ఏదో పుణ్యం చేస్తాం. సిరి సంపదలు వస్తాయి. భార్యా పిల్లలందరూ బాగుంటారు. సంతోషమే. దానిని అనుభవిస్తున్న సమయంలో సాత్త్విక గుణంతో సత్త్వ గుణ ప్రధానుడై అనుభవించాలి. దర్పంతో ఇదంతా తాను ప్రయోజకత్వం అనే భావంతో ఉంటాడు. ఇతరులను తిరస్కరించి కాదు. ఇతరులను అవమానించి తాను ధనవంతుడినని విర్రవీగ కూడదు. మనం అనుభవిస్తున్న సంపదలన్నీ క్షణికం, అనే భావన ఏర్పరచుకోవాలి. ఏదీ శాశ్వతం కాదు. మనిషి గూడా అశాశ్వతుడే! ఎందుకంటే మనిషి తాను జీవించి ఉన్నపుడే పుణ్యం ఖర్చయిపోయి సంపదలన్నీ వెళ్ళిపోతాయి. సంపదలుండగనే ఆయుర్దాయం అయిపోతే, తను శరీరం చాలిస్తాడు. కాబట్టి వియోగం ఎలాగూ తప్పదు. ఈ రెండు విషయములలో కూడా సంపద యొక్క అనుభవం క్షణికమే! ఏడు తరాలు అనుభవించ గలిగిన ఆస్తి ఉండవచ్చు. కాని వ్యక్తి అనుభవం క్షణికం మాత్రమే.

## గురువు - జ్ఞానభిక్ష

"అందుకనే "జ్ఞానభిక్ష" పెట్టమని గురువును ఆశ్రయించాలి". ఈ క్షణికమైన జీవితంలో అనుభవించటానికి అన్నీ ఉన్నాయి. కానీ అనుభవించటం కోసమని నేనుండటంలేదు. నేనూ ఉండను అవీ ఉండవు. అందువలన నాకు



మార్గోపదేశం చెయ్యి అని ఆశతో గురువును ఆశ్రయించి మోక్షమార్గాన్ని అర్థించేవాళ్ళు మూడు రకాలుగా ఉంటారు. మాహారాజా! వాళ్ళే అంకురితులు, పుష్పితులు, ఫలితులు, జీవితంలో ఏ మార్గాన్ని ఆశ్రయించి జ్ఞానాన్ని పొందుతారో వాళ్ళనే ఫలితులు అంటారు. ముక్తిఫలం లభించిన వాళ్ళు ఫలితులు.

మోక్ష ధర్మమందు కోరిక మాత్రమే కలిగి, ఆ కోరిక అంకురించిన హృదయంతో ముక్తి మార్గం అన్వేషిస్తే చాలు. ఎలాగైనా, ఎప్పటికైనా, నా కోరిక తీరుతుందేమో! గురువు లభిస్తాడేమో! ఎప్పటికైనా ఈ సంసారంలోంచి నేను బయటికి రాగలుగుతానేమో! అనేటటువంటి భావన, కోరిక కలిగిన వాళ్ళు అంకురితులు.

"ఆ తపస్సులో ప్రవేశించి సాధనచేస్తున్న వాళ్ళు పుష్పితులు. జ్ఞానసిద్ధి పొందినవాళ్ళు ఫలితులు. ఈవిధంగా మూడు రకాలుగా వున్నారు. వీరంతా గురుబోధ జ్ఞానమువలన మోక్షాన్ని పొందుతారు. గరువు - ఇది మార్గమని, ఇది గమ్యమని, ఇది కర్తవ్యముని చూపిస్తాడు. ఆ తరువాత నీకు కర్తవ్యం లేదు. వెనక్కు తిరిగి చూడకు. ఈ సంసారం యొక్క అర్థం ఇంతకన్నా లేదు. ఇది వ్యర్థమయినటువంటిది. నీవు అటు చూడవద్దు. నీకు ఏవో ధర్మాలున్నాయని అనుకోవద్దు. మోక్షమార్గానికి వెళ్ళే వాడికి ఏవో ధర్మాలున్నాయని గుర్తుకు రాకూడదు అది పతనమవుతుంది" అని కపిల మహర్షి హితబోధ చేసాడు.

ఇంకా తన సందేశాన్ని ఇస్తూ కపిలుడు "ఓ రాజా! సమస్త ధర్మములను పరిత్యాగం చేసి అంకురితుడిగా మోక్షమందు ఇష్టత కలుగచేసుకో! నువ్వు ఆ మార్గంలో ప్రవేశిస్తే పుష్పితుడివి. సిద్ధి పొందితే ఫలితుడివి. అలా మూడు విధములయిన ముముక్షువులు ఉన్నారు" అని అన్నాడు.

## ముక్తి మార్గం

రాజు రాజ్యము, సంపదలు, భార్య బిడ్డలను వదిలిపెట్టి కపిలుని ఆశ్రమానికి వెళ్ళాడు. పదమూడు రోజుల తరువాత కపిలుడు రాజుతో "రాజా!

నా ఆశ్రమానికి ఎందుకు వచ్చావు నీకు రాజ్యమున్నది అందరినీ వదలిపెట్టి నా వద్దకు వచ్చి మోక్షం ప్రసాదించమని అడిగావు. అది అధర్మం కాదా! అలా అని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి" అంటూ సంభాషించాడు. యథార్థమైన వైరాగ్యం ఉండటంచేత రాజు చలించలేదు. సమాధానం చెప్పలేదు. అంజలి బద్ధుడై నిలబడి ఉన్నాడు.

అప్పుడు కపిలుడు మనుష్యుడికి కర్మ, భక్తి, వైరాగ్యము, జ్ఞానము, యోగము అనేటటువంటి అయిదు పరిణామాలు ఉంటాయి అనే విషయం బోధచేసి, అతడికి ముక్తిమార్గం అనుగ్రహించాడు. ఆయన రాజుకు ఉపదేశించిన మహామంత్రం ఇలా వుంది.

**"పరాయ పర రూపాయ**
**పరమాత్మన్ పరాత్మనే**
**నమః పరమతత్త్వాయ**
**పరానందాయ ధీమహి"**

"పరాత్పరమైనటువంటి బ్రహ్మ వస్తువు. దానికే నమస్కరించు, ఈ ప్రపంచంలో లభించే ఆనందానికి పరమై ఉండేటటువంటి ఒకానొక ఆనంద స్వరూపమయినటువంటి వస్తువు అది. పరమాత్మ దర్శనంచేత లభించే ఆనందానికి హేతువేదో, అది లోకాన్ని తరించిన తరువాత కలిగే ఆనందాన్నిచ్చేది. ఈ లోకంలో ఆనందదాయకమైన వస్తువులు అనేకం ఉన్నాయి. ఆ వస్తువులు లభిస్తే ఆనందం, లేకపోతే దుఃఖం కలుగుతాయి. లోకాన్ని తరించి వెళ్ళిన తరువాత పరమాత్మ వస్తువు యొక్క భావనచేత కలిగే శాశ్వతమైన, నిరంతరమైన ఆనందానికి అవధులు లేవు. నిరవధికమైన ఆనందం అది. ఒక నాటికి అది తరిగిపోయేది కాదు. పరమాత్మయొక్క సాన్నిధ్యంలో పొందినటువంటి ఆనందం నిరవధికంగా ఉంటుంది. ఏ వస్తువైనా ఆనందాన్ని కొంత కాలమే ఇస్తుంది.



నిరవధికమైన ఆనందాలు బ్రహ్మ వస్తువునందుంటాయి. దానికి సమస్కరించేటటువంటి మంత్రాన్నే కపిలుడు పుండరీక మహారాజుకు బోధించాడు. పుండరీకుడు ఆవిధంగా ధ్యానం చేసుకుంటూ కపిల మహర్షినే గురువుగా భావన చేసి అయననే ఈశ్వరుడిగా భావన చేసినందువలన, చిరకాలము ఆయన చేసిన తపస్సు ఫలించి విష్ణువు ప్రత్యక్షమై పుండరీక మహారాజుకు మోక్షాన్ని ప్రసాదించాడు.

మోక్ష సాధనకు సద్గురువును ఆశ్రయించాలనే మహర్షి సందేశం వలన ప్రజలలో అవగాహన కలిగించటం ముదావహము. మహర్షులు లోకోపరాకానికే వారి జీవితాన్ని అంకితం చేసారు.

* * *

# 20. పరాశర మహర్షి

నేటి కలియుగంలో భారతీయులు ఆచరించవలసిన స్మృతి 'పరాశరస్మృతి' అని నిర్ణయించారు. ఈ స్మృతికి ప్రధాన కారకుడు పరాశర మహర్షి. ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క స్మృతిని నిర్ణయించారు. ఎందుకని? మానవాళి శక్తి సామర్థ్యాలు, ఆలోచనలు, భావాలు అన్ని యుగాలలోనూ ఒకే విధంగా ఉండవు. శారీరక శక్తి, సామర్థ్యాలు ఉన్నా, ప్రజలకు మానసికబలం కూడా అత్యంత అవసరం. ధ్యాన శక్తి, యోగశక్తి, ఏకాగ్రతశక్తి, సంకల్పబలం, సామర్థ్యాలు గానీ ఉండాలి, మనస్సును ఒక అంశం మీద లగ్నం చేయాలి. అన్ని యుగాలలోను అందరి మనసులలోనూ ఒకే రకంగా ఉండవు. ప్రతి వ్యక్తికి ఆసక్తి, సాధన, ఏకాగ్రత తప్పనిసరిగా ఉండాలి. యుగాలనుబట్టి, వాటి స్వభావాలను అనుసరించి ఆచారాలు, వ్యవహారాలు, ధర్మాలు, నిర్ణయించబడ్డాయి. జీవన విధానంలో కొంత వైముఖ్యము, జ్ఞానాభివృద్ధి, వైరాగ్యము, జ్ఞానాభిలాష ఉన్నవారు ఎలా జీవిస్తే కలుగుతాయో ఆ విధంగా జీవించటం కోసమే ధర్మం. అటువంటి ధర్మాచరణ చేసే మానవులకు ఎప్పుడూ ఆశలే, బాధలే.

ధర్మాచరణ మనిషి పురోభివృద్ధికి, ఆరోగ్యానికి సన్మార్గం చూపేటటు వంటిది. యుగధర్మాలన్నీ మనుష్యుల మానసిక, శారీరక శక్తినిబట్టి ఏర్పడ్డాయి. దానినే నేడు యుగధర్మం అని చెబుతున్నారు. ఇది ఋషులు ఆ విధంగా నిర్ణయంచేసారు. కృతయుగంలో మనుధర్మశాస్త్రం, త్రేతాయుగంలో గౌతమధర్మశాస్త్రం, ద్వాపరయుగంలో శంఖలఖితులస్మృతి ధర్మమే అనుసరించారట. కలియుగంలో ధర్మాలు ఆచరించటానికి పరాశరస్మృతి నిర్ణయించబడింది. కలియుగానికి అనువైన కొన్ని నియమాలు చెప్పాడు. అందువలన ఈ కలికాలానికి ధర్మాశాస్త్ర కర్త పరాశర మహర్షి అని తెలుసుకోవాలి.



కలియుగంలో ప్రారంభంనుంచి రెండు లేక మూడు తరాలవారు ప్రతిభ, నైపుణ్యం,విద్య ఉన్నవారు ఉన్నారు. క్రమేపీ కలియుగ నడక పెరిగే కొద్దీ విపత్కర పరిస్థితులు, కష్టాలు, బాధలు, సమస్యలు అనేక రోగాలతో మానవాళి సతమతమవుతున్నారు. రెండు తరాలు బాగుంటే మూడోతరం బాగుంటుందో లేదో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. కలియుగం ప్రథమ పాదములోనే ఉన్నాం. అన్నీ ఉన్నా ఆస్తి పోగొట్టుకునే వారు, ఆస్తి ఉన్నా సద్గుణాలు, సలక్షణాలు పోగొట్టుకుంటున్నారు. గుణాలు పోతే ఆయుర్దాయం పోగొట్టుకుంటారు. ఇలా ఉన్నారు ప్రజలు. అల్పాయుష్కులు, అకాల మరణాలు జరుగుతున్నాయి. మానవసంబంధాలు, కుటుంబ సంబంధాలు కనుమరుగు అవుతున్నాయి. మానవాళి మధ్య హార్థిక సంబంధాలు కనుమరుగై, ఆర్థిక సంబంధాలు తాత్కాలిక సంబంధాలుగా కొనసాగుతున్నాయి. దీనికి కారణం మహర్షులు మానవాళికి అందించిన ధర్మాచరణమార్గంలో నడవకపోవటమే! అని విశ్లేషించుకోవాలి.

అల్పత్వం వల్ల, క్షుద్రత్వంవల్ల, మానవాళి తేజస్సు, ఓజస్సు, శక్తి, సామార్థ్యాలు పోగొట్టు కుంటారు. రెండు పాత తరాలు అయ్యేటప్పటికి, ప్రస్తుత తరం ధనదారిద్ర్యము, గుణ దారిద్ర్యము వీటిల్లో ఏదో ఒకటి వస్తుంది. ఈ రెండు ఉన్నా ఆరోగ్యదారిద్ర్యము. ఏదయితే నేం పోగొట్టు కోవాటానికి. మనస్సులు దురాశకుపోయి అక్రమంగా ధనార్జన చేసి, ఇదివరకు పెద్దలు కష్టపడి సంపాధించిన ఆస్తి, ప్రస్తుతం తను అక్రమంగా సంపాదించిన సంపద పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది.

వివేకంతో కూడిన లక్షణాలు ఉండాలి. ధర్మాచరణ ఉండాలి. ధైర్యస్థైర్యాలు ఉండాలి. ఐశ్వర్యం ఉండాలి. ఇవన్నీ వస్తాయి. "నేటియుగంలో మఠాధిపతులు, పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు, వేదపండితులు వారి ప్రవచనాలలో. "ధర్మో రక్షతి రక్షితః" అని సూచిస్తూంటారు. దర్మాన్ని రక్షించి, ఆచరిస్తే అదే మనలను రక్షిస్తుంది. అని ఋషుల సందేశం.

కలియుగ ధర్మానికి మూల పురుషుడు పరాశర మహర్షి. ఇంతకీ ఈయన ఎవరు? ఈయన మాతా పితరులు ఎవరు? వసిష్ట మహర్షి పెద్దకుమారుడు శక్తి. శక్తి భార్య అదృశ్యంతి. కొంత కాలానికి ఆమె గర్భంలో షడంగములతో వేదాన్ని పఠిస్తున్నాడట. హెచ్చుస్వరంతో అతిమధురంగా సాంగోపాంగంగా వేదం చక్కగా గర్భం లోపలనుంచి వినిపిస్తున్నది. ఆ వేదగానం వింటూంటే వసిష్టునికి ఆనందం కలిగింది.

శక్తి తపస్సుచేసుకుంటున్నాడు. కల్మాషపాదుడు అనే రాక్షసుడు విశ్వామిత్రుని అండతో తపస్సులోనున్న శక్తిని, వసిష్టుడి మిగిలిన కొడుకులను చంపేశాడు. పుత్రశోకంతో వసిష్ఠుడు, వైధవ్యంతో అదృశ్యంతి దుఃఖంలో మునిగి ఉన్నారు. ఆ సమయంలో వసిష్ఠుడు తన మనుమడు గర్భంలోనే వేదాధ్యయనం విని ఆనందించి, ఉపశమనం పొందాడు. "అమ్మా! శక్తీ, నీ కడుపులో ఉన్నవాడు అనేకమంది పండితులు, విద్వాంసులచేత పరమపూజ్యుడిగా భావించబడే గొప్పవాడవుతాడు. నిత్య వేదాధ్యయన తత్పరుడైన నా కుమారుడు అసామాన్యుడు, విద్యాంసుడు, జ్ఞాని, పరమసాత్త్వికుడు అతడి అంశంలో జన్మించేటువంటి ఈ శిశువు, నేటికి 12 సంవత్సరముల వయసు కలిగిన వాడమ్మా! అటువంటి వాడు నీ గర్భంలో ఉన్నాడు" అని వసిష్ఠుడు పలికాడు. ఆ శిశువే "పరాశరుడు"గా జన్మించాడు. పరాశరుడు గర్భంలో ఉన్న సమయంలోనే తండ్రి శక్తి నిర్వహించే హోమాలు, క్రతువులు, యజ్ఞాలు, వాటిలోని వేదఘోష వింటున్నాడు. అవి అన్నీ పరాశరుడికి శ్రవణానందముగా ఉన్నాయి. అంటే అతడి గర్భం నరకంకాదు. అతను వింటున్నదంతా తండ్రి వేదఘోష మాత్రమే. శక్తి చెప్పే వేద శాస్త్రం, ఉపనిషద్వాక్యాలు, యోగశాస్త్రాది విషయాలు - తన తల్లి, తండ్రి చర్చించు కుంటున్నవి అన్నీ విన్నాడు.

**ప్రతీకారం పనికిరాదు**

పరాశరుడికి జాతక కర్మాదులు చేసారు. దేదీప్యమానంగా పరాశరుడు పెరిగి పెద్దవాడైనాడు. అతనికి తండ్రి జ్ఞాపకానికి వచ్చాడు. వెంటనే తల్లి దగ్గరకు వెళ్ళి "అమ్మా! నాకు ఎప్పుడూ తాత వసిష్ఠుడే కనుపిస్తున్నాడు. మరి నా నాన్న కనుపించటంలేదు. నా తండ్రి ఎవరు? ఏమైనాడు" అని అడిగాడు. జరిగిన కథంతా కొడుక్కి చెప్పింది అదృశ్యంతి. ఆ కథంతా విని ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించాడు పరాశరుడు. "నా తపోబలంతో ఈ ప్రపంచాన్నంతా భస్మం చేస్తాను", అన్నాడు పరాశరుడు. నిజానికి పరాశరుడు యందు వసిష్ఠుడి తపోబలం, శక్తి తపోబలం, తన తపోబం అన్నీ ఉన్నాయి. తల్లి పాతివ్రత్య మహత్యం కూడా అతడికి సహకరించింది. వంశపారంపర్యంగా అతడియందు శక్తి దివ్యమై వెలుగుతోంది. ఆసమయంలో "ప్రపంచాన్ని భస్మీపటలం చేస్తాను" అని అనగానే, పంచభూతాలూ తల్లక్రిందులయినాయి. ఆయన సంకల్పానికి ప్రపంచం అల్లకల్లోలం అయిందట.

ఆ సమయంలో వసిష్టుడు తపస్సు చేసుకుంటున్నాడు. ఆయనకు క్రోధంరాలేదు. తన కొడుకును చంపితేనే ఆయనకు క్రోధం రాలేదు. శాంతం ఆయన సహజ లక్షణం. ప్రపంచం కల్లోలాలకు కారణం పరాశరుని తీవ్రమైన 'శపథమే' అని దివ్యదృష్టితో తెలుసుకున్నాడు. వెంటనే పరాశరుడి దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చాడు వసిష్ఠుడు. ఆయనను అనునయిస్తూ, బుజ్జగిస్తూ ఇలా సూచించాడు.

"నాయనా! పరాశరా! నీ ప్రతిజ్ఞ చాలా భయంకరమైనది. దీని వల్ల లోకంలో ఉపద్రవంవస్తుంది. పరాశరా! లోకాలను అనుగ్రహించి, నువ్వు కోపాన్ని ఉపసంహరించుకో! నీ తండ్రి పరమ పుణ్యాత్ముడే! పూజ్యుడే! కాని విధి ఒకటి ఉన్నది కదా! పుట్టిన ప్రతివాడూ, ఎదో విధంగా మరణించాలి. ఆయన మరణం ఆ విధంగా వ్రాసి ఉంది. మరణించాడు. పుట్టిన వారందరూ ఎప్పుడో ఒకప్పుడు, ఎదో ఒక కారణంతో మరణించకతప్పదు. ఎవరి చేతిలో మరణించినా, నీ వంటి సత్పుత్రుడు జన్మించటం వలన నీ తండ్రి శక్తి పుణ్యలోకాలకు వెళ్ళాడు. ఆయనకు పుణ్యం కలిగింది.

నేటి ప్రజలకు వసిష్ఠుడి సూచనలతో ఎంతో మానసిక ఓదార్పు కలుగుతుంది అనుటలో సందేహం లేదు. జరామరణములు విషయాలలో మహర్షుల సందేశాలతో మానవాళికి ఉపశమనం కలుగుతాయి.

**శాంతి స్వభావం**

పరాశరుడు వసిష్ఠుడితో "తాతా! తండ్రి మరణం వింటే నాకు క్రోధం వచ్చింది. నీ మాటవింటే శాతం పొందాను. రెండింటిలోనూ నాకు కర్తృత్వంలేదు. సహజంగా నా తండ్రి మరణం నా క్రోధానికి కారణమయితే శాంతానికి నువ్వు కారణమయినావు. అందువలన ఈ రెండిటికి నేను కర్తనుకాను "అన్నాడు". ఇక నేను ఈశ్వరుడిని గురించి తపస్సుచేస్తాను. నా తండ్రిని దర్శించుకుంటాను. ఈశ్వరానుగ్రహం పొందుతాను. "అని సంకల్పించి ఈశ్వరుని గురించి తపస్సు చేసాడు పరాశరుడు. ఆయన లక్ష్యం తండ్రిని దర్శించాలని. కొంత కాలానికి శివానుగ్రహం కలిగింది. తండ్రిని చూడాలని ఉందని శివుణ్ణి ప్రార్థించాడు. శివుడు ఆయనతో "అదేముంది! నీవు నిరభ్యంతరంగా స్వర్గలోకానికి వెళ్ళి నీ తండ్రిని చూడవచ్చు, ఎక్కడికైనా వెళ్ళ వచ్చు", అన్నాడు. ఆజ్ఞ అయింది. 14 భువనాలలో ఎక్కడికైనా వెళ్ళవచ్చు అని ఆదేశించాడు. ఆ తరువాత పరాశరుడు స్వర్గానికి వెళ్ళాడు. తండ్రి దర్శనం చేసుకున్నాడు. ఇక్కడ స్వర్గం అంటే ఉత్తమలోకం అని అర్థం. అక్కడ నుంచి ఇంటికి వచ్చి తల్లికి పాదాభివందనంచేశాడు. తాత గారైన వసిష్ఠ మహర్షిని చూచి నమస్కారం చేసాడు. జరిగిన సంగతి అంతా వివరించాడు. "మహాత్మా! నేను శివదర్శనం చేసుకున్నాను. ఆయన అనుగ్రహంతో నా తండ్రిని చూడగలిగాను. నా తండ్రి అక్కడ సుఖంగా ఉన్నాడు. దు:ఖంగానీ, అశాంతిగానీ ఆయనకు లేవు" అని తను పొందిన వరాలన్నింటిని గురించి ఆయనకు వివరించాడు. వసిష్ఠుడు పరాశరుడు సాదించిన విజయానికి చాలా సంతోషించాడు. తరువాత కొంత కాలానికి యమునా నది తీరంలో సత్యవతిని వివాహం చేసుకున్నాడు పరాశరుడు. ఈమె పూర్వ జన్మలో అచ్ఛోద అనే దేవకన్య. సత్యవతి సద్యోగర్భంలో వెంటనే వ్యాసుడు జన్మించాడు. పరాశరుడి తపోబలం ఆ పసివాని యందు ఉన్నది. వ్యాసుడు జన్మించింది 'కృష్ణ' అనే ద్వీపం కాబట్టి, ఆయనకు కృష్ణద్వైపాయనుడు అని పేరొచ్చిందని చెపుతున్నాయి ఇతిహాసాలు.



**సౌఖ్యం - ధర్మం**

ఒకసారి పరాశరమహర్షి వద్దకు జనక మహారాజు (రామాయణంలోని జనక మహారాజు కాదు) వెళ్ళి, మహర్షీ! ధర్మాన్ని తెలుసుకుందామని మీ దగ్గిరకు వచ్చాను. నాకు ధర్మాన్ని గురించి బోధించు "అని ప్రార్థించాడు. వెంటనే మహర్షి "ఫలం కావాలంటే వృక్షం కావాలి. వృక్షం కావాలంటే బీజం కావాలి, కదా! అలాగే సౌఖ్యం కోరుకునేవారు ధర్మాన్ని ఆశ్రయిస్తారు. ఎప్పుడో రాబోవు కాలంలో నాకు సుఖం కావాలంటే ఇప్పుడు ధర్మాచరణ చేయటమే కర్తవ్యం.

సత్కృత్యమైనా (మంచి కార్యమయినా) దుష్కృత్యాలైనా (చెడు కార్యాలైనా) ఆ పాపపుణ్యముల ఫలితాలను ఇవ్వకుండా మనుష్యులను వదిలిపెట్టవు. కాబట్టి మనసు, వాక్కు, దృష్టి వీటితోబాటు సత్యము, శమము, మొదలైన వాటితో కూడిన మంచి మార్గాన్ని ఆశ్రయించాలి. సమదర్శియై, న్యాయము, ధర్మములు ఆచరించేవారికి దేవతలు నమస్కరిస్తారు. మనిషి ఋణం నుంచి విముక్తుడు కావాలి. వేదాధ్యయనంచేత ఋషి ఋణం తీర్చుకుంటాడు. యజ్ఞయాగాదులచేత దేవతల ఋణం తీర్చుకుంటాడు. అతిథిపూజ చేసి ఆతిథ్యం ఇచ్చి, అతిథి ఋణం తీర్చుకుంటాడు. దానధర్మములు చేసి ప్రజలఋణం తీర్చుకుంటాడు. ఈ విదంగా మనిషి అన్ని ఋణాలు తీర్చుకొని పవిత్రుడవుతాడు. ఇదే ధర్మమార్గం. ఈ జీవితం అశాశ్వతమైనదని గుర్తుంచుకోవాలి సుమా! సుఖదుఃఖములు కలిగినప్పుడు కూడా ధర్మ విషయం మరచిపోకుండా ఉండటం శ్రేయస్సుకు మార్గం.

పైన మహర్షి చెప్పిన సద్విషయాలను విశ్లేషిస్తే ప్రతి మనిషి ధర్మాధర్మములు నిత్యం ఎదో ఒక సమయంలో తెలిసో, తెలియకో ఆచరిస్తాడు. ధర్మం ఆచరిస్తే శుభాలు కలుగుతాయి. అధర్మం ఆచరిస్తే దుఃఖాలు కలుగుతాయి. సుఖాలలో ఉన్నప్పుడు పొంగి పోగూడదు. దుఃఖాలను అనుభవిస్తున్నప్పుడు క్రుంగిపో కూడదు. మనిషి ఆచరించే కార్యాలను అనుసరించి సుఖదుఃఖాలు రెండూ ఎర్పడుతాయి. మనిషి జీవితం సుఖదుఃఖాల కలయిక. ఈ రెండింటినీ సమానంగా భావించాలని మహర్షుల వాక్కు, ధర్మం మాత్రమే శ్రేయోదాయకం. ఉదాహరణకు – సీతారాములు 14 సం॥ల అరణ్యవాసంలో కష్టాలు అనుభవించినా ధర్మాన్ని ఆచరించారు గదా! తర్వాత సుఖాలు అనుభవించారు. ఆ విధంగా ద్వాపరయుగంలో పంచపాండవులు, ద్రౌపది 12 సం॥ అరణ్యవాస సమయంలో, ఒక సంవత్సరం అజ్ఞాతవాస సమయంలో ఎన్నో కష్టాలు అనుభవించారు గదా! కష్టాలల్లోనూ వారు ధర్మాన్ని అనుసరించారు. వారంతా ధర్మాలను ఆచరించి తరువాత సుఖాలు అనుభవించారు. రాజ్యపాలన ధర్మపరిపాలనతో చేసి మెప్పుపొంది స్వర్గానికి వెళ్ళారు.

**తపస్సు – ప్రయోజనాలు**

"తపస్సు అంటే ఏమిటి? ఎలా ఉంటుంది? దానికి ఎందుకు అంత ప్రాముఖ్యత ఏర్పడింది?" అని జనకమహారాజు అడిగాడు. వెంటనే పరాశరుడు "మహారాజా! విద్యాధరులున్నారు. ఋషులున్నారు. దేవతా గణములు ఉన్నాయి. వాళ్ళంతా అటువంటి స్థితికి ఎట్లా వెళ్ళారు అనుకుంటున్నారు? తపస్సు చేతనే! తపస్సు ఉత్తమలోకాలకు మార్గం. తపస్సు వల్లనే బ్రహ్మకి సృష్టించే శక్తి వచ్చింది. ఐహికాముష్మికమయిన ఏకోరికనైనా తీర్చుకోవాలంటే తపస్సే కారణం. మరొక మార్గం లేదు. భార్యా, పుత్రులు, సంసారము, ధనము, దుఃఖము – వీటిలో పడి సతమతమైన వారికి కూడా, ఈ సంఘాన్ని తప్పించుకునేందుకు, చిత్తము పరిశుద్ధత పొంది శాంతి కావాలనుకునే వారికి కూడా తపస్సే మార్గం. తపస్సు పై దృష్టి లేని వాడిని లోభ మోహాలు వశం



చేసుకుంటాయి. తపస్సులో నిమగ్నమైన వారిని లోభము, మోహము, కామము ఏమి చెయ్యవు. చతుర్విధపురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షములు అన్నిటికీ ప్రారంభంనుంచి చివరిదాకా ఉండే మార్గం, గమ్యస్థానం, ఉపాయం అంతా కూడా తపస్సే. యోగులు, మహర్షులు, పరమపుణ్య పురుషులు మొదలైన వాళ్ళు ప్రాముఖ్యతను సంతరించుకొని అంత వారైనారంటే తపస్సే కారణం. ఇది అందరూ తెలుసుకోవాలి. వారి చరిత్రలు, లోకోపకారం, తెలుసుంటేచాలు. మహర్షుల చరిత్రలు చదివినా, విన్నా మనుషులు పుణ్యాన్ని పొందవచ్చు. మహర్షులు గూడ భగవత్స్వరూపులుగా ఆశీర్వదించి, అనుగ్రహిస్తారు. నేటికీ కొంతమంది శక్తి వంతమైన మహర్షులు ఆకాశంలో నక్షత్రాలరూపంలో వెలుగునిస్తూంటారు. మరికొందరూ హిమాలయాలల్లో, మానస సరోవర ప్రాంతాల్లో తపస్సులో ఉన్నారని శాస్త్రాలు చెబుతున్నాయి.

తపస్సు ఆచరించే వారికి కోరికలులేవు. దుఃఖంలేదు. వారంతా పరమశాంత చిత్తులు. మానసికమైన ఎట్టి వికారములు, రుగ్మతలు లేవు. సృష్టిలోనూ, దేనియందూ సంగ బుద్ధివారికి లేదు. వారిని ఆశ్రయించిన వారికి శాంతి, అనుగ్రహము ప్రసాదించ కలిగిన శక్తి వారికి తపస్సు వల్లనే వచ్చింది. వారిని చూస్తే తపస్సుయొక్క శక్తి అర్థమవుతుంది.

తపఃశక్తి సంపన్నులయిన మహర్షులను కలిసినపుడు, మనుష్యులు వినయం, విధేయత, వాత్సల్యం, కట్టు, బొట్టు. జుట్టు సంప్రదాయ పద్ధతిలో నమస్కరించి వారి ఆశీస్సులు పొందాలి. వారితో సంభాషించునపుడు ఏకాగ్రతతో దృష్టిసారించి వినాలి, ఆచరించాలి. మహర్షులు మాట్లాడు సమయంలో నిశ్శబ్దంగా, మౌనం పాటించాలి. వెకిలిచేష్టలు చేస్తే మనం మహర్షుల కోపాగ్నికి గురికావలసి వస్తుంది. శాపమూ తగలవచ్చు. ఉదా కౌరవులు, పంచపాండవులు రాజ్యం కోసం పట్టుదలతో ఉన్నారు. పాండవులు మాత్రం అయిదుగురికి అయిదు ఊళ్ళు ఇవ్వండి. మా బతుకులు మేము పోషించుకుంటాము అన్నారు. పాండవులకు ఆశ మాత్రమే ఉంది, కాని

దురాశలేదు. కౌరవులకు దురాశతో పాటు రాజ్యకాంక్ష, పదవీకాంక్షతో దుష్టసంబంధాలు పెంచుకున్నారు. ఎందరో రాయబారాలు నిర్వహించి కౌరవులను ఒప్పించాలని చూచారు. పాండవుల రాజ్యభాగం వారికి ఇవ్వమని దుర్యోధనునికి హితవు పలికారు. కాని దుర్యోధనుడు ససేమిరా అన్నాడు. తను రాజ్యానికి రారాజు అని అన్నాడు. యుద్ధం అనివార్యమైంది. చివరిప్రయత్నంగా మైత్రేయ మహర్షి విదురునితో కలిసి ధృతరాష్ట్రుడిని కలిసి యుద్ధం మానుకోమని, రెండు కుటుంబాలు సఖ్యతతో, ఐక్యతతో పరిష్కరించుకోండి. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం నివారించండి. వంశ గౌరవాన్ని, కుటుంబ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని యుద్ధం మానుకోండి.

"ధృతరాష్ట్రా! నీ కొడుకును సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత నీదికదా! తమ్ముడు పాండురాజు కొడుకులను పెంచావు. నీ కొడుకులుగా భావించి వారికి ఇవ్వవలిసిన రాజ్యాన్ని వారికివ్వవలసింది" అని హితవు పలికాడు మైత్రేయ మహర్షి. ఈ సమావేశంలో ధృతరాష్ట్రుడు, దుర్యోధనుడు, విదురుడు, మైత్రేయ మహర్షి మాత్రమే ఉన్నారు. ఆ సమావేశంలో మహర్షి హితవాక్యాలు, పాండవుల సమర్థత, బలపరాక్రమాలు చెబుతూ ఉన్నాడు. ఆ సమయంలో దుర్యోధనుడి ముఖ కవళికలు, హావభావాలు (శారీరకభాష) ఎలా ఉన్నాయి? ఒక సారి గమనించండి. మైత్రేయ మహర్షి మంచి మాటలు నచ్చక దుర్యోధనుడు "కళ్ళు ఎర్రచేసి మైత్రేయుని కోపంగా చూస్తూ పళ్ళు పట, పట కొరుకుతూ, మీసాలు దువ్వుతూ, గదచేతితో త్రిప్పుతూ, కుడికాలు నేల మీద రాస్తూ" ప్రవర్తించాడు. అది చూచిన మైత్రేయునికి కోపం పెరిగి "చూచావా! ధృతరాష్ట్రా! నీకుమారుని నడవడి, తీరు, ప్రవర్తన ఇలా ఇంది. పెద్దవారు, మహర్షుల ముందు ఎలా ఉండాలో తెలిసిగూడా వారితో అసభ్యంగా, తిరస్కారభావంతో, చీత్కారంగా చెష్టలు ఉన్నాయి", అని మైత్రేయుడు "యుద్ధం అనివార్యం అవుతుంది", ఆయుద్ధంలో దుర్యోధనుని తొడలు విరగగొట్టబడి మరణిస్తాడు" అని శపించాడు. వెంటనే ధృతరాష్ట్రుడు "మహర్షి కాళ్ళపైబడి



"అంత మాట అనకండి మహర్షి, నాకు పుత్రశోకం కలిగించకండి" అని ప్రార్థించాడు. కాని మహర్షి శాపం కొంత సవరించి "నేను చెప్పినట్లు నీకుమారుడు దుర్యోధనుడు సఖ్యత చేసుకుని పాండవుల రాజ్యం వారి అప్పగిస్తే నా శాపం తగలదు. లేనిచో యుద్ధం అనివార్యమైతే మాత్రం నా శాపం నెరవేరుతుంది" అని చెప్పి మైత్రేయ మహర్షి అక్కడినుంచి నిష్క్రమించాడు. గురు దిక్కారం గురు దూషణ మహాపాపం అని మానవాళి గ్రహించాలి.

అందువలన పెద్దలు, మహర్షులు, పీఠాదిపతులు, మఠాధిపతులు వేద పండితులు, శాస్త్రపండితులు మొదలైన వారి ఎడల ఎలా ప్రవర్తించాలి. వారి అనుగ్రహం సంపాదించాలి అనే భావన ప్రతి మనిషిలో అంకురించాలి. మానవాళికి, మహర్షుల ద్వారా ఎన్నో సత్సందేశాలు అందాయి. అవి అందరికి ఆచరణీయం, అనుసరణీయం.

**తపస్సు - ఆయుర్దాయం**

భద్రసేనుడనే రాజు కాశ్మీర దేశాన్ని పరిపాలిస్తున్నాడు. ఆయనకు ఒక కుమారుడు సుధర్ముడనేవాడు ఉన్నాడు. ఆయన మంత్రికి ధారకుడనే కొడుకు ఉన్నాడు. సుధర్ముడు, ధారకుడనే వాడు ఇద్దరు మంచి స్నేహితులు. వీరిద్దరూ సత్సంబంధాలు పెంచుకొని ఆధ్యాత్మిక తత్వాన్ని పెంచుకున్నారు. వీరు శివభక్తి పరాయణులు. ఎల్లప్పుడూ విభూతి, రుద్రాక్షలు ధరించి శివనామ స్మరణ చేసుకునేవాళ్ళు. బంగారు నగలు, విలువైన దుస్తులు మీద వీరికి ఇష్టత లేదు. అవి వాళ్ళకు రుచించేవికావట. రాజు, మంత్రి కుమారులైనా చాలా సాధారణ మనుషులుగా ప్రవర్తిస్తూ సంచరించేవారు.

ఆ రాజు దగ్గరికి పరాశరమహర్షి వచ్చాడు. భద్రసేనుడు మహర్షి పాదాలపైబడి సాష్టాంగ నమస్కారం చేసి "మహాత్మా! నా కొడుకు, మంత్రి కొడుకు ఇలా ఉన్నారు. ప్రవృత్తి మార్గంలో వారిద్దరిని ప్రవేశపెట్టాలని నా కోరిక, వాళ్ళు శివభక్తిని వదలటం లేదు. నేను చెప్పిన మాట వినటంలేదు" అని అన్నాడు.

పరాశరమహర్షి ఆ రాజుతో "వాళ్ళకు అడ్డు తగలవద్దు. అసలు వారికి ఆయుర్దాయమే లేదు. వాళ్ళు కారణ జన్ములు. వాళ్ళు భ్రష్టయోగులు. శివ భక్తులు వాళ్ళు నిత్యం రుద్రసూక్త జపం చేత తరిస్తారు. నేను వాళ్ళకు ఆ జపం ఉపదేశం చేస్తాను" అని వాళ్ళ పూర్వ జన్మ వృత్తాంతాన్ని ఆరాజుకు వివరించాడు. వారిద్దరి యందు ఉన్న పుత్ర వాత్సల్యాన్ని మనసులోంచి తీసి వేశాడు. తద్వారా వాళ్లకు ఉపదేశం చేసి "వాళ్ళు ప్రవృత్తి మార్గంలో అసలు లేకుండా, తపో మార్గంలో ఉండేటట్లయితే వాళ్ళకు మరికొంత కాలం మనుగడ ఉంటుంది. అందువలన వారు తపో మార్గంలో ఉండేటట్లు చూడు" అని రాజుకు సూచించాడు. వాళ్ళ తపస్సు ఫలించేవరకు వాళ్ళకు ఆయుర్దాయం ఇచ్చాడు. శివదర్శనం అయ్యే వరకు జీవించమని వారిద్దరిని ఆశీర్వదించి పరాశరుడు అక్కడనుంచి వెళ్ళాడు.

తపస్సులో నిమగ్నమైన వారికి వారు అనుకున్న లక్ష్యం నెరవేరేంతవరకు వారికి ఆయుర్దాయం ఉంటుందని తెలుసుకోవాలి. అల్పాయుష్షు ఉన్న వారికి గూడ అయుర్దాయం పెరుగుతుదని మార్కండేయ మహర్షి వృత్తాంతం సూచిస్తోంది గదా!

## పరాశరస్మృతి - కలియుగధర్మం

ఒకసారి వ్యాసమహర్షి వద్దకు అనేక మంది ఋషులు వచ్చారు. "మహర్షీ రాబోయేది కలియుగం ఆ కలియుగంలో ఆచరించటానికి అనువైన ధర్మ స్వరూపము ఎలా ఉంటుంది. దాని నిజరూపము ఎమిటి? ఆ ధర్మం ఉపదేశించండి" అని అడిగారు. వెంటనే వ్యాస మహర్షి "అది రాబోయే యుగం. అది ఎలా ఉంటుందో నాకు తెలియదు. నా తండ్రి పరాశర మహర్షి బదరికాశ్రమంలో తపస్సులో నిమగ్నమైనాడు. మనం అక్కడికి వెళుదాం" అని చెప్పి పరాశరమహర్షి దగ్గరకు అందరూ వెళ్ళారు. అన్ని వర్ణాల వారికి సకల ధర్మాలను బోధించాడు పరాశరుడు. అదే 'పరాశర స్మృతి' అనే పేరుతో



కలియుగ ధర్మ శాస్త్రమయింది. పరాశర స్మృతి పరమ పవిత్రగ్రంథం. మనం ప్రస్తుతయుగంలో అనుసరించవలసినది ఇదేకాని, మనుస్మృతి కాదు. మనుస్మృతి కృతయుగానిది.

కృత, త్రేత, ద్వాపర యుగాలకు వేరు వేరు స్మృతులు ఉన్నాయి. నేడు మనకు మనుస్మృతి అని ఒకటి అందుబాటులో ఉన్నది. దీనిలో ఉన్నవి యదార్ధ విషయములుకావు. ఎందుచేతనంటే పూర్వపు మనుస్మృతి ఇప్పుడు అందుబాటులో లేదు. కృతయుగానికి సంబంధించిన మనుస్మృతి అసలు స్వయంగానే గ్రంథం చాలా మటుకు కనుమరుగైంది. జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, గౌతమస్మృతి, పరాశరస్మృతి, శంఖలిఖితస్మృతి, సామాన్య మానవ ధర్మాలను అన్నిటిని వివరించింది. కాబట్టి దానిని కృతయుగ స్మృతి అని బావించ వచ్చు.

చేసిన అధర్మానికి తన శిక్ష తానే ఎన్నుకునే బోధ 'శంఖలిఖిత స్మృతిలోని సూత్రం చెప్పబడింది. ఎలాగైనా చేసిన అధర్మానికి తాను శిక్ష అనుభవించటమే ఉత్తముల లక్షణం అని మాత్రమే దీని అర్థం. మనం తప్పు చేసామని తెలిసిన వెంటనే తనే రాజు వద్దకు వెళ్ళి 'తప్పుచేసాను, తగిన శిక్ష విదించండి' అని రాజును ప్రార్థించటం ధర్మవేత్తల సలక్షణం. ఇది ఆనాటి మాట. అయినా నేటికీ అది అనుసరణీయమే. ప్రస్తుతం మనం వింటున్నాం "తప్పు చేసిన వారు ఆత్మ విమర్శ చేసుకుని పోలీస్ కార్యాలయానికి వెళ్ళి నేను ఫలానా తప్పు చేసాను, నేను మీ ఎదుట లొంగిపోవటానికి వచ్చాను" అని నేరస్థులు వెళుతూంటారు. ఇటువంటి పరిస్థితులలో లొంగిపోయిన వాడికి శిక్ష తక్కువగా ఉంటుందట. కొంత వెసులు బాటు కల్పించాయి చట్టాలు.

## పరాశరుడు - ఆత్మగురువు

పరాశర మహర్షి - మైత్రేయ మహర్షి మధ్య ఒక అపురూప రహస్యముంది. అది ఏమిటంటే - మైత్రేయ మహర్షి పరాశరుడి దగ్గరకు

వెళ్ళి అతడిని తన ఆత్మగురువుగా ఎన్నుకున్నాడు. మైత్రేయుడు ఎప్పుడూ 12 సం॥ బాలుడుగానే ఉంటాడట. పుట్టినప్పుడూ, ఇప్పుడూ అంతే.

మైత్రేయుడు సనాతనుడని, సనకసనందనాదుల వలె శాశ్వతంగా ఉంటాడనీ ఆయనను స్తుతించాడు. ఆయన పరాశరమహర్షి వద్దకు వెళ్ళి, "నాకు నీవు ఆత్మగురువుగా ఉండాలని నేను నిర్ణయించాను. నాకు ఆత్మబోధ చేయవలసింది" అని అడిగాడు. ఆయన అభ్యర్థనకు అంగీకరించి పరాశరుడు వేదవేదాంగములు, ధర్మశాస్త్రములన్నీ కూడా పరాశరుడు చెప్పిన తరువాత మైత్రేయుడు ఆయనను ఆశ్రయించి పరాశరుని ఆశ్రమంలో ఉన్నాడు. ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు. ఎక్కడికి వెళ్ళడు. ఆయనకు ఏ కోరిక లేదు. ఏం చేయాలో ఆయనకే తెలియదు. ఒక శుభ సమయాన గురు శుశ్రూష చేస్తూ మైత్రేయ మహర్షి, "నీదయతో నాకు సకల శాస్త్ర విద్యలూ తెలిసాయి. నీకంటే ఉత్తమ శ్లోకులు నాకు ఈ లోకంలో, భూమి పై కనబడలేదు. నేను నిన్ను అడిగి కొన్ని సందేహాలు నివృత్తి చేసుకోవాలని ఉన్నది. ఇంతకు ముందు నేను నేర్చిన వేదశాస్త్రములన్నీ చెప్పినప్పటికీ, సందేహం అనేది అందులో తీరదు. అది గురు ముఖంగానే అడిగి తెలుసుకొనాలి" అన్నాడు.

"సమస్త లోకాలకీ మూలము ఎవ్వరు? ఇంద్రాదులకు అందరికీ ప్రభువంటూ ఒకడు ఉన్నాడా? అతడు ఎవ్వరు? వేదాలు ఏ దేవత నుంచి ఆవిర్భవించాయి? విజ్ఞానాన్ని ఇవ్వగలిగిన ఈశ్వరుడంటూ ఒక దేవత ఉన్నాడా? అసలు విజ్ఞానానికి మూలకారకుడు ఎవ్వరు? పృథి వ్యాది పంచభూతాలు, సప్తసాగరాలు, సప్తద్వీపాలు, సప్తకులపర్వతాలు, సప్తాశ్వప్రముఖ గ్రహతారకా సంచారములు, చతుర్యుగ ప్రమాణములు, కల్పాకల్ప విభాగములు, యుగధర్మములు, దేవర్షి చరిత్రలు, రాజవంశాను కీర్తనలు, వేదశాఖ ప్రమాణములు, బ్రాహ్మణాది వర్ణధర్మములు, బ్రహ్మచర్యాది చతురాశ్రమక్రమములు, మొదలైన విషయాలు వివరించవలసింది" అని పరాశరుణ్ణి అడిగాడు మైత్రేయ మహర్షి.



"నీ సందేహాల రూపంలోని ప్రశ్నలన్నిటికీ సమాధానం పూరాణ రూపంలో వినిపిస్తాను. అందులోని ధర్మాలు నువ్వు సూక్ష్మంగా తెలుసుకో" అని పరాశరుడు చెప్పాడు. "శాశ్వతుడు, నిత్యుడు అయిన శ్రీ మహావిష్ణువు తత్త్వాన్ని వివరించాడు ఇదంతా జగద్విషయం. "ప్రస్తుతం నీకు చెప్పిన సందేహాలకు ఇచ్చిన సమాధానాలు అన్నీ స్వయంగా వ్రాయి. ఈ దేవత లందరూ విష్ణుమయులు. విష్ణువు ఆధీనంలో ఉన్న వాళ్ళు. దేవతలందరకీ ఆయనే రక్షకుడు. అతడే విశ్వగురువు. సర్వమూ విష్ణుమయమే.

విష్ణు తత్త్వాన్ని, విష్ణువు మహిమలు, విష్ణు చరిత్ర, విష్ణు మాయలు తెలుసుకోవాలను కున్నవారు "విష్ణుపురాణం" పరిశీలించాలి. అంతే కాకుండా నేటి తరం భారతీయులు విష్ణువు గురించి తెలుసుకోవాలనుకున్న వారు, ప్రహ్లాద చరిత్ర, అంబరీషోపాఖ్యానము, అజామీళుడిచరిత్ర మొ॥ గ్రంథాలు చదివి తెలుసుకోవాలి. మైత్రేయ మహర్షి సందేహాలకు సమాధానాలు అన్నీ భారతీయ సనాతన చరిత్రలో భాగమే ప్రస్తుతతరం, భావితరంవారు తెలుసుకోదగ్గ విషయాలు ఎన్నో ఉన్నాయి.

తన ధర్మశాస్త్రముతో కలియుగ ప్రజలను ఉద్ధరించిన పరాశరమహర్షి ప్రాతః స్మరణీయుడు, చిరస్మరణీయుడు.

* * *

## 21. అంగిరస మహర్షి

బ్రహ్మదేవుడు తనకు సృష్టికార్యములో సహాయపడతారనే ఉద్దేశ్యంతో కొంత మంది మానసపుత్రులకు జన్మనిచ్చాడు. వాళ్ళంతా సంతానవంతులయి ఆయన లక్ష్యాన్ని నెరవేర్చారు. ఆయన తన కోరిక ప్రకారం తన బుద్ధిలోంచి ఒక పుత్రుణ్ణి ప్రసాదించాడు. అతని పేరే అంగిరసుడు. అంగీరసుడు పుట్టిన తరువాత అతనికి ముల్లోకాలను ఏకకాలమందు ప్రసరింప చేసే బ్రహ్మాండమయిన తేజస్సును బ్రహ్మ అనుగ్రహించాడు, ఆశీర్వదించాడు. ఇంకా, వివాహం చేసుకుని సంతానానికి జన్మనివ్వమని కూడా అంగీరసునికి చెప్పాడు. లోక క్షేమం, లోకరక్షణకోసం తపస్సు ఆచరించమని సలహా ఇచ్చాడు. బ్రహ్మ మహర్షులందరినీ సంతానాన్ని కని ప్రజలను వృద్ధి పొందించమని ఉపదేశించాడు. ప్రజలు పుణ్యంచేసుకుంటే లోకక్షేమం కలుగుతుందని సూచించాడు. తపస్సు చేసి లోక క్షేమం కోసం ధారపోయటమనే సంప్రదాయం ఆయుగంలో ఉంది.

బావిభారత ప్రజలు సత్సంతానం సద్గుణాలు పుణికిపుచ్చుకున్నవారుగా లోకంలో ఉండాలనేదే ఋషుల ఆకాంక్ష. మానవాళి క్షేమం కోసం అంగిరసుని తపస్సు చేయమని సలహా ఇచ్చాడు బ్రహ్మ. కొంత మంది మానసపుత్రులను సంసారంలోకి ప్రవేశించమని హితవు పలికాడు. మరికొందరిని, ముక్తి మార్గంలోకి ప్రవేశిస్తామంటే నిరోధించాడు. నీవు నా దయకు పాత్రుడివై నేనెప్పుడు స్మరిస్తే అప్పుడు నా దగ్గరకు వచ్చి నేను చెప్పే కార్యాన్ని నిర్వహించటమే నీ ఉద్యోగం. లోక క్షేమమే నీ కర్తవ్యం, బాధ్యత. "లోకానికి క్షేమమనే కార్యము కొరకు, నేను ఏది చెబితే ఆ పని చెయ్యి", అన్నాడు. ఇంకా మరో మాటగూడ అన్నాడు బ్రహ్మ. "లోక క్షేమంకోసం నేను ఆదేశించిన సమయానికి నీవు వివాహితుడవై సంసారంలో ప్రవేశించు" అని కూడా ఆదేశించాడు. వెంటనే అంగిరసుడు బ్రహ్మకు సానుకూలమైన, అంగీకార యోగ్యమైన మాట పలికాడు. అంగిరసుడు ఆయనతో "నా జన్మకు కారణంమైన నువ్వు నేను ఏది సాధించటానికి సృష్టించావో, ఏ పని నియోగించావో ఆ పనిని నేను చక్కగా నిర్వర్తిస్తాను. నీవు సర్వాధికారివి. నీకు నేను విధేయుణ్ణి అన్నాడు.

### తపశ్శక్తి - ఫలితాలు

అంగిరసుడు ఇంద్రియములను నిగ్రహించి సర్వోత్తమమైన తపోనిష్ఠలో నిమగ్నమై, చాల సంవత్సరములు తపస్సు చేసాడు. సర్వైశ్వర్యప్రదుడు అయిన ఈశ్వరుడి వలె గొప్పగా ప్రకాశించాడు అంగిరసుడు. దివ్య తేజస్సుతో జన్మించిన అగిరసుడు, తపస్సుచేత మరింత దేదీప్యమానంగా ప్రకాశించాడు. అనేక శక్తులు, లోకములు, అనేక విభూతులు, ఐశ్వర్యములు ఆయన వశమయినవి. తపస్సులో ఉన్నవాటిని ఆయన చూడలేదు. తపస్సును విరమించ లేదు. ఏమాత్రము గర్వము అంగిరసుడిలో లేదు. అంగిరస మహర్షి అనేక వేద మంత్రములకు పండితుడైనాడు. ఆయన ముఖంలోంచి వచ్చిన అపారమైన విజ్ఞానాన్ని లోకాలు స్వీకరించాయి.

### అంగిరసుడి వివాహం

కర్దమప్రజాపతి సర్వస్వతీ నదీ తీరంలో తపస్సు చేసి విష్ణుమూర్తి అనుగ్రహంతో తొమ్మిది మంది కుమార్తెలకు జన్మనిచ్చాడు. వారందరినీ యోగ్యులైన మహర్షులకిచ్చి వివాహంచేయాలని నిశ్చయించాడు. ఆ తొమ్మిదిమంది కుమార్తెలలో ఒకరైన 'శక్తి' అనే పేరు గల కుమార్తెను అంగిరసమహర్షి కిచ్చి వివాహంచేసాడు. సమస్త దేవతలు వారిని ఆశీర్వదించారు. శక్తి, అంగిరసులు గృహస్థ జీవనంలో ప్రవేశించారు. వీరిద్దరూ గృహస్థ జీవనాన్ని తపస్సుగా భావించారు. ఆ యుగంలో మహర్షుల కుమార్తెలు, కొడుకులను వేరొక మహర్షుల సంతానంతో వివాహలు నిర్వహించి ఇచ్చి పుచ్చుకొనేవారు. ఆ విధంగా వివాహాలు నిర్వహించటం ఆనాటి సంప్రదాయం.

శ్రద్ధ, అంగిరసుడి సంసార యాత్ర మోక్ష లక్ష్మిని చేరుకోవటానికి ప్రయాణమేకానీ, భౌతిక మయిన లాలసతో నిండిన యాత్ర మాత్రం కాదు. వీరు లోభాలకు అతీతులై, నియమంతో, నిగ్రహంతో, తపస్సుతో సంసారయాత్ర చేసారు. విశ్వమంతా పరమేశ్వర తత్త్వమై కనుపడింది వారికి. వారు చేసే ప్రతికార్యాన్ని ఇంద్రియాలను ఈశ్వరమయంగా చూచారు. ప్రశాంత మనస్కులై గృహస్థ జీవనాన్ని సాక్షీగా, భగవత్సేవగా భావించారు.

## సత్సంతానం - బ్రహ్మ సందేశం

బ్రహ్మ ఆదేశించిన విదంగా శక్తి, అంగిరసుల దంపతులు ఏడుగురు కొడుకులు, ఏడుగురు కుమార్తెలకు జన్మనిచ్చారు. మళ్ళీ వీరందరికీ కొడుకులు, కొడుకులకు మనుమలు, మనుమలకు కొడుకులు అలా వాళ్ళ సంతానం అభివృద్ధి చెందింది. వీళ్ళందరిని అంగిరసులు అంటారు. ఆనాడు పుత్రులు లేకుండా ఋషులు ఉండేవారు కారు. ఎంత ఎక్కువ సంతానం ఉంటే అంతగా ఆనందించేవారు. అంగిరస మహర్షి పేరుతో గోత్రం ఉంది. ఈ అంగిరసుడు ఋషిగా ఉన్న గోత్రాలు చాలా ఉన్నాయి. సప్తాఋషేయంలో ఉన్నాడు. దశ ఋషేయంలోనూ ఉన్నాడు. గోత్రంలోని ఋషుల్లో అంగిరసమహర్షి ఉంటే వివాహము చేయవచ్చు అని అంటారు. రెండు గోత్రాలను చూచి వివాహం చేసుకునేటప్పుడు, అంగిరసుడు రెండు గోత్రాలలోనూ ఋషిగా ఉన్నను దోషం లేదు. తప్పులేదు. వివాహంచేసుకోవచ్చు. గోత్ర వంశస్థులకు మూలపురుషుడు అంగిరస, అయాస్య, గౌత మస గోత్రములో, (ముగ్గురు ఋషులు – అంగిరస, అయాస్య, గౌతమ) భరద్వాజస గోత్రంలోనూ త్రయాఋషేయంలోను అంగిరసమహర్షి ఉన్నాడు. (అంగిరస, బార్హస్పత్యస్య, భరద్వాజస) ఈనాటికీ హరితసగోత్రం, లోనూ అంగిరసుడు ఉన్నాడు. (అంగిరస, అంబరీష, యవనాస్వ) గౌతమస గోత్రం, వారందరూ అంగిరసుడి పరంపరలోని వారే అని తెలుసుకోవాలి.



## పుత్రశోకం - మహర్షి ఓదార్పు

చిత్రసేన మహారాజు శూరసేన దేశంలో సక్రమంగా పరిపాలన చేస్తున్నాడు. ఆయనకు ఉన్న ఐశ్వర్యానికి అంతులేదు. గొప్పకీర్తి కలవాడు. వైభవము, ప్రతాపము, రూపము, యౌవనము ఉన్నవాడు. దిగ్విజయం చేసిన వాడు. పరమధార్మికుడు. ఇన్ని ఉన్నా ఆ రాజుకు సంతానము లేదు. అంగిరసుడు ఆయన ఇంటికి వచ్చి “ఎందుకు రాజా! నాయనా! దుఃఖముగా ఉన్నావు?” అని ప్రశ్నించాడు. వెంటనే రాజు ఆయనతో, “తమకు తెలియనిది ఏముంది మహర్షీ? నాకు సంతానం లేదు కదా! ఈ వైభవం, భోగభాగ్యాలు ఎవరు భవిష్యత్తులో అనుభవిస్తారు” అని బాధను వ్యక్తపరచాడు. అంగిరస మహర్షి ఆ చిత్రసేన మహారాజు చేత పుత్రకామేష్టి యాగంచేయించి, అతనికి పుత్రుడు జన్మించేటట్లు ఆశీర్వదించి వెళ్ళాడు. ఆరాజుకి సత్పుత్రుడు జన్మించాడు.

ఆరాజు పెద్ద భార్యవలన పుత్రుడు, జన్మించటం వలన, ఆ భార్యపై ఆయనకు అమితమైన ప్రేమ, గౌరవం, ఎక్కువ మోహము, ఆ కొడుకుపైన అమితమైన వాత్సల్యం కలిగాయి. ఆరాజుకు ఉన్న ఇతరభార్యలు పెద్దభార్యకు సవతులు ఉన్నారు. ఆ సవతులకు పుత్ర సంతానం లేక పోవటం వలన వారికి ఈర్ష్య, అసూయ, ద్వేషము పెరిగి, ఆ పిల్లవానికి విషమిచ్చి చంపివేశారు. చిత్రసేన మహారాజు, పిల్లవాడి తల్లి హృదయాలు (తల్లి పేరు – కృతద్యుతి) తల్లడిల్లిపోయాయి. వారి దుఃఖానికి అంతులేదు. వారిద్దరి బాధ, దుఃఖము వర్ణనాతీతము. ఈ దుఃఖవార్త విని వారు పెద్దగా విలపించారు.

ఈ దుఃఖ వార్త తెలిసిన వెంటనే అంగిరస మహర్షి రాజును కలిసి, ఓదార్చి, అనునయమాటలు మాట్లాడి తత్త్వ బోధ చేసాడు. ఆ మహర్షి వెంబడి నారదుడు కూడా వచ్చాడు. “ఎవరు నీ కొడుకు అనుకుంటున్నావు? నువ్వెవ్వరివి? ఈ పుత్ర దర్శనాకాంక్షచేత నీకు ఈ జన్మలో భాగ్యం కలిగింది. పుత్రుడు కావాలన్నావు. జన్మనిచ్చావు. అతడిని చూచావు. సంతోషించావు.

నీ పెద్దలు తరించారు. ఇంక నీవు మోహాన్ని వదిలిపెట్టు. నీవు పండితుడివి. రాజ్యపాలన చేస్తూన్నావు. నీకు ఎక్కువ చెప్పవలసిన అవసరం లేదు" అన్నాడు అంగిరసుడు.

## రాజుకు జ్ఞానోదయం

శోకతప్త హృదయంతో ఉన్న రాజు అంగిరసమహర్షిని గుర్తించలేదు. అయోమయంలో "మహాత్మా! నీవు ఎవరు?" అని ప్రశ్నించాడు. వెంటనే అంగిరసుడు రాజుతో "నీ చేత పుత్రకామేష్టియాగం చేయించి నీకు పుత్రుణ్ని ప్రసాదించిన వాడిని నేను. నా పేరు అంగిరసుడు. నీకు జ్ఞానోపదేశం చేయటానికి వచ్చాను", అన్నాడు. వెంటనే రాజు దుఃఖోపశమనం కలిగి, జ్ఞానబోధ చేత జ్ఞానోదయం కలిగింది. మానసిక మార్పు తీసికొచ్చి జ్ఞానోదయం అయింది రాజుకు మరియు ప్రశాంత మనస్కుడైనాడు. అప్పుడు అంగిరసుడు నారదుడిని ప్రార్థించాడు. విషంతో మరణించిన రాజకుమారుడు నారదుడి ద్వారా పునరుజ్జీవితుడయినాడు. తక్షణమే రాజుకు వైరాగ్యంకలిగి విరాగియై తపస్సుకు వెళ్ళాడు. అంగిరసుడి ప్రతిభ పాటవాలు ఈ సంఘటన వలన తెలుస్తుంది.

పుత్రులు ఉన్న వారికి, పుత్రులు మరణించిన వారికి అంగిరసుడి జ్ఞానబోధ ఒక సందేశంగా నిలుస్తుంది. మానవ జీవితంలో ఇటువంటి సంఘటనలు ఒక భాగమే.

## తీర్థ మహిమలు

భరత వర్షంలో గొప్ప పుణ్య క్షేత్రాలున్నాయి. స్వయంభువుగా వెలసిన దేవాలయాలలో మహిమ కలిగిన తీర్థాలు ఎన్నో ఉన్నాయి. అంగిరసుడు గౌతమ మహర్షికి ఈ తీర్థాల గురించి మహిమలను వివరించాడు. ఒక తీర్థం సందర్శనం వలన, ఆ తీర్థంలో స్నానం ఆచరించటంవలన సంతాన ప్రాప్తి కలుగుతుందని, మరొక తీర్థం వలన పుణ్యం వస్తుందని తీర్థ మహిమల



గురించి చెప్పాడు అంగిరసుడు. కాశ్మీర దేశంలో ఎన్నో నదులు పుట్టి సముద్రంలో కలుస్తున్నాయి. అక్కడి తీర్థాలన్నీ పవిత్రమయినవి. కాశ్మీర దేశంలోని నదులలో స్నానంచేసిన వాడు యోగ స్థితిని పొందుతాడు, జ్ఞాన సిద్ధిని పొందుతాడు, మోక్షాన్ని చేరుకుంటాడు", అని వివరించి, అలాగే పుష్కర తీర్థము, ప్రభాస తీర్థము, నైమిష తీర్థము, దేవికి, ఇంద్రమార్గ, స్వర్ణబిందులు అనబడే ప్రముఖ తీర్థాల మహిమలను గురించి చెప్పాడు అంగిరసుడు.

"ప్రశాంతచిత్తుడు, విరాగి, బ్రహ్మభావన కలిగినవాడు, ఏ విషయమందూ అపేక్ష లేని వాడు అటువంటి వారికి తీర్థాలతో పని లేదు. ఇంకా అంగిరసుడు ఎవరైనా తీర్థయాత్రలు సందర్శించి, వాటి కథలు, మహిమలు, చరిత్ర చెబితే విన్నవారికి కూడా కొంత పుణ్యం వస్తుంది", అని వివరించాడు గౌతమ మహర్షికి.

## అంగిరసులు - సామవేదము

అంగిరస మహర్షి సంతానాన్ని, మనుమలు, మునిమనుమలు మొదలైన వారి వంశస్థులను అంగిరసులు అంటారు. అంగిరసులంతా సామవేద ప్రవీణులు, మంత్రద్రష్టలు. వాళ్ళు ఒకసారి స్వర్గానికి వెళ్ళేటప్పుడు వాళ్ళ వెంబడి వాళ్ళను అనుకరిస్తూ కొందరు రాక్షసులు స్వర్గానికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తున్నారట. వాళ్ళను వెనుకకు వెళ్ళమంటే వెళ్ళటంలేదట. రాక్షులు అంగిరసులను వదలలేదు. అంగిరసులు హరివర్ణ సామ మంత్రములను పటించగానే రాక్షసులు పలాయనంచేసి వెళ్ళారట. ఈ ప్రకారంగా సామవేదం కూడా అంగిరసుని గొప్పదనాన్ని శ్లాఘించింది. అంగిరసుని గొప్పదనం, సామవేద మంత్ర మహిమను మానవాళి అర్థం చేసుకుని, వేదాలను గౌరవించాలని తెలుసుకోవాలి.

## వేదం - ఆంధ్రదేశం

వేద మంత్రం శక్తిమంతమైనది, చైతన్యవంతము కూడా. దాని అర్థం మనకు తెలియనక్కరలేదు. ఆ వేదమంత్రాలను వినేటప్పుడు వినటానికి

ఆనందంగా, ఆసక్తిగా ఉంటుంది. వినాలనే అనిపిస్తుంది. లేచి వెళ్ళాలని అనిపించదు. ఉపనయనం, వివాహం, గృహప్రవేశం, షష్టిపూర్తి శుభకార్యాలలో "వేదాశీర్వచనం" పండితులు నిర్వహిస్తారు. ఆ ఆశీర్వచనానికి ఎంతో మేలు, ప్రాముఖ్యత ఉంది లోకంలో వేద విజ్ఞానం భారతదేశంలోనే ఆవిర్భవించింది. ఆదరణ పెరిగింది. వేదం ప్రచారంలో ఉన్న దేశం ఆంధ్రదేశం. గోదావరి నదీ తీర ప్రాంతం, కృష్ణా నదీతీర (అనగా కృష్ణా, గుంటూరు జిల్లాలు). ప్రాంతంలో వేదపాఠశాలలు, వేదపండితులు, వేదాధ్యయన పరులు, ఎంతో ప్రచారం చేస్తున్నారు. ఆంధ్ర దేశం సామాన్యమైన దేశంకాదు. ఆంధ్రదేశం వేదాధ్యయనదేశం. తిరుమల తిరుపతి దేవస్థానముల వారు ఆరు వేద పాఠశాలలను "వేద విజ్ఞాన పీఠాలు"గా మార్పు చేసారు. వేదాధ్యయనం, వేద విజ్ఞానాన్ని మరింత విస్తృతం చేయటానికి ప్రజలను ధర్మమార్గంలో జీవించటానికి అన్నివేళల కృషిచేస్తోంది.

వసిష్ఠుడు, భరద్వాజుడు, అత్రి, వామదేవుడు, విశ్వామిత్రుడు, గృత్సమదుడు మొదలైన ఋషులందరూ అంగిరసుణ్ణి స్తోత్రం చేసారు. అంగిరసుడు అథర్వణ వేదంలో నిష్ణాతుడు. యజ్ఞ యాగాది క్రతువులలో, కర్మలలో నిత్య, నైమిత్తిక కర్మలలో కూడా అంగిరసుడి మంత్రాలు, వాక్యాలు మానవాళికి ప్రమాణాలుగా ఉన్నాయి.

### విశాలహృదయం - అంగిరసులు

మహర్షులు ఏ కార్యం నిర్వహించినా లోకక్షేమం కోసమే చేస్తారు. ఈ విషయాన్ని అంగిరసులు స్పష్టంగా నిరూపించారు. అంగిరసులు సూర్యభగవానునితో కలిసి దర్శపూర్ణమాస యజ్ఞాలు నిర్వహించారు. స్వర్గవాసాన్ని అనుభవించారు. సత్రయాగము, అహీనయాగము, దశరాత్రయాగము నిర్వహించి వెళ్ళిపోతూ, భూలోకంలో వాళ్ళు నిర్వహించిన యజ్ఞ ఫలాన్ని భూలోకవాసులకు ధారపోసి వెళ్ళారు అంగిరసులు. అలా



చేయటం అత్యుత్తమమైన, మహోన్నతమైన, విశాలహృదయం వారి లక్షణం. అంగిరసులు స్వతంత్రంగా వారి తపోబలం చేతనే ఊర్ధ్వలోకాలకు వెళ్ళగలరు. అయినా యజ్ఞములు నిర్వహించి, తపోబలాన్ని మాత్రమే వారు స్వీకరించి, యజ్ఞఫలాన్ని మాత్రం భూలోకవాసులకు ధారపోసారు. మహర్షుల లోకక్షేమమే వారి లక్ష్యం అని మరోసారి ఋజువైనది కదా!

* * *

## 22. పిప్పలాది మహర్షి

చ్యవన మహర్షి కుమారుడు దధీచి మహర్షి, సువర్చల దధీచి మహర్షిల కుమారుడు పిప్పలాది మహర్షి. ఒక సారి దేవతలకు దధీచి మహర్షి శరీరంలోని వెన్నెముక అవసరమైంది. దేవతలకు సహాయంచేయాలని యోగాగ్నిలో ప్రవేశించి శరీరాన్ని వదలిపెట్టి, ఆయుధాలు చేసుకోమని తన ఎముకలు ఇచ్చేశాడు దధీచి.

తయారు చేసుకొన్న ఆయుధాలు రాక్షసులు తీసుకుని పోకుండా దధీచి మహర్షి వద్దనే దాచిపెట్టమని ఆయనకు ఇచ్చారు. మరల తీసుకుంటామని ఆయనకు చెప్పారు. దేవతలు ఎన్ని సంవత్సరాలైనా రాకపోయేసరికి దధీచి ఆయుధాలను రక్షించే బాధ్యతను సహించలేక, వాటన్నింటినీ తనలోకి తీసేసుకున్నాడు. అవన్నీ దధీచి శరీరంలో జీర్ణమైపోయాయి. ఆ అస్త్రాలన్నీ దివ్యాస్త్రాలు మంత్రశక్తిగలవి. వాటిని దధీచి ఆహారంగా తీసుకున్నాడు. ఆ ఆయుధాలన్నీ ఆయన శరీరంలోని ఎముకలలో రక్తంలో, మాంసంలో జీర్ణమైపోయాయి. తరువాత ఎప్పుడో దేవతలు వచ్చి ఆయనను తమ ఆయుధాల కోసం అడిగారు.

వెంటనే దధీచి వారితో "నేను ఎన్నో పర్యాయములు మీ ఆయుధాలు తీసుకెళ్ళమని చెప్పాను. మీరు ఆ పని చేయలేదు. అవన్నీ నా శరీరంలో జీర్ణమైపోయాయి. ఇప్పుడు ఆ ఆయుధాలు మీకు లభించవు" అని చెప్పాడు. ఆ దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి అడిగారు. అప్పుడు ఆయన వారితో, "మీ ఆయుధాలన్నీ ఆయన శరీరంలో జీర్ణమైనాయి. ఆయినా ఆయుధాలకు శక్తి ఉంటుంది. దధీచి ఆయుధాలు మరల మీకు ఇవ్వగలిగితే, వాటితో మీరు రాక్షస సంహారం చేయవచ్చు" అని అన్నాడు. మళ్ళీ ఆయనను ఎలా అడగాలి? అని ప్రశ్నవచ్చింది వారికి. ఆ పద్ధతిని ఆయన వారికి సలహా ఇచ్చారు బ్రహ్మ. ఆ ప్రకారంగా దేవతలు దధీచిని వారి ఆయుధాలు తిరిగి ఇవ్వమని అడిగారు. ఆయన వారితో "ఈ ఆయుధాలు ఏ విధంగాను పనికి రావు. మీకు వెనక్కు ఇస్తాను. తీసుకుని వెళ్ళమని చెప్పాడు. శరీరం లేక పోయినా జీవించగలను, ఈ ఎముకలు తీసుకోండి" అని అన్నాడు. ఈ విషయాన్ని దధీచి, భార్యకు కూడా తెలుపకుండా తన శరీరాన్ని యోగాగ్నితో వదలి ఎముకలను దేవతలకు ఇచ్చాడు.

దధీచి ఇచ్చిన ఎముకలతో ఆయుధాలు తయారు చేసి వాటితో శత్రువులైన రాక్షసులను సంహరించారు దేవతలు. దధీచి మరణించే సమయంలో ఆయన భార్య సువర్చల గర్భవతి. ఆమె భర్తతో సహగమనంచేసి మరణిద్దామని అనుకున్నది. అయితే శిశువును చంపగూడదు, అందువల్ల కత్తితో పొడుచుకొని గర్భంలోని శిశువుని బయటకు తీసి వాడిని ఇక్కడే వదలి వెళ్ళి సహగమనం చేసి మరణించింది. సమీపంలోని పిప్పలిచెట్టును పసివానికి చూపించి, "ఈ వృక్షం నీకు తల్లి, తండ్రి నా ఆశీస్సులతో ఈ పిప్పలిచెట్టు నిన్ను రక్షిస్తుంది. తరువాత నిన్ను ఎవరో పెంచి, పెద్ద చేస్తారు. నీకు రాబోవు కాలంలో చాలా కీర్తి కలుగుతుంది" అని చెప్పి తల్లి సువర్చల కనుమరుగైంది.

ఆ పిల్లవాడు మెల్లిగా పాకుతూ ఆ పిప్పలి వృక్షం దగ్గరకు వెళ్ళాడు. ఆ వృక్షంలో ఉండే వనస్పతులు, దేవతలు అతడిని పెంచారు. ఆ చెట్లు అన్నీ దేవతా స్వరూపాలే. వాటిలో దేవతలు ఉంటారు. అందువల్లనే మన భారతదేశంలో వృక్షాలను దేవతా స్వరూపాలుగా భావించి పూజలు నిర్వహిస్తాము. పిప్పలిచెట్టు (అంటే రావిచెట్టు) జాగ్రత్తగా ఆ పిల్లవాడిని పెంచింది. ఆ చెట్టు సంరక్షణలో పెరిగాడు కాబట్టి ఆ పిల్లవాడికి "పిప్పలాదుడు" అని నామకరణం చేశారు.

పిప్పలాదుడి తల్లి వెళ్ళిపోతూ "నాయనా! నీ తండ్రి మరణానికి దేవతలు కారణం. మనకు వీరు చాలా ద్రోహం చేసారు. దేవతలు వారి స్వార్థం కోసమని వాళ్ళే చంపారు. అందుకనే వాళ్ళను ఇలా శపించాను, "వారికి సంతానం ఉండదు, సుఖం ఉండదు. గృహస్థధర్మంలో ఉండే సుఖాలు,

ఆనందం వారికి కలుగవు. గృహస్థధర్మంలో ఆచరించే సత్కార్యాలు ఏవీ వారికి ఉండవు. వాటి వల్ల కలిగే ఫలాలు గూడ కలుగవు. ఉన్న పుణ్యం అంతా నశించిపోయే దాకా సుఖపడుతూనే ఉంటారు. పతనం అయిన తరువాత మానవులకంటే హీనంగా జీవిస్తారు" అని అన్నది సువర్చల. "జ్ఞానమూర్తివై వంశ గౌరవాన్ని వంశాభివృద్ధిని నిలబెట్ట"మని కొడుకుని కోరి, ఆశీర్వదించి ఆమె బ్రహ్మలోకానికి వెళ్ళింది.

## అమృతమే ఆహారం

పిప్పలి చెట్టు ఆ పిల్లవాడికి ఆహారాన్ని అందించటాని అమృతం కోసమని చంద్రుణ్ణి ప్రార్థించింది. వెంటనే చంద్రుడు తన కిరణాలద్వారా ఇచ్చిన అమృతాన్ని చంద్రోదయవేళలో ఆపిల్లవాడినోట్లో ధారగా పోసింది. ఆ విధంగా వచ్చిన అమృతంతో పిప్పలాదుడు పెరిగాడు. అందులో తల్లిదీవెన, బలం ఉంది. తల్లి శక్తి అటువంటిది. ఈ వృక్షఛాయలో పెరిగి పెద్దవాడు అయినాడు. పిప్పలాదుడు వృక్షం నీడలోనే, తన అంతఃకరణలో నుంచి తనకు కలిగిన జ్ఞానంతో తపస్సు చేస్తూ, ధ్యానంచేస్తూ పెద్దవాడైనాడు. తన తల్లి దండ్రుల స్థితికి కారకులైన వారిని శిక్షిస్తానని, వాళ్ళ అపరాధానికి వారిని శిక్షించకుండా ఉండకూడదని నిర్ణయించుకున్నాడు.

## చంద్రుడి సలహా

పిప్పలి వృక్షం ద్వారా తనకు అమృతాన్ని తాగించిన చంద్రుణ్ణి ప్రార్థించాడు. "నా తల్లి, తండ్రుల మరణానికి కారకులు దేవతలు కదా! వారిని కఠినంగా శిక్షించదలచుకున్నాను. నీ సలహా ఏమిటి" అని అడిగాడు చంద్రుడిని పిప్పలాదుడు. "నాయనా! పిప్పలా! నీ కోరిక ఎవరూ కాదనలేరు. నీ సంకల్పం చాలా అమోఘం. కాబట్టి నీవు గోదావరి తీరానికి వెళ్ళి అక్కడ పరమేశ్వరుడిని గురించి తపస్సు చెయ్యి. ఆయన అనుగ్రహంతో నీవు అనుకున్న కార్యం నెరవేరుతుంది" అని ఆదేశించాడు. పిప్పలాదుడికి శివధ్యానం,



శివస్తోత్రం, శివనామోచ్చారణ, శివారాధన తప్ప ఇంకొక పనిలేదు. రాత్రి పగలు అదే పని. ఆ విధంగా తపస్సు చేసాడు పిప్పలాదుడు. చాలా కాలంగా చేసిన తపస్సు ఫలంగా శివుడు ప్రత్యక్షమైనాడు. తనకోరిక గురించి పిప్పలాదుడు చెప్పాడు. "శాంతి, జ్ఞానము, మోక్షము, విద్య, వైరాగ్యము, మొదలైన వాటిని గురించి నేను ఇప్పుడు ఆలోచించే స్థితిలో లేను. హృదయం అగ్నిలా దహించుకు పోతోంది. నా జననీ జనకులు జ్ఞాపకం వస్తున్నారు. నా వయస్సు పిల్లలు అందరూ చక్కగా అమ్మ, నాన్న నీడన, వాత్సల్యంతో బుద్ధిగా పెరుగుతున్నారు. నాకు ఆ అదృష్టంలేదు. నేను దిక్కులేని వాడిలా వృక్షం క్రింద పెరిగాను. దీనికి దేవతలే కారణం. దేవతలు వరాలిచ్చి అనుగ్రహిస్తారు. తపస్సు చేసుకునే వాళ్ళను రక్షిస్తారు. వాళ్ళను పోషిస్తారని అంటారు గదా! మరి నా విషయంలో విరుద్ధంగా ఉన్నది. ఇలా ప్రవర్తించిన దేవతలు క్షంతవ్యులుకారు. వీరిని అందుకే శిక్షించదలచు కున్నాను. దీని కోసం నాకు అవసరమయిన శక్తిని ప్రసాదించు" అని అడిగాడు పిప్పలాదుడు.

పరమేశ్వరుడు వెంటనే "ఇదిగో నీకు శక్తిని ఇస్తున్నాను" అని ఒక కృత్యను సృష్టించి ఇచ్చాడు. రుద్రుడు ఇచ్చిన ఆ కృత్య పిప్పలాదుడిని "ఏమి! స్వామీ! మీ ఆజ్ఞ" అని అడిగింది. ఆయన ఆ కృత్యను దేవలోకానికి వెళ్ళి దేవతలను వధించి రమ్మన్నాడు. అనేకమంది దేవతలను ఆ కృత్య వధించింది. వెంటనే మిగిలిన దేవతలు బ్రహ్మ దగ్గరకు వెళ్ళారు. ఆయనను శరణుజొచ్చారు. బ్రహ్మ వారిని తీసుకుని శివుడి దగ్గరకు వెళ్ళారు. వాళ్ళంతా, శివుడితో "నీవు పిప్పలాదుడికి ఇచ్చిన కృత్య వలన దేవతలు నశిస్తున్నారు. ఇది జరగకుండా ఉండటానికి ఏదైనా ఉపాయం చెప్పాలి" అని అడిగారు.

సదాశివుడు వారితో "నేనేం చెయ్యను?" ఆయన తపస్సు ఫలంగా వరం ఇచ్చాను. ఆ పిప్పలాదుడే అంగీకరిస్తే, అనుగ్రహంకలిగితే, దేవతలు బ్రతుకుతారు. లేకపోతే ఇంతే! ఎందువలన అంటే నేను అతనికి ఇచ్చిన వరం తిరుగులేనిది.

ఆ కృత్య దేవలోకాన్ని పూర్తిగా నాశనం చేయ్యగలదు. ఆ పిప్పలాదుడు ఎవరు చెప్పినా వినడు. అతడి ధృఢసంకల్పం అంతటిది" అన్నాడు.

బ్రహ్మాది దేవతలు, "పిప్పలాదుడిది తీవ్రమైన భయంకరమైన సంకల్పం. ఆయన ఎవరు చెప్పినా వినడు. అందరిమీద ఆగ్రహం ఉంది. ఆ శక్తిని ఇచ్చినది రుద్రుడు కాబట్టి, ఆయన చెబితే వింటాడేమో అని, రుద్రుడిని "నీవే దయచేసి ఆ పిప్పలాదుడిని శాంతింపచేయి. దేవతలను ఇంక చంపకుండా కటాక్షించి వదిలివేయమని నీవే చెప్పాలి" అని బ్రహ్మతో దేవతలందరూ ప్రార్థించారు.

వారందరూ పిప్పలాదుడి దగ్గరకు వచ్చారు. రుద్రుడు ఆయనతో, "నాయనా! నీకు ఈ పాటికి ఆగ్రహం చల్లారి ఉండవచ్చు, నీ శక్తి, సామర్థ్యాలు అందరికీ తెలిసినవి. దేవతలందరినీ చంపగలవు. నీవు కృత్యను సంపాదించావు. కొంతమంది దేవతలను చంపావు. మిగిలినవారు నిన్ను శరణుకోరుతున్నారు. వాళ్ళను వధించే శక్తినీకు ఉన్నా వారిని క్షమించి వదలివేయి. నీకు కీర్తి కలుగుతుంది. నీ కీర్తి ఆ చంద్రార్కం వర్ధిల్లుతుంది. నీ క్షమాగుణానికి గూడ కీర్తి లభిస్తుంది. శక్తి ఉండి క్షమించటంలోనే కీర్తి లంభించేది. బాగా ఆలోచించుకో" అన్నాడు రుద్రుడు పిప్పలాదుడితో.

సాక్షాత్తు పరమశివుడే వచ్చి హితబోధ చేసాడని సంతోషించాడు పిప్పలాదుడు. "మహాప్రభో! నీవు సర్వలోక పూజ్యుడివి. జగత్కర్తవు. నన్ను అనుగ్రహించి నేను కోరిన వరం ఇచ్చావు. నా మీద వాత్సల్యంతో హితబోధ చేస్తున్నావు. నీమాట ఎలా అతిక్రమిస్తాను. నీ సలహా శిరసావహిస్తాను. ఇంక నుంచి దేవతలను సంహరించను. మిగిలినవారు జీవించే ఉంటారు. అయినది ఏదో అయింది. నా క్రోధం చల్లారింది", అన్నాడు పిప్పలాదుడు.

**మాతాపితరుల దర్శనం**

తరువాత పిప్పలాదుడు రుద్రుడి ఆజ్ఞప్రకారం ఆ కృత్యను ఒక బంగారు పాత్రలో ప్రవేశింపచేసి దానిని సముద్రంలో వదిలాడు. భయంకరమైన ఆ



సంహారశక్తిని సముద్రానికి చేర్చాడు. శివుడు మరొక వరం కూడా ఇచ్చాడు పిప్పలుడికి. "తల్లిదండ్రులను చూడలేకపోయానని కదా నీకు దుఃఖం ఉన్నది. ఆ దుఃఖం నీకు ఇంక ఉండదు. నీవు అనుకున్న సమయంలో పితృలోకాలకు వెళ్ళి నీ మాతాపితరుల దర్శనం చేసుకో! వాళ్ళతో నీవు సలక్షణంగా సంభాషించవచ్చు, వాళ్ళను దర్శించిన వెంటనే నీ దుఖం పోతుంది" అని రుద్రుడు ఉపదేశం చేసాడు.

పరమేశ్వరుడి సందేశం ప్రకారం పితృలోకాలకు వెళ్ళి తల్లిదండ్రులను దర్శించుకున్నాడు పిప్పలాదుడు. శరీరాలు పోయినా వారు క్షేమంగానే, ఆరోగ్యంగానే ఉన్నారు. దివ్య శరీరాలతో ప్రకాశిస్తున్నారు. వారిని దర్శించి పిప్పలాదుడు ఉపశమనం పొంది. శాంత మనస్కుడైనాడు. మళ్ళీ భూలోకానికి వచ్చి యథావిధిగా తపస్సుకు ఉపక్రమించాడు. తపస్సు వలన బ్రహ్మజ్ఞానం కలిగింది. తల్లిదండ్రులు పితృలోకాలలోఉన్నా వారిపై భక్తి ప్రపత్తులు ఉండాలని లోకానికి తెలియ చేసాడు పిప్పలాది మహర్షి.

**తపః శక్తి ప్రయోజనాలు**

తల్లిదండ్రుల తపఃశక్తి వలన పసివాడైన పిప్పలాదుడు వృక్ష సంరక్షణలో జీవించాడు. చంద్రకిరణములవలన ఆ ప్రసరించే అమృత ధారలవలన ఆకలి తీర్చుకున్నాడు. పరమేశ్వరుని గూర్చి తపస్సు చేసి తల్లి తండ్రులను దర్శించగలిగాడు. అమితానందాన్ని పొందాడు. తపస్సువలన వరం పొంది కొంత మంది దేవతలను సంహరించాడు. ఈశ్వరుని ఆజ్ఞవలన మనసు మార్చుకొని, కోపం వీడి ఇతర దేవతలను సంహరించదలచుకోలేదు. తపస్సు వలన మంచి కార్యాలు చేసి కీర్తి గడించాడు. తపస్సు ఆచరించి బ్రహ్మజ్ఞానం పొందాడు. చూశారా! తపస్సు ఎన్ని సత్కార్యాలకు దోహదపడిందో మానవాళి మానసిక మార్పుకు తపస్సు ప్రధానమైన ఆయుధంగా, ఔషధంగా పని చేస్తుందనుటలో సందేహంలేదు.

## పిప్పలాదుడి వివాహం

ఒకనాడు పిప్పలాదుడు పుష్పభద్రానదిలో స్నానం చేస్తుంటే సౌందర్యవతి అయిన కన్య కనుపించింది. ఆమెకు అతను ముగ్ధుడై ఆమె ఎవరో తెలుసుకున్నాడు. స్వాయంభువ వంశంలో జన్మించిన ఆనవద్యమహీపాలుడి కుమార్తె ఆమె. ఆ రాజు గొప్ప విష్ణు భక్తుడు. భృగుమహర్షి ఆధ్వర్యంలో అనేక యజ్ఞాలు చేసాడు. వెంటనే ఇంద్రపదవి వరిస్తే దానిని తృణప్రాయంగా తిరస్కరించాడు. యజ్ఞాలు తపస్సులు చేసినా నాకు లోకమేచాలు అని ఇంద్రపదవిని ఆశించలేదు. దేవతల వైపు ఒకసారి, రాక్షసులవైపు ఒక సారి యుద్ధంచేసి ఇంద్రుణ్ణి ఒకసారి, బలిచక్రవర్తిని మరొకసారి ఓడించిన పరాక్రమశాలి ఆ రాజు. ఆయనకు దేనియందు కోరిక లేదు. ఆయనకు నూరుగురు కుమారులు, ఒక కుమార్తె, ఆ కుమార్తె పేరు పద్మ, అత్యంత సౌందర్యవతి. పిప్పలాదుడు నదీ తీరంలో చూచినది ఈమెనే. అనపద్య మహారాజు పిప్పలాదుడి దగ్గరకు వెళ్ళి "మహర్షీ! నీవు నా కుమార్తెను చూచావని తెలిసింది. ఆమెను నీకిచ్చి వివాహం చేయాలని అనుకుంటున్నాను అయితే నువ్వు ఋషివి కదా! అదే నాకు సందేహంగా ఉన్నది. నాకుమార్తె అంగీకరిస్తే ఆమెను నీకిచ్చి వివాహం చేయటానికి నాకు అభ్యంతరంలేదు" అన్నాడు రాజు. వెంటనే పిప్పలాదుడు "రాజా! నాకు అభ్యంతరంలేదు. భూత భవిష్యత్ వర్తమాన కాలాలను అంచనా వేసి కాలజ్ఞానంతో చెబుతున్నాను, "ఈ వివాహం వలన లోకక్షేమం కలుగుతుంది" అని అన్నాడు. వెంటనే ఆ రాజు తన కూతురు పద్మకు, పిప్పలాదుడికి వివాహంజరిపించాడు. మరుక్షణం తన తపోబలంతో సహజంగా తనకు కలిగిన వార్ధక్య వికారమైన శరీరాన్ని త్యజించి యౌవనం సంపాదించుకుని యువకుడు అయినాడు. వాళ్ళు సుఖంగా జీవిస్తున్నారు.

## పాతివ్రత్యం - ధర్మదేవత

పిప్పలాదుడి భార్య పద్మ పాతివ్రత్యాన్ని పరీక్షించుదామని ధర్మదేవతకు బుద్ధి పుట్టింది. ఆమె నదీ తీరాన స్నానం చేస్తున్న సందర్భంలో ధర్మదేవత



ఒక సుందరాకారం ధరించి పురుషరూపంలో ఆమెను సమీపించి "నీవు జడలు ధరించిన వాడితో ఏం కాపురం చేస్తావు? నన్ను వరించు, నేను దేవతను" అని అంటూ అతడు రథం దిగి ఆమెను రథం ఎక్కించటానికి ప్రయత్నం చేసాడు. వెంటనే ఆమె పురుషాకృతిలో ఉన్న ధర్మదేవతను శపించటానికి ప్రయత్నంచేసింది. అది తెలిసిన ధర్మదేవత భయపడింది. తను ఎవరో అమెకు తెలిపింది. అయినా ఆమె ఊరుకోలేదు. ఆ దేవతతో, "నువ్వు చేసిన ఈ చర్య దుశ్చర్య, హేయమైనది. నీవు చాలా సుందరుడివి, తేజోవంతుడివి అని చెప్పుచున్నావు. నీ తేజస్సు, నీ అందము నీ యౌవనము అన్ని నశించుగాక" అని శపించింది. ఋషుల భార్యలు గూడ ఋషీమణులే. వారి తపఃశక్తి వలన వారిచ్చిన శాపం తప్పక తగులుతుంది.

మరల ఒకసారి తను ధర్మదేవతను అని తెలియపరచుకున్నాడు. తరువాత ఆమె "నా శాపం అప్రతిహతం. తిరుగులేనిది. పంచ భూతాలకైనా వినాశం ఉండవచ్చుగానీ, పతివ్రత శపిస్తే తిరుగులేదు. నువ్వు ధర్మదేవతవై ఉండిగూడ విచక్షణా జ్ఞానంలేకుండా నాలాంటి పతివ్రతను పరీక్షించటానికి వచ్చావు. నువ్వు నశిస్తే సృష్టినశిస్తుంది. అంటే ధర్మంనశిస్తే, సృష్టిలోనిధర్మం పూర్తిగా నశిస్తుందని అర్థం. ధర్మదేవతవైన నీవు చిరకాలం ఉండాలి కదా! అయినా నా శాపం అనుభవించక తప్పదు. ప్రతియుగంలోనూ నీ క్షీణత తగ్గుతూ ఉంటుంది. ధర్మం తగ్గుతూ వస్తుందని అనుకోవాలి. కృతయుగంలో నాలుగు పాదాలతో షోడశ కళాపూర్ణుడవై ఉండు. త్రేతాయుగంలో మూడు, ద్వాపరయుగంలో రెండు కలియుగంలో ఒక పాదమే ఉంటుంది. ఆ ప్రకారంగా క్షీణిస్తూ సంచరించు మళ్ళీ కృతయుగం వచ్చిన తరువాత నీకు పరిపూర్ణత్వం సిద్ధిస్తుంది", అన్నది పిప్పలాది మహర్షి భార్య పద్మ.

పురుష రూపంలో ఉన్న ధర్మదేవతతో ఆమె ఇంకా "అయితే హరిభక్తులు పరివ్రాజకులు, బ్రహ్మచారులు, వానప్రస్థులు, బిక్షువులు, ప్రాజ్ఞులు పతివ్రతలు,

ధర్మపాలన చేసే రాజులు, దానంచేసే వైశ్యులు, బ్రాహ్మణులను సేవించే శూద్రులు, ఈశ్వర భక్తులు వీరియందు నీవు పరిపూర్ణంగా ఉంటావు" అని చెప్పి తన శాపాన్ని కొంత సవరించింది. అతనికి ఎక్కువ హాని చేయకుండా చేసింది.

ఋషుల భార్యలు గూడ వారి తపఃశ్శక్తితో శపిస్తారని తెలుస్తోంది. అధర్మం తెలిసి జరిగినా తెలీక జరిగినా, అధర్మ వేత్తలను శిక్షించటం, అందులో పతివ్రతాశిరోమణులను అవమాన పరచటం, వారిని పరీక్షించటం నేరమే అని మానవాళి తెలుసుకోవాలి. పరీక్షించినపుడే పతివ్రతా శిరోమణుల మహిమ బయటపడుతుంది. ధర్మదేవతకు ప్రమాదం కలిగి ధర్మదేవత క్షీణిస్తున్నది కదా! ధర్మం తగ్గిపోతున్నదని అర్థం. దానివల్ల లోకానికి ఏమి లాభం? అన్న అనుమానం కలుగుతుంది. అది విధిలోని యుగ ధర్మం. ధర్మం క్షీణించటానికి ఏదో ఒక సంఘటన, సన్నివేశం, సందర్భం ఉండాలి కదా!

## మహర్షులు - ధర్మం

ధర్మపాలన ఉన్న ప్రదేశాలలో, ధర్మం ఆచరించే రాజుల, చక్రవర్తుల దగ్గర ధర్మం పూర్తిగా ఉంటుంది. అయితే వారంతా కష్టాలు, బాధలు అనుభవించి విజయం సాధించినవారే. ధర్మమూర్తులు కష్టాలు అనుభవించారు. చివరకు విముక్తులైనారు. భగవంతుడే వారిని పరీక్షిస్తాడు. వరాలు ఇస్తాడు. ఆశీర్వదిస్తాడు.

ఉదాహరణకు- కృతయుగంలో శ్రీ రామచంద్రుడు ధర్మమూర్తి. "రామో విగ్రహవాన్ ధర్మః" అని పిలవబడ్డాడు అందరిచేత. అటువంటి శ్రీరామచంద్రుడు 14 సంవత్సరములు రాజ్యం లేక, అడవులపాలై ఎన్ని కష్టాలు అనుభవించాడు. ఈ రఘువంశ తిలకునికి దాదాపు అరవైకిపైగా మహర్షులు అండగా ఉండి, ఆశీర్వదించి విజయానికి దోహదపడ్డారు గదా! ధర్మమూర్తికి అందరూ సహాయంగా ఉండి ఆశీర్వదిస్తారని తెలుసుకోవాలి.



ద్వాపరయుగంలోనూ ధర్మరాజు సమేతంగా పంచపాండవులు, ద్రౌపది, కుంతీదేవి పన్నెండు సంవత్సరములు, అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసంలో తలదాచుకున్నారు. ఆ సమయంలో వారికి ధర్మవేత్తలైన మహర్షులు, పండితులు, పురోహితులు, రాజులు అండగా ఉండి ధైర్యవచనాలు పలికి ఆశీర్వదించారు. అరణ్యాలలో ఎన్నో కష్టాలు, బాధలు చవిచూచారు కదా! వారి ధర్మమే వారిని కాపాడింది.

తపస్సు, ధర్మం, సత్యం, త్యాగం మానవాళి శ్రేయస్సు కోసం ఆచరించారు, తపించారు మహర్షులు.

## ఇంకా ధర్మ దేవత...

పిప్పలాదుడి భార్య పద్మ ధర్మ దేవతతో, "మహాత్మా! నీవు ఇంకా అశ్వత్థ, వట, బిల్వ, తులసి, చందన, దేవార్చ పుష్పమాలల్లో, దేవాలయాల్లోనూ పుణ్యతీర్థ స్థలాలలోనూ, వ్రతములు, తపములు, యజ్ఞములు, దీక్షాస్థలములలోనూ, ఆవుల దేహములయందును నివసించే ఉంటావు". అని చెప్పింది.

వెంటనే ధర్మ దేవత పద్మతో "నీ భర్త పిప్పలాదుడు మార్కండేయుడికంటే ఎక్కువ ఆయుష్మంతుడు అవుతాడు. కుబేరుడికంటే ధనవంతుడవుతాడు, ఇంద్రుడికన్నా ఐశ్వర్యవంతుడవుతాడు, కపిలుడికి మంచి సిద్ధుడవుతాడు, శివుడితో సమానమని అనిపించుకుంటాడు, నిత్య యౌవనంతో ప్రకాశిస్తాడు. సుస్థిర యౌవనభాగ్యము, పతి సేవాభాగ్యము, సత్పుత్రభాగ్యము, నీకు లభిస్తాయి. నీవు శాశ్వతమైన కీర్తిని పొందుతావు" అని ఆమెకు వరం ప్రసాదించాడు.

## పిప్పలాది మహర్షి శాస్త్ర విజ్ఞానం

పిప్పలాది మహర్షి భార్య పద్మ ధర్మదేవతతో జరిగిన సంభాషణ, వృత్తాంతమంతా భర్తకు చెప్పింది. తరువాత కాలంలో వారికి ఆయిదుగురు కుమారులు జన్మించారు. భార్య భర్తలిద్దరూ చాలా కాలము వానప్రస్థంలో

ఉన్నారు. ఆశ్రమ ధర్మాలను ఆచరిస్తూ బ్రహ్మవిద్యాపారంగతులైనారు. అనేకమంది శిష్యులు పిప్పలాదుడికి ఏర్పడ్డారు. వారందరికీ విద్యాభ్యాసం చేస్తూ లోకానుగ్రహం చేస్తున్నాడాయన.

కొంత మంది మహర్షులు వారికి తెలియని బ్రహ్మజ్ఞానం, వేదాంత విషయములను, ధర్మాలను, శాస్త్ర విషయాలను తెలుసుకోవాలని ఉవ్విళూరుతూ ఉంటారు. ఇంకా ఎంతో నేర్చుకోవాలని తహతహలాడుతూంటారు. ఇటువంటి మహర్షులు చాలమంది పిప్పలాది మహర్షి దగ్గరకు వెళ్ళి ధర్మబోధలను తెలుసుకునేవారు. ఆనాడు మహర్షుల మధ్య సత్సంబంధాలు, సన్నిహిత సంబంధాలు పెంచుకొని బ్రహ్మజ్ఞానం పొందేవారు. ఆకోవలోకి చెందిన వారే ఒకనాడు ఆయన ఆశ్రమానికి వచ్చారు. వారిలో ప్రముఖులు - కాత్యాయన మహర్షి సంతతిలో ఉండే కబంధుడు అనే ఋషి, భృగువంశంలో పుట్టిన వైదర్భి ఋషి, అశ్వలాయనవంశంలో జన్మించిన కౌటిల్యుడు అనే ఋషి, గర్గవంశంలో పుట్టిన సౌర్యాయణి అనే ఋషి, సత్యకాముని ఋషి సంతానమైన శైభ్యుడనే ఋషి, భరత్వాజుడి వంశంలో జన్మించిన సుకేశుడనే ఋషి సమిధలు తీసుకొనివచ్చి, ఆయనకు నమస్కరించి తమకు బ్రహ్మ విద్యను బోధించమని ప్రార్థించారు. అది ఆనాటి సంప్రదాయం, గురు-శిష్య సంబంధాలు అలా ఉండేవి ఆనాడు.

## సద్గురువు - సంబంధాలు

వేద విజ్ఞానం, శాస్త్ర విజ్ఞానం, బ్రహ్మ జ్ఞానం విద్యలను అధ్యయనం చేయవలసిన వారు, సద్గురువును వారే వెతుక్కోవాలి. ఇది వారి ప్రథమకర్తవ్యం, గురువులు పిలువరు. శిష్యులే విషయ సేకరణచేసి సద్గురువును ఎంపిక చేసుకోవాలి. ఇటువంటి లక్ష్యంతో, ఋషులంతా పిప్పలాదునితో "మేము సగుణోపాసన చేసాము. చిత్తశుద్ధి సంపాదించాము. వాసనాత్రయాన్ని జయించాము. బ్రహ్మజ్ఞాన సంపాదన అనే కోరిక తీవ్రంగా ఉండటంచేత



సద్గురువును అన్వేషిస్తూ వచ్చాము. అందువల్ల మీరు మమ్మల్ని అనుగ్రహించ వలసింది అని అడిగారు. అన్నీ తెలిసికూడా పిప్పలాదుడు ఆ ఋషులతో మీరు నా దగ్గర ఒక సంవత్సర కాలము శుశ్రూషచేయండి. తరువాత నా ఆశ్రమంలో నేను మీ సందేహాలను తీర్చే ప్రయత్నం చేస్తాను" అని అన్నాడు. వాళ్ళు ఆరుగురూ ఆయన దగ్గరకు నిజమైన జిజ్ఞాసతో వచ్చారు కాబట్టి, ఒక సంవత్సర కాలము ఆయన ఆశ్రమంలోనే తపస్సు చేసుకుంటూ బ్రహ్మచర్య దీక్షను ఆచరిస్తూ ఉన్నారు.

## మహర్షుల సందేహాలు - పిప్పలాదుడి సమాధానాలు

పిప్పలాదుడి ఆశ్రమంలో నిర్ణయించిన సంవత్సర కాలం గడువు పూర్తియైన పిదప ఆరుగురు మహర్షులు తమ సందేహాలకు నివారణ చెప్పమని ప్రార్థించారు. పిప్పలాది మహర్షి నివారణకు, ఇచ్చిన సమాధానాలు నేటి మానవాళి అవగాహన కల్పించుకుని ఆచరించాల్సిన అవసరం ఆలోచించాలి. మానవుల సందేహాలు తీర్చవలసిన అవసరం గూడ మహర్షులకు ఉన్నదని తెలుస్తోంది.

**1. కబంధుడు : దేవా! ప్రజా సంసృష్టి ఎలా జరుగుతున్నది?**

**పిప్పలాదుడు :** సృష్టి చేయవలసినటువంటి జీవుల అదృష్టరేఖ ఎలా ఉందో, పూర్వ కర్మ ఏ విధంగా ఉన్నదో ఆప్రకారంగానే మరల సృష్టి జరగాలి. దానికి నిమిత్తమైన శక్తి ఉండాలి కదా! కర్మను అనుసరించి మళ్ళీ దేహమో, పునఃసృష్టో జరగాలి. సృష్టిలో అది శాసనం. కానీ నిమిత్తమాత్రంగా సృష్టించేవాడు ఒకడు ఉండాలి. ఆలా చేసే వాడే బ్రహ్మ. అయితే ఆయన ఇష్టానుసారంగా సృష్టిచేయలేదు. జీవులకు కర్మతో కూడిన ఏ శరీరం ఎక్కడ ఏ లోకంలో ఎలా పుట్టాలో ఆ ప్రకారంగా నడిపించేవాడు మాత్రమే అతడు. అయితే పుట్టిన శరీరం ఒకసారి ఎప్పుడో నశించాలి. కాబట్టి శరీరానికి వృద్ధిక్షయములు అన్నీ ఉంటాయి.

**2. వైదర్భి మహర్షి : దేవా! శరీరాన్ని భరించేవారు ఎవరు?**

**పిప్పలాదుడు :** శరీరాన్ని భరించేది, ప్రకాశింపచేసేది ప్రాణమే. ప్రకాశింప చేయటము అంటే, చైతన్యాన్ని ఇచ్చి పని చేయించేది ప్రాణమే".

**3. మరొక ఋషి : ప్రాణం అనేది ఎట్లా పుడుతుంది? శరీరంలోకి ప్రాణం ఎలా ప్రవేశిస్తుంది?**

**పిప్పలాదుడు :** ప్రథమంగా ఆత్మనుంచే ఆత్మ పుడుతుంది. తరువాత దాని నుండి ప్రాణం పుడుతుంది. అంటే ఆత్మ వస్తువు పంచభూతములలో ప్రవేశించగానే, ఆత్మ స్వయం ప్రకాశమైనది. కాబట్టి పంచభూతముల స్పర్శ తగిలిన వెంటనే ప్రాణం అందులోంచి బహిర్గతమవుతుంది. ప్రాణం ఎక్కడ నుంచో రాదు. ఆత్మయందే ఉన్నది. ఆ ప్రాణి ఏఏ కర్మలు చేస్తాయో వివరంగా చెప్పాడు పిప్పలాద మహర్షి

**4. సౌర్యాయణి మహర్షి : దేవా శరీరంలో నిద్రించేది ఏది? మేల్కొనేది ఏది? సుఖ మంటే ఏమిటి?**

**పిప్పలాద మహర్షి :** ఇంద్రియములన్నీ మనసులో లయం చెందటమే నిద్ర. జ్ఞానేంద్రియములు అయిదు - అవి కన్ను, చర్మము, వంటి కర్మేంద్రియ పంచకము వెనుక సూక్ష్మ రూపంలో ఉండే జ్ఞానేంద్రియ పంచకము - మనసులో లయిస్తే దానిని నిద్ర అంటాము. ఈ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ పంచకం, అంతఃకరణ చతుష్టయాన్ని నడిపించటానికి కావలసిన ప్రాణశక్తిని మనలో నుంచి జనింపచేసి నడిపించేశక్తి ఆ పరమాత్మ యందు మాత్రమే ఉంది. కాని దానియందు ఇంద్రియములు కానీ, ఈ ధాతువులు కానీ ఏవి ఉండవు. వాటికి అన్నిటికీ కావలసిన శక్తి మాత్రమే అందులో ఉంటుంది కాని దానిలో వస్తువులేవీ ఉండవు.

**5. మరొక ఋషి : పిప్పలాదా! ఓంకారాసన గురించి తెలియచేయండి?**



**పిప్పలాద మహర్షి :** ఓంకారం ఏ కొద్ది కాలం ఉపాసించిన వారైనాసరే, ఋగ్వేదాభిమాని అయిన దేవతలు వలన మరల మనుష్యులై జన్మిస్తారు. అయితే అధికంగా ఉపాసనచేసే వాళ్ళు యజుర్వేదాభిమాని అయినటువంటి చంద్రుడి వల్ల చంద్రమండలానికి వెళ్ళి తిరిగి వస్తారు. త్రిమాత్ర అంటే ఇంకా ఎక్కువ ఉపాసించేవాళ్ళు పాపమునుండి విముక్తి పొంది సామవేదాభిమాని దేవతచే సూర్యమండల మార్గంలో బ్రహ్మలోకానికి వెళతారు. ఋక్యజుస్సామ వేదాలకు ఉన్నతి ఈ వరుస క్రమంలో ఉంటుంది.

**6. మరొక ఋషి : షోడశ కళాపురుషులు అంటే ఎవరు?**

**పిప్పలాద మహర్షి :** అతడు శరీరంలోనే ఉన్నాడు. దేహం స్వస్థంగా ఉండటానికి ఆధారమైన అయిదు విధముల ప్రాణశక్తి, దానికితోడుగా శ్రద్ధ, అయిదు ఇంద్రియాలు, పృథ్వి మొదలైన పంచభూతాలు - ఇవే పురుషులు - మనసు, అన్నము, వీర్యము, సమస్తమూ పుడుతూ నిత్యమూ జీవనక్రియ నడుస్తూ ఉంది కదా! ఈ క్రియలు అన్నింటినీ షోడశ కళలంటారు. అవి అన్నీ సర్వసాక్షి అయిన పురుషుడి లోపల ప్రవేశించి అస్తమిస్తాయి. దానినే మృత్యువు అంటారు. అవి శాశ్వతంగా అస్తమిస్తే అతడు అమృతుడవుతాడు. అ పురుషునిలోకి వెళ్ళి నిద్రించినపుడే మృత్యువు. మళ్ళీ బయటకు వచ్చినపుడు పునర్జన్మ ఉంటుంది. మళ్ళీరాకుండా వెళితే మాత్రం అది మృత్యువుకాదు, అమృతత్వం.

**లోకానికి పిప్పలాద మహర్షి సందేశాలు**

పిప్పలాద మహర్షి గొప్ప జ్ఞాని. మోక్ష మార్గాన్ని బోధించిన వాళ్ళలో ఇతడు ప్రథముడు అని చెబుతారు. కామక్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యాలనే ఆరు శత్రువులు, శమదమాది షట్క సంపత్తి తితీక్ష, ఉపరతి, శ్రద్ధ, సమాధానం అనే సుగుణాలు, వాటి నిష్ఠనుబట్టి - ఆ దేహాన్ని ఆశ్రయించి ఎప్పుడూ

ఉంటాయి. వీటిలో ఏగుణములను జీవుడు ఆశ్రయిస్తాడో అటువంటి ఫలాన్ని పొందుతాడు. అంటే శమదమాది షట్క సంపత్తి, అరిషడ్వర్గము రెండూ కూడా శరీరమందు సహజంగా ఉంటాయి. మనలో ఆరు సుగుణాలు, ఆరు దుర్గుణాలు ఉన్నాయి. నువ్వు దేనిని ఆశ్రయిస్తే ఆ ఫలం నీకు లభిస్తుంది. ఒక వేళ ఇవి కొన్ని, అవి కొన్ని ఆశ్రయిస్తే నిరంతరం మానవ జన్మ ఎత్తుతూ సుఖదుఃఖాలు అనుభవిస్తావు. రెండూ స్వతంత్ర మార్గాలు. ఇందులో ఉండి అందులోకి వెళ్ళ లేదు. అందులో ఉండి ఇందులోకి రాలేదు.

పిప్పలాద మహర్షి తన శిష్యులకే కాదు మానవాళికి గూడ అవగాహన కలిగించే జీవిత రహస్యాన్ని ఇలా వివరించాడు. "ఇష్టానిష్ట శబ్దములు అనే పేరుతో షడ్జము, ఋషభము, గాంధారము, పంచమము, మధ్యమము, ధైవతము, నిషాదము అని ఉన్నాయి శుక్ల, రక్త, కృష్ణ, ధూమ్ర, కపిల, పాండురములని ఏడు ధాతువులు ఉన్నాయి. వాటికి వర్ణములు ఉన్నాయి. రసము నుండి రక్తము, రక్తము నుండి మాంసము, మాంసము నుండి మేధస్సు, మేధస్సు నుంచి ఎముకలు, ఎముకల నుంచి మజ్జ, మజ్జ నుంచి శుక్లము, ఇవన్నీ ఉత్పత్తి అవుతాయి" అని చెప్పాడు.

## గర్భం - ఆలోచనలు

దుఃఖానికి కారణము జన్మమే అంటారు. ఇది పరమ దుస్సహమైనది. ఇది తెలిసినవాడు జన్మరాహిత్యము కోసం, ధర్మాన్నిగాని, యోగజ్ఞాన సాధనకానీ, ఆధ్యాత్మిక, భక్తి భావనగాని ఆచరిస్తాడు. మానవ జన్మను గురించి, గర్భనరకంలో ఉన్నపుడు దుఃఖపడతాడు. గర్భం నుంచి బయటికి వచ్చి జన్మ ఎత్తిన తరువాత ఎప్పుడో, తను గర్భంలో ఉండి వేదన పడిన విషయం మనసుకు వచ్చి, మోక్షమార్గంవైపు తీవ్రమైన కోరికపుడుతుంది. ప్రతి జీవికి భగవంతుడి అనుగ్రహంతో ఎప్పుడో ఒకప్పుడు జీవితం మీద విముఖత



కలుగుతుంది. తల్లి గర్భంనుంచి బయటకు వచ్చిన సమయంలో, ఆ నరకాన్ని మరచిపోయి ఆ జీవి పాపపుణ్యాలు చేస్తున్నాడు.

జీవింతంలో ఏదో గొప్ప సంఘటన దైవం ద్వారా జరిగినపుడు, గర్భనరకంలో తను అనుభవించిన కష్టాలు, బాధలు గుర్తుకు వచ్చి మోక్షమార్గానికి కారణమవుతుంది. అంటే కొంత కాలంతరువాత జీవికి మానసిక మార్పుకలిగి సన్మార్గానికి చేరటానికి ప్రయత్నిస్తాడు, దానికోసం అన్వేషించి సఫలీకృతుడవుతాడు. అయితే ఇటువంటి సత్సంకల్పములు దైవానుగ్రహమువలన మాత్రమే నెరవేరుతాయి. అజ్ఞానం ఎంత భయంకరమైనదో గర్భంలో ఉన్నప్పుడే అనుకుంటాడట. నేను బయట ప్రపంచంలోకి రాగానే వీటన్నిటినీ జయిస్తాను. ఆ సంసారమనే సంకెళ్ళను పిండిచేస్తాను" అని ఇటువంటి విషయాలు అనుకుంటూ ఉంటాడు. కానీ భూమి మీదకు ప్రవేశింపగానే ఆ విషయాలన్నీ మరచి పోతాడు.

ఆ యుగాలలో గూడ గర్భంలో ఉన్నప్పుడు జీవుడు ఆలోచనా ధోరణి ఒకటి, ఆచరించేది మరొకటి అని తెలుస్తోంది. పిప్పలాద మహర్షి ఇంకా "గర్భవాసం నుంచి బయటపడిన వెంటనే శివ స్మరణ చేస్తాను. లయ క్రియకు హేతువు, జగత్తు నంతా తనలోకి తీసుకునేవాడు రుద్రుడు. సర్వశక్తిమయుడు చిదాత్ముడు సర్వకారణ కారకుడు భర్గుడు, పశుపతి, మహాదేవుడు, జగద్గురువు అయినటువంటి ఈశ్వరుడిని నేను శరణు వేడుతాను'', అని ఎన్నో అనుకుంటాడు. జీవుడు ఇవతలికి వచ్చిన వెంటనే అన్నీ మరచిపోతాడు, అని చెప్పాడు. ఆ మహర్షి హితబోధలు ఎన్నో ఉన్నాయి.

పిప్పలాది మహర్షి బ్రహ్మజ్ఞానులలో అగ్రేసరుడు. యోగులలో గొప్పవాడు, మహర్షులలో ఉత్తముడు. పిప్పలాది మహర్షి మూడు వేల సంవత్సరములు తపస్సు చేసాడు. తరువాత బ్రహ్మప్రత్యక్షమై, 'సర్వకామసిద్ధి' అనే వరమిచ్చాడు. దీనివల్ల అతడికి అహంకారం పెరిగింది. మళ్ళీ బ్రహ్మయే హంసరూపంలో దర్శనమిచ్చాడు. "పిప్పలా! తల్లిదండ్రులకు సేవచేసిన సుకర్ముడనే ముని

బాల్యంలోనే ఏ తపస్సులూలేక, నీకంటే అధిక జ్ఞానశక్తి సంపన్నుడైనాడని బోధించాడు". బ్రహ్మ బోధ విని పిప్పలాది మహర్షి, సుకర్ముడిని దర్శించి, తన అహంకారం విసర్జించాడు. ఈ కథ పద్మపురాణంలో వివరించబడింది.

మన కంటే గొప్పవారు లేరు, మనమే గొప్పవారం అని అనుకోకూడదు. ఎక్కడో ఒక చోట ఏదో ప్రదేశంలో నాకంటే గొప్పవారు ఉంటారు". అని అనుకోవాలి అహంకారం వదిలించుకోటానికి బ్రహ్మ చెప్పిన హితబోధ అన్నియుగాల ప్రజలకు సత్సందేశమే!

తపస్సు చేయకపోయినా, మాతాపిత పాద సేవ వలన అధిక జ్ఞాన సంపన్నులవుతారని మరొక సందేశాన్ని బ్రహ్మ లోకానికి అందించాడు. ఈ రెండు సందేశాలను బ్రహ్మ పిప్పలాద మహర్షి ద్వారా మానవాళికి ఉపదేశం చేసాడు.

* * *

## 23. మతంగ మహర్షి

మతంగుడు గౌతమ వంశంలో ఒక బ్రాహ్మణుడికి జన్మించాడు. అతనికి మంచి గుణాలు, లక్షణాలు ఉండి నీతిమంతుడిగా వేదశాస్త్రాలన్నీ అధ్యయనంచేసి యజ్ఞకర్మలు నిర్వహించాడాయన. ఒక రోజు తండ్రి పిలిచి మతంగునితో "నాయనా! మన ప్రక్కన ఉన్న గ్రామంలో యజ్ఞం జరుగుతోంది. యాజ్ఞీకుడిగా వెళ్ళి కార్యం శుభప్రదంచేయాలి" అని అన్నాడు. తండ్రి మాటను శిరసావహించి, మతంగుడు ప్రక్క ఊరికి బయలుదేరాడు.

**పశువులు - మనసు**

మతంగుడు ప్రయాణమై వెళుతున్న సమయంలో ఒక గాడిద తన బిడ్డతో వెళుతున్నది. ఆ గాడిదపిల్లను ఊరకనే చేతితో గట్టిగా కొట్టాడు. ఆ గాడిదపిల్ల బాధపడి తల్లి దగ్గిరకు పరుగెత్తింది. ఆ పిల్ల తల్లితో, "ఈ బ్రాహ్మణుడు నన్ను అనవసరంగా హింసించి కొట్టాడు. నేనేమీ తప్పుచేయలేదు. ఆయన దారికి గూడా నేను అడ్డంగా లేను. అమ్మా! నాకు ఈ దుఃఖం ఎందుకు వచ్చింది?" అని అడిగింది. గాడిదపిల్ల తల్లిని పశువులబాషలో అడిగినప్పటికీ, మతంగుడికి ఆ భాష అర్థమై, దాని అర్థం తెలిసింది. ఆ తల్లి వెంటనే పిల్లతో "వీడు పూర్వ జన్మలో చండాల సదృశుడు. క్రూరకర్మలు చేసాడు. పూర్వజన్మలో కూడా వీడు ఇట్లానే ఉన్నాడు. వీడికి ఎప్పుడు సాధారణ మనిషి తత్త్వం వస్తుందో! పోనీలే!" నీ కర్మ అనుకుని అనుభవించి ఊరుకో అని ఓదార్చింది. మతంగుడు చేసిన ఈ దుశ్చర్యకు అంత బాధ పడ్డాయి పశువులు.

పశువులకు గూడ భాష ఉంటుంది. అవి ఏమి మాట్లాడు కుంటాయో మనుషులకు తెలియదు. పశువులు వాటి కష్టాలు, బాధలు, కళ్ళ ద్వారా, చూపుల ద్వారా, నడిచే పద్ధతిని బట్టి మనుషులు తెలుసుకోవచ్చు. అవి ఏం మాట్లాడు కుంటాయో మనం ఊహించుకోవచ్చు. మనకు అంత తెలివి ఉంది. ఉదా॥ ఒక కుక్క అన్నం కోసం మన ఇంటికి వస్తుంది. కారణం

లేకున్నా. ఆ కుక్కను కొడతాం. దానికి ఆకలి వేస్తుంది. అందుకే వచ్చింది. మనకు ఆకలి వేస్తే, అన్నం వండుకుని తింటాం. ఆకలి తీర్చుకుంటాం. ఆకలి అన్ని ప్రాణులకు సమానమే! కుక్క శరీరమైనా అంతే! మనిషి శరీరమైనా అంతే! కుక్కను కొడితే అవి తిట్టుకుంటాయి మనకు వాటి భాష అర్థమయితే మనకు తెలుస్తుంది. ఆ కుక్క మనసులో "ఏమిటి వీళ్ళందరూ వంట చేసుకుంటారు, తింటారు, నాకు పట్టెడు అన్నం పెట్టటానికి ఏడుస్తున్నారు. పైగా కొడుతున్నారు. ఇంత ముద్దనాకు వెయ్య గూడదా! పైగా యజ్ఞం చేస్తున్నాడట. ఈ ఊరి వాళ్ళంతా అటువంటి వాడిని చాలా గొప్ప వాడని ప్రశంసిస్తున్నారు". అని కుక్క తన భాషలో అనుకుంటున్నది. మనకు ఆభాష అర్థమయితే ఏమవుతుంది. ఆ కుక్క అంతరంగంలోని భావం

మనకు అర్థమయితే మనది ఎంత అనుచితమైన కార్యమో మనకు తెలుస్తుంది. యజ్ఞం నిర్వహిస్తున్నాం కాబట్టి, కుక్క ఆ ప్రాంతానికి రాగూడదని, మనం ధార్మికమైన కార్యం చేస్తున్నామని, దానిని శిక్షించటంచేత యజ్ఞం పవిత్రత కాపాడుకున్నామని అనుకుంటాం. ఇవన్ని మన భావాలు, ఆలోచనలు, ఇలా మనం తెలివి ఉండి కూడా చేసేటటువంటి పాపాలుంటాయి. నోరులేనివి కాదు పశువులు మాటలురానివికాదు. వాటికి మనసు ఉంది. భాష ఉంది. ప్రతి ప్రాణికి ఇవి సహజం ఏ ప్రాణి భాష ఆ ప్రాణికే అర్థం అవుతుంది. అయితే మనిషికి విచక్షణ, విశ్లేషణాజ్ఞానం భగవంతుడు ఇచ్చాడు. దీనిని ఉపయోగించి ప్రతి ప్రాణికి మేలు చేయాలి అని తెలుసుకోవాలి. మతంగ మహర్షి చర్యలవలన మానవాళికి భగవంతుడు అందించిన మంచి హితబోధ ఇది.

జంతువుల భాష తెలుసు కనుక ఆ గాడిద అన్న మాటలు మతంగుడికి అర్థమయినాయి. ఇతనికి పూర్వ జ్ఞానం కలిగింది. వెంటనే తనలో తాను ఇలా అనుకున్నాడు "హితబోధచేసింది. నిందించటంలేదు నన్ను. ఇవి



నిరూపిస్తున్నమాటలు. ఆ గాడిద నిజమే చెబుతున్నది. బహుశః పూర్వ జన్మలో నేను పశువులను చంపి చర్మం ఒలిచి అమ్ముకునే నీచవృత్తిలో జన్మించినానేమో, నాకు తెలియదు గదా!" అని అనుకున్నాడు.

వెంటనే మతంగుడు గాడిద తల్లి దగ్గరకు వెళ్ళి నమస్కరించి "నా పూర్వ జన్మ జ్ఞానం నాకు తెలిస్తేనే గొప్ప అనుకుంటాను. నువ్వు ఎవ్వరో నాకు తెలియదు అమ్మా. నేను పూర్వ జన్మలో ఏమిచేశానో, ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో, ఆ క్రూరకర్మ ఎలా ఉన్నదో వివరించు" అని అడిగాడు.

ఆ గాడిద తల్లి ఇలా చెప్పింది "నువ్వు పూర్వ జన్మలో కులభ్రష్టురాలైన బ్రాహ్మణస్త్రీకి జన్మించావు. నీ తల్లి బ్రాహ్మణి. అవినీతిపరురాలు గూడ. అటువంటి దాని గర్భవాసాన జన్మించావు. ఆ సంస్కారం నీకు పోలేదు. అందువలననే ప్రాణిని హింసించటం నీకు సులభమైన పని. ఒకప్రాణిని హింసించాలన్నా, పశువును కొట్టాలన్నా దానిని సంహరించాలన్నా నీవు చాలా సుళువుగా, సంతోషంగా చేస్తావు. అది నీ సహజ లక్షణం. ఈ వివరణ ఇవ్వటంతో మతంగుడికి జ్ఞానోదయం అయింది. ఇంక నన్నేమి అడగవద్దు, నీ తండ్రిని అడుగు" అంది.

అటువంటి జ్ఞానం కలిగిన మహాత్ములు పశువులలోనూ ఉంటారని అంటారు. పశువులన్నీ పశువులు కావు. కొంత మంది యోగులు కూడా పశువులుగా, పక్షులుగా జన్మిస్తారు. ఎందుకు? వారికి పూర్వజన్మలో ఎవైనా దోషాలు వేసి ఉంటారు మళ్ళీ మరున జన్మ ఎత్తితే మరల పాపాలు చేయవచ్చు. ఈ శరీరం ఏదైనా క్షుద్రమైన శరీరమైనా చాలు, పక్షిగా జన్మిస్తారు. ఈ పక్షి శరీరంతో పాపంచేసే అవకా ఉండదు. మరొకరు పాపం చేస్తే వారి చేతిలో మరణిస్తానుకాని నేను పాపం చేయను కదా! పక్షి ఏ పాపం చేస్తుంది. పురుగులను తింటుంది అది దాని సహజ లక్షణం. పాపంచేస్తున్నానని పక్షికి తెలియదు. తెలిసి చేసేది పాపం. పక్షి జన్మ ఎత్తి దేవాలయాల గాలిగోపురాల

చుట్టూ తిరుగుతూ ప్రదక్షిణలు చేస్తూ భక్తులు ఇచ్చే ప్రసాదం కొంచెం తింటూ ఉంటే పుణ్యం కదా! ఇలా జన్మ గడుస్తుంది.

మతంగుడు గాడిద చెప్పిన మాటలు విని, ఆయన అనుకున్న యజ్ఞానికి వెళ్ళకుండా తండ్రి దగ్గరికి వెళ్ళి జరిగిన విషయాన్నంతాచెప్పి, "తండ్రీ! నా గత జన్మలోని తల్లి చేసిన పాపము ఏమిటో నాకు తెలియదు. నాకు తెలియకుండా, దయాదాక్షిణ్యాలు లేకుండా అనవసరంగా గాడిద పిల్లను కొట్టాను. పాపం చేసాను. నాకు ఆ చర్యవలన మానసిక మార్పు వచ్చింది. నేను ఇప్పుడు తపస్సు చేసి బ్రహ్మత్వం పొందాలని నాకు కోరికగా ఉంది. నాకు అనుమతి ఇవ్వవలసింది" అని అన్నాడు. తండ్రి అనుమతి పొంది కొన్ని వేలసంవత్సరములు తపస్సు చేసాడు మతంగుడు. అతడికి మొట్టమొదట ఇంద్ర దర్శనం అయింది.

ఇంద్రుడు వరం కోరుకో మన్నాడు. మతంగుడు ఆయనను "బ్రహ్మవిద్వద్వరుని"గా అనుగ్రహించమని అడిగాడు. ఇంద్రుడు ఆయనతో "మతంగా ఎన్నో జన్మలలో బ్రాహ్మణుడివై పుట్టితేనే "బ్రహ్మ విద్వద్వరుడివి" అవుతావు. ఇంకేమైనా వరం కోరుకోమని అడిగాడు ఇంద్రుడు, మతంగుడు అంగీకరించలేదు. ఇంద్రుడు తనదారిన తను వెళ్ళాడు. అయితే మతంగుడు తన తపస్సును విడిచి పెట్టలేదు. ఈ సారి ఒంటికాలిపై నిలబడి నూరు సంవత్సరాలు తపస్సు చేసాడు. మరల ఇంద్రుడు ప్రత్యక్షమై "ఓ మతంగా! బ్రహ్మ విద్వద్వరుడివి కావటం నీ తరంకాదు. ఇంతకు 100 రెట్లు తపస్సు చేస్తే చండాలుడు శూద్రుడవుతాడు. దీనికి అధికంగా 100 రెట్లు తపస్సు నిర్వహిస్తే శూద్రుడు వైశ్యుడవుతాడు. దానికి వెయ్యి రెట్లు అధికంగా తపస్సు చేస్తే వైశ్యుడు క్షత్రియుడవుతాడు. దీనికి పది వేల రెట్లు అధికంగా తపస్సు చేస్తే క్షత్రియుడు దుర్బ్రాహ్మణుడు అవుతాడు. జీవలక్షణం నీలో ప్రవేశిస్తుంది. ఆ పది వేల రెట్లు తపస్సు చేస్తే సామాన్య బ్రాహ్మణ లక్షణం నీకు లభించవచ్చు.



బ్రాహ్మణ లక్షణం అంటే సత్యగుణంతో కలిసి ఉన్నదని అర్థం. కాబట్టి ఇప్పుడు నీలో ఉన్న దౌర్బ్రాహ్మణ్యం పోవాలి. పూర్వ జన్మలో చేసిన పాపపు పనుల వలన నీ జీవలక్షణంలో చండాలత్వం ఉన్నది. అది నీలో నుంచి పోవాలంటే చిరకాలం తపస్సు చేయాలి.

ఇంకా ఒంటికాలిమీద మతంగుడు తపస్సు కొనసాగిస్తూనే ఉన్నాడు. ఇంద్రుడు ప్రత్యక్షమైనాడు. "బ్రహ్మవిద్వద్వరుడివి కావటం నీతరం కాదు. నీ తపస్సు చాలించు. నీకొక వరం ఇస్తున్నాను. ఉత్తమమైన బ్రాహ్మణ లక్షణములు – సత్యము, శౌచము, ధనం మీద ఆశలేకుండుట, అపరిగ్రహము మొదలైనవి – కలిగినటువంటి బ్రాహ్మణ జన్మ ఉత్తరజన్మలో ఇస్తాను నీకు. ఆ జన్మలో నీ తపస్సు ఫలిస్తుంది. అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది. నువ్వు బ్రాహ్మణుడివి అవుతావు. నిదానంగా బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది" అని చెప్పి వెళ్ళాడు. ఇంద్రుడి వరం సిద్ధించాలన్నా ఈ జన్మ గడవాలి. కాబట్టి మిగిలిన జీవితం తపస్సులో గడిపాడు మతంగుడు. వివాహం చేసుకున్నాడు. ఒక కొడుకు పుట్టాడు. అతడి పేరు ప్రసన్నుడు. గృహస్థాశ్రమంలో ఉన్నా మతంగుడు తపస్సు చేస్తూనే ఉన్నాడు.

పట్టుదలతో అనుకున్న లక్ష్యం సాధించేవరకు తపస్సు చేయాల్సిందేనని మతంగుడు నిర్ణయించుకున్నాడు. ముఖ్యంగా నేటియువత మతంగుడి మాదిరి అనుకున్న లక్ష్యం సాధించేవరకు వారి వృత్తిని, విద్యను, సత్కార్యాన్ని తపస్సుగా భావించి తదేక దీక్షతో సత్ఫలితాలు పొందాలని ప్రతిజ్ఞ చేయాలి. మహర్షులు నడిచిన మార్గంలో మానవాళి నడవాలని భావించాలి.

## ఏనుగు పిల్లతో స్నేహం

ఒకనాడు ఆశ్రమానికి దగ్గర ఒక ఏనుగు ప్రసవించి పిల్లను కన్నది. తల్లి ఏనుగు మాత్రం మరణించింది. ఆ ఏనుగు పిల్లను చూచి దయకలిగి తన ఆశ్రమానికి తీసికొని వచ్చి జాగ్రత్తగా పెంచాడు మతంగుడు. ఆ ఏనుగు

పిల్లను ఎంతో మచ్చిక చేసుకున్నాడు. వారిద్దరి మధ్య స్నేహ సంబంధాలు వృద్ధి చెందాయి. మతంగుడు చెప్పిన ప్రతి పనిని శ్రమలేకుండా, దూరమైనా, చిన్నదైనా, పెద్దపని అయినా వెంటనే చేసేది. మతంగుడు గూడ ఎంతో సంతసించాడు. ఆయన ఆశ్రమాన్ని కాపలా కాసేది. ఆయన తపస్సులో ఉన్న సమయంలో తపస్సుకు భంగం కలుగకుండా, ఎవరూ ఆశ్రమంలోకి ప్రవేశింపకుండా చూచేది. కన్నకొడుకు మాదిరి మతంగుడికి సేవ చేసేది. ఆ ఏనుగుపై మతంగుడికి పుత్రోత్సాహం వచ్చింది.

ఏనుగు పిల్లపై ఆయనకు కలిగిన వాత్సల్యాన్ని చూచి ఇంద్రుడు ఆశ్చర్య పడ్డాడు. ఇంద్రుడు ఒక రోజు క్షత్రియుడి వేషం వేసుకుని ఆయన దగ్గరకు వచ్చాడు. వచ్చి "మహాత్మా! నువ్వు పెంచుకొని, మంచి శిక్షణ ఇస్తున్న ఏనుగును నాకు ఇవ్వు, నేను పెంచుకుంటాను. నా దగ్గరే క్షేమంగా ఉంటుంది. నేను రాజును, ఇప్పుడే దీనిని తీసుకు వెళుతాను, అనుమతి ఇవ్వు" అన్నాడు.

అందుకు సమాధానంగా మతంగుడు "అయ్యా! నేను దీనిని నా కొడుకుతో సమానంగా పెంచుకుంటున్నాను. నేను దీనిని నీకు ఇవ్వటానికి వీలు పడదు. నాకు ఈ ఏనుగు ఎన్నో పనులు, ఎన్నో విధాలుగా చేసి పెడుతోంది. నాకు ఆశ్రమంలో అండగా, సహాయంగా ఉంటోంది. దీనిని వదలిపెట్టను" అని అన్నాడు. ఇంద్రుడు వెంటనే "ఈ ఏనుగుకు బదులుగా నీకు వేయి గోవులను ఇస్తాను, బంగారం ఇస్తాను, కాబట్టి ఏనుగునాకు ఇవ్వు" అన్నాడు.

మతంగ మహర్షి వెంటనే "నాకు ఏమి, ఏమిటో ఇస్తానంటావు. నీవు ఇచ్చే వన్నీ నాకు అవసరమయితే, గోవులు నాకు అవసరం అయితే, ఈ ఏనుగు కూడా అవసరం కదా! అందువలన ఏనుగును అసలు ఇవ్వను" అన్నాడు. అప్పుడు ఇంద్రుడు ఆయనతో, "మునీంద్రా! దీని మీద ఆశవదులుకో! దీన్ని నేను పట్టుకు వెళుతాను. దీన్ని వాహనంగా తీసుకొనిపోతే ఏమాత్రము దోషంలేదు, ఎందుకంటే నేను ఈ దేశానికి రాజును అందువలన ఈ ఏనుగును తీసుకుని వెళుతాను" అన్నాడు.



ఆ ఏనుగుకు, మతంగుడికి ఎందుకంత వాత్సల్యం? ఆ యుగాలలో వన్యమృగాలు శతృత్వం మరచి స్నేహంతో సంచరించాయి. జీవించాయి. మహర్షులకు వాటి చేష్టలు, విన్యాసాలు ఆహ్లాదంగా, ఆనందంగా ఉండేవి. ఇంకా మహర్షులు అరణ్యాలలో ఆశ్రమాలు నిర్మించుకుని, చెట్లపొదల్లో గుహలల్లో, కటిక చీకట్లలో కొన్ని సంవత్సరాలు తపస్సులో నిమగ్నమై ఉండేవారు. వారి శరీరంపై చీమలు పాకేవి, పాములు తిరిగేవి వన్యమృగాలు సమీపంలో నిద్రించేవి. భయంకరమైన పక్షులు గూడ వింత అరుపుల శబ్దాలు చేస్తూ భయ కంపితులను చేసేవి. కాని మహర్షుల ప్రాణాల జోలికి వెళ్లేవి కాదు. మహర్షులను ప్రేమించాయి, గౌరవించాయి, వారితో సహజీవనంచేసి సంచరించేవట. అదంతా భగవంతుని సృష్టి అనే వారు. ఆ విధంగా ఆ ఏనుగు బాల్యంనుంచి మతంగుడితో వాత్సల్యాన్ని పెంచుకొని, పంచుకొంది. ఆయనకు ఏనుగు ఒక రక్షక భటుడుగా వెన్నంటి ఉండేది. అటువంటి ఏనుగును మతంగుడు వదులుకుంటాడా! చిన్నతనంలోనే ఆ ఏనుగు ఆలనా, పాలనా చూచాడు గదా!

నేటి యుగంలోనూ సంతానం లేనివారు బంధువుల్లో, స్నేహితులు, తెలిసినవారి ఇండ్లలోని ఎవరో ఒక పసిబిడ్డను మగబిడ్డగానీ, ఆడబిడ్డగాని – దత్తతీసుకొని పెంచుకునేవారు. రెండు, మూడునెలల పసికందును దత్తత తీసికుని పెంచుకునేవాడు, ఇరువర్గాల వారు అంగీకరించే వారు. చిన్న తనంలోనే తల్లి, తండ్రి అనే భావన పెరిగి, పెరిగి ఆప్యాయత, వాత్సల్యంతో ఇంటివాతావరణం సృష్టించబడుతోంది. ఆ దత్తత తీసికున్న బిడ్డ కూడ తన సొంత అమ్మ, నాన్న అనే భావనతోనె పెరిగి పెద్దదవుతుంది, సంచరిస్తుంది. ఆ కుటుంబంలోని సభ్యుడు / సభ్యురాలిగా జీవిస్తుంది. చివరకు విడదీయరాని బంధంగా చిరస్థాయిగా ఉంటుంది.

ఏనుగు – మతంగ మహర్షి బంధం విడదీయరాని బంధంగా ఉన్నది. భారతీయ సంప్రదాయంలో ఇటువంటి సంఘటనలు ఎన్నో. అనూచానంగా

వస్తున్న సంప్రదాయమని చెప్పాలి. "పుణ్యమూర్తులు సంతోషంపొందే, పాపాత్ములు శిక్షలు పొందే యమలోకానికి వెళ్ళు. ఈ ఏనుగును అక్కడ ఇస్తాను" అన్నాడు మతంగ మహర్షి, క్షత్రియ వేషధారణలో ఉన్న ఇంద్రుడితో అంటే ఇది ఒక శాపం వంటిది. కోపంతో, యముడి దగ్గరకు పద ఇస్తాను అన్నాడట. వెంటనే ఇంద్రుడు, యముడి దగ్గరకు నాస్తికులు, పాపాత్ములు వెళుతారు. నేను అక్కడికిరాను" అన్నాడు.

తరువాత వారిద్దరి మధ్య సంభాషణ జరిగింది ఆ ఏనుగు పిల్ల కోసం. మతంగ మహర్షి ఎన్నో పవిత్ర స్థలాలను చెప్పి అక్కడకు రమ్మన్నాడు క్షత్రియ రూపంలో ఉన్న ఇంద్రుణ్ణి. ఏ స్థలంలోనూ, ఏప్రదేశంలోనూ, ఏ తీర్థంలోనూ, రావటానికి ఇంద్రుడు అంగీకరించలేదు. చివరగా మతంగ మహర్షి "బ్రహ్మలోకానికి వస్తావా?" అని అడిగాడు ఇంద్రుణ్ణి, వెంటనే ఇంద్రుడు "విరాగులు, వ్రత దీక్షాపరులు, కృతపుణ్యులు, జ్ఞానులు ఉండేలోకం అది. అక్కడికి నేనెట్లా రాగలను?" ఈ విధంగా మతంగ మహర్షి రమ్మన్న ప్రతి ప్రదేశానికి ఇంద్రుడు రానని అన్నాడు. అప్పుడు ఆయన ఇంద్రుడితో "సరే, ఇప్పుడు తెలిసినది! నీవు రాజ పుత్రుడవు కాదు ఆరూపంలో వచ్చిన ఇంద్రుడివి. ఈ కపటవేషంలో ఎందుకు వచ్చావు?" అన్నాడు. ఎన్నో ప్రశ్నలు వేసి, సమాధానాలు చెప్పించుకుని, అతడు ఇంద్రుడని తెలుసుకున్నాడు మతంగ మహర్షి.

## ఏనుగు - స్వర్గలోకం

ఇంద్రుడు తన నిజరూపంలో ప్రత్యక్ష మయ్యాడు. వెంటనే, "మతంగ మహర్షీ! నీకు ఏమికావాలో అడుగు" అన్నాడు. "నేనేమి అడుగుతాను! నువ్వు ఈ ఏనుగు పిల్లను కావాలని కోరుకున్నావు, దానిని నా దగ్గరనుంచి వేరు చేయవద్దు. కరుణా హృదయంతో దానిని విడిచిపెట్టు" అన్నాడు మతంగుడు. అప్పుడు ఇంద్రుడు ఆ ఋషితో "ఏమిటి నీవు ఇంత అమాయకుడివి? ఇంత



పరీక్ష చేసి నేనెవరినో తెలుసుకున్న వాడివి, నీకు ఇంకా ఏనుగు కావాలా! ఇది తెలుసుకోలేవా? నిన్ను పరీక్ష చేయటానికి నేను వచ్చాను. రహస్యంగా, నిగూఢంగా ఉన్న నన్ను ఎవరూ గుర్తించ లేరు. నీవే గుర్తించావు. అది నీ మహిమ. నీ తపస్సుకు ప్రతిఫలంగా నీకు, నీ ఏనుగుకు స్వర్గంలో సుఖాన్నిస్తాను. ఈ ఏనుగు నీకు పుత్ర సమానుడు గదా! స్వర్గానికి వచ్చి సుఖంగా ఆనందంగా ఉండండి" అన్నాడు ఇంద్రుడు.

చూశారా! తపశ్శక్తి ఎంత సత్ఫలితాన్ని ఇచ్చింది. మతంగ మహర్షి వలన ఏనుగుకు గూడ స్వర్గానికి వెళ్ళే అదృష్టం వచ్చింది. ఏ జీవి అయినా మహర్షులతో వాత్సల్యంతో సత్సంబంధాలు పెంచుకొని, విశ్వాసంతో సేవ చేస్తే ఏనుగులా అందరూ స్వర్గానికి వెళ్ళవచ్చు.

వెంటనే ఇంద్రుడి దివ్య విమానం వచ్చి ఆగింది. ముందు ఏనుగును రథంలోకి ఎక్కించారు. తరువాత మతంగ మహర్షి రథాన్ని అధిరోహించాడు. ఇంద్రుడు వాళ్ళిద్దరినీ ఇంద్రలోకానికి తీసుకొని వెళ్ళాడు. అక్కడ చిరకాలము సుఖం అనుభవించాడు మతంగుడు, తరువాత జన్మలో జ్ఞాని అయినాడు. మహర్షులు అతీంద్రియ శక్తులు. వారు సత్యమునే చెబుతారు. కాబట్టి వారు మహాత్ములు. సత్యమే బ్రహ్మ వస్తువు. సత్యమే జ్ఞానము, సత్యమే పరతత్వము, సత్యమే పరమేశ్వరుడు, సత్యమే శాశ్వతమైన వస్తువు, సత్యము కానటువంటి వస్తువు అసలు ఉండదు. ఎల్లకాలము అది అనిత్యమైనది. అనిత్యమైన వస్తువు ఎప్పుడూ సత్యముకాదు. నిత్యము సత్యము అయిన వస్తువునే మహర్షులు ఉపాసిస్తారు. మనసులో ఏభావనలో ఉంటారో, చిత్తమందు కూడా అదే భావన ఉంటుంది. అంతఃకరణలోనూ అదే భావన. మహర్షులు దానిని ఆవిధంగానే ప్రకటిస్తారు.

సత్యానికి దారి తెలుసుకోవటానికి ఉత్తమమైన మార్గం వైదిక, ధార్మిక, స్వధర్మ నిర్వహణ. అటువంటి సన్మార్గమే సత్త్వగుణ ప్రధాన్యత కలిగిన మార్గం

అని భారతీయ సంప్రదాయం నొక్కి చెబుతోంది. ఆ సంప్రదాయంలో ఉన్న వేదం చదివిన బ్రాహ్మణుడైనా కాకపోయినా, సత్య మార్గంలో ఉంటే వాడు ఎవరైనా సరే, తనకు నిర్దేశింపబడిన ధర్మమును ఆచరిస్తే సత్యాన్ని ఉపాసిస్తే క్రమంగా ముక్తికి వెళుతారు. కేవలం పాండిత్యం వలన గానీ, కర్మల వలన గానీ ప్రయోజనములేదని తెలుస్తోంది. ఈ రెండింటికి మించినది సత్యవ్రతమే. సత్యవ్రతమే నిత్యవ్రతముగా ఆచరించాలి.

త్రేతాయుగంలో శ్రీ రామచంద్రుడు తన జీవితకాలమంతా సత్య ధర్మాలతోనే పయనించాడు, పాలించాడు. సత్య ధర్మాలే రెండు పాదాలుగా అడుగులు వేస్తూ "రామో విగ్రహవాన్ ధర్మః" అనిపించుకున్న మర్యాదా పురుషోత్తముడు శ్రీరామచంద్ర ప్రభువు. ఈ నాటికీ ఆ శ్రీరాముని గురించి ప్రస్తుతించుచున్నాము, ప్రశంసిస్తున్నాము.

ద్వాపరయుగంలోనూ ధర్మరాజు సత్య ధర్మాలను తు.చ. తప్పకుండా ఆచరిస్తూ తన తమ్ములనూ సత్య, ధర్మ మార్గములోనే నడిపించాడు. సత్యమే జ్ఞానము అన్న వాక్కు ధర్మరాజుకు బలమైన వాక్కు, అరణ్య, అజ్ఞాతవాస సమయంలో ఎన్ని కష్టాలు బాధలు, సమస్యలు ఎదురైనా పాండవులు వాటిని అన్నిటినీ అధిగమించి సత్య ధర్మాలనే పట్టుకుని, నమ్ముకుని విజయం సాధించారు.

లోకానికి సత్య ధర్మములే ముక్తికి మార్గమని, వాటిని నిష్ఠతో ఆచరించాలని మహర్షులు హితబోధ చేశారు. వారు ఆచరించిచూపిన సన్మార్గాలన్నీ మానవాళి క్షేమం కోసమేనని గుర్తించాలి.

* * *

## 24. కణ్వ మహర్షి

కణ్వ మహర్షి కశ్యప ప్రజాపతి వంశంలో జన్మించాడు. బాల్యం నుంచీ తపస్సును నియమ నిష్ఠలతో ఆచరిస్తూ బ్రహ్మచర్యాశ్రమములోనే ఉన్నాడు. సామవేదంలోనే ఆయన నిష్ణాతుడు. భారత దేశంలో కాణ్వశాఖ, అనే వారు మనకు ఉన్నారు. వారికి మూలపురుషుడు కణ్వ మహర్షి. ఆయన తపస్సులో ఉన్న సమయంలో సామవేదం దర్శనమిచ్చేది. కణ్వుని లక్ష్యసాధన, తపఃశ్శక్తి అంత గొప్పది. శ్లాఘనీయమైనది. సామవేదాన్ని బహిర్గతం చేసి అనేక మంత్రాలకు మూలమైనాడు.

కణ్వ మహర్షి శుక్లయజుర్వేది శుక్లయజుర్వేదములో 1) కణ్వశాఖ 2) మధ్యందినశాఖ యని రెండు శాఖలు గలవు. కణ్వుఁడు కణ్వశాఖకు మూల పురుషుఁడు.

కణ్వ మహర్షి మాలినీ నదీ తీరంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని అక్కడ నివశిస్తున్నాడు. ఆయనను ఆశ్రయించి ఆయన శిష్యకోటి వాళ్ళ సంసారాలతో అనేకమంది ఉండే వాళ్ళు. వాళ్ళందరికీ పోషణ కర్త కణ్వుడు. ఆయన వారందరికీ 'కులపతి' అయినాడు. భూతదయలో ఆయనకు మించినవాడు లేడని, పరమ దయాసముద్రుడని ఖ్యాతి గడించాడు.

విశ్వామిత్ర, మేనకల కుమార్తె శకుంతల కణ్వ మహర్షి ఆశ్రమంలో పెరిగింది. కణ్వ మహర్షి స్నానానికి వెళ్ళినపుడు, పక్షులు వాటి రెక్కలతో నీళ్ళు తెచ్చి ఆ బిడ్డమీద చల్లుతున్నాయి. ఆ శకుంతపక్షులు ఆ బిడ్డకు నీరుపడుతున్నాయి. ఆ బిడ్డకు ఎవరూలేరని సర్వోత్తమురాలిగా పెంచాడు కణ్వ మహర్షి. పక్షులు పూలు తీసికొచ్చి ఆ బిడ్డనోట్లో వాటిలో దాగి ఉన్న తేనెను పిండుతున్నాయి. ఆ బిడ్డకు తేనే ఆహారంగా అందించాయి. తరువాత ఆమెను దుష్యంతుడు వివాహంచేసుకున్నాడు. వీరిద్దరికీ ఒక మగబిడ్డ జన్మించాడు. అతని పేరే భరతుడు. ఆ పుట్టిన పిల్లవాడిని కణ్వుడే పెంచాడు.

భారతదేశానికి మూలపురుషుడు భరతుడే అని మనం గౌరవిస్తాము. ఆ యుగాలలో, ఆ కాలంలో గూడ ఎవరూ నా అనే వారు లేనప్పుడు ఋషులే దగ్గిరకు చేర్చి వారిని పెంచి, పెద్దచేసి, వివాహం జరిపించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అనాథలకు "దేవుడేదిక్కని" నిరూపించారు భారతీయ మహర్షులు. ఋషులు మానవాళిపై దయాహృదము కలవారని నిరూపించారు. "దయగల హృదయమే భగవన్నిలయం" అంటున్నాయి శాస్త్రాలు గూడ.

## ధర్మం - ఆవుపాలు

మహర్షులు హితబోధ చేయటానికి ఎన్నో ఉదాహరణలు చెబుతారు. అలా చెబితేనే మానవాళి మనస్సులోకి తేలికగా చొచ్చుకునివెళ్ళి ఆచరించటానికి ఆసక్తిని, ప్రేరణను కలిగిస్తాయి. కణ్వమహర్షి చరిత్ర చదివితే ధర్మాన్ని ఆవుపాలతో పోల్చి చెప్పటం జరిగింది. అది ఏమిటో తెలుసుకుందాం.

"ధర్మో రక్షతి రక్షితః" అని నేటికీ పండితులు, ప్రచారం చేస్తున్నారు కదా! ధర్మం ఎప్పుడూ కూడా దానిని ఎవరు గౌరవించి ఆచరిస్తారో వారిని ఆ ధర్మం రక్షిస్తుంది. అటువంటి వారి దగ్గరే శాశ్వతంగా ఉంటుంది. ధర్మాన్ని గోవుతో పోల్చారు. గోవును సేవించిన వాడిని, రక్షించినవాడిని ఆ గోవు వదిలిపెట్టదు. వాడికి కుంభవృష్టిగా పాలు ఇస్తుంది. ఆవుకు మనం పనికి రాని గడ్డి పెడతాం. ఆ గడ్డితిని ఆవు మనకు రుచికరమైన పాలను ఇస్తుంది. ధర్మం కూడా అటువంటిదే. అది మన దగ్గర నుంచి ఎమీ ఆశించదు. అయితే ధర్మం మనుషులనుంచి గౌరవాన్ని, రక్షణను మాత్రం ఆశిస్తుంది. వాటిని మనం దానికి ఇస్తే అది మనలను పోషిస్తుంది, రక్షిస్తుంది, సర్వశుభాలను కలుగ చేస్తుంది. అయితే ధర్మం ఆచరించని వారిని వదలి ధర్మం ఆచరించేవారి దగ్గరకు వెళుతుంది.

ధర్మాలు అనేకం ఉన్నాయి. గృహస్థాశ్రమంలో వెయ్యి ధర్మాలు ఉన్నాయి. వాటిలో అహింస ఒక ధర్మం ఈ విధంగా - వృత్తి ధర్మం, రాజధర్మం,



పాతివ్రత్యధర్మం, కుల ధర్మం, పతి ధర్మాలు మొదలైనవి ఎన్నో ఉన్నాయి. ఎన్నో శాస్త్ర గ్రంథాలు, వేదాలు అర్థంచేసుకుని తెలుసుకోవాలి. మహర్షుల జీవితచరిత్రలు, అష్టాదశపురాణాలు చదివి తెలుసుకోవాలి, ఆచరించాలి.

మానవాళిని సన్మార్గంలో నడిపించటానికి భారతీయ మహర్షులు మార్గదర్శకులు. ప్రసన్నత, శాంతి, నీతి, కర్తవ్యం తెలుసుకోవటానికి ఋషుల హితోక్తులు చదవాలి, గ్రహించాలి. ఎవరికి వారు పరిశుద్ధులుగా మారిపోవాలి.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

* * *